సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00

సంపుటి: 10
సంచిక: 150

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి'



శనివారం యూపీలోని ముజఫర్‌నగర్ వద్ద ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో ధ్వంసమైన బోగీలు

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ వద్ద ఘోర రైలు ప్రమాదం

23 మంది దుర్మరణం..
60 మందికి గాయాలు

- పూరీ నుంచి హరిద్వార్ వెళ్తుండగా ఖతౌలి వద్ద పట్టాలు తప్పిన 14 బోగీలు
- శనివారం సాయంత్రం 5.45 గంటల సమయంలో దుర్ఘటన
- రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది.. కొనసాగుతున్న సహాయక చర్యలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని, యూపీ సీఎం, సోనియాగాంధీ తదితరులు
- ప్రమాదానికి కారణం మానవ తప్పిదమే: యూపీ సర్కార్

13 లో

పట్టాలు తప్పిన ఉత్కళ్

- హామీలు.. సొమ్ములు.. ఫలించక..

బెదిరింపు రాజకీయం

ఓటర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్న టీడీపీ నేతలు

- అభివృద్ధి ఆగిపోతుంది... పథకాలు ఆపేస్తాం..
- సోదాలు జరిపిస్తాం.. రౌడీషీట్లు తెరుస్తాం..
- మరో అడుగు ముందుకేసిన ముఖ్యమంత్రి
- 50వేల మెజారిటీ రాకపోతే అభివృద్ధి ఆపేస్తాం..
- ఓటు ఎవరికి వేశారో తెలుసుకుంటాం..
- విస్తుపోతున్న ప్రజాస్వామిక వాదులు..
- పథకాలెలా ఆపుతారు? ఓటెలా తెలుసుకుంటారు?
- నంద్యాలలో విచ్చలవిడిగా నగదు పంపిణీ
- ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేలు..
- ప్రతిపక్షపార్టీ మద్దతుదారుల ఇళ్లపై దాడులు సోదాలు..

- వివరాలు 7లో



సుందర నంద్యాల చేస్తా

- స్మార్ట్ సిటీగా మార్చి ఆదాయం పెంచుతా: సీఎం చంద్రబాబు
- నిరసన తెలిపిన అగ్రిగోల్డ్, కేశవరెడ్డి బాధితులు

- 6లో

మాటిచ్చారు.. వదిలేశారు..

హామీలకు విలువెక్కడ?

- ప్రత్యేక కథనం 10లో



నంద్యాలలోని పప్పుల బట్టీ సెంటర్‌లో రోడ్ షోకు హాజరైన జన సందోహంలో ఓ భాగం.. ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్. చిత్రంలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి

ప్రజాస్వామ్యం ఖూనీ

నంద్యాల ప్రజలను, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను బెదిరిస్తున్నారు

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- అర్ధరాత్రి దాటాక ఇళ్లల్లో ఆకస్మిక తనిఖీలేంటి?
- మహిళలు, చిన్నపిల్లల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు..
- వ్యాపారులకు తోడుగా, అండగా నేనుంటాను..
- శిల్పామోహన్‌రెడ్డిని గెలిపించి మోసకారి బాబుకు బుద్ధి చెప్పండి
- పదకొండో రోజు రోడ్‌షో, ఆర్యవైశ్యుల ఆత్మీయ సదస్సులో ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు

5 లో

బాలకృష్ణ డబ్బులు పంపిణీపై కేంద్ర ఎన్నికల సంఘం

సీరియస్

- ఘటనపై మళ్లీ నివేదిక పంపాలని కలెక్టర్‌కు ఆదేశం
- సర్వేలు నిషేధించే అధికారం ఈసీకి ఉంది: భన్వర్‌లాల్

- వివరాలు 6లో



'హోదా' రాయితీలు

పదేళ్లు పొడిగింపు

- కశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్, ఈశాన్య రాష్ట్రాలకు ప్రయోజనం
- 2027 వరకు పన్ను రాయితీలు వర్తింప చేస్తూ కేంద్రం నిర్ణయం
- రూ. 27,413 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- ఆర్థిక ప్రయోజనం పొందనున్న 4,284 కంపెనీలు
- ఆరు వారాల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామన్న జైట్లీ

2 లో

తాత్కాలిక సచివాలయంలో

ఆత్మహత్యాయత్నం

- ఆర్థిక సాయం కోసం వచ్చి పురుగు మందు తాగిన నెల్లూరు జిల్లా వాసి
- గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి

- వివరాలు 2లో

సాక్షి రౌండప్

వైఎస్‌ఆర్ జిల్లా
ఆదివారం | ఆగస్టు | 20 | 2017

ఊక్లా రూపొందించిన 122 దేశాల స్పీడ్‌టెస్ట్ సూచీ ప్రకారం, అత్యంత వేగవంతమైన మొబైల్ ఇంటర్‌నెట్ ఉన్న దేశం నార్వే. తర్వాతి స్థానాల్లో




నెదర్లాండ్స్, హంగరీ ఉన్నాయి. ఇండియా స్థానం 112.

వీడు గొప్ప ఆటగాడ్రా 'బుజ్జి'



బాల్యంలో మనలో చాలామంది దాగుడుమూతల ఆట ఆడే ఉంటాం. ఎవరికీ దొరక్కుండా ఆటలో మనమే గెలవాలని భలే గమ్మత్తయిన ప్రదేశాలను ఎంచుకుని మరీ దాక్కునే వాళ్లం.. అయినా చివరికి ఎలాగోలా దొరికిపోయే వాళ్లం. అయితే ఉక్రెయిన్‌లోని ఏడేళ్ల బుజ్జిగాడు ఓ రోజు దాగుడు మూతలు ఆట ఆడుతున్నాడు. ఎవరూ ఊహించలేని, ఎవరికీ కనబడని ప్రదేశంలో దాక్కొని తానే గెలవాలని అనుకున్నాడు. దాక్కునే చోటు కోసం చూస్తుండగా పక్కనే ఉన్న వాషింగ్ మిషన్ బుడతడి కంటికి కనబడింది. ఇదేదో బాగుందే ఎవరికీ కనబడకుండా ఉండొచ్చని వెంటనే దానిలోకి దూరేశాడు. దానిలో దాక్కున్న కొద్దిసేపు బాగానే ఉన్నా.. ఆ తర్వాతే అర్థమైంది మనోడికి ఈ ప్రదేశం ఏదో తేడాగా ఉందే అని. తక్షణమే దానిలోంచి బయట పడాలని ఎంత ప్రయత్నించినా కుదరకపోవడంతో పెద్దగా అరవడం మొదలు పెట్టాడు. ఇది గమనించిన కుటుంబస భ్యులు బయటకు తీసేందుకు ప్రయత్నించినా వారి వల్ల కాలేదు. ఎమర్జెన్సీ సర్వీస్‌కి ఫోన్ చేయగా.. నలుగురు పోలీసులు వచ్చి పిల్లాడిని బయటకు తీసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఇక్కడే వారికి ఒక ఐడియా వచ్చింది. వెంటనే సన్‌ఫ్లవర్ నూనెను వాషింగ్ మెషీన్‌లోని గుమ్మరించారు. నూనె బాలుడి శరీరానికి అంటుకోవడంతో కాసేపటికి తనంతట తానే బయటకు జారిపడ్డాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

విమానం నుంచిపడినా ఏం కాలేదు..



చేతిలోఫోన్ జారి కిందపడితేనే అబ్బా అని ఫీల్ అవుతాం.. అలాంటిది విమానం నుంచి పడితే! ఇంకేం ఉంటుంది ముక్కలు ముక్కలు అవడమే అనుకుంటాం కదా. కానీ విచిత్రంగా ఓ ఫోన్ వేల అడుగుల ఎత్తు నుంచి పడినా చెక్కుచెదరకుండా అలానే ఉందట. పైగా కనీసం చిన్న గీత కూడా పడలేదట. ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. ఈ ఘటనకి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. అమెరికాలోని టెన్నెస్సీకి చెందిన బ్లేక్ హెండర్సన్ ఓ చిన్నతరహా విమానంలో ప్రయాణిస్తుండగా అతి సమీపం నుంచి మరో విమానం దూసుకురావడాన్ని గమనించాడు. వెంటనే తన శాంసంగ్ గెలాక్సీ ఎస్5 ఫోన్ తీసి దృశ్యాలను చిత్రీకరిస్తుండగా.. అనూహ్యంగా ఫోన్ చేతిలో నుంచి జారిపోయింది. ఇంకేముంది వేల అడుగుల ఎత్తు నుంచి ఫోన్ జారడం.. ఓ ఇంట్లోని పెరట్లో పడటం.. క్షణాల్లో జరిగిపోయాయి. ఆకాశం నుంచి ఊడిపడిన ఫోన్‌ను చూసి ఆ ఇంట్లో వాళ్లు ఆశ్చర్యపోయారు. ఫోన్ పడుతున్న సమయంలో వీడియో ఆన్ చేసి ఉండటంతో సదరు దృశ్యాలన్నీ రికార్డయ్యాయి. చివరికి టెలికాం కంపెనీ సాయంతో జీపీఎస్ ద్వారా హెండర్సన్ తన మొబైల్‌ను తిరిగి పొందాడు. ఫోన్‌లో రికార్డయిన వీడియోను హెండర్సన్ బంధువు ఒకరు యూట్యూబ్‌లో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. దీనిని చూసిన వారంతా ఈ ఫోన్ చాలా స్ట్రాంగ్ గురూ అంటున్నారు.



శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ భట్ తదితరులు

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

సాక్షి, తిరుమల: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌పి భట్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆయన ఆలయానికి విచ్చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. తర్వాత శ్రీవారిని, వకుళమాతను దర్శించుకుని.. హుండీలో కానుకలు సమర్పించారు. జస్టిస్ భట్ వెంట చిత్తూరు జిల్లా జడ్జి దుర్గా ప్రసాద్, ప్రొటోకాల్ జడ్జి సన్యాసినాయుడు ఉన్నారు.

ఉత్తరకోస్తా వైపు అల్పపీడనం

- చురుగ్గా రుతుపవనాలు, నాలుగు రోజులపాటు వానలు
- నేడు అక్కడక్కడ భారీ వర్షాలు

సాక్షి, విశాఖపట్నం/అమరావతి : ఒడిశాకు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం శనివారం నాటికి ఉత్తర కోస్తా వైపు మళ్లింది. ఇది నైరుతి వైపుగా ఉంది. దీనికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. మరోవైపు.. ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమల మీదుగా అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. వీటి ప్రభావంతో కోస్తాంధ్రలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయి. ఫలితంగా రానున్న నాలుగు రోజులపాటు కోస్తాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలతోపాటు రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం రాత్రి విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రాబోయే 24గంటల్లో కోస్తాంధ్రలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గడచిన 24 గంటల్లో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వరరామచంద్రపురం, కూనవరం, వేలేరుపాడుల్లో 7, చింతపల్లిలో 6, నర్సీపట్నం, నందిగామ, చింతలపూడిల్లో 5, చింతూరు, నూజివీడు, గరుగుబిల్లి, యలమంచిలి, ఏలూరు, పార్వతీపురం, నందికొట్కూరుల్లో 4, శాంతిపురం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, జూపాడు బంగ్లా, మందస, పాలేరు బ్రిడ్జి, తిరువూరు, కురుపాం, పోలవరం, సోంపేట, తాడేపల్లిగూడెం, తుని, కొమరాడ, పాడేరు, అమలాపురం, కుక్కునూరుల్లో 3 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

ఏపీపీఎస్సీ ద్వారా గురుకుల టీచర్ పోస్టుల భర్తీ!

- కమిషన్ ద్వారా భర్తీకి గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖలు సిద్ధం
- గతంలో డీఎస్సీ ద్వారానే ఎంపిక

సాక్షి, అమరావతి: సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థల సొసైటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు ఈ పోస్టులు డీఎస్సీ (డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ) ద్వారా భర్తీ చేసేవారు. గిరిజన సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సొసైటీలో కొత్తగా 400 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు.. అదే విధంగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీలో 200 టీచింగ్ పోస్టులు భర్తీకి కూడా ఆర్థికశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పోస్టుల భర్తీ బాధ్యతను పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారు.

ఎప్పటికి భర్తీ అవుతాయో..

ఏపీపీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ ప్రక్రియ మొదలు పెడితే ఎప్పటికి పూర్తవుతాయో తెలియదని కొంతమంది అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే గ్రూప్ 1, 2, 3 పోస్టులకు నోటిఫికేషన్‌లు సంవత్సరం నుంచి ప్రాసెస్‌లో ఉండటాన్ని వారు ఉదహరిస్తున్నారు. వచ్చే ఏడాది ఆఖరుకు కూడా ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తవుతుందని నమ్మకంగా చెప్పలేమంటున్నారు. ఎందుకంటే కోర్టు కేసుల వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఏపీపీఎస్సీ అధికారులు పలు సందర్భాల్లో చెప్పడాన్ని వారు గుర్తు చేస్తున్నారు.

నూతన బీసీ గురుకుల పాఠశాలల్లో 40 పోస్టులు మంజూరు

సాక్షి, అమరావతి: మత్స్యకారుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఏడు బీసీ గురుకుల పాఠశాలల్లో 40 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. టీచింగ్ పోస్టులకు సంబంధించి ఒక ప్రిన్స్‌పాల్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు–7, గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు– 4, ఒక ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టును మంజూరు చేసినట్టు పేర్కొంది. మిగిలిన 23 నాన్ టీచింగ్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

హోదా రాయితీలు పదేళ్లు పొడిగింపు

కశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాలకు ప్రయోజనం



సాక్షి, అమరావతి: 'ప్రత్యేక హోదా' కాలం చెల్లిన అంశమని, జీఎస్‌టీ వస్తే హోదా కలిగిన రాష్ట్రాలకు పన్ను రాయితీలు ఉండవన్న వాదన ఉత్త బూటకమని తేలిపోయింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్‌లకు ప్రత్యేక హోదా కింద లభించే పన్ను రాయితీలను కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో పదేళ్ల పాటు పొడిగించింది. ఈమేరకు నాలుగు రోజుల క్రితం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు కేంద్ర ప్రభుత్వంలో కొనసాగుతున్న టీడీపీ మంత్రులు పచ్చి అబద్ధాలతో రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారని దీంతో తేలిపోయింది.

2027 మార్చి 31 వరకు అమల్లో రాయితీలు

జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన జూలై 1వతేదీ నుంచి 2027 మార్చి 31వతేదీ వరకు ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకు ఈ రాయితీలు అమల్లో ఉంటాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిడం గమనార్హం. ఇందుకోసం ఏకంగా రూ. 27,413 కోట్లను కేటాయించడానికి కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. దీనివల్ల 4,284 కంపెనీలకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుందని, దీనికి సంబంధించిన పూర్తి స్థాయి మార్గదర్శకాలను ఆరు వారాల్లో విడుదల చేస్తామని జైట్లీ తెలిపారు.

రీఫండ్ రూపంలో చెల్లింపులు


నార్త్ ఈస్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ 2007 కింద ఏర్పాటైన సంస్థలతో పాటు ప్రత్యేక హోదా కలిగిన కశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఏర్పాటైన కంపెనీలు ఉత్పత్తి ప్రారంభించిన తర్వాత మొదటి పదేళ్ల పాటు ఎక్సైజ్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇచ్చారు. కానీ ఇప్పుడు సెంట్రల్ ఎక్సైజ్ చట్టం రద్దు కావడంతో ఈ నిబంధనలు కింద ఇచ్చే రాయితీలు జీఎస్‌టీ రాకతో రద్దయిపోయాయి. దీంతో పన్ను రాయితీలను పదేళ్ల పాటు రీఫండ్ రూపంలో చెల్లించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం జీఎస్‌టీలో కేంద్రం వాటాగా వచ్చే సీజీఎస్‌టీ, ఐజీఎస్‌టీ పన్నులను తిరిగి చెల్లించనుంది. దీనికి రూ. 27,413 కోట్లు అవసరమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ ప్రమోషన్ (డీఐపీపీ) అంచనా వేసింది.

ఏపీకి హోదా కోసం ప్రధాన ప్రతిపక్షం ఒంటరి పోరాటం..

ప్రత్యేక హోదా కాలం చెల్లిన అంశమని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు అధికార పార్టీకి చెందిన నేతలు సాకులు చెబుతున్నా ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ సీపీ ఒక్కటే దీనిపై గట్టిగా పోరాడుతూ వస్తోంది. ఢిల్లీ నుంచి గల్లీదాక పోరాటాలు చేయడమే కాకుండా పార్లమెంటు ఉభయసభల్లో ఈ అంశాన్ని పలుమార్లు ప్రస్తావనకు తెచ్చింది. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీని నెరవేర్చే వరకు పోరాటం ఆపేది లేదని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. లౌక్యం, దౌత్యం, పోరాడటం ద్వారా ఏపీకి ప్రత్యేక హోదాను సాధించడం సాధ్యమేనని ఆయన పదేపదే ఉద్ఘాటించారు. ఇప్పుడు కేంద్రం ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హోదాను పదేళ్ల పాటు పొడిగించడంతో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ వాదనకు మరింత బలం చేకూరింది. ప్రభుత్వం చిత్తశుద్ధితో గట్టిగా పోరాడితే మన రాష్ట్రానికి కూడా ఈ ప్రయోజనాలు దక్కే అవకాశాలు కచ్చితంగా ఉన్నాయని విశ్లేషిస్తున్నారు.

'వేతన నిధి' మొత్తాన్ని పెంచడంపై మాట్లాడరేమి?

ముఖ్యమంత్రి వైఖరిని తప్పుపట్టిన ఐవైఆర్



సాక్షి, అమరావతి: అర్చకుల వేతనాలు తగ్గించబోమంటూనే ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అర్చకులకు రూ. 10 వేలకు బదులు రూ. 5 వేల కనీస వేతనాలు ఇస్తామని చెప్పడాన్ని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, అర్చక సంక్షేమ సంఘ మాజీ చైర్మన్ ఐవైఆర్ కృష్ణారావు తప్పుపట్టారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదాయం లేని ఆలయాల్లో పనిచేసే అర్చకులందరికీ రూ. 10 వేల వేతనం ఇవ్వాలంటే ప్రస్తుతం ఉన్న వేతన నిధిని రూ. 500 కోట్లకు పెంచాల్సిన అవసరం ఉంటుందని తాను ఈ నెల 16న సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. అర్చకుల వేతనాలు తగ్గించబోమని సీఎం చెబుతున్నా వేతన నిధిని పెంచడానికి తీసుకోబోయే చర్యలను మాత్రం ముఖ్యమంత్రి మాట్లాడటం లేదని మండిపడ్డారు.

నేటి నుంచి మూడో విడత మెడికల్ వెబ్ కౌన్సెలింగ్

23 నుంచి యాజమాన్య కోటా సీట్లకు కౌన్సెలింగ్

విజయవాడ(హెల్త్ యూనివర్సిటీ)/సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లోని కాంపిటెంట్ అథారిటీ(ప్రభుత్వ, ప్రైవేటు ఏ–కేటగిరీ) సీట్లలో అడ్మిషన్లకు ఈ నెల 20వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు మూడో విడత వెబ్(ఆప్షన్లు) కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు వర్సిటీ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండో విడత వెబ్ కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్లతోపాటు కొత్తగా అనుమతి పొందిన(విశాఖపట్నంలోని గాయత్రి, విజయవాడ సమీపంలోని నిమ్రా ముస్లిం మైనార్టీ) వైద్య కళాశాలలు, తిరుపతి పద్మావతి మహిళా మెడికల్ కళాశాలలోని సీట్లకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఎంబీబీఎస్ సీట్లకు మొదటి, రెండవ విడత కౌన్సెలింగ్ జరిగే నాటికి గాయత్రి, నిమ్రా కళాశాలల్లో సీట్లకు అనుమతి రాలేదు. ఆ తర్వాత అనుమతి వచ్చింది. ఆ మేరకు గాయత్రి వైద్య కళాశాల, నిమ్రా వైద్య కళాశాలల్లో 150 సీట్ల చొప్పున పెరిగాయి. ఇందులో గాయత్రి కళాశాలలో 75 సీట్లు కన్వీనర్ కోటాలో ఉండగా, మిగతా 75 సీట్లను నిబంధనల ప్రకారం యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటాల్లో భర్తీ చేస్తారు. నిమ్రా కళాశాలలో మాత్రం కన్వీనర్ కోటా సీట్లను మైనార్టీలతోనే భర్తీ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అప్పలనాయుడు శనివారం సాక్షితో మాట్లాడుతూ.. ఈ సీట్లను మూడవ విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి సమాచారమిచ్చామన్నారు. స్పోర్ట్స్, ఎన్‌సీసీ అభ్యర్థుల ఆప్షన్లకు నాల్గో విడత కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్, డెంటల్ కళాశాలల్లోని యాజమాన్య(బీ–కేటగిరీ, ఎన్ఆర్ఐ) సీట్లకు ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో తుది విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. 23వ తేదీన మొదటి నుంచి 2,500 మెరిట్ ఆర్డర్ వరకు, 24వ తేదీన 2,501 నుంచి చివరి మెరిట్ ఆర్డర్ వరకు అభ్యర్థులను ఆహ్వానించారు. మరిన్ని వివరాల్ని యూనివర్సిటీ (హెచ్‌టీటీపీ://ఎన్‌టీఆర్ యూహెచ్‌ఎస్.ఏపీ.ఎన్‌ఐసీ.ఇన్) వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

బాబు గిమ్మిక్కులను ప్రజలు నమ్మరు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన



మాట్లాడుతున్న భూమన కరుణాకర్ రెడ్డి

సాక్షి బృందం, నంద్యాల: నంద్యాల ఉప ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న గిమ్మిక్కులను ప్రజలు నమ్మరని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు. ఆయన శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 2014లో 600 అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిగా నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. నంద్యాల ఉప ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఓటమి భయంతో సీఎం అడ్డదారులు తొక్కుతున్నారని విమర్శించారు. వేలాది రూపాయలు, అధికారాన్ని అడ్డుపెట్టుకొని గెలవాలని చూసే చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఈ ఎన్నికలు 2019 ఎన్నికలకు నాంది కావాలని, చంద్రబాబుకు కనువిప్పు కావాలని చెప్పారు. జనంలోకి జగన్ వస్తుంటే ప్రజలు హారతులు పడుతున్నారని, బాబు వస్తే భయంతో పరుగు దీసి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను, అధికారులను భయభ్రాంతులకు గురి చేసి లబ్ధి పొందేందుకు కుట్రలు పన్నుతున్నారని, చివరకు ఎన్నికలు వాయిదా వేయించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మహానేత వైఎస్సార్ ఉన్నప్పుడు రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని, ఇప్పుడు రాక్షస పాలన సాగుతున్నట్లు ఉందన్నారు. రాష్ట్రంలో ఇంతటి దుర్మార్గపు పాలన ఏనాడూ లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సచివాలయం ప్రాంగణంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ఆర్థిక సాయం కోసం వచ్చి పురుగు మందు తాగిన నెల్లూరు జిల్లా వాసి
- గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి



రాజగోపాల్ మృతదేహం

గుంటూరు ఈస్ట్: నెల్లూరు జిల్లాకు చెందిన గండికోట రాజగోపాల్ ఆయుర్వేద వైద్యుడు. ఆర్థిక సమస్యలతో అష్టకష్టాలు పడుతున్న తనకు ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం అందుతున్న ఆశతో సచివాలయానికి చేరుకున్నాడు. ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశాడు. అక్కడ అతడి మొర ఆలకించే వారే కరువయ్యారు. సచివాలయంలో నిరాదరణే ఎదురు కావడంతో అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఈ హృదయ విదారకమైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడి కుమారుడు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం తాళ్లపల్లికి చెందిన గండికోట రాజగోపాల్(50) ఆయుర్వేద వైద్యుడు. 2007లో అతని భార్య మృతి చెందింది. పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు పార్ట్‌టైమ్‌గా కారు డ్రైవర్‌గా పనిచేస్తూ నెల్లూరులో బీటెక్ పూర్తి చేశాడు. రెండో కుమారుడు అయ్యప్ప బెంగళూరులో బీసీఏ చదువుతున్నాడు. రాజగోపాల్ వివిధ జిల్లాల్లో తిరుగుతూ ఆయుర్వేద వైద్యం చేస్తుంటాడు. అతనికి ఎలాంటి ఆస్తి పాస్తులు లేవు. కుమారులను ఉన్నత చదువులు చదివించాలని తాపత్రయపడ్డాడు. అందుకోసం ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం అందుతుందేమోనని మొదట నెల్లూరులో ప్రయత్నాలు చేశాడు. తెలిసినవారి సలహా మేరకు శుక్రవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయం వద్దకు చేరుకున్నాడు. అయితే, అక్కడ తనకు ఎలాంటి సహాయం అందదని నిర్ధారించుకుని సచివాలయం ప్రాంగణంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. రాజగోపాల్ జేబులో సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పోలీసులు అతడిని తొలుత సచివాలయంలోని ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స ప్రారంభించిన కొద్దిసేపటికే రాజగోపాల్ మృతి చెందాడు.

కాటేసిన రాకాసి అలలు

విశాఖ తీరంలో విషాదం



రాజశేఖర్‌రెడ్డి, శౌర్య (పాతచిత్రాలు)

మల్కాపురం/గాజువాక: విశాఖ జిల్లాలో యారాడ సముద్రతీరాన విషాదం చోటుచేసుకుంది. మూడేళ్ల చిన్నారి సముద్రంలో గల్లంతుకాగా, అతడిని రక్షించబోయిన తండ్రి మృతి చెందాడు. విజయవాడ కృష్ణలంకకు చెందిన ఎన్.రాజశేఖర్‌రెడ్డి(43) డెన్మార్క్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మూడు నెలల క్రితమే విజయవాడకు వచ్చాడు. ఆయన భార్య, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి నాగేశ్వరరెడ్డి కుమార్తె ఝాన్సీ రెండో కాన్పు కోసం విశాఖపట్నం కూర్మన్నపాలెంలోని రాజేశ్వరి ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న తన తండ్రి ఇంటికి వచ్చింది. మూడు వారాల క్రితం మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ చిన్నారికి శుక్రవారం బారసాల నిర్వహించారు. శుభకార్యం పూర్తి కావడంతో కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం యారాడ బీచ్‌కు వెళ్లారు. బీచ్ అంచున ఆడుకొంటున్న తన పెద్ద కుమారుడు శౌర్య(3)ను అలలు సముద్రంలోకి ఈడ్చుకెళ్లిపోవడాన్ని గమనించి అతడిని రక్షించేందుకు రాజశేఖర్‌రెడ్డి లోపలకు పరుగెత్తాడు. అతడిని కూడా సముద్రం అల ఈడ్చుకెళ్లిపోయింది. అక్కడున్నవారు తాడు విసిరారు. దాని సాయంతో బయటకు రావడానికి ప్రయత్నించిన రాజశేఖర్‌రెడ్డి ఒడ్డుకువచ్చి మృతి చెందినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చిన్నారి ఆచూకీ రాత్రి పొద్దుపోయేవరకు కూడా లభించలేదు.

ఎక్స్‌ప్రెస్ వేపై కేంద్రానికి సీఎం టోకరా

- రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే భూసేకరణ వ్యయం హామీపై వెనకడుగు
- భూసేకరణ వ్యయం భరిస్తానంటేనే ప్రాజెక్టుకు కేంద్రం అంగీకారం
- ఇప్పుడు ఇలా మాటతప్పడం ఏంటని నిలదీత

సాక్షి, అమరావతి: అమరావతి నుంచి రాయలసీమ వరకు నిర్మించే ఎక్స్‌ప్రెస్ వేపై కేంద్రానికి ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పారు. రాజధానికి రాయలసీమ జిల్లాలనుంచి వేగవంతమైన ప్రయాణం కోసం ప్రతిపాదించిన ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి దాదాపు 27,000 ఎకరాలు అవసరమని నిర్ణయించారు. ఇందులో వ్యవసాయ భూమి 23,139 ఎకరాలు కాగా అటవీ భూమి 3,751 ఎకరాలు అవసరమని తేల్చారు. అయితే భూ సేకరణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే ప్రాజెక్టు వ్యయాన్ని తాము భరిస్తామని కేంద్ర రహదారుల మంత్రి గతంలో స్పష్టం చేశారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకారం తెలిపడంతో ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్రం ఆమోదించింది. దీంతో పాటు కేంద్రం సూచన మేరకు ఈ ప్రాజెక్టు డిజైన్లు తదితర అంశాలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి అధ్యక్షతన కమిటీని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అవసరమైన భూమిని వీలైనంత మేర ల్యాండ్ పూలింగ్ విధానంలో తీసుకోవాలని గతంలో జరిగిన కలెక్టర్ల సమావేశాల్లో రాయలసీమ జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశించారు.

భూ సేకరణకు రూ. 3 వేల కోట్లు..

భూ సేకరణకు సుమారు రూ. 3 వేల కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశారు. అయితే ఇటీవల చంద్రబాబు కేంద్రానికి ఇచ్చిన మాటను తప్పారు. భూ సేకరణ వ్యయం కూడా కేంద్రమే భరించాలని రాష్ట్ర అధికారులతో ప్రతిపాదన పంపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం మండిపడుతోంది. స్వయంగా ముఖ్యమంత్రి అంగీకరించిన తరువాతనే ప్రాజెక్టు చేపట్టడానికి అంగీకరించామని, ఇప్పుడు ముఖ్యమంత్రి ఇలా మాట తప్పడం ఏంటని ఇటీవల ఢిల్లీలో కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కేంద్ర అధికారులు నిలదీశారు. ఈ ఎక్స్‌ప్రెస్ వేలో రైలు మార్గం కూడా ఉండటంతో అండర్ గ్రౌండ్ టన్నెల్స్‌తో పాటు బ్రిడ్జీలను కూడా నిర్మించాల్సి ఉంది. ఇలాంటి పనులకే రూ. 29,557 కోట్లు వ్యయం అవుతుందని, ఇంత పెద్ద మొత్తాన్ని కేంద్రం భరిస్తున్నప్పుడు భూ సేకరణకయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించలేదా అని కేంద్ర అధికారులు ప్రశ్నించినట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

సీమ జిల్లాలకు అన్యాయమే..

భూ సేకరణకయ్యే ఖర్చులో సగమైనా కేంద్రం భరించాలని తాము విజ్ఞప్తి చేయగా.. కేంద్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాన్ని ప్రకటించలేదని అధికారులు తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రాజెక్టు డైలమాలో పడిపోయిందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. రూ. 3 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించకపోవడం సీమ జిల్లాలకు అన్యాయం చేయడమేనని అధికార వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. అన్ని చోట్లా హామీలిచ్చి.. ఆనక వాటిని విస్మరించడం ముఖ్యమంత్రికి అలవాటైందని విమర్శిస్తున్నారు. నిజానికి ఎక్స్‌ప్రెస్ వేకు అంత పెద్ద మొత్తం భూమి అవసరం లేదని, అయితే రహదారులు ఇరు వైపుల పారిశ్రామిక, వాణిజ్య వేత్తలకు భూమిని సేకరించి ఇవ్వడానికి సీఎం నిర్ణయించారని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.



...నంద్యాలకు పోకుండా ఇక్కడకు ఎందుకొచ్చావయ్యా!

పుట్టెడు కష్టాలు

పల్లెటూరి డాక్టరమ్మలకు



- పని ఒత్తిడితో నలిగిపోతున్న ఏఎన్‌ఎంలు
- ముగ్గురు పనిచేయాల్సిన చోట ఒక్కరే
- ఆరేళ్లుగా ఒక్క నియామకమూ జరపలేదు
- రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఏఎన్‌ఎంల ఖాళీలు

సాక్షి, అమరావతి: పల్లెటూరి డాక్టరమ్మలుగా పేదలకు వైద్య సేవలందించే ఏఎన్‌ఎంలు(ఆగ్జిలరీ నర్స్ మిడ్‌వైఫరీ) పని ఒత్తిడితో నలిగిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు, మహిళలు ఏఎన్‌ఎంల రాక కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారు. ప్రస్తుతం ఏఎన్‌ఎంలు పని ఒత్తిడితోపాటు మానసిక కుంగుబాటుతో సతమతమవుతున్నారు. స్టాఫ్ నర్సుల నుంచి ప్రజారోగ్య సంచాలకుల వరకూ ఏఎన్‌ఎంలకే పనులు పురమాయించడం పరిపాటిగా మారింది. కిలోమీటర్ల కొద్దీ ప్రయాణిస్తూ మారుమూల గ్రామాలకు సైతం వెళ్లిరావడం, రవాణా చార్జీలను కూడా ప్రభుత్వం ఇవ్వకపోవడం, సర్వేల నుంచి వ్యాక్సిన్లు వంటి పనులతో విశ్రాంతి లేక ఏఎన్‌ఎంలు నిత్యం జీవన పోరాటం సాగిస్తున్నారు. రాష్ట్రంలో చాలాచోట్ల ముగ్గురు పని చేయాల్సిన చోట ఒక్కరినే నియమిస్తున్నారు. ఇక స్థానిక ప్రజాప్రతినిధులు ఏఎన్‌ఎంలపై తరచుగా నోరు పారేసుకుంటున్నారు. బహిరంగంగానే దూషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఎన్‌ఎంల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.


ఆరేళ్లుగా నియామకాలే లేవు : గత ఆరేళ్లుగా ప్రభుత్వం కొత్త ఏఎన్‌ఎంలను నియమించలేదు. ఇప్పటికే వందలాది మంది పదవీ విరమణ చేసినా వారి స్థానంలో ఎవరూ రాలేదు. పైగా కాంట్రాక్టు పద్ధతిలో కూడా కొత్తవారిని తీసుకోవడం లేదు. ఉన్న కొద్దిమంది సిబ్బందితోనే అన్ని పనులూ చేయిస్తున్నారు. ఒత్తిడిని భరించలేక కొందరు ఇప్పటికే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారని వైద్యాధికారులు చెబుతున్నారు.

ఏఎన్‌ఎంలపై బాధ్యతలు

- ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం జరిగితే ఆయా తల్లీబిడ్డల పేర్లు విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
- కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటున్న వారి వివరాలు సేకరించాలి.
- సాంక్రమిక వ్యాధుల (కమ్యూనికబుల్ డిసీజెస్) నివారణకు టీకాలు వేయాలి.
- ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి.
- ఏవైనా విపత్తులు సంభవించినప్పుడు ప్రాథమిక వైద్యం చేయాలి.
- పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్యం నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించాలి.
- కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో ఇంటి వద్దనే ప్రసవాలు చేయాల్సిన బాధ్యత ఏఎన్‌ఎంలదే.
- ప్రతివారం ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించి పథకాల అమలు తీరును వివరించాలి.
- 30 ఏళ్లు దాటిన మహిళల్లో వచ్చే ఏడు రకాల జబ్బులపై అవగాహన కల్పించాలి. వారిని ఆస్పత్రులకు తీసుకురావాలి.

రాష్ట్రంలో ఏఎన్‌ఎంలు.. ఖాళీలు

జిల్లా	ప్రస్తుతం ఉన్నది	ఖాళీలు
శ్రీకాకుళం	360	59
విజయనగరం	328	73
విశాఖపట్నం	401	184
తూ.గోదావరి	546	230
ప.గోదావరి	319	157
కృష్ణా	371	161
గుంటూరు	381	204
ప్రకాశం	361	92
నెల్లూరు	376	133
చిత్తూరు	390	169
వైఎస్సార్	290	104
అనంతపురం	362	128
కర్నూలు	355	94



(కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను మంజూరైన పోస్టులలో పరిగణించరు.)

సీఎం తీరుపై హజ్ యాత్రికుల ఆగ్రహం

- సచివాలయంలో మూడు గంటలపాటు యాత్రికుల అవస్థలు
- హైదరాబాద్ చేరుకుని గగ్గోలు పెట్టిన వైనం

హైదరాబాద్: సీఎం చంద్రబాబు తీరుపై హజ్ యాత్రికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు యాత్రికులు వెళ్లే ప్రదేశానికి వచ్చి వీడ్కోలు చెబితే.. ఏపీ సీఎం మాత్రం తన కార్యాలయానికి పిలిపించి ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం సీఎం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సీఎం చంద్రబాబు యాత్రికులు వెళ్లే ప్రాంతానికి వెళ్లకుండా వారినే వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలోని తన కార్యాలయానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం ఆంధ్ర హజ్ కమిటీ సభ్యులు, అధికారులు, కృష్ణా, గుంటూరు జిల్లాల యాత్రికులను బస్సుల్లో సీఎం కార్యాలయానికి తీసుకొచ్చారు. యాత్రికులను కలవడానికి, జెండా ఊపి యాత్రను ప్రారంభించడానికి సీఎం మూడు గంటలు ఆలస్యంగా వచ్చారు. దీంతో నానా అవస్థలు పడ్డామని హైదరాబాద్ చేరుకున్నాక యాత్రికులు గగ్గోలు పెట్టారు. సచివాలయంలో భద్రత పేరుతో తమను కనీసం బస్సు నుంచి కూడా దిగనీయలేదని వాపోయారు. యాత్రికుల్లో ఎక్కువ శాతం వృద్ధులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారని పేర్కొన్నారు. కనీసం మూత్ర విసర్జనకు కూడా పంపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 450 మందితో కూడిన ఆంధ్ర యాత్రికుల మొదటి బృందం శనివారం హజ్‌యాత్రకు వెళ్లిందని తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ఎస్‌ఏ. షకూర్ తెలిపారు. 450 మందితో కూడిన రెండో బ్యాచ్ శనివారం రాత్రి 10.30 గంటలకు వెళ్లిందని చెప్పారు.

ఆలస్యం జరిగిన విషయం వాస్తవమే: సీఎం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ద్వారా హజ్ యాత్రకు ఎంపికైన కృష్ణ, గుంటూర్ జిల్లా యాత్రికులను ఎహెరామ్ దుస్తుల్లో రెండు బస్సుల్లో సచివాలయానికి తీసుకొచ్చాం. అనుకున్న సమయానికి సీఎం సచివాలయంలోనే వేరే సమావేశంలో ఉన్నారు. ముందు సీఎం అరగంటలో వస్తారని సమాచారం అందింది. అనంతరం సమావేశం సుదీర్ఘంగా సాగడంతో ఆలస్యం అయింది.

– హజ్ కమిటీ చైర్మన్ మోమిన్ అహ్మద్

దశల వారీగా రాజధానికి అటవీ భూములు!

- షరతులు అమలు చేస్తే మూడు విడతల్లో బదలాయింపు
- మొదటి విడతలో 2,087 హెక్టార్లు
- కేంద్ర అటవీ సలహా కమిటీ సూత్రప్రాయ ఆమోదం

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ)కి షరతులతో దశల వారీగా అటవీ భూముల బదలాయింపునకు కేంద్ర అటవీ సలహా కమిటీ(ఎఫ్‌ఏసీ) సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. మొదటి దశలో గుంటూరు జిల్లాలోని వెంకటాయపాలెం, తాడేపల్లిలో 2,087 హెక్టార్ల అటవీ భూముల బదలాయింపునకు అంగీకరించింది. తాము సూచించిన నిబంధనలను అమలు చేస్తే మూడు దశల్లో ఏపీ ప్రభుత్వం కోరిన విధంగా 12,444.89 హెక్టార్ల అటవీభూమిని సీఆర్‌డీఏకి బదలాయిస్తామని ఎఫ్‌ఏసీ తెలిపింది. ఢిల్లీలో ఇటీవల జరిగిన ఎఫ్‌ఏసీ సమావేశంలో ఈ అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది. 13,267.12 హెక్టార్ల అటవీభూమిని రాజధాని కోసం బదలాయించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది కేంద్ర అటవీ పర్యావరణ శాఖకు విజ్ఞప్తి చేసింది. తర్వాత దీనిని 12,444.89 హెక్టార్లకు తగ్గించుకుని సవరించిన ప్రతిపాదన పంపింది. దీనికి ప్రతిగా వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అంతే పరిమాణంలో భూమిని అటవీశాఖకు ఇస్తామని నివేదికలో పేర్కొంది. అయితే ఈ ప్రతిపాదన సమగ్రంగా లేదని, అటవీభూమిని దేనికి వినియోగించుకుంటారో పేర్కొనలేదని, ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిన భూమి అడవి అభివృద్ధికి పనికిరాదంటూ ఎఫ్‌ఏసీ అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం విదితమే. తదుపరి ఈ విషయంపై సిఫార్సు చేయాలంటూ అటవీ నిపుణుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయగా.. ఈ కమిటీ ఈ ఏడాది జూన్ 19 నుంచి 22 వరకూ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎఫ్‌ఏసీకి నివేదిక సమర్పించింది. దీనిపై తాజాగా ఢిల్లీలో సమావేశమై చర్చించిన ఎఫ్‌ఏసీ మొదటి విడతలో 2,087 హెక్టార్ల అటవీ భూమి బదలాయింపునకు ఆమోదం తెలిపింది. తదుపరి తాము పేర్కొన్న నిబంధనలు అమలుచేస్తే(అడవి అభివృద్ధికి అనుకూలమైన ప్రత్యామ్నాయ భూమిని ఇవ్వడం, వనీకరణకు అవసరమైన మొత్తాన్ని, నష్ట పరిహారాన్ని చెల్లిస్తే).. వాటిని పరిగణనలోకి తీసుకుని మరో రెండు విడతల్లో అటవీభూమిని సీఆర్‌డీఏకి బదలాయించడానికి అభ్యంతరం లేదని తెలిపింది. ఈ విషయమై రాష్ట్ర అటవీశాఖ అధికారులను సంప్రదించగా ఇప్పటి వరకూ అధికారికంగా ఉత్తర్వులు రాలేదని తెలిపారు.

రైల్లో సూట్‌కేసును కొరికిన ఎలుక

ప్రయాణికుడికి రైల్వే శాఖ రూ.27,350 నష్టపరిహారం

కేకే.నగర్ (చెన్నై): రైలులో ప్రయాణిస్తున్న సమయంలో ఎలుక సూట్‌కేసును కొరికినందుకు సదరు ప్రయాణికునికి నష్టపరిహారంగా రూ.27,350 చెల్లించాలని దక్షిణ మధ్య రైల్వేకి వినియోగదారుల న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. చెన్నై కొళత్తూరుకు చెందిన దేవదాస్ ఇటీవల కేరళ అలంపురా నుంచి చెన్నైకి ఎక్స్‌ప్రెస్ రైలులోని ఏసీ బోగీలో ప్రయాణం చేశారు. రైలులో అతని ఖరీదైన సూట్‌కేసును ఎలుక కొరికి ధ్వంసం చేసింది. మనోవేదనకు గురైన దేవదాస్ చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ అధికారికి చెప్పగా దాన్ని ఫొటో తీసి దక్షిణ మధ్య రైల్వేకి ఫిర్యాదు చేయాలని చెప్పారు. వెంటనే దేవదాస్ వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు. దక్షిణ మధ్య రైల్వే నిర్వాహకంపై కేసు వేశారు. అందులో తన రూ.12,600 సూట్‌కేసుతో ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణం చేశానని, తన సూట్‌కేసును ఎలుక కొరికి నాశనం చేసిందని, తనకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కేసుపై విచారణ జరిపిన వినియోగదారుల న్యాయస్థానం ప్రయాణికుడికి దక్షిణ రైల్వే రూ.27,350 నష్టపరిహారంగా చెల్లించాలని ఇటీవల ఆదేశించింది.

అర్ధరాత్రి స్కూటర్‌పై కిరణ్‌బేడీ..

పుదుచ్చేరిలో భద్రత ఎలా ఉందో తెలుసుకునేందుకు స్వయంగా గస్తీ తిరిగిన వైనం


స్కూటర్‌పై వెళ్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ (వెనుక సీటులో)

సాక్షి ప్రతినిధి, చెన్నై: 'అర్ధరాత్రి మహిళ ఒంటరిగా ధైర్యంగా తిరిగిన నాడే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినట్లు' అని మహాత్మా గాంధీ అన్నారు. ఆయన ఆశించిన స్వాతంత్ర్యం పుదుచ్చేరిలో ఉందా లేదా అని లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ పరీక్షించారు. అనంతరం పుదుచ్చేరిలో మహిళలకు పూర్తి రక్షణ ఉందని ప్రకటించారు. పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సంచలనాలకు కేంద్ర బిందువుగా మారారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి, గవర్నర్ కిరణ్ బేడీకి మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వాన్ని కాదని కిరణ్ బేడీ తానే సర్వాధికారిగా వ్యవహరిస్తున్నారని సీఎం నారాయణ స్వామి పదేపదే ఆరోపిస్తుండగా, గవర్నర్ సైతం అనేక సంచలన పర్యటనలు, తనిఖీలు చేస్తూ సీఎంను ఇరుకున పెడుతున్నారు. అధికారులనూ హడలెత్తిస్తున్నారు. ఇందులో భాగంగా కిరణ్‌బేడీ మరో సాహసం చేశారు. శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో గవర్నర్ బంగ్లాకు చెందిన ఒక మహిళ (సిబ్బంది)ను వెంట బెట్టుకుని రహస్యంగా నగర పర్యటనకు బయలుదేరారు. సెక్యూరిటీ అధికారుల వద్ద గోప్యం పాటించి బందోబస్తు లేకుండానే స్కూటర్‌లో కలయదిరిగారు. స్కూటర్‌ను సదరు ఉద్యోగి నడపగా.. కిరణ్ బేడీ తనను ఎవరూ గుర్తు పట్టకుండా తలపై చున్నీ కప్పుకుని ప్రధాన ప్రాంతాలన్నీ చుట్టుకుని సుమారు ఒంటి గంట సమయంలో బంగ్లాకు చేరుకున్నారు. స్కూటర్‌లో గవర్నర్ గస్తీ తిరిగినట్లు ఆలస్యంగా తెలుసుకున్న అధికారులు హడలిపోయారు. 'పుదుచ్చేరిలో ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు తగిన రక్షణ ఉంది, అయినా పోలీసులు మరింతగా గస్తీ తిరగాల్సి ఉంద'ని అనంతరం కిరణ్‌బేడీ ట్వీట్ చేశారు.

ఒడిశాలో బాణసంచా పేలుడు

ఐదుగురు మృతి.. ఖుర్దా జిల్లా సిక్కో గ్రామంలో ఘటన

భువనేశ్వర్: ఒడిశాలోని ఖుర్దా జిల్లా సిక్కో గ్రామంలో శనివారం ఉదయం బాణసంచా పేలి ఐదుగురు మృతి చెందారు. సిక్కో గ్రామంలో సన్నై సెఠి అనే వ్యక్తి ఇంట్లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇంటిపై కప్పు, గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఘటనాస్థలిలోనే ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొం దుతూ మృతి చెందారు. మృతుల్లో ద్యుతీ సెఠి (62), బాబీ సెఠి (40), డాలీ సెఠి (19), మాధవి సెఠి(8), టికిలి సెఠి (4)లు ఉన్నారు. ఇంట్లో అక్రమంగా బాణసంచా తయారు చేస్తుండగా పేలుడు సంభవించినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

రిటర్నింగ్ అధికారి ఉత్తర్వులను నిలిపేయండి

హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: నంద్యాల శాసనసభ స్థానానికి ఉప ఎన్నిక ముగిసేంత వరకు ఎన్‌జీవోలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా చేపట్టే ఓటర్ల అభిప్రాయ సర్వేపై నిషేధం విధిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఉత్తర్వుల అమలును నిలిపేయాలని కోరుతూ సోషియో పొలిటికల్ అనాలసిస్ అండ్ రీసెర్చ్ సెంటర్ (స్పార్క్) కార్యదర్శి నున్నా రాంబాబు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో రిటర్నింగ్ అధికారి, ప్రధాన ఎన్నికల అధికారి, భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ జరపనుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రజాభిప్రాయ సర్వేపై నిషేధం లేదన్నారు. కేవలం ఎన్నికకు 48 గంటల ముందు ఎగ్జిట్ పోల్స్ నిర్వహణ, ఫలితాల ప్రకటనపై మాత్రమే నిషేధం ఉందని పిటిషనర్ వివరించారు.

'వక్ఫ్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని పోటీలో నిలపాలి'

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవికి జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థిని పోటీలో నిలపాలని ముస్లిం ఐక్య వేదిక అంజుమన్ ఇస్లామిక్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ జలీల్ కోరారు. విజయవాడలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వక్ఫ్ ఓటర్ల జాబితాలో ఉన్న వారిలో అధిక భాగం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులేనని చెప్పారు. వక్ఫ్ ఆస్తులకు రక్షణ కావాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయాలని అన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎస్‌ఏ అజాన్, అజీజ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

సాగు బరువై... బతుకు భారమై...

యువ కౌలు రైతు ఆత్మహత్య

- మిర్చి పంట వేస్తే రూ.4 లక్షలు అప్పు మిగిలింది
- ప్రశ్నార్థకంగా ముగ్గురు చెల్లెళ్ల భవిష్యత్తు


శివకృష్ణ (ఫైల్)

గుంటూరు ఈస్ట్ : సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువ కౌలు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంటూరు నగరంలోని కొత్తపేటలో ఉన్న ఓ లాడ్జిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి మృతుడి తండ్రి తెలిపిన వివరాలు...

గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం వెంకటాయపాలేనికి చెందిన నాగేశ్వరరావు, పద్మావతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. నాగేశ్వరరావుకు సొంత పొలం లేకపోవడంతో కొద్దిపాటి పొలం కౌలుకు తీసుకుని సాగు చేసేవాడు. ఇతర సీజన్‌లలో పొలం పనులకు వెళ్తుంటాడు. కుమార్తెల్లో ఒకరు బీఈడీ, మరొకరు సీనియర్ ఇంటర్, ఇంకొకరు 8వ తరగతి చదువుతున్నారు. రెండో సంతానమైన కుమారుడు శివకృష్ణ.. తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ పొలం పనులు చేస్తుంటాడు. ఇంటి బాధ్యతలన్నీ తానే చూస్తున్నాడు. గతేడాది నాలుగెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట వేశాడు. ఆస్తులులేని కారణంగా బ్యాంకు రుణం పొందలేక ప్రైవేటు అప్పులపై ఆధారపడ్డాడు. పంట చేతికొచ్చాక మిర్చి ధర పడిపోవడంతో లక్ష రూపాయలే వచ్చింది. రూ.4 లక్షలు అప్పు తేలింది. ఇది కాకుండా కొంత చిల్లర అప్పులూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్‌గా తీసుకున్న అప్పుల వారి నుంచి తండ్రీకొడుకులపై ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాదైనా మిర్చి అమ్మగా కొంత మిగులుతుందని ఆశపడితే పెద్ద మొత్తంలో అప్పులు మిగలడం.. చెల్లెళ్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడంతో మానసికంగా కుంగిపోయాడు. శుక్రవారం ఉదయం గుంటూరు కొత్తపేట విజ్ఞానమందిరం రోడ్డులోని విఘ్నేశ్వర లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. శనివారం ఉదయం గది తలుపులు తెరవకపోవడంతో సిబ్బంది కిటికీలో నుంచి చూడగా శివకృష్ణ మంచంపై నిస్తేజంగా పడి ఉన్నాడు. పోలీసులు వచ్చి లోపలికి వెళ్లి పరిశీలించగా పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాగేశ్వరరావు, అతని బంధువులు మార్చురీకి చేరుకుని శివకృష్ణ మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు. కుటుంబాన్ని గట్టెక్కించేందుకు తనకు అండగా ఉన్న ఒక్క కొడుకూ విగతజీవుడు కావడంతో నాగేశ్వరరావు నిశ్చేష్టుడై మతిస్థిమితం కోల్పోయినట్లుగా మారాడు.

'రాష్ట్రంలో రైతుల పరిస్థితి దుర్భరం'



ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు) : రాష్ట్రంలో రైతుల పరిస్థితి దుర్భరంగా ఉందని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ సంచాలకుడు, ఏపీ వ్యవసాయ అభివృద్ధి కమిషన్ సభ్యుడు ఎస్.గాలబ్ అన్నారు. ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో శనివారం ఆయన మీడియాకు ఏపీప్రభుత్వ వ్యవసాయ అభివృద్ధి కమిషన్ (రాధాకృష్ణ కమిషన్) నివేదిక అంశాలను వివరించారు. ఏపీలో రైతులకు లాభం చేకూర్చే విధంగా విధానాల్లేవని, మార్కెట్ వ్యవస్థ నిర్వహణ సక్రమంగాదని, చిన్న, సన్నకారు రైతులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని గుర్తించామన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని అధ్యయనం చేసి.. 13 రాష్ట్రాలలో రైతులు, వ్యవసాయరంగ నిపుణులు, సాంకేతిక నిపుణులతో మాట్లాడి తీర్చిదిద్దిన నివేదికను ఏడాది క్రితం ప్రభుత్వానికి అందించినా.. ఇప్పటివరకూ ఎటువంటి చలనంలేదని గాలబ్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలు, రైతులకు సేవచేసే అనుబంధ సంస్థలు, సాంకేతికత తదితర రంగాలను అధ్యయనం చేశామని, ఇందులో భాగంగా పది సబ్ కమిటీలు నియమించి వివరాలు సేకరించామని చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ విఫణిలో రైతులు తమ ఉత్పత్తులను విక్రయించే విధంగా వాణిజ్యం విస్తరించాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కౌలుదారులు, మహిళా వ్యవసాయదారుల సంఖ్య పెరిగిందని గాలబ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని కోసం పెద్దఎత్తున భూసమీకరణ చేయడంతో భూముల ధరలు పెరిగాయని.. చిన్న రైతులు భూములు కొనలేని పరిస్థితి ఏర్పడిందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

స్వైన్‌ఫ్లూ బాధితులకు తక్షణమే వైద్యం

రాష్ట్రాలకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదేశం

సాక్షి, అమరావతి: స్వైన్‌ఫ్లూ (హెచ్1ఎన్1) కేసులు నమోదైన వెంటనే బాధితులకు వైద్యం అందించాలని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. స్వైన్‌ఫ్లూ వల్ల మరణాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఇటీవల అన్ని రాష్ట్రాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఢిల్లీలో సమావేశం నిర్వహించింది. దేశంలోనే అత్యధికంగా తమిళనాడు,ఏపీ, తెలంగాణల్లో స్వైన్‌ఫ్లూ కేసులు ఎక్కువగా నమోదయ్యాయని, మరణాలు కూడా సంభవించాయని వెల్లడించింది. ఏపీలో ఈ ఏడాది 352 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదు కాగా 13 మంది మృతి చెందినట్టు అధికారికంగా ప్రకటించారు. వైద్య సేవలు సక్రమంగా అందకపోవడం వల్లే బాధితులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. స్వైన్‌ఫ్లూ బారినపడుతున్న బాధితులను వెంటనే గుర్తించాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సూచించింది.

ప్రతి ఐదు పడకలకు ఒక వెంటిలేటర్

స్వైన్‌ఫ్లూపై ఢిల్లీలో సమావేశం అనంతరం రాష్ట్ర అధికారులు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం వెంటిలేటర్ల కొరత వేధిస్తోందని, స్వైన్‌ఫ్లూ సోకిన వారికి సకాలంలో కృత్రిమ శ్వాస అందించలేకపోతున్నామని చెబుతున్నారు. ప్రతి ఐదు పడకలకు ఒక వెంటిలేటర్ ఉంటేనే బాధితులకు తక్షణం ఉపశమనం కలిగించవచ్చని భావిస్తున్నారు. వీలైనంత త్వరలో వెంటిలేటర్లను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

మీసం మెలేస్తోన్న రొయ్య!

- సీజన్ చివర్లో లాభాలు పండిస్తున్న వనామీ
- తగ్గిన ఉత్పత్తి, పెరిగిన డిమాండ్
- మార్కెట్‌లో టన్ను రూ.లక్ష పైమాటే
- ఆశాజనకంగా ఎగుమతులు



సాక్షి, అమరావతి: రొయ్యలు మీసం మెలేస్తున్నాయి! సీజన్ ముగుస్తుందనగా సాగుదారులకు ఆగస్టులో రొయ్యలు సిరులు కురిపిస్తున్నాయి. ఉత్పత్తి తగ్గిపోవడం, ఎగుమతి ఆశాజనకంగా ఉండటంతో మార్కెట్‌లో ధరలు పుంజుకున్నాయి. రొయ్యలు మూడు వారాల క్రితం వరకు టన్ను రూ.80 వేలు ఉండగా ప్రస్తుతం మార్కెట్‌లో రొయ్యలు టన్ను రూ.లక్ష పైనే పలకటంతో రైతులు సంబరపడుతున్నారు. మే, జూన్ నెలలో రెండో పంట సాగు చేపట్టిన రైతులకు వైట్ స్పాట్ వైరస్, విబ్రియో బ్యాక్టీరియా, ఈహెచ్‌పీ వైరస్, వైట్‌గట్ లాంటి వ్యాధులతో రొయ్యల సాగు పెద్దగా కలసి రాలేదు. ప్రారంభంలో 60 శాతం రొయ్యలకు వైరస్ సోకడంతో పెట్టుబడులతోనే సరిపెట్టుకోగా మిగిలిన 40 శాతం ఆశాజనకంగా మారింది.

మొదటి పంట ఒకేసారి మార్కెట్‌కు..

రాష్ట్రంలో ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో 1,84,183 హెక్టార్లలో ఆక్వాలో వనామీ రొయ్యలు సాగు చేశారు. మొదటి పంటను జనవరి, ఫిబ్రవరిలో స్టాకింగ్ చేసి మే నెలలో పట్టుబడి పట్టారు. ఆ పంటలో రాష్ట్రవ్యాప్తంగా 5.68 లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యలు ఉత్పత్తి సాధించారని అంచనా. ఈ సీజన్‌లో మొదటి పంటను అధిక సంఖ్యలో రైతులు ఏకకాలంలో పట్టుబడి పట్టేశారు. ఈ క్రమంలో ఒకేసారి మార్కెట్‌కు రొయ్యలు రావటంతో ఎగుమతిదారులు ధరలు తగ్గించి కొనుగోలు చేయడంతో పెట్టుబడులతో సరిపెట్టుకున్నారు. దీంతో కనీసం రెండో పంటలో అయినా లాభాలు వస్తాయని ఆక్వా రైతులు ఆశలు పెంచుకున్నారు.

విదేశాల నుంచి పెరిగిన డిమాండ్

కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రొయ్యల చెరువుల్లో పట్టుబడి ఇప్పటికే 60 శాతం పూర్తి చేశారు. చెరువుల్లో మిగిలిన 40 శాతం పట్టుబడి మొదలై ఉత్పత్తి తక్కువగా ఉండటంతో ప్రస్తుతం ఆక్వా మార్కెట్‌లో రొయ్యకు డిమాండ్ పెరిగింది. థాయిలాండ్, చైనా, వియత్నాం తదితర దేశాలలో ఎర్లీ మోర్టాలిటీసిండ్రోమ్ (ఇఎమ్ఎస్) వైరస్‌తో రొయ్యల ఉత్పత్తి పడిపోవడం కూడా ఇక్కడ ధరలు పెరగడానికి దోహద పడిందంటున్నారు. గత మూడు వారాల వ్యవధిలోనే కిలోకు రూ.100 పెరగడంతో రైతులు, వ్యాపారులు ఆనందంగా కనిపిస్తున్నారు.

ఎకరాకు రూ.3.50 లక్షలు మిగులు

ఎకరా చెరువులో పెంపకం కోసం లక్ష రొయ్య పిల్లలు వేస్తే 120 నుంచి 140 రోజులలో 40 కౌంట్ లెక్కన 2.50 టన్నుల దిగుబడి సాధించారు. టన్ను దిగుబడికి రూ.6.50 లక్షలు వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. ఇప్పుడున్న ధర (40 కౌంట్ రూ.400) పరిగణనలోకి తీసుకుంటే సుమారు రూ.10 లక్షలు ఆదాయం వస్తుంది. ఇందులో రూ.6.50 లక్షలు పెట్టుబడి పోగా రైతుకు ఎకరాకు రూ.3.50 లక్షలు లాభం వచ్చింది.

రొయ్యకు మద్దతు ధర ప్రకటించాలి

రొయ్య రైతులకు మద్దతు ధర ప్రకటించాలి. ప్రభుత్వానికి కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెడుతున్న ఆక్వా రంగంలో ధరలు నిలకడగా ఉంచేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలి. మొదటి పంటలో అధిక దిగుబడులు వచ్చినా ఎగుమతి కంపెనీలు సిండికేటై ధరలు తగ్గించడంతో పెట్టుబడులు మాత్రమే దక్కాయి. రెండో పంట ప్రారంభంలో వైరస్‌లతో నష్టపోయాం. ఎకరాకు రూ.3 లక్షలు వరకు లాభం రావటం సంతోషంగా ఉంది.

– భూపతిరాజు వెంకట సుబ్రహ్మణ్యరాజు ఆక్వా రైతు, తూర్పుగోదావరి)

పస్తుతం రొయ్య ధరలు	ప్రారంభంలో ధరలు
100 కౌంట్–రూ.240	100 కౌంట్–రూ.170
90 కౌంట్–రూ.260	90 కౌంట్–రూ.180
80 కౌంట్–రూ.280	80 కౌంట్–రూ.200
70 కౌంట్–రూ.300	70 కౌంట్–రూ.210
60 కౌంట్–రూ.320	60 కౌంట్–రూ.230
50 కౌంట్–రూ.360	50 కౌంట్–రూ.250
40 కౌంట్–రూ.400	40 కౌంట్–రూ.315
30 కౌంట్–రూ.440	30 కౌంట్–రూ.330

సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం | ఆగస్టు | 20 | 2017

నంద్యాల దేనికి నాంది?

త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి

నంద్యాల ఉపఎన్నికలో ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొన్ని రోజులుగా అక్కడే మకాం ఉండి నిత్యం రోడ్‌షోలు నిర్వహిస్తుండగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం ఉదయం చేరుకున్నారు. రెండు శిబిరాలలో ఆఖరి పోరాటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. నంద్యాల శాసనసభ్యుడు భూమా నాగిరెడ్డి ఆకస్మిక మరణం కారణంగా జరుగుతున్న ఉపఎన్నిక తెలుగుదేశం అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికీ, వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డికి మధ్య పోరాటంలా కనిపించడం లేదు. ఇది చంద్రబాబుకూ, జగన్‌మోహన్‌రెడ్డికీ మధ్య యుద్ధం. ప్రచారంలో ప్రస్తావనగా అప్పుడప్పుడు అభ్యర్థుల పేర్లు రావచ్చు కానీ ప్రధాన యోధులు వారిద్దరే. అమరావతిలో ఉండవలసిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం యావత్తూ కొన్ని రోజులుగా నంద్యాలలోనే విడిది చేసింది. మరో పాతికమంది అధికారపార్టీ శాసనసభ్యులూ అక్కడే తిష్ఠ వేశారు. జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు తమ అభ్యర్థి విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఒక ఉప ఎన్నికలో ఇంతటి తీవ్రమైన పోటీ, స్పర్ధ, ప్రచారం, ఆవేశం మునుపెన్నడూ కనీవినీ ఎరగం.

చంద్రబాబు ఎన్టీ రామారావును గద్దె దింపి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత వచ్చిన మొదటి ఉపఎన్నిక ప్రకాశం జిల్లా దర్శిలో 1996లో జరిగింది. ఆ రోజుల్లోనే అక్కడ విపరీతంగా డబ్బు ఖర్చు చేశారు. కాంగ్రెస్ దీటైన పోటీ ఇవ్వలేదు. తొమ్మిదివేల ఓట్ల తేడాతో టీడీపీ గెలిచింది. ఎంత వ్యూహాత్మకంగా వ్యవహరించినా కొన్ని సందర్భాలలో విజయం వరించకపోవచ్చు. అదే సంవత్సరం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఉపఎన్నికలో నందమూరి లక్ష్మీపార్వతి టీడీపీ అభ్యర్థిపైన 14వేల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించి అన్ని వేళలా అధికారం, డబ్బూ, దబాయింపూ పని చేయవని నిరూపించారు. 2001లో సిద్దిపేట నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా కల్వకుంట్ల చంద్రశేఖరరావు టీడీపీ అభ్యర్థి కె శ్రీనివాసరెడ్డిపైన 52,712 ఓట్ల భారీ మెజారిటీతో ఢంకా బజాయించారు. పదవిలో ఉన్నారు కనుక ప్రతిసారీ విజయం చంద్రబాబునే వరిస్తుందనే వాదనలో పసలేదు. గట్టి ప్రతిఘటన ఉన్న సందర్భాలలో ఓటమి తప్పలేదు. చంద్రబాబు ప్రభుత్వాధికారాన్నీ, పోలీసు బలగాన్నీ, అర్థబలాన్నీ నిస్సంకోచంగా వినియోగిస్తున్నారు. జగన్‌మోహన్ రెడ్డి శక్తివంచన లేకుండా ప్రచారం చేస్తున్నారు. మొత్తంమీద నువ్వా–నేనా అన్నట్టు సాగుతున్న సమరంలో రెండు పక్షాలూ చావోరేవో తేల్చుకునేందుకు సిద్ధమై తలపడుతున్నాయి. అందుకే ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారింది.

నంద్యాల ప్రత్యేకత

నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం నంద్యాల లోక్‌సభ నియోజకవర్గానికి కేంద్రం. ఈ స్థానం నుంచి ఎన్నికైన ఇద్దరు వ్యక్తులు దేశానికి రాష్ట్రపతిగా (నీలం సంజీవరెడ్డి), ప్రధాని (పీవీ నరసింహారావు)గా సేవలందించారు. దేశంలోని మరే ఇతర లోక్‌సభ స్థానానికీ ఇటువంటి ప్రత్యేకత లేదు. ఆత్యయిక పరిస్థితిని ఎత్తివేసిన తర్వాత 1977లో జరిగిన ఎన్నికలలో మొత్తం 42 లోక్‌సభ స్థానాలలో ఒక్కటంటే ఒక్కటే ప్రతిపక్షానికి దక్కింది. నంద్యాలలో జనతాపార్టీ టిక్కెట్టుపైన పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి, మాజీ స్పీకర్ నీలం సంజీవరెడ్డి నలభై వేల ఓట్ల మెజారిటీతో గట్టెక్కారు. తక్కిన 41 స్థానాలనూ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కేంద్రంలో జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. నీలం ఏకగ్రీవంగా లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైనారు. ఆ తర్వాత మూడు మాసాలకే నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ కన్నుమూశారు. 1977 జూలై 21న సంజీవరెడ్డి ఏకగ్రీవంగా రాష్ట్రపతిగా ఎన్నికైనారు. 1969లో రాష్ట్రపతి ఎన్నికలలో వివి గిరిని పోటీ చేయించి కాంగ్రెస్ అధికార అభ్యర్థి సంజీవరెడ్డిని ఓడించిన ఇందిరాగాంధీ 1977లో సంజీవరెడ్డి ఏకగ్రీవ ఎన్నికకు సహకరించడం విశేషం. 1967–69 మధ్య మొదటిసారి స్పీకర్‌గా పని చేసిన సంజీవరెడ్డి అప్పట్లో అనంతపురం జిల్లా హిందూపురం నుంచి లోక్‌సభకు ఎన్నికైనారు. నంద్యాలనుంచి సంజీవరెడ్డి తర్వాత పెండేకంటి వెంకటసుబ్బయ్య ఎన్నికై ఇందిర మంత్రిమండలిలో హోంశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. ఏడేళ్ళ అనంతరం నంద్యాలకు మరోసారి మహర్దశ పట్టింది. 1991 ఎన్నికలకు దూరంగా ఉండిన పీవీ తమిళనాట శ్రీపెరంబదూరులో రాజీవ్‌గాంధీ హత్య జరగడంతో మైనారిటీ ప్రభుత్వ సారథిగా పదవీ బాధ్యతలు స్వీకరించి ఆ తర్వాత పార్లమెంటుకు ఎన్నిక కావలసి వచ్చింది. ఆనాటి సీఎం కోట్ల విజయభాస్కరరెడ్డి నంద్యాల నుంచి గెలుపొందిన కాంగ్రెస్ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి చేత రాజీనామా చేయించి పీవీని అక్కడ పోటీ చేయించారు. ప్రధాని స్థాయికి చేరిన ఒక తెలుగు ప్రముఖుడికి పోటీ పెట్టకూడదని ఎన్టీఆర్ నిర్ణయించారు. ఫలితంగా పీవీ 5.8 లక్షల ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. 1996లో రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన పీవీ నంద్యాల నుంచి తక్కువ మెజారిటీతోనూ, బరంపురం నుంచి ఎక్కువ ఆధిక్యంతోనూ గెలిచారు. బరంపురం స్థానం ఉంచుకొని నంద్యాలను వదులుకున్నారు.

అధికారం అన్నివేళలా లాభించదు

దర్శి నుంచి నంద్యాల వరకూ చంద్రబాబు ఎత్తుగడలూ, వ్యూహాలూ గమనించినవారికి కొన్ని అంశాలు స్పష్టంగా అర్థం అవుతాయి. ఒకటి, ఆయనకు సెంటిమెంట్లు లేవు. రెండు, రాజకీయ విలువలు కానీ నైతిక విలువలు కానీ ఆయనకు శిరోధార్యం కాదు. మూడు, ఎన్నికలలో గెలుపే ప్రధానం. విజయం సాధించే క్రమంలో ఏమి చేసినా చెల్లుతుందనే విశ్వాసం బలంగా ఉంది. నాలుగు, ప్రజలు అమాయకులనీ, ఎన్నికలలో మాట్లాడినవన్నీ చేసితీరాలని పట్టుపట్టరనీ, ఆటలో అరటిపండు అనుకుంటారనీ అభిప్రాయం. ఈ విషయంలో ఆయన నమ్మకం ఇంతవరకూ వమ్ముకాలేదు. చంద్రబాబు రాజకీయ వ్యక్తిత్వంలో ఇది ప్రధాన పార్శ్వం. ఒకటి చెప్పడం వేరొకటి చేయడం చాలామంది రాజకీయ నాయకులకు అలవాటు. చెప్పిన దానికి పూర్తి భిన్నంగా చేయడం, చేసిన దానికి పూర్తి వ్యతిరేకంగా మాట్లాడటం, దాన్ని సమర్థించుకోవడం బాబు ప్రత్యేకత . 1994లో అత్యధిక మెజారిటీతో గెలిచి ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణం స్వీకారం చేసిన ఎన్టీఆర్‌ను ఎట్లా గద్దె దించిందీ తెలుగు ప్రజలు జాగ్రత్తగా గమనించారు. పదవీచ్యుతి తర్వాత అల్లుడి గురించి ఆయన ఏమి మాట్లాడారో జగద్విదితం. యూట్యూబ్‌లోకి వెడితే లెక్కలేనన్ని క్లిప్పింగ్‌లు దొరుకుతాయి. రామారావు అస్తమయం అనంతరం కొన్ని మాసాలకు ఆయనను కీర్తించడం ప్రారంభించిన చంద్రబాబు ఆయనను అధికారం లాగివేసిన ఉదంతాన్ని పిచ్చి ప్రజలు విస్మరించి ఉంటారని భావించారు. ఆ భావనకు అనుగుణంగానే 1996 లోక్‌సభ ఎన్నికలలోనూ, 1999 అసెంబ్లీ పోరులోనూ విజయం కట్టబెట్టారు. గెలుపొందడానికి కారణాలు వేరే ఉండవచ్చును. కానీ రామారావును దేవుడిని చేసి పూజించడం ద్వారా ఆగస్టు సంక్షోభం జ్ఞాపకాలను చెరిపివేశానని బాబు నమ్ముతున్నారు. ఇదే ప్రయోగం రాష్ట్ర విభజన సమయంలోనూ చేశారు. రాష్ట్రాన్ని విభజించమని ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖ రాశారు. దమ్ముంటే విభజించాలని సోనియాగాంధీని సవాలు చేశారు. తాను లేఖ ఇవ్వకపోతే రాష్ట్రం ఏర్పడేది కాదని తెలంగాణలో, అన్యాయంగా, అశాస్త్రీయంగా కాంగ్రెస్ రాష్ట్రాన్ని విభజించిందని ఆంధ్రప్రదేశ్‌లో మాట్లాడారు. ఈ ద్విపాత్రాభినయనాన్ని రెండుచోట్లా స్వీకరించి తన విధానాన్ని బలపర్చుతారని ఆయన భావించారు. అందుకే తెలంగాణలో కూడా పట్టు కొనసాగించాలని ప్రయత్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ శాసనసభ్యుడిని కొనుగోలు చేసే దుస్సాహసం చేశారు. కానీ పార్టీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డిని నగదుతో సహా టేపులలో ఇరికించి తాను ఆడియోలో దొరికిపోయారు. నీతినియమాల గురించి ఆలోచించడం లేదు. ఎక్కడ పోటీ జరిగితే తాను అక్కడ ఉండాలనీ, ఎట్లాగైనా గెలిచి తీరాలనే జూదరి స్వభావం. చంద్రబాబు అదృష్టం కొద్దీ 'ఓటుకు కోట్లు' కేసు ముందుకు సాగడం లేదు. తప్పు చేసినా ఏదో ఒక విధంగా తప్పుకునే చాకచక్యం ఉంది.

మాట వేరు, బాట వేరు

విభజన సమయంలో ప్రత్యేక హోదా గురించి పట్టుబట్టి, అయిదు, పది సంవత్సరాలు సరిపోదు పదిహేనేళ్ళు ఇచ్చి తీరాల్సిందేనంటూ వాదించిన చంద్రబాబు ఇప్పుడు హోదా వద్దు ప్యాకేజీ ముద్దు అంటున్నారు. నంద్యాల ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీకి మారిన శిల్పా మోహన్‌రెడ్డిని శనివారం ప్రచారంలో ధనదాహం ఉన్న స్వార్థపరుడుగా అభివర్ణించారు. శిల్పా చక్రపాణిరెడ్డికి శాసనమండలి అధ్యక్ష పదవి ఇస్తానన్న చంద్రబాబు మాజీ మంత్రి ఫారూఖ్ వైపు మొగ్గు చూపారు. నంద్యాల నియోజకవర్గంలో ముస్లింలు అధికంగా ఉన్నారు కనుక ఫారూఖ్ గుర్తుకొచ్చారు. ఇదే ఫారూఖ్‌కు ఆయన 2014లో మొండిచేయి చూపారు. ఇప్పుడు ఏకంగా శాసనమండలి చైర్మన్ పదవి వాగ్దానం చేశారు. 1995 ఆగస్టులో వైస్రాయ్ డ్రామాలో ఏమి జరిగిందో ఫారూఖ్‌కి తెలుసు. ఎన్టీఆర్‌కు ఎసరుపెట్టడంలో సహకరించిన తోడల్లుడు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు ఉపముఖ్యమంత్రి పదవీ, బావమరిది హరికృష్ణకు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవీ ఇవ్వజూపారు. ఒకరి తర్వాత ఒకరికి జెల్లకొట్టారు. నెల తిరగకుండానే రామారావు దగ్గరికి దగ్గుబాటి తిరిగి వెళ్ళిపోతే, హరికృష్ణ 1999లో సొంతపార్టీ పెట్టుకొని తిరుగుబాటు ప్రకటించారు. 1996 ఎన్నికలకు కొన్ని మాసాల ముందే రామారావు మరణించడంతో చంద్రబాబుకి పెద్ద అడ్డంకి తప్పిపోయింది. ఇవన్నీ క్షుణ్ణంగా తెలిసినా ఫారూఖ్ ప్రలోభాలకు లొంగిపోయారు. ఆయన వాస్తవిక దృష్టిలో ఆలోచించి ఉంటారు. ఇప్పుడు ఏమీ లేని స్థితి కంటే శాసనమండలి సభ్యత్వం కొంత మెరుగు. ఆ తర్వాత కౌన్సిల్ అధ్యక్ష పదవి బోనస్. రాకపోయినా పర్వాలేదని అనుకొని ఉంటారు. అన్నగారికి సహాయం చేసేందుకు చక్రపాణిరెడ్డి వైఎస్ఆర్‌సీపీలో చేరాలని వెడితే మండలి సభ్యత్వానికి రాజీనామా చేసి రావాలంటూ జగన్ మోహన్‌రెడ్డి షరతు విధించారు. ఈ ఆదర్శప్రాయమైన ఉదంతానికి ప్రచారం రాకుండా బాబు మీడియాను కట్టడి చేయగలిగారు. 21మంది వైఎస్ఆర్‌సీపీ శాసనసభ్యులను ఫిరాయించేందుకు ప్రోత్సహించిన నీతిమాలిన చర్య ప్రస్తావన కూడా రాకుండా జాగ్రత్త పడ్డారు. నంద్యాలలో కోట్లు ఖర్చు చేస్తూనే తనకు వస్తు వ్యామోహం లేదనీ, చేతికి ఉంగరం, వాచీ కూడా ఉండదనీ చెబుతారు. అఖిలప్రియ చెప్పిన అభ్యర్థికి టిక్కెట్టు ఇచ్చినా ఎన్నికల తంత్రం ఇతర నేతలకు, మంత్రులకూ అప్పగించారు. భూమా కుటుంబానికి రాజకీయ శత్రువైన గంగుల ప్రతాపరెడ్డికి అర్జంటుగా పచ్చకండువా కప్పారు. విద్యార్థులను సర్వేయర్ల రూపంలో పంపి ఓటర్లను బెదిరిస్తున్నారు. ఇన్ని పరస్పర విరుద్ధమైన అంశాలను సమన్వయం చేసుకోవడం చాకచక్యం కావచ్చును కానీ రాజనీతి మాత్రం కాదు. ప్రజాస్వామ్య స్ఫూర్తి అసలే కాదు. నంద్యాల ఎన్నికలో ఓటమి ఎదురైతే బాబు తన వైఖరిని సమీక్షించుకొని, తప్పు తెలుసుకొని, సవరించుకునే అవకాశం ఉంటుంది. గెలిచినట్లయితే తన వైఖరికి తిరుగులేదని భావించి అదే మార్గంలో ప్రయాణిస్తారు కాబోలు. 28వ తేదీన నంద్యాల ఓటర్ల తీర్పు ఎట్లా ఉండబోతోందనేదే ఉత్కంఠ కలిగించే అంశం.



పళని స్వామి (సి.ఎం.)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కలిసే చేతుల్ని కురిసే చినుకులు అడ్డుకుంటాయా? రా.. మిత్రమా.. ముందు చేతులు కలుపుకుని, ఆ తర్వాత ఆలింగనంతో ఒక్కటై పోదాం.

పొయెట్రీ రాస్తున్నాను!

ఊపిరి సలపడం లేదు. పన్నీర్‌సెల్వం పట్టు బిగించాడు. ఇష్టం లేని ఆలింగనం కూడా ఇంత గాఢంగా ఉంటుందా?!

వదిలెయ్ మిత్రమా! దయచేసి వదిలెయ్. చేతులు, ఛాతీలు కలిసింది చాలు. కలిసేందుకు ఇక మన మధ్య కాస్తయినా చోటు మిగల్లేదు.

పొయెట్రీని చాలా బలంగా రాస్తున్నాను.

పన్నీర్‌సెల్వం వదలడం లేదు. గట్టిగా అతడిని వదిలించుకుని.. ఒక్క ఉలికిపాటుతో నిద్ర లేచాను! మురుగా.. ఇది నిజం కాదు! నేను నా ఇంట్లోనే ఉన్నాను. పన్నీర్‌సెల్వం కూడా తన ఇంట్లో ఉండి ఉంటాడు.

సమయానికి నిన్న వర్షం కురిసి ఒక బలమైన ఆలింగనం తప్పిపోయింది. 'వర్షం పడుతోంది ఇప్పుడు కాదు' అని పన్నీర్‌సెల్వంని తప్పించుకుని వచ్చేశాను. పన్నీర్‌సెల్వం కూడా నన్ను ఇలాగే తప్పించుకుని వెళ్లిపోయాడట.. 'వర్షం పడుతోంది ఇప్పుడు కాదు' అని! ఇద్దరం ఒకేమాట చెప్పకుండా ఉండాల్సింది. మోదీకి డౌట్ వచ్చినట్లుంది!



పన్నీర్‌సెల్వంని హత్తుకోవడం నాకు ఇష్టం లేదు. నన్ను హత్తుకోవడం పన్నీర్‌సెల్వంకీ ఇష్టం లేదు. కానీ.. ఇష్టం లేని ఆలింగనం లోంచే ఒక ఇష్టమైన బంధం ఏర్పడుతుందని నాకూ, పన్నీర్‌సెల్వంకి నచ్చజెప్పమని ఢిల్లీ నుంచి డిప్యూటీ స్పీకర్ తంబిదొరైకి చెప్పి పంపించారు మోదీ!

"మోదీజీకి ఆలింగనాలంటే ఇష్టమని నీకూ తెలుసు కదా పళని స్వామీ. ఎందుకు మొండికేస్తావ్? దేశ ప్రధాని ఒక కోరిక కోరినప్పుడు దానిని తీర్చడం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నీ ధర్మం కాదా?! ఆయనేమీ తనని ఆలింగనం చేసుకొమ్మని అడగడం లేదే. పన్నీర్‌సెల్వంని హత్తుకోమని అంటున్నాడు. అంతే కదా" అన్నారు తంబిదొరై.

'అంతే కదా' అని తంబిదొరై చాలా తేలిగ్గా అనేయడం నా మనసును తీవ్రంగా గాయపరిచింది. పన్నీర్ సెల్వం లాంటి వాణ్ణి మనసా వాచా కర్మణా హత్తుకోవడం.. 'అంతే కదా' అవుతుందా!

"అలవాటైతే కష్టం కూడా ఇష్టంగా అనిపిస్తుంది పళని స్వామీ. ఇప్పుడు పన్నీర్‌సెల్వంని హత్తుకోవడం అలవాటైతే.. రేపు మోదీజీని హత్తుకోవడం నీకూ, పన్నీర్‌సెల్వంకి కూడా ఈజీ అవుతుంది. ఆలోచించు" అని వెళ్లిపోయారు తంబిదొరై. పన్నీర్‌సెల్వంకి కూడా సేమ్ ఇవే మాటలు చెప్పడానికి ఆయన వెళ్లి ఉంటారు.

ఇంతకీ నేను పొయెట్రీ రాస్తున్నట్లు కల ఎందుకొచ్చినట్లు? దిండు పక్కన ఎప్పటిదో కరుణానిధి కవితల పుస్తకం! రాత్రి చదువుతూ చదువుతూ నిద్రపోయినట్లున్నాను.

తమిళనాడు రాజకీయాల్లో నేను కరుణానిధి, పన్నీర్‌సెల్వం ఎమ్జీఆర్ అవబోతున్నామా?

నంద్యాల జనం గుండెల్లో జగన్

సందర్భం



ఇమామ్

నంద్యాలలో ఉప ఎన్నిక హోరు రాష్ట్రంలో ప్రజలందరినీ ఆలోచింపచేస్తోంది. ఈ ఎన్నికలో రాజకీయ పోరాటం తారా స్థాయికి చేరింది. ప్రత్యేకించి ఈ ఎన్నికలో ధర్మానికి అధర్మానికి, న్యాయానికి అన్యాయానికి మధ్య జరుగుతున్న ఎన్నికగా వైఎస్సార్‌సీపీ నేత జగన్‌మోహన్‌రెడ్డి అభివర్ణించారు. గత 10 రోజులుగా జగన్ ఎన్నికల ప్రచారానికి ప్రజలు విశేషంగా హాజరు కావడం.. ప్రత్యేకించి తండోపతండాలుగా మహిళలు జగన్ రాక కోసం ఎదురుచూడటాన్ని ఎలక్ట్రానిక్, ప్రచార మాధ్యమాలలో చూస్తున్నాం. ఇలాంటి ప్రజాభిమానం గతంలో ఓ ఎన్టీఆర్‌కి, ఓ వైఎస్సార్‌కి మాత్రమే సాధ్యమైంది. ప్రజల మీద అచంచలమైన విశ్వాసంతో జగన్ తన రాజకీయాలను పారదర్శకతతో కొనసాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీలోకి శిల్పా చక్రపాణి రెడ్డి చేరాలంటే.. కీలకమైన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి రావాలని కోరడంతో రాజకీయాలలో నూతన ఒరవడిని మనం చూడగలిగాం. అవినీతిమయమైన రాజకీయాలు ప్రజాస్వామిక వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న నేటి సామాజిక పరిస్థితిలో జగన్ నిర్ణయం ప్రజాస్వామిక వాదులందరికీ ఆనందం కలిగించే అంశం. మరో వైపు చంద్రబాబు గెలవడమే పరమావధిగా అనైతిక చర్యలకు పాల్పడడం మనం గమనిస్తున్నాం.

ఉదాహరణకు రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు తారాస్థాయిలో కేంద్ర బిందువుగా ఉండిన ఆళ్లగడ్డ నియోజకవర్గంలో భూమా కుటుంబానికి గంగుల ప్రతాప్‌రెడ్డి వర్గానికి జరిగిన ఘర్షణలు ఒక చరిత్ర అవుతుంది. భూమా నాగిరెడ్డి కుటుంబంలో శోభానాగిరెడ్డి మరణం తరువాత తండ్రి, కుమార్తె, బావమరిదిని ప్రలోభాలకు గురిచేసి ధనం వెదజల్లి తెలుగుదేశంలో చేర్చుకోవడం ప్రజాస్వామిక వ్యవస్థలకు తిలోదకాలు ఇవ్వడమే. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా గెలిచిన వీరి ముగ్గురిని తెలుగుదేశంలోకి చేర్చుకోవడం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనం. అఖిలప్రియకి మంత్రి పదవిని ఇవ్వడంతోపాటుగా, భూమా బ్రహ్మానందరెడ్డిని టీడీపీ అభ్యర్థిగా నిలపడం ఒక ఎత్తైతే, మరోవైపు భూమా కుటుంబంతో కనీసం చర్చించకుండా గంగుల ప్రతాప్ రెడ్డిని కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి ఏకపక్షంగా చంద్రబాబు చేర్చుకోవడంతో ఆయన రాజకీయ దిగజారుడుతనం తారస్థాయికి చేరింది. ఇక్కడే జగన్ విశ్వసనీయతకు చంద్రబాబు అవకాశ వాదానికి అక్రమ పద్ధతులకు తేడా కనిపిస్తుంది. ఒకరు జనాన్ని నమ్మారు. న్యాయం, ధర్మం గెలుస్తుందనే విశ్వాసంతో రాజకీయాలలో కొనసాగుతున్నారు. మరో వైపు చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు



పన్నుతూ కోట్లు గుమ్మరించి ఓటర్లను అక్రమ పద్ధతులలో ప్రలోభపరుచుకోవడం మనం చూస్తున్నాం. నేడు నంద్యాల ఎన్నికలో తెదేపా మంత్రులందరూ, ఎమ్మెల్యేలతో సహా తిష్ట వేసి ప్రజలను తమ కుటిల రాజకీయాలకు పావులుగా మార్చుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నంద్యాల ఎన్నికల గెలుపు కోసం ఏకంగా ముఖ్యమంత్రి నంద్యాలకు వచ్చి మూడురోజులు తిష్టవేసి ప్రచారం నిర్వహిస్తున్నారు..

సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ఒక కొత్త తరహా అభివృద్ధి నమూనాను వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఏపీ రాజకీయాలలో నెలకొల్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా ఎన్నో అమలు చేసి సంక్షేమ సారథిగా నిలిచిపోయారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ ఇస్తామనేది ఇవ్వని హామీ! అయినప్పటికీ 4 శాతం రిజర్వేషన్ కల్పించి మైనార్టీల జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. ఈ రిజర్వేషన్‌తో స్కాలర్‌షిప్‌లు, ఉన్నత చదువులతో పాటు మంచి ఉద్యోగాలు కూడా మైనార్టీలు సాధించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లలో కూడా మైనార్టీలకు గట్టి మేలు జరిగింది.

సంక్షేమ పథకాలకు సంబంధించి వైఎస్సార్ వారసత్వాన్ని కొనసాగించడానికి వైఎస్ జగన్ నిరంతరం పోరాడుతున్నారు. జనం రాజశేఖరరెడ్డిని జగన్‌లో చూస్తున్నారు. గతంలో వైఎస్సార్‌ని ఆదరించిన నంద్యాల ప్రజలు నేడు జగన్‌ని కూడా ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని సంకేతాలు వెలువడుతున్నాయి. గతంలో నీలం సంజీవరెడ్డిని రాజకీయంగా నలిపేస్తామని ప్రగల్భాలు పలికిన నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు షాక్ కలిగిస్తూ నంద్యాల ప్రజలు నీలం సంజీవరెడ్డిని గెలిపించి ఒక చరిత్ర సృష్టించారు. సీమ ప్రాంతానికి ఎంతో సేవ చేసిన నీలం సంజీవరెడ్డి, ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డిలను రాయలసీమ వాసులు ఎన్నటికీ మర్చిపోలేరు. రాయలసీమ కరువు పరిస్థితులకు శాశ్వత పరిష్కారంగా సేద్యపు నీటి సౌకర్యాలను కల్పించడానికి తుంగభద్ర, శ్రీశైలం రిజర్వాయర్, శ్రీశైలం కుడి కాలువ, తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు–నగరి లాంటి సేద్యపు నీటి ప్రాజెక్టుల కోసం కృషి చేసిన ఆ మహా నాయకుల జాడలోనే వైఎస్ జగన్ ఆ ప్రాజెక్టుల సాధన కొరకు సమరశీల పోరాటాలు చేస్తున్నారు. తమ హృదయాలలో పదిలంగా దాచుకున్న ఆ మహా నాయకుల కోవలో ప్రజలు వైఎస్ జగన్‌ని చూసుకుంటున్నారు. ఎటువంటి ప్రలోభాలు, జిమ్మిక్కులు, అక్రమ పద్ధతులను ప్రజలు సహించబోరని, నంద్యాలలో ఓటు హక్కు అనే ఆయుధంతో చంద్రబాబుకు గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పరిణామాలు సూచిస్తున్నాయి.

వ్యాసకర్త కదలిక సంపాదకులు | 99899 04389

సైనికులకు ఇవ్వాల్సింది బూటకపు గౌరవమేనా?

సైనికులను ముందుగా విమానాల్లోకి ఎక్కనివ్వాలని ఎయిర్ ఇండియా తీసుకున్న నిర్ణయం సైనికులను గౌరవించడం అనే సైనిక వ్యతిరేక బూటకపు కథనానికి కొనసాగింపు మాత్రమే. ఎయిర్ ఇండియా యథాలాపంగా చేపట్టిన ఈ చర్య, సైనికపరమైన త్యాగాలకున్న నిజమైన అర్థాన్ని తగ్గించి వేస్తుంది. అది ప్రభుత్వాన్ని సంతోషపెట్టినాగానీ, నిజమైన సమస్యను దాట వేస్తుంది.

అవలోకనం



ఆకార్ పటేల్

మన జాతీయ విమాన ప్రయాణ సంస్థ ఎయిర్ ఇండియా, సైనికులను గౌరవించడానికి ఒక చర్య చేపట్టాలని నిర్ణయించింది. ఇకపై ఆ సంస్థ తమ విమానాల్లోకి ఇతర ప్రయాణికుల కంటే ముందు సాయుధ బలగాల సిబ్బందిని ఎక్కమని కోరుతుంది. ఈ చర్య సైనికుల్లో తాము ప్రత్యేకమైన వారిమనే భావనను కలిగిస్తుంది కాబట్టి, వారిని గౌరవించినట్టు అవుతుంది. దీని ద్వారా వారి సేవలను, ఇతర భారతీయులు అందించే సేవల కంటే ఎక్కువ అర్థవంతమైనవని చెప్పినట్టు అవుతుంది. ఇక్కడ మనం ఎయిర్ ఇండియా వారి ఈ ముందస్తు ఊహాత్మక అంచనాను గురించి ఆలోచించడానికి కాస్త ఆగుదాం.

మన దేశంలోని ఉపాధ్యాయుడు, పోస్ట్‌మ్యాన్, గ్యాస్ సిలిండర్లు అందించే వ్యక్తి అంతకంటే తక్కువ ముఖ్యమైన వారు ఎలా అయ్యారు? వారు ముఖ్యమైన వారు కారనే అనుకుంటే, ఎందువల్ల? సైనికులు ప్రమాదకరమైన ఉద్యోగం చేస్తున్నారని మనం వాదించవచ్చు. అలా అంటే, విద్యుత్ లైన్‌మన్ల పని కూడా ప్రమాదకరమైనదే. ఏటా యుద్ధంలో చనిపోతున్న సైనికులకంటే ఎక్కువ మంది మన మురుగు కాల్వలను, పైపులను శుభ్రం చేస్తూ మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఆ కార్మికులకు ఏ పతకాలూ ఇవ్వరు, ఎలాంటి గౌరవం లేదా బహుమతులూ ఇవ్వరు. నిజానికి, వారికి రావాల్సిన బకాయిలు సైతం అందవు. నేనీ రోజు దాని జోలికి పోను. సైనికులు మన రిపబ్లిక్‌కు సంబంధించిన అత్యంత ముఖ్యమైన పని చేస్తున్నారని, ఇతరులకన్నా వారు ఎక్కువ గౌరవాన్ని పొందడానికి అర్హులని అనుకుందాం. ప్రభుత్వ వైమానిక సంస్థ విమానాల్లోకి ఎక్కడానికి సంబంధించి గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించడమే సైనికులను గౌరవించడానికి సరైన మార్గమా? కాదని నేనంటాను. అంతేకాదు, ఈ చర్య, సైనికులను గౌరవించడం అనే సైనిక వ్యతిరేక బూటకపు కథనాన్ని కొనసాగించడానికి ఉద్దేశపూర్వకంగా చేపట్టినది అని కూడా అంటాను. దీన్ని వివరిస్తాను.

సైన్యానికి మనం రుణపడి ఉన్నందున ఆ రుణాన్ని సమంజసంగా తీర్చుకోడానికి హామీనిచ్చే చాలా మార్గాలున్నాయి. ఒకటి, జీతభత్యాలు, జీవన పరిస్థితులకు సంబంధించినది. ఇటీవల దుర్భరమైన సైనికుల ఆహారం, జీవన పరిస్థితుల గురించిన వాస్తవాలను వెల్లడించిన జవాన్ల పట్ల మనం చాలా కఠినంగా ప్రవర్తించాం. అదే మనకు ఈ విషయంలో శ్రద్ధ లేదనడానికి నిదర్శనం. మన సైనికుల ఆహారాన్ని మెరుగుపరిచేలా ఎయిర్ ఇండియా తమ కేటరింగ్ సేవలను



ఉపయోగిస్తే అది వారిపట్ల మెరుగైన గౌరవం అయ్యేది. రెండు, మన సైనికులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటానికి హామీని కల్పించాలి. తీవ్రమైన పని ఒత్తిడికి గురైన జవాన్లు తరచుగా తమ అధికారులనో, తోటి జవాన్లనో కాల్చి చంపే ఘటనలు తరచుగా జరుగుతుండటం అలాంటి హామీ లేకపోవచ్చనే సూచిస్తోంది. మన సైనికులలో చాలా మంది మానసికంగా ఆరోగ్యవంతంగా లేరని, వారికి అందే సహాయం లేదా చికిత్స శూన్యమని పూర్వ సైనికుల సంఘాలు, సంస్థలు చెబుతున్నాయి.

మూడు, సైనికులు ఉద్యోగంలో ఉండగా, పదవీ విరమణ చేసిన తర్వాత వారికి పెన్షన్, ఉద్యోగ అవకాశాలు, విద్యావకాశాలు కల్పించడం. అమెరికా ఈ పనిని చాలా బాగా చేస్తోంది. ప్రత్యేకించి విద్యకు సంబంధించి అది పూర్వ సైనికులకు కళాశాల ఉపకార వేతనాలను అందిస్తోంది. మనం ఆ పని చేయడం లేదు. ఇక పెన్షన్, ఉద్యోగాలకు వస్తే, మనది స్వల్పంగా వనరులున్న పేద దేశమే ఆయినా, ప్రభుత్వ ఉద్యోగులలో మరే విభాగం కంటే కూడా వారికే ప్రభుత్వం నుంచి ఎక్కువ అందుతోందని చెప్పగలను. నాలుగు, సైనికులకు, వారు బాగా విధులను నిర్వహించినపుడు పతకాలు తదితరాలను ఇచ్చి గౌరవించాలి. వారికి అందాల్సిన గౌరవ పురస్కారాలు వారికి అందడంలేదని ఒక తాజా నివేదిక తెలిపింది. ఎవరైనా సైనికుడికి పతకం లభించిందని చెప్పినా, దాన్ని భౌతికంగా ఆ పతకాన్ని అతనికి ఇవ్వరని చెప్పి ఉండొచ్చు. ఆ జవాను దాని నకలును ఆర్మీ క్యాంటీన్‌లో కొనుక్కుని ధరిస్తాడు. ఇది అవమానకరం అని నాకు అనిపిస్తుంది.

ఇక ఐదవది, చివరిది మన సైనిక యోధులను అర్థవంతమైన రీతిలో గౌరవించడానికి ఉన్న అతి ముఖ్యమైన మార్గం. అత్యంత ధైర్యవంతులైన మన సైనికులను మోహరించిన సంఘర్షణాత్మక ప్రాంతాలను తగ్గించాలి. గడ్డిపరక కూడా మొలవని సియాచిన్ ఆక్రమించుకోవడం, ఏడాదికి ఓ డజను మంది సైనికులు మరణించడం ఎందుకు? వారు చనిపోయేది పోరాడే శత్రు సైనికుల చేతుల్లో కాదు, అక్కడి వాతావరణానికి. మనం పాకిస్తాన్ ప్రభుత్వంతో మాట్లాడి సియాచిన్, సల్తోరో ప్రాంతాల్లో ఇరు పక్షాల సైన్యాన్ని తగ్గించుకోడానికి ప్రయత్నించలేమా? మనం చేయగలం, కాకపోతే పాకిస్తాన్‌తో మాట్లాడితేనే అది సాధ్యం. ఇప్పటికైతే మనం వారితో కయ్యం కోరుకుంటున్నాం. అంటే మన సైనికులు చనిపోవడం కొనసాగినా ఫర్వాలేదు.

అంతర్గతంగా మన సైన్యం, పారామిలిటరీ బలగాలు ఈశాన్యంలో, ఆదివాసీ ప్రాంతాల్లో, జమ్మూకశ్మీర్‌లో నిరంతరాయంగా మోహరించి ఉంటున్నాయి. ఇవి, రాజకీయంగానే తప్ప సైనికంగా పరిష్కారమయ్యే సమస్యలు కావు. సాయుధ బలగాలు 70 ఏళ్లుగా ఈ ప్రాంతాల్లో అలసిపోతున్నాయే తప్ప ఎలాంటి అనుకూల ఫలితాలు కలగలేదు. సాయుధ బలప్రయోగమే ఏకైక మార్గమని పట్టుబడితే, అందుకు జవాన్లు, వారితో పోరాటంలో ఉన్న పౌరులు మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది.

భారత సైనికుడు ఎక్కడ పోరాడమని అడిగితే అక్కడ పోరాడతాడు. అతడి సేవలను, త్యాగాలను అత్యంత ఉపయోగకరమైన లక్ష్యాల కోసం మాత్రమే ఉపయోగపడేలా చేయాల్సిన బాధ్యత మన ప్రజాస్వామిక సమాజం విధి. అనవసరంగా అతన్ని మన కోసం చనిపొమ్మని కోరరాదు. భారత జవాన్‌ను మనం గౌరవించగల ఏకైక అత్యుత్తమ మార్గం అదే. మోదీ ప్రభుత్వం పెంపొందింపజేస్తున్న ఈ సైనికీకరణ వాతావరణంలో ఎయిర్ ఇండియా, జాతీయవాదులకు చంచాగిరీ చేస్తోందని నా అంచనా. ఇప్పటికే అది స్థానిక విమానాల్లో శాఖాహారాన్నిమాత్రమే అందిస్తామని చెప్పింది. ఆర్ఎస్ఎస్‌కు అది చాలా సంతోషాన్ని కలిగించి ఉంటుంది. చంచాగిరీతో నాకు ఎలాంటి ఇబ్బందీ లేదు, అది అందరూ చేసేదే.

కాకపోతే యథాలాపంగా చేపట్టిన ఈ చర్య, సైనికపరమైన త్యాగాలకున్న నిజమైన అర్థాన్ని తగ్గించివేస్తుంది. అది ప్రభుత్వాన్ని సంతోషపెట్టినాగానీ, నిజమైన సమస్యను దాటవేస్తుంది.

వ్యాసకర్త కాలమిస్టు, రచయిత

గో'హస్తం'

మనిషి సంగతేమోగానీ... ఆవుకు అపకారం తలపెట్టారని లేదా దాన్ని హతమార్చారని తెలిస్తే ఊరుకునే రోజులు పోయాయి. తెలిసో, తెలియకో ప్రభుత్వాలు ఊరుకున్నా గోరక్షకుల పేరిట పుట్టుకొస్తున్న బృందాలు మౌనం వహించడంలేదు. ఛత్తీస్‌గఢ్‌లోనూ అలాంటిదే జరిగింది. గత నాలుగు రోజుల్లో దాదాపు 30 ఆవులు మరణించడానికి కారకుడయ్యాడన్న ఆరోపణతో ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఒక బీజేపీ పాలిత రాష్ట్రంలో ఇలా జరగడంలో వింతేమీ లేదు. కానీ వింతేమిటంటే అరెస్టయిన వ్యక్తి బీజేపీ నేత కావడం! గోశాలలో తగిన సదుపాయాలు లేకపోబట్టే పెద్ద సంఖ్యలో ఆవులు చనిపోయాయని అతనిపై కేసు పెట్టారు. ఈ ఉదంతంలో గోరక్షక పాత్రను కాంగ్రెస్ పోషించింది. గోశాలలో వాస్తవానికి 300 ఆవులు చనిపోయాయని ఆ పార్టీ ఆరోపించింది. వ్యాధులు ప్రబలడమే ఇందుకు కారణమని చెబుతోంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం
దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం
తిథి బ.చతుర్దశి రా.1.58 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం పుష్యమి సా.6.00 వరకు తదుపరి ఆశ్లేష, వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం సా.4.39 నుంచి 5.32 వరకు
అమృతఘడియలు ప.11.57 నుంచి 1.28 వరకు.

నమాజ్ వేళలు



ఫజర్	:	4.45
జొహర్	:	12.19
అసర్	:	4.46
మగ్రీబ్	:	6.39
ఇషా	:	7.54

సూర్యోదయం :5.47
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు



నంద్యాలలోని శౌరిరెడ్డి హాస్పిటల్ సమీపంలో చిన్నారిని ఆప్యాయంగా ఎత్తుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



శనివారం నంద్యాలలోని 39వ వార్డులో ప్రచారం సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రతిపక్ష నేత

సాక్షి

రాష్ట్రీయం

వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం I ఆగస్టు I 20 I 2017

www.sakshi.com

ఒక అంచనా ప్రకారం, భారతదేశంలో ప్రతిరోజూ సగటున సినిమాలు చూడటానికి థియేటర్‌కు వెళ్లేవారి సంఖ్య సుమారు 14 లక్షలు.



పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ

చంద్రబాబుపై నిప్పులు చెరిగిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'చంద్రబాబు హయాంలో నంద్యాలలో పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. కొద్ది రోజుల్లో ఉప ఎన్నిక జరుగుతోన్న నేపథ్యంలో అధికార పార్టీ ఓటమి భయంతో దాడులు, బెదిరింపులకు సిద్ధపడింది. పోలీసు బలగాన్ని ఉపయోగించి నంద్యాల ప్రజలు, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అర్ధరాత్రి దాటాక వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుల ఇళ్లపై ఆకస్మిక తనిఖీల పేరిట దాడులు చేసి భయాందోళన సృష్టిస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోంది. సెర్చ్ వారెంట్లు లేకుండానే పోలీసులు అర్ధరాత్రి దాటాక ఆకస్మిక తనిఖీలకు వెళ్లాల్సిన అవసరమేమొచ్చిందో స్పష్టం చేయాలి. ఇంట్లో ఏది ఉంటే అది సీజ్ చేయడం దారుణం. అధికార పార్టీ నేతలు మాత్రం ఓటర్లను ప్రలోభ పెడుతూ.. విచ్చలవిడిగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారు. వార్డులు.. గ్రామాల వారీగా రూ. 2 వేలు, 3 వేలు, 5 వేలు చొప్పున డబ్బులు పంచుతున్నారు. వారిపై ఎలాంటి దాడులు ఉండవు. ఎవరూ వారిని పట్టుకోరు. ఎవరు ఎవరిపై వేధింపులకు పాల్పడుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శనం కావాలా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. శనివారం నంద్యాల టౌన్ హాలులో ఏర్పాటు చేసిన ఆర్య వైశ్యుల ఆత్మీయ సమావేశంలో, ఆ తర్వాత పెద్దబండ సత్రం సెంటర్ రోడ్‌షోలో జగన్ మాట్లాడారు. పదకొండో రోజు రోడ్‌షో సంజీవనగర్ రామాలయం నుంచి ప్రారంభమై.. శాంతినికేతన్ స్కూల్, శేషయ్య చికెట్ సెంటర్, డాక్టర్ శౌరిరెడ్డి హాస్పిటల్, బైటిపేట, పెద్దబండ సత్రం, తల్లిపీరు వీధి, నీలివీధి రేణుక ఎల్లమ్మ టెంపుల్, మెయిన్ బజార్, పప్పులబట్టి బజార్ మీదుగా తెలుగుపేట వరకు సాగింది. చంద్రబాబు అరాచక పాలనకు ముగింపు పలకాలంటే శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాలని జగన్ పిలుపునిచ్చారు. ప్రసంగం ఆయన మాటల్లోనే..

> రాష్ట్రంలో దారుణమైన పాలన సాగుతోంది. నంద్యాల ఉప ఎన్నికలో ఓడిపోతామనే భయంతో ప్రజలు, వ్యాపారులు, వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వీరి ఇళ్లకు అర్ధరాత్రి దాటాక ఎలాంటి సెర్చ్ వారెంట్లు లేకుండా పోలీసులు వెళ్లి భయోత్పాతం సృష్టిస్తున్నారు. పోలీసుల దాడులతో మహిళలు, చిన్న పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. మీ అందరికీ అన్ని విధాలా నేను తోడుగా.. అండగా ఉంటాను.

పొట్టి శ్రీరాములును ప్రభుత్వం విస్మరించింది..

రాష్ట్ర విభజనకు ముందు ఏటా నవంబర్ 1న పొట్టి శ్రీరాములు జయంతి ఎంతో ఘనంగా జరిగేది. మూడేళ్ల చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పొట్టి శ్రీరాములు జయంతిని జరుపుకోవడం మానేశారు. ప్రభుత్వం ఆయన్ను పూర్తిగా విస్మరించింది. ఆర్య వైశ్యులంటే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో అభిమానం చూపేవారు. 2009లో రోశయ్యకు ఆరోగ్యం సహకరించక ఆ ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. ఆ తర్వాత ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రిని చేసిన ఘనత రాజశేఖరరెడ్డిదే.

కులాలు, పార్టీలకు అతీతంగా నవరత్నాలు..

అవకాశం వస్తే దివంగత నేత రాజశేఖరరెడ్డిలా ప్రజలకు మంచి పరిపాలన అందించాలన్నదే నా లక్ష్యం. అందులో భాగంగా నవరత్నాల పథకాలను ప్రకటించాం. అర్హులైన ప్రతి ఒక్కరికి నవరత్నాలు అందాలి. అప్పుడు ఏ ఇంట్లోనూ అశాంతి అనేది ఉండదు. చిరునవ్వులు ఉంటాయి. కులాలు, మతాలు, రాజకీయాలు, పార్టీలు అని చూడకుండా ఆ పథకాలు అందరికీ అందించాలన్నదే నా తాపత్రయం. నంద్యాల రోడ్డు విస్తరణ పనులు చంద్రబాబు ఇష్టారాజ్యంగా చేశారు. పనులు చేపట్టే ముందు కనీసం వ్యాపారులను సంప్రదించలేదు. నష్టపరిహార విషయంపై చర్చించలేదు. రాత్రికి రాత్రే పోలీసులను పెట్టి భవనాలు కూలదోయించారు. అక్కడ మార్కెట్ ధర ప్రకారం సెంటు (48 గజాలు) స్థలం రూ.50 లక్షలు పలుకుతోంది. ఆయన మాత్రం ముష్టి వేసినట్లు గజానికి రూ.18 వేలే ఇస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో దుకాణాలు కోల్పోయి నష్టపోయిన వారికి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందజేస్తాం.

చంద్రబాబు ఎవరినీ వదల్లేదు..

చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం కోసం ఎన్నికల ముందు.. ఆ తర్వాత అన్ని విధాలుగా ప్రజలను మోసం చేశారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన మాటలు.. ఎన్నికలయ్యాక వాటిని పక్కన పెట్టి ఏరకంగా ప్రజలను మోసం చేశారన్నది అందరికీ తెలిసిందే. ఎన్నికల ముందు రైతుల వ్యవసాయ రుణాలు రూ.87,612 కోట్లను పూర్తిగా మాఫీ చేస్తానన్నారు. నేటికీ ఒక్క రూపాయి మాఫీ చేయలేదు. బ్యాంకుల్లో పెట్టిన బంగారం బయటకు రావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలంటూ మోసపూరిత వాగ్దానాలతో రైతులను అతి దారుణంగా వంచించారు. వడ్డీనే ఏడాదికి రూ.15 వేల కోట్లు అవుతోంది. చంద్రబాబు మాత్రం రైతుకు ఏడాదికి రూ.3 వేలు మాత్రమే ఇచ్చి అదే రుణమాఫీ అని చెప్పి బొంకుతున్నారు. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలనూ మోసం చేశారు. వారి రుణాలకు సంబంధించి ఒక్క రూపాయి మాఫీ చేయలేదు. విద్యార్థులు, నిరుద్యోగులను కూడా వదిలి పెట్టలేదు. జాబు రాకపోతే నెలనెలా రూ.2 వేల చొప్పున ప్రతి ఇంటికీ నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. ఒక్క రూపాయి ఇవ్వలేదు. ప్రతి పేదవాడికి 3 సెంట్ల స్థలం.. పక్కా ఇల్లు కట్టిస్తానన్నారు. ఈ మూడున్నరేళ్ల కాలంలో ఒక్క ఇల్లు కట్టించలేదు. బెల్టు షాపులు లేకుండా చేస్తానన్నారు. అదీ చేయలేదు. కర్నూలు జిల్లా ప్రజల సాక్షిగా ముఖ్యమంత్రి హోదాలో మూడేళ్ల కిందట ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అందరినీ మోసం చేశారు. ఇలాంటి చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సమయం ఆసన్నమైంది. నంద్యాల ప్రజలు ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేయాలి. ధర్మం, న్యాయం వైపు నిలిచి శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాలి' అని జగన్ పిలుపునిచ్చారు.

వ్యాపారంలో కష్ట నష్టాలు నాకు తెలుసు..

నంద్యాల పట్టణంలో కొందరి ఇళ్లను టార్గెట్ చేసుకుని.. సెర్చ్ వారెంట్లు లేకుండా సోదాలు జరిపే అధికారం పోలీసులకు ఎవరిచ్చారు? సత్యనారాయణ, రమేష్ లాంటి వాళ్ల ఇళ్లపై పోలీసులు రాత్రి వేళ దాడులు జరపాల్సిన అవసరమేముంది? పోనీ సోదాల్లో చివరికి ఏమైనా దొరికిందా అంటే అదీ లేదు. అమృత్‌రాజ్, నాగిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, రామలింగారెడ్డి, లక్ష్మీనారాయణ, బాల హుస్సేన్, భువనేశ్వర్‌ల ఇళ్లపైనా దాడులు చేసి రూ.10 వేలు, రూ.20 వేలు సీజ్ చేశారు. ఈ దాడులకు సంబంధించి వారెంట్ ఉండదు. ఒకేసారి 40, 50 మంది పోలీసులు బిలబిల మంటూ ఇళ్లలోకి వచ్చేస్తారు. వాళ్లను చూసి మహిళలు, పిల్లలు భయపడిపోతున్నారు. ప్రియతమ నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోక ముందు వరకు నేనూ వ్యాపారాలు చేశాను. చైర్మన్‌గా సాక్షి పేపర్‌ను నడిపాను. సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశాను. వ్యాపారం కష్టనష్టాలు నాకు తెలుసు. నంద్యాలలో వ్యాపారులు పడుతున్న కష్టాలు చూశాను. వారికి వైఎస్సార్‌సీపీ అండదండగా ఉంటుంది. మానవతా దృక్పథంతో మీకు నేను సాయం అందిస్తాను. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక వ్యాపారులను టార్గెట్ చేశారు. ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడానికి కమర్షియల్ టాక్స్ అధికారులకు ఏటా లక్ష్యాలను పెట్టి వ్యాపారులపై దాడులు చేయిస్తున్నారు. మూడున్నరేళ్లుగా ఈ కార్యక్రమం నిరాటంకంగా సాగుతోంది. వ్యాపారులు బాగా ఇబ్బందులు పడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.





నంద్యాలలోని టౌన్‌హాలులో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో వాసవీ కన్యకాపరమేశ్వరి చిత్రపటానికి నమస్కరించి అనంతరం ఆర్యవైశ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఆత్మీయ సమావేశానికి హాజరైన ఆర్యవైశ్యులు

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధుల కొరత

- అమలుకు నోచని పథకాలు
- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆవేదన



దేవీచౌక్ (రాజమహేంద్రవరం): నిధుల కొరత కారణంగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఆశించిన ఫలితాలను సాధించలేకపోతోందని వైఎస్సార్‌సీపీబాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత శాసనసభలో ఏకైక బ్రాహ్మణ ఎమ్మెల్యే అయిన రఘుపతి బ్రాహ్మణ సమాఖ్య ఆహ్వానం మేరకు శనివారం తూర్పు గోదావరి జిల్లా కోటిపల్లి బస్టాండు సమీపంలోని మహిళా స్వాతంత్ర్య సమర యోధుల పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా సమాఖ్య నాయకులతో మాట్లాడుతూ... బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఐవైఆర్ కృష్ణారావు సుమారు 15 అద్భుతమైన పథకాలకు రూపకల్పన చేశారని, నిధుల గ్రహణంతో అవి అమలు కావడం లేదని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ లెక్కన ఇప్పటికి ప్రవేశపెట్టిన నాలుగు బడ్జెట్లలో రూ.400 కోట్లు విడుదల కావాల్సి ఉండగా కేవలం రూ.135 కోట్లే విడుదల చేశారని, అందులోనూ రూ.40 కోట్ల వరకు కార్పస్ ఫండ్‌గా ఉందని తెలిపారు. మిగతా నిధులతో అన్ని పథకాలను అమలు చేయడం అసాధ్యమన్నారు. ఒక ప్రభుత్వ కార్పొరేషన్‌ను టీడీపీ కార్పొరేషన్‌గా చూడటం తగదని చెప్పారు. ఐవైఆర్ బాపట్ల వచ్చినప్పుడు స్థానిక ఎమ్మెల్యేగా టీకి ఆహ్వానించడం తప్పా? అని ప్రశ్నించారు. ఐవైఆర్‌ను తొలగించిన విధానం బ్రాహ్మణ జాతినే అవమానపరిచేరీతిలో ఉందని విమర్శించారు.

నంద్యాలలో అధికార దుర్వినియోగం

నంద్యాల ఉప ఎన్నికలో అధికార పక్షం తీరు అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని రఘుపతి వ్యాఖ్యానించారు. టీడీపీ నేతలు అన్ని సంప్రదాయాలకూ తిలోదకాలిచ్చి, నిర్లజ్జగా బరి తెగించి డబ్బు పంచుతున్న పద్ధతి ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని, సభ్యసమాజం తల దించుకునేటట్లు ఉన్నదని విమర్శించారు.

రూ.288కోట్లు... గుడ్డిగా ఇచ్చేశారు

- రిజిస్ట్రేషన్ లేకుండానే జీవీకేకు కోట్లు చెల్లింపు
- ఇప్పటికీ తనఖాలోనే జీవీకే భూమి
- ప్రభుత్వాధినేత మాటతో మోసపోయిన డిస్కమ్‌లు
- లబోదిబో అంటున్న అధికారులు
- కథ మార్చేందుకు 'బై అవుట్' మార్పిడి నాటకం

సాక్షి, అమరావతి: ఇల్లుగానీ, పొలంగానీ కొన్నప్పుడు సాధారణంగా ఎవరైనా ఏం చేస్తారు? అగ్రిమెంట్ సమయంలో కొంత డబ్బులు చెల్లిస్తారు. రిజిస్ట్రేషన్ సమయంలో పూర్తిగా చెల్లిస్తారు. కానీ, ఏపీ డిస్కమ్‌లు మాత్రం భూమి రిజిస్ట్రేషన్ చేయకుండానే ఓ ప్రైవేట్ సంస్థకు మొత్తం సొమ్ము చెల్లించేశారు. కాస్తో కూస్తో కూడా కాదు... ఏకంగా రూ.288.55 కోట్లు ముట్టజెప్పారు. డబ్బులిచ్చాకైనా తమ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారా? అదీ లేదు. డబ్బులిచ్చి ఏడాది దాటినా డిస్కమ్‌ల చేతికి ఆ భూమి రాలేదు. వివరాల్లోకి వెళ్తే...

తూర్పు గోదావరి జిల్లా జేగూరుపాడు వద్ద 1994లో జీవీకే సంస్థ 217 మెగావాట్ల సామర్థ్యంగల గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పింది. ఈ ప్లాంట్ విద్యుత్‌ను ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థలు కొనుగోలు చేసేందుకు అప్పట్లోనే పీపీఏ కుదుర్చుకున్నాయి. దీని గడవు 2014లోనే ముగిసింది. నిబంధనల ప్రకారం ఈ ప్లాంట్‌ను డిస్కమ్‌లు కొనుగోలు చేయవచ్చు. ఈ ప్రకారం బై అవుట్ కార్యక్రమం చేపట్టారు. సంప్రదింపుల తర్వాత ప్లాంట్ విలువను రూ.288.55 కోట్లుగా లెక్కగట్టారు. కొనుగోలుకు సంబంధించిన అగ్రిమెంట్ కూడా రాసుకున్నారు. దీని ప్రకారం నిర్ణయించిన మొత్తంలో సగం అగ్రిమెంట్ రోజు చెల్లించాలి. మిగతాది రిజిస్ట్రేషన్ సమయంలో ఇవ్వాలి. కానీ అలా జరగలేదు.

కోట్లు ఇచ్చి.. వదిలేశారు..

గత ఏడాది ఏప్రిల్ 22న ఏపీ డిస్కమ్‌లు, జీవీకే సంస్థ మధ్య ప్లాంట్ కొనుగోలు అగ్రిమెంట్ ఖరారైంది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సమన్వయ కమిటీ సమక్షంలో ఇందుకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు కూడా జరిగాయి. అదే రోజు జీవీకే సంస్థకు ప్లాంట్ మొత్తం విలువ రూ. 288.55 కోట్లు చెక్ రూపంలో ముట్టజెప్పారు. జీవీకే ప్లాంట్‌కు 211.735 ఎకరాల భూమి ఉంది. నిజానికి ఈ ఒప్పందంలో ఈ భూమే కీలకం. ఎందుకంటే జీవీకే ప్లాంట్ యంత్ర సామాగ్రికి కాలం చెల్లింది. ఇంత విలువైన భూమిని జీవికే అప్పటికే 13 బ్యాంకుల వద్ద తనఖా పెట్టి రుణాలు తీసుకుంది. లీడ్ బ్యాంక్‌గా ఐడీబీఐ వ్యవహరించింది. డబ్బంతా తీసుకున్న జీవీకే దాన్ని ఇతర అవసరాల కోసం వాడుకుంది. నిన్న మొన్నటి వరకూ ఒక్క పైసా కూడా బ్యాంకులకు కట్టలేదు. ఈ కారణంగా రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకుండాపోయింది. ఈ వ్యవహారం ఆ నోట ఈ నోట బయటకు పొక్కడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జీవీకేకు నోటీసుల మీద నోటీసులు ఇచ్చారు. అప్పు కట్టి భూమిని విడిపించి రిజిస్ట్రేషన్ చేయాలని వేడుకున్నారు. ఇప్పటికీ ఈ ప్రక్రియ పూర్తికాకపోవడంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రభుత్వాధినేతతో జీవీకే ఒత్తిడి తేవడంతో ముందే డబ్బులన్నీ ఇచ్చామని, ఇప్పుడు తాము ఇరుక్కునేలా ఉన్నామని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ గండం నుంచి గట్టెక్కేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. డిస్కమ్‌లతో జరిగిన బై అవుట్‌ను రద్దుచేసి, కొత్తగా ఏపీ జెన్‌కో పేరుతో కొత్త బై అవుట్‌కు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ రకంగా కొంత ఒడ్డున పడతామని అధికారులు చెబుతున్నారు.


లీడ్ బ్యాంక్ భరోసా ఇచ్చింది

ఈ విషయమై సంబంధిత అధికారులను 'సాక్షి' వివరణ కోరగా రిజిస్ట్రేషన్ జరగకుండానే సొమ్ము అంతా ఇచ్చామని అంగీకరించారు. అయితే, అప్పు ఇచ్చిన లీడ్ బ్యాంక్ తమకు ఎన్‌వోసీ ఇచ్చిందని, జీవీకేకు డబ్బులిస్తే భూమి తనఖా పత్రాలు ఇస్తామని భరోసా ఇచ్చిందని అధికారులు అంటున్నారు. దీనిపై తాము న్యాయ నిపుణుల సలహా తీసుకున్నామన్నారు. వాస్తవానికి అసలు ఈ డీల్ సరికాదని, తనఖా విడిపించిన తర్వాత కొనుగోలు చేయాలని తాను అధికారులకు సూచించినా పట్టించుకోలేదని ట్రాన్స్‌కో లీగల్ అధికారి తెలిపారు.

పెచ్చుమీరుతున్న టీడీపీ ఆగడాలు

ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: నంద్యాల పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ అధికార పార్టీ ఆగడాలు శృతిమించుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఘాటుగా ఫిర్యాదు చేసింది. ప్రజాస్వామ్య పద్ధతిలో పోలింగ్ జరగాలంటే నంద్యాలలో మరింత నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొంది. పార్టీ తెలంగాణ శాఖ ప్రధాన కార్యదర్శి కె శివకుమార్ శనివారం రాత్రి ఎన్నికల సంఘం అదనపు సీఈవో అనూప్‌సింగ్‌ను కలిసి నంద్యాల్లో టీడీపీ అడ్డగోలు వ్యవహారాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి వంట వాహనం తనిఖీ విషయంలో శుక్రవారం హైడ్రామా నడిపించారని, ఇదే వాహనంతో వెళ్ళిన మరో రెండు వాహనాలను తప్పించినట్టు స్థానికులు చెబుతున్నారని తెలిపారు. ఆ వాహనాల్లో అధికార పార్టీ పెద్ద ఎత్తున నగదు తరలించినట్టు అనుమానాలు బలపడుతున్నాయని, దీనిపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరిపించాలని కోరారు. ఓటుకు నోటు కేసులో సీఎం చంద్రబాబునాయుడు ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, ఇదే తరహాలో నంద్యాలలోనూ డబ్బులు విచ్చలవిడిగా పంచి, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని కమిషన్‌కు తెలిపారు. టౌన్‌లెవల్ ఫెడరేషన్, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ అధికార పార్టీ ఏజెంట్లుగా పనిచేస్తున్నారని, స్వయం సహాయక బృందాలను ప్రలోభపెడుతున్నారని ఈసీకి వివరించారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వకపోతే ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తామని బెదరిస్తున్నారని పేర్కొంటూ, వారి పేర్లతో సహా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అనూప్‌సింగ్ సానుకూలంగా స్పందించారని, తన సమక్షంలోనే కర్నూలు జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను నిరోధించాలని ఆదేశించారన్నారు.



సీఈవో అనూప్‌సింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న శివకుమార్

రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామసుబ్రమణ్యం



వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామసుబ్రమణ్యం

సాక్షి బృందం, నంద్యాల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, విపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామసుబ్రమణ్యం అన్నారు. శనివారం కర్నూలు జిల్లా నంద్యాలలో వైఎస్ జగన్ సమక్షంలో ఆయన వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా శివరామసుబ్రమణ్యం మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచినా అభివృద్ధి శూన్యమన్నారు.

సూర్యగ్రహణంతో భూకంపాలు.. సునామీలు

వాతావరణ నిపుణుల హెచ్చరిక

సాక్షి, విశాఖపట్నం: ఈ నెల 21వ తేదీన ఏర్పడబోయే సంపూర్ణ సూర్యగ్రహణం వల్ల భూకంపాలు, సునామీలు, టోర్నడోలు ఏర్పడే ప్రమాదముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 1979 సంవత్సరం తర్వాత ఏర్పడనున్న అతి పెద్ద సూర్యగ్రహణం ఇదేనని వారు చెబుతున్నారు. ఈ సూర్యగ్రహణం అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాల్లో తప్ప భారత్‌లో కనిపించదని తెలిపారు. అమెరికాలో 21న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు అంటే.. దాదాపు ఆరు గంటలపాటు ఈ గ్రహణం కొనసాగనుంది. సుదీర్ఘంగా గ్రహణం ఏర్పడడం వల్ల ఉపరితలంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు తగ్గుతాయని ఇప్పటికే వాతావరణ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇలా తగ్గినప్పుడు ఆయా ప్రాంతాల్లో టోర్నడోలు, భూకంపాలు, సునామీలకు ఆస్కారం ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. అయితే ఈ సంపూర్ణ సూర్యగ్రహణం అమెరికా తదితర ప్రాంతాల్లో పగటిపూట ఏర్పడడం వల్ల మనదేశంలో ఆ సమయానికి రాత్రి అవుతుంది. అందువల్ల ఈ సూర్యగ్రహణం మనకు కనిపించదని రిటైర్డ్ వాతావరణ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ 'సాక్షి'కి చెప్పారు. అంతేగాక ఈ సూర్యగ్రహణ ప్రభావం మన దేశంపై ఉండబోదన్నారు. అందువల్ల పుకార్లను నమ్మవద్దని సూచించారు.

సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం I ఆగస్టు I 20 I 2017
www.sakshi.com

6

ఒక అంచనా ప్రకారం, ప్రపంచంలో అంతరించే ప్రమాదంలో ఉన్న అత్యధిక భాషలు (197) మనదేశంలోనే ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో అమెరికా(191), బ్రెజిల్ (190), చైనా (144) ఉన్నాయి.




విమానాశ్రయమే స్వర్గం..






అదో విమానాశ్రయం. కానీ అక్కడి విమానాలు ఎక్కడికి వెళ్లవు. మనల్నే స్వర్గానికి తీసుకెళ్తాయి. వినడానికి విచిత్రంగా ఉన్నా ఇది నిజం. మన భాషలో చెప్పాలంటే ఇదో శ్మశానవాటిక. పేరు 'అంతిమ్ ఉడాన్ మోక్ష ఎయిర్‌పోర్ట్'. గుజరాత్‌లోని సూరత్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో బర్డోలీలో ఇది ఉంది. మింధోలా నదీ తీరంలో దీనిని నిర్మించారు. ఇక్కడ విమానాల ఎనౌన్స్‌మెంట్లకు బదులు 'స్వర్గానికి వెళ్లే సమయం ఆసన్నమైంది.. ఒకటో నంబర్ టెర్మినల్ గుండా లోపలికి తీసుకురండి..'అనే మాటలే వినబడుతుంటాయి. ఆ సూచనల మేరకు పార్థివదేహాన్ని టెర్మినల్ వద్ద దింపేసి, బంధుగణమంతా బయటికి వెళ్లిపోతుంది. నిమిషాల వ్యవధిలో ఎయిర్‌పోర్ట్ లౌడ్‌స్పీకర్ల నుంచి విమానం టేకాఫ్ అయిన భారీ శబ్దం వినిపిస్తుంది. 'వారికి మోక్షం సిద్ధించింది. స్వర్గానికి వెళ్లారు'అనే ప్రకటన రావడంతో తంతు పూర్తవుతుంది. విమానాశ్రయంలో 'స్వర్గ్ ఎయిర్‌లైన్స్', 'మోక్ష ఎయిర్‌లైన్స్'అనే రెండు విమాన ప్రతిరూపాలు ఉంటాయి. దీనిలో మూడు ఎలక్ట్రిక్, రెండు సంప్రదాయ వాటికలు ఉన్నాయి. రోజురోజుకూ రద్దీ ఎక్కువ అవుతుండటంతో దీనిని విస్తరించాలని భావిస్తున్నట్లు ఎయిర్‌పోర్ట్ నిర్వాహకుడు సోమాభాయ్ పటేల్ చెప్పారు. తన బామ్మ మాట మేరకు దీనిని నిర్మించానని తెలిపారు. మొదట్లో రూ.1,000 చార్జ్ చేసేవాళ్లమని, క్రమంగా విరాళాలు వస్తుండటంతో ప్రస్తుతం ఉచితంగానే సేవలు అందిస్తున్నామని వివరించారు.



నంద్యాల ఫలితం రెఫరెండం కాదు


కేంద్రమంత్రి సుజనా చౌదరి



సాక్షి, విశాఖపట్నం: కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక ఫలితం టీడీపీ ప్రభుత్వానికి రెఫరెండం కాదని కేంద్రమంత్రి సుజనా చౌదరి స్పష్టం చేశారు. నంద్యాల అసెంబ్లీ ఎన్నిక చిన్నదని, ఆ ఎన్నికను రెఫరెండంగా తీసుకోవలసిన అవసరం లేదని చెప్పారు. శనివారం విశాఖలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నిక చిన్నదైనా, పెద్దదైనా రాజకీయపార్టీగా గెలుపుకోసం తాము గట్టి పోటీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కొన్ని ఉప ఎన్నికల్లో గెలిచామని, మరికొన్ని ఓడామని చెప్పారు. నంద్యాలలో అభివృద్ధి అవసరమని భావించి అక్కడ నిధుల్ని ఖర్చు చేస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. ఉప ఎన్నిక జరుగుతున్నందునే అవసరమని భావించారా? అన్న ప్రశ్నకు మంత్రి జవాబు దాటేశారు.

టీడీపీకి ఓటేయొద్దు

- మంద కృష్ణ మాదిగ పిలుపు



సాక్షి బృందం, నంద్యాల: గత ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు మాట తప్పారని, టీడీపీకి ఎవరూ ఓటు వేయొద్దని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం ఆయన నంద్యాలలోని ఎమ్మార్పీఎస్ నాయకుడు నరసింహులు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు మోసపూరిత నిర్ణయాలను ప్రతి మాదిగ పల్లెల్లోని ప్రజలకు తెలియజేయాలన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో ప్రచారం చేయడానికి వచ్చిన తమకు చంద్రబాబు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదన్నారు. మంత్రి అఖిలప్రియ, ఆమె తండ్రి దివంగత భూమా నాగిరెడ్డి వైఎస్సార్‌సీపీలో గెలిచి.. టీడీపీలోకి వెళ్లారని, ఇలాంటి నీచ, ఫిరాయింపు రాజకీయాలకు చంద్రబాబే ఆద్యుడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్యమాదిగ, నాయకులు నరేంద్ర మాదిగ, రాచపూడి ఆనంద్‌మాదిగ పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతి, అక్రమాలపై ఈసీకి ఫిర్యాదు

పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి



సాక్షి, అమరావతి/ నూనెపల్లె (నంద్యాల): నంద్యాల ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమాలకు పాల్పడుతూ, ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తోన్న వైనంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలిపారు. శనివారం ఆయన నంద్యాలలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నంద్యాలలో ఉన్న ఎన్నికల అధికారికి స్థానికంగా ఉన్న నేతలు, హైదరాబాద్‌లో ఉన్న ఏపీ ఎన్నికల సంఘానికి రాష్ట్ర స్థాయి నాయకులు, కేంద్ర ఎన్నికల సంఘానికి ఢిల్లీలో ఉన్న నాయకులు ఫిర్యాదు చేస్తారని వివరించారు. మంత్రులు, అధికార పార్టీ నాయకులు ఉప ఎన్నికల్లో చేస్తోన్న వ్యవహారాలపై ఆధారాలతో కూడిన నివేదిక తయారు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

చంద్రబాబు ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు

ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలి: రామకృష్ణ



సాక్షి, అమరావతి: నంద్యాల ఉపఎన్నికను అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు నంద్యాలలో జరిపిన రోడ్ షోలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు ప్రకటించడాన్ని రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తప్పుబట్టారు. ఇది కచ్చితంగా ఓటర్లను ప్రభావితం చేయడమేనన్నారు. మిగిలిన నియోజకవర్గాలకూ ఇదే విధంగా రూ.2వేల కోట్లను ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ఉప ఎన్నికలో డబ్బు పంపిణీ వంటి ఆరోపణలు వస్తున్నందున ఈసీ దృష్టిసారించాలన్నారు.

సుందర నంద్యాల చేస్తా

రోడ్‌షోలో కోడ్ దాటి పలు హామీలు గుప్పించిన చంద్రబాబు

నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి: ఎన్నికల ప్రచారం కోసం తాను నంద్యాల రాలేదని, అభివృద్ధి పనులు చూసేందుకు వచ్చానని సీఎం చంద్రబాబు చెప్పారు. నంద్యాల చరిత్రలో ఎప్పుడూ చేయనన్ని కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి అభ్యర్థన మేరకు రోడ్ల విస్తరణ పనులతో పాటు పేదలకు ఇళ్లు, మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. శనివారం కడప నుంచి హెలికాప్టర్ ద్వారా నంద్యాల చేరుకున్న ఆయన అయ్యలూరు నుంచి రోడ్‌షో ప్రారంభించారు. పలు చోట్ల ప్రజలనుద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. నంద్యాలను స్మార్ట్ నంద్యాలగా, సుందర నంద్యాలగా మార్చి ఆదాయాన్ని పెంచుతామన్నారు. 'పేదలే నా ఆస్తిగా పెట్టుకొని పనిచేస్తా ఉంటే, నన్ను కాల్చి చంపాలంటారు... ఉరి తీయాలంటారు. నా చొక్కా విప్పాలంటారు. ఇది న్యాయమేనా తమ్ముళ్లూ. మనమేమి కాల్చి చంపొద్దు, ఓటు ఆయుధంతో బుద్ధి చెప్పండి. మిమ్మల్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదే. నేను చూసుకుంటా. నాకు వదిలేయండి' అని సీఎం వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపింది తానేనన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత అంతా తనపై నమ్మకం ఉంచి ముఖ్యమంత్రిని చేశారన్నారు. తన చేతికి ఉంగరాలు లేవని, వాచీ కూడా లేదన్నారు. రాగులు, సజ్జలు, కూరగాయలే తన తిండి అని చెప్పారు. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని కోరారు. మీరిచ్చే మెజార్టీ నాకు టానిక్ లాంటిదన్నారు. మరోవైపు నంద్యాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలిచినా.. తన ప్రమేయం లేకుండా అభివృద్ధి జరగదంటూ సీఎం చంద్రబాబు బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. కార్యక్రమంలో మంత్రి అఖిలప్రియ, అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, ఎంపీ టీజీ వెంకటేష్, ఎమ్మెల్సీ ఎస్ఎండి ఫరూక్, సినీ నటుడు వేణుమాధవ్, భూమా మౌనిక, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు, మాజీ మంత్రి మారెప్ప, మాజీ మేయర్ బంగి అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల అయ్యలూరు రోడ్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

శనివారం ఉదయం అయ్యలూరులో జనం లేక చంద్రబాబు రోడ్‌షో పూర్తిగా వెలవెలబోయింది. ఇలాగైతే ఎన్నికల్లో మన పని అయినట్లేనని తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో ఆయనతో పాటు ఉన్న తామంతా కంగుతిన్నామని ఓ ముఖ్య నాయకుడు వ్యాఖ్యానించారు. దీంతో అప్పటికప్పుడు ఎన్జీవో కాలనీలోని ఓ ప్రయివేటు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులను సమీకరించి చంద్రబాబుకు అనుకూలంగా నినాదాలు చేయించారు.


అగ్రిగోల్డ్, కేశవరెడ్డి, బాధితుల నిరసనలు..

సీఎం చంద్రబాబు ప్రసంగిస్తుండగా అగ్రిగోల్డ్ బాధితుల నుంచి నిరసన వ్యక్తమైంది. మాకు అన్యాయం చేస్తున్నారంటూ ప్రసంగం ముగియగానే అయ్యలూరులో బాధితులు కేకలు వేశారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. అగ్రిగోల్డ్, కేశవరెడ్డిలను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచి పోషించిందని ఆరోపించారు. కేశవరెడ్డిని టీడీపీలో చేర్చుకుంది మీరేనని కొందరు కేకలు వేసినా సీఎం పట్టించుకోలేదు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన సీఎం



నంద్యాల రోడ్‌షోలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి పలు హామీలు గుప్పించారు. రెండు నెలల్లో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, కాపులకు ఉద్యోగ, విద్యా అవకాశాలు కల్పిస్తానని, రూ. వందకోట్లు నిధులు కేటాయించి ముస్లిం కుటుంబాల్లోని ఆడపిల్లలు పెళ్లిళ్లు ప్రభుత్వమే చేసేలా కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడతామని, చంద్రన్న బీమా పథకం కింద అందజేసే డబ్బులు చనిపోయిన వ్యక్తి పెద్దకర్మ రోజునే అందేలా, 50 ఏళ్లలోపు వ్యక్తి చనిపోతే రూ. 2 లక్షలు వెంటనే అందజేస్తామని హామీలు ఇచ్చి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మాట్లాడటం గమనార్హం.



దారివ్వని సీఎం కాన్వాయ్

- సకాలంలో ఆస్పత్రికి చేరుకోలేకపోయిన వృద్ధుడు
- పరిస్థితి విషమం.. కర్నూలు తరలించాలన్న వైద్యులు



చికిత్స పొందుతున్న మదార్‌సా

నూనెపల్లె: సీఎం కాన్వాయ్ దారివ్వని కారణంగా.. ఓ వృద్ధుడు ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. నంద్యాలలోని ఎన్‌జీఓ కాలనీకి చెందిన మదార్‌సా అనే వృద్ధుడు శనివారం సాయంత్రం అనారోగ్యానికి గురయ్యారు. ఒక్కసారిగా బీపీ, షుగర్ పెరిగిపోవడంతో చికిత్సకోసం ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబసభ్యులు ప్రయత్నించారు. అయితే అదే సమయంలో ఎన్‌జీఓ కాలనీ మీదుగా ప్రభుత్వాసుపత్రి వరకు ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా సీఎం చంద్రబాబు కాన్వాయ్ కొనసాగుతుండడంతో సకాలంలో వృద్ధుడిని ఆసుపత్రికి తరలించడం కష్టమైంది. ఈ క్రమంలో 108 వాహనానికి సమాచారమిచ్చినా రెండుగంటలైనా రాలేదు. దీంతో ఆటోలోనే మదార్‌సాను తీసుకుని బయల్దేరారు. అయితే వాహనాల రద్దీతో తీవ్ర ఇబ్బందిపడ్డారు. ఆటోను వెనక్కి తిప్పి విశ్వనగర్, గోపాల్‌నగర్ మీదుగా ప్రభుత్వాసుపత్రికి తరలించేసరికి బాగా ఆలస్యమైంది. దీంతో అక్కడి వైద్యులు మదార్‌సా పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యంకోసం కర్నూలుకు తరలించాలని సూచించారు. దారివ్వకపోవడంపై బాధితుడి కుటుంబసభ్యులు సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలకృష్ణ డబ్బులు పంపిణీపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్

- ఘటనపై మళ్లీ నివేదిక పంపాలని కలెక్టర్‌కు ఆదేశం
- సర్వేలు నిషేధించే అధికారం ఈసీకి ఉంది: భన్వర్‌లాల్

సాక్షి, న్యూఢిల్లీ: నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో ఓటర్లకు ఎమ్మెల్యే బాలకృష్ణ పబ్లిక్‌గా డబ్బులు పంపిణీ చేయడాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఉప ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ఆయా రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లతో సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా నంద్యాల ఎన్నికల ప్రచారంలో బాలకృష్ణ ఓటర్లకు డబ్బులు పంచడంపై అందిన ఫిర్యాదులను పరిశీలించిన ఎన్నికల కమిషన్.. ఈ ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. సమావేశానికి హాజరైన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని చెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని, అందులో భాగంగానే ఒక డీఎస్పీని బదిలీ చేశామని తెలిపారు. వీవీప్యాట్‌ల నుంచి వచ్చే స్లిప్పులను వేరేవాళ్లు చూస్తారన్నది కేవలం దుష్ప్రచారమేనని చెప్పారు. ఓటరు మినహా ఎవరూ ఆ స్లిప్పులు చూసే అవకాశం లేదని, స్లిప్పులన్నింటినీ ఎన్నికల సంఘమే భద్రపరుస్తుందని తెలిపారు. ఏపీలో మొదటి సారిగా నంద్యాలలో వీవీప్యాట్‌లను వినియోగిస్తున్నామని, మొత్తం 308 వీవీప్యాట్‌లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. సర్వేలు ఆపాలని ఆదేశించే అధికారం ఎన్నికల సంఘానికి ఉందన్నారు. దీనిపై కోర్టులో తమ వాదనను వినిపిస్తామని ఆయన చెప్పారు.

ఆదినారాయణరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు



హైదరాబాద్: రాష్ట్ర మంత్రి ఆదినారాయణ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ తెలంగాణ లంబాడీ సేన నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దళితులకు చదువురాదు, శుభ్రంగా ఉండరని వ్యాఖ్యానించడంతో పాటు భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను సైతం కించపరిచే విధంగా రిజర్వేషన్లపై మాట్లాడినందుకు ఆయనపై కేసు నమోదు చేయాలని లంబాడీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కెతావత్ రామునాయక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. మంత్రి మాటలతో దళితులు, గిరిజనుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఫిర్యాదును ఆర్‌జీఐఏ ఎస్సై రమేశ్ నాయక్‌కు అందజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో లంబాడీ సేన నాయకులు గణేశ్ నాయక్, కిశోర్‌నాయక్, వెంకటేశ్ నాయక్, సురేశ్ నాయక్ తదితరులున్నారు.

బాబూ.. నంద్యాల అభివృద్ధి ఇప్పుడు గుర్తుకొచ్చిందా?

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ

నంద్యాల వ్యవసాయం: మూడేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు నంద్యాల అభివృద్ధి ఇప్పుడే గుర్తుకు వచ్చిందా? అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసం, నయవంచన చంద్రబాబు నైజమని, ఎన్నికలున్నాయి కాబట్టి నంద్యాల అభివృద్ధి అంటూ ప్రజలను మభ్యపెట్టడానికి దొంగ జపం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఓడిపోతామనే ఉద్దేశంతోనే టీడీపీ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. నంద్యాల పట్టణంలోని బీసీ, ఎస్సీ, వైఎస్సార్‌సీపీ నాయకులను భయపెట్టి, ప్రలోభపెట్టి తమ పార్టీలో చేర్చుకోవడానికి కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. అయితే నంద్యాల ప్రజలు ఇప్పటికే చంద్రబాబు అసలు రంగు తెలుసుకున్నారని, టీడీపీ కుట్రలన్నింటినీ తిప్పి కొడతారని, వైఎస్సార్‌సీపీకి పట్టం కడతారని చెప్పారు.

నాలుకా... తాటిమట్టా?

చంద్రబాబుకు నంద్యాలలో ఓటమి భయం పట్టుకుందని బొత్స ఎద్దేవా చేశారు. ''అందుకే 2014 ఎన్నికల హామీ అమలు చేశామంటూ అబద్ధాలు చెబుతున్నారు. ప్రజల సంక్షేమం కోసం మూడేళ్ల నుంచి పైసా ఖర్చు పెట్టలేదు. రైతులకు, మహిళలకు రుణమాఫీ అంటూ అబద్ధాలు చెబుతున్నారు. మీది నాలుకా... తాటిమట్టా?'' అని మండిపడ్డారు. పేదలకు ఇళ్లంటూ వారు జీవితాంతం బ్యాంకులకు రుణాలు కట్టాల్సిన పరిస్థితిని తెస్తున్నారన్నారు. చంద్రబాబు చట్టాన్ని తన అరచేతిలో పెట్టుకొని నంద్యాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 11రోజులుగా చేస్తున్న ప్రచారానికి జనాలు నీరాజనం పడుతున్నారని చెప్పారు. ముస్లింల అభివృద్ధి వైఎస్సార్ హయాంలోనే జరిగిందని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలు, విద్యార్థులు లబ్ధి పొందారని, వీటిని జగనన్న సీఎం అయిన తర్వాత కూడా కొనసాగిస్తారని తెలిపారు. సమావేశంలో నాయకులు కిలారి రోశయ్య, మాజీ ఎమ్మెల్సీ దుర్గేష్ పాల్గొన్నారు.




విలేకరులతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ఐవీఆర్ఎస్ ద్వారా టీడీపీ సర్వే

సాక్షి ప్రతినిధి, కర్నూలు: నంద్యాల ఉప ఎన్నికలో విజయం సాధించే అవకాశాలు రోజురోజుకూ సన్నగిల్లుతుండటంతో తన పరిస్థితి ఏమిటో తెలియక టీడీపీ బెంబేలెత్తుతోంది. సర్వేలు చేపట్టరాదని ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాటిని ఉల్లంఘిస్తోంది. తాజాగా ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) విధానంలో నేరుగా నంద్యాల ఓటర్లకు ఫోన్ చేసి సర్వే నిర్వహిస్తోంది. మీరు ఎవరికి ఓటు వేస్తారని ప్రశ్నిస్తూ.. టీడీపీకైతే 1, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకైతే 2 నొక్కండంటూ అడుగుతున్నారు. ఇందుకు స్పందించి ఓటర్లు ఏదో ఒక సంఖ్యను నొక్కాల్సి ఉంటుంది. అలా కాకుండా ఫోన్ కట్ చేస్తే.. తిరిగి ఏదో ఒక నంబర్ నొక్కే వరకు పదే పదే ఫోన్లు వస్తున్నాయని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓటర్లకు సంబంధించిన ఫోన్ నంబర్లన్నింటినీ అధికార పార్టీ సేకరించింది. ఈ నంబర్లకు ఐవీఆర్ఎస్ విధానం ద్వారా ఫోన్ చేసి సర్వే చేపడుతున్నారు. కాగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తామని 2 నెంబరు నొక్కిన వారికి మళ్లీ ఫోన్ వస్తోంది. తిరిగి మళ్లీ 2 నంబరే నొక్కినా.. మళ్లీ మళ్లీ ఫోన్లు వస్తూనే ఉన్నాయి.

నంద్యాల డీఎస్పీపై బదిలీ వేటు

- పక్షపాత వైఖరితో పనిచేస్తుండడంతో ఈసీ కొరడా
- ఓఎస్‌డీ రవిప్రకాష్‌కు బాధ్యతలు



గోపాలకృష్ణ

కర్నూలు: నంద్యాల డీఎస్పీ గోపాలకృష్ణను ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఓఎస్‌డీ రవిప్రకాష్‌కు బాధ్యతలు అప్పగించింది. కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలంలో డీఎస్పీగా పనిచేస్తున్న ఈయన ఉప ఎన్నిక నోటిఫికేషన్‌కు ముందు మంత్రి భూమా అఖిలప్రియ సిఫారసుతో జూలై 4న హరినాథరెడ్డి స్థానంలో నంద్యాల డీఎస్పీగా నియమితులయ్యారు. అప్పట్నుంచీ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతల్ని వేధింపులకు గురిచేస్తున్నారని, ఉప ఎన్నిక సందర్భంగా పక్షపాతంతో విధులు నిర్వర్తిస్తున్నారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. తమ పార్టీకి చెందిన స్థానిక నాయకుల ఇళ్లపై అర్ధరాత్రి సోదాలంటూ తలుపు తడుతున్నారని, అధికార పార్టీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ సైతం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఉప ఎన్నిక ప్రచారం కోసం సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో నంద్యాలకు భారీగా డబ్బులొస్తున్నాయని సమాచారం అందడంతో ఓ కంటైనర్‌ను ఎన్నికల నిఘా విభాగం శుక్రవారం పోలీసులకు అప్పగించింది. దాన్ని తనిఖీ చేశాక సంబంధిత నివేదికను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పజెప్పాల్సిన డీఎస్పీ గోపాలకృష్ణ.. అసత్య ఆరోపణలు చేస్తే కేసులు పెడతానంటూ ప్రతిపక్ష పార్టీ నాయకుల్ని బెదిరించడం వార్తలకెక్కింది. ఈ వ్యవహారం నేపథ్యంలో డీఎస్పీ గోపాలకృష్ణపై ఎన్నికల సంఘం బదిలీ వేటేస్తూ శుక్రవారం రాత్రి నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నంద్యాల మూడవ పట్టణ సీఐగా పనిచేస్తున్న దేవేంద్ర కుమార్ కూడా టీడీపీకి వీర విధేయుడుగా వ్యవహరిస్తుండటంపై దృష్టిపెట్టిన ఎన్నికల సంఘం ఆయన వివరాలు పంపాలని జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించడం తెలిసిందే. తాజాగా నంద్యాల డీఎస్పీ గోపాలకృష్ణపై బదిలీ వేటేసింది. దీంతో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఏకపక్షంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఈసీ తాజాగా హెచ్చరించినట్లయ్యింది.

ఆది నుంచీ వివాదాస్పదమే..

గోపాలకృష్ణ వ్యవహారశైలి మొదట్నుంచీ వివాదాస్పదమే. ఈయనపై అవినీతి ఆరోపణలూ ఉన్నాయి. ఈయన 1989లో ఎస్ఐ హోదాలో విధుల్లో చేరారు. కర్నూలుతోపాటు చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లోనూ పనిచేశారు. ఎమ్మిగనూరులో సీఐగా పనిచేసేటప్పుడు ఎరుకలి ఈరన్న, ఎరుకలి నాగన్న అనేవారిని వేధింపులకు గురిచేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో సస్పెన్షన్‌కు గురయ్యారు.

కర్నూలు జిల్లాలో రూ.47.40 లక్షలు స్వాధీనం

- మైనింగ్ కూలీల కోసం దాచిన డబ్బు తీసుకున్నారంటున్న వ్యాపారవేత్త దస్తగిరిరెడ్డి కుటుంబం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

బనగానపల్లె: కర్నూలు జిల్లా బనగానపల్లె మండలం పలుకూరులో వ్యాపారవేత్త శనివారపు దస్తగిరిరెడ్డి ఇంటిలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక పోలీసులు రూ.47.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల ఉపఎన్నిక నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు జరిపి నగదు స్వాధీనం చేసుకున్నట్లు నందివర్గం పోలీసులు తెలిపారు. దస్తగిరిరెడ్డి కుటుంబానికి విద్యాసంస్థలతో పాటు నాపరాయి మైనింగ్ గనులు, కంకర, సుద్ద ఫ్యాక్టరీలు, టిప్పర్లు ఉన్నాయి. వీటిలో నిత్యం వందల మంది కార్మికులు పనిచేస్తున్నారు. కూలీలకు ప్రతి శనివారం కూలి(బట్వాడా) పంపిణీ చేసేందుకు ఇంట్లో భద్రపరచిన నగదును పోలీసులు స్వాధీనం చేసుకోవటం ఏమిటని దస్తగిరిరెడ్డి కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. తాము వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానులమే తప్ప పూర్తిగా రాజకీయాల్లో పాల్గొనే వాళ్లం కాదని స్పష్టం చేస్తున్నారు. దీనిపై టీడీపీ నేతలతోపాటు ఆ పార్టీ అనుకూల మీడియా రాద్ధాంతం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకు రూ.కోటి నగదు స్వాధీనం

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో ఇప్పటివరకు రూ. కోటి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

బెదిరింపు రాజకీయం

నంద్యాల నియోజకవర్గంలో ఓటర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్న అధికార తెలుగుదేశం పార్టీ నేతలు




శుక్రవారం అర్ధరాత్రి గోస్పాడు మండలం దీబగుంట్లలో వైఎస్సార్ సీపీ నేత పి.పి. నాగిరెడ్డి నివాసంలో సోదాలు నిర్వహించేందుకు పోలీసులు రావడంతో బయట గుమికూడిన జనం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ''మీరు అధికార పార్టీ అభ్యర్థికి ఓటు వేయకపోతే మీకు వస్తున్న పింఛన్, రేషన్ ఆగిపోతుంది'' అంటూ సర్వే టీమ్ పేరుతో ఓటర్లకు బెదిరింపులు... ''ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా తెలుగుదేశం పార్టీలో చేరు. లేదంటే మీ ఇంట్లో సోదాలు చేస్తాం.'' అంటూ ప్రతిపక్ష పార్టీ నాయకులకు హెచ్చరికలు.... ''వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎక్కువగా తిరగకు. రౌడీషీటు పెడతా. ఇక ఎక్కడకూ పోలేవు''....ఇలా ఓ సీఐ హూంకరింపులు.. ''శిల్పా మోహన్ రెడ్డి మంచివాడే. ఆయనకు ఓటు వేస్తే ఎమ్మెల్యే అవుతారు. కానీ తెలుగుదేశం పార్టీకి ఓటు వేయకపోతే నంద్యాలలో అభివృద్ధి ఆగిపోతుంది'' అంటూ ఓటర్లకు అధికారపార్టీ నాయకుల అదిలింపులు..... ఇక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ బెదిరింపుల విషయంలో మరో అడుగు ముందుకేశారు.. తెలుగుదేశం పార్టీకి కనీసం 50వేల మెజారిటీ రాకపోతే నంద్యాలలో అభివృద్ధి ఆపేస్తామని బెదిరించేవరకు వెళ్లారు.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఆయన ప్రకటనలు ఉన్నాయి. అంతేకాదు.. ఎవరు ఎవరికి ఓటు వేశారనేది ముఖ్యమంత్రికి తెలిసిపోతుందంటూ పార్టీ నేతల చేత చెప్పిస్తూ ఓటర్లను భయపెడుతున్నారు.... ప్రజాస్వామ్యంలో ఎవరికి ఓటు వేస్తారనేది ఓటరు ఇష్టం. అది అత్యంత గోప్యంగా ఉంచాలి. బైటకు చెప్పడం కూడా నేరంగా పరిగణిస్తారు. అలాంటిది ఓటు ఎవరికి వేశారో కనుక్కుంటాం.. మాకు తెలిసిపోతుంది అంటూ భయపెట్టాలని చూడడం అత్యంత దుర్మార్గమని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అసలు అలా తెలుసుకోవడం సాధ్యం కానే కాదని కూడా వారు పేర్కొంటున్నారు. ఇక సంక్షేమ పథకాలు రద్దయిపోతాయని అధికారపార్టీ నేతలు ఓటర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. అలా ఒక నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అమలు కాకుండా చేయడం సాధ్యమయ్యే పనేనా? కానీ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడానికి అధికారపార్టీ ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతోంది. ఇక ఇదే సమయంలో నియోజకవర్గంలో ఒక్కోచోట ఒక్కో విధంగా డబ్బు పంపిణీ జరుగుతోంది. ఏరియాను బట్టి ఓటుకు రూ.2 వేల నుంచి రూ. 5 వేల వరకు పంచుతున్నారు.

గెలుపు అవకాశాలు కనిపించక...

విచ్చలవిడిగా డబ్బు వెదజల్లుతున్నా... ఎడాపెడా హామీల వర్షం కురిపిస్తున్నా... నంద్యాల ఉప ఎన్నికల్లో గెలుపు అవకాశాలు కానరాకపోవడంతో ఓటర్లను రకరకాలుగా బెదిరించే స్థితికి అధికారపార్టీ దిగజారింది. అయినా పరిస్థితి మెరుగు పడకపోవడంతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు గాను అధికారాన్ని అడ్డుపెట్టుకుని.. పోలీసులను ఉపయోగించుకుని.. దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటివరకు తాను ఇచ్చిన హామీలను, అభివృద్ధి జపాన్ని జనం నమ్మడం లేదని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇక నేరుగా హెచ్చరికలకు, బెదిరింపులకు దిగుతున్నారు. దాడులు జరపాల్సిందిగా ప్రోత్సహిస్తున్నారు. తమకు ఓటు వేయకపోతే నంద్యాలలో అభివృద్ధి ఆగిపోతుందంటూ బ్లాక్‌మెయిలింగ్‌కూ దిగుతున్నారు. 'ఓటుకు కోట్లు' స్ఫూర్తితో.... నంద్యాల నియోజకవర్గంలో అధికారపార్టీ నేతలు విచ్చలవిడిగా నోట్లను పంపిణీ చేస్తున్నారు. నంద్యాలలోని ఒకటో వార్డులో ఏకంగా ఒక భవనంలో తిష్టవేసిన అధికారపార్టీ ఎమ్మెల్యే డబ్బుల పంపిణీని స్వయంగా పర్యవేక్షిస్తున్నారంటే పరిస్థితి ఏ మేరకు దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

విచ్చలవిడిగా డబ్బు పంపిణీ

ఓటుకు రూ.5 వేలు ఇవ్వగలనని స్వయంగా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చేసిన ప్రకటనకు అనుగుణంగానే అధికారపార్టీ నేతలు నోట్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడం ప్రారంభించడంతో... ఓటర్లకు డబ్బుల పంపిణీని ముందుగానే పూర్తిచేసేందుకు అధికారపార్టీ శ్రీకారం చుట్టింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. శనివారం రాత్రి కూడా డబ్బుల పంపిణీ వ్యవహారం కొనసాగింది. ఇక తమకు డబ్బులు ఇవ్వడం లేదని కొందరు గొడవలకు కూడా దిగడం కనిపించింది. శనివారం ఒక్క రోజే సుమారు రూ.25 కోట్లను అధికారపార్టీ పంపిణీ చేసినట్టు తెలుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి కచ్చితంగా ఓటు వేస్తారని భావించే వారికి ఓట్లు లేవని దుష్ప్రచారం చేస్తున్నారు. నంద్యాలలోని విశ్వనగర్ కాలనీలో ఈ రకమైన ప్రచారం జరగడంతో కలకలం చెలరేగింది.

పోలీసుల బెదిరింపుల ఫోన్లు...!

నంద్యాల మండలంలో వైఎస్సార్సీపీలో క్రియాశీలంగా పనిచేస్తున్న ఓ కార్యకర్తకు నేరుగా సీఐ ఫోన్ చేసి... 'నీ మీద రౌడీషీటు ఓపెన్ చేస్తాం' అని బెదిరిస్తున్నారు. రౌడీషీటు తెరిస్తే విదేశాలకు పోలేవని...భవిష్యత్ అంతా అంధకారంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. మరోవైపు సర్వేల పేరుతో ఓటర్ల దగ్గరకు వెళ్లి ఓటు వేయకపోతే పింఛను, రేషన్ కట్ అవుతుందని బెదిరిస్తున్నారు. కొత్త ఈవీఎం మిషన్లతో మీరు ఎవరికి ఓటు వేస్తారో తమకు తెలుస్తుందని... తప్పకుండా టీడీపీకే ఓటు వేయాలని కూడా మరికొందరు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు.

ప్రతిపక్షమే లక్ష్యంగా దాడులు.. దుష్ప్రచారాలు..

నంద్యాల ఉప ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ...అధికారపార్టీ అరాచకాలకు హద్దులేకుండా పోతోంది. ఒకవైపు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తూ మరోవైపు విపరీతంగా నగదును పంపిణీ చేస్తోంది. ప్రతిపక్ష నేతల ఇళ్లపై దాడుల్లో ఎక్కడా ఆధారాలు లభించకపోయినప్పటికీ రెచ్చిపోయి మరీ సోదాలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు 15 మంది ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అంతటితో ఆగకుండా సెర్చ్ వారంట్లను కూడా సిద్ధం చేసుకుంటున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా ఓట్లు వేస్తారని భావించే వారి ఇళ్ల వద్దకు వెళ్లి మీ ఓట్లు లేవంటూ గందరగోళ పరిచే ప్రచారాలకూ దిగుతున్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కొందరు అధికారులపై ఎన్నికల సంఘం కొరఢా ఝుళిపిస్తుండటంతో అధికారపార్టీ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఎన్నికల సంఘం సీరియస్ అవుతోందన్న వార్తల నేపథ్యంలో పోలింగుకు ముందు పంపిణీ చేయలేమనే ఆందోళనతో ఓటుకు నోటు పంపిణీని ముమ్మరం చేసింది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డులల్లో కలియతిరుగుతూ రాత్రి, తెల్లవారుజామున కూడా డబ్బులను పంపిణీ చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రచారాన్ని మొత్తం దగ్గరుండీ మరీ రెండు వీడియో కెమెరాలతో చిత్రీకరిస్తున్న అధికారులు... ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారపార్టీ ఎమ్మెల్యే ప్రచారం వైపు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. నంద్యాల ఉప ఎన్నికల్లో కచ్చితంగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలవబోతోందంటూ నిఘా సంస్థలు నివేదికలు ఇవ్వడంతో అధికారపార్టీకి ఊపిరాడటం లేదు.

15 మంది ఇళ్లల్లో సోదాలు...!

నంద్యాల ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నేతలను అధికారపార్టీ టార్గెట్ చేసింది. మొదటగా కౌన్సిలర్ సుబ్బరాయుడు ఇంటిపై అర్ధరాత్రి సమయంలో దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేశారు. ఇంట్లో కత్తులు, మరణాయుధాలు ఉన్నాయంటూ పోలీసులు సోదాలు చేపట్టారు. పక్కనున్న ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహించారు. ఆ తర్వాత మల్లికార్జున, అనిల్ అమృత్‌రాజ్ ఇళ్లపైనా రాత్రి సమయాల్లో సోదాలకు దిగారు. ఈ సోదాల్లో ఎక్కడా భారీ మొత్తం కానీ, మారణాయుధాలు కానీ లభించలేదు. అయినప్పటికీ ఆగకుండా ఆంధ్రా మెడికల్స్ యజమాని రమేష్ ఇంటిలోనూ సోదాలు చేపట్టారు. ఇక సత్యనారాయణ ఇంట్లో సోదాలు చేస్తే కేవలం రూ.5 వేలు మాత్రమే ఉన్నాయి. గోస్పాడు మండలంలో వైసీపీకి బలంగా ఉన్న పీపీ నాగిరెడ్డి అధికార పార్టీలో చేరలేదనే అక్కసుతో రాత్రి 1 గంట ప్రాంతంలో సోదాలకు వెళ్లారు. సెర్చ్‌వారెంట్ కావాలని అడగడంతో....వెనుదిగిరి సెర్చ్‌వారంట్‌ను తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. అదేవిధంగా శుక్రవారం రాత్రి సమయంలో ఆదిరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి, దేశం సులోచన, కల్లూరు రామలింగారెడ్డి, పలుకూరు దశరథరెడ్డి ఇంటిలోనూ సోదాలు జరిపారు. దశరథరెడ్డి ఇంట్లో డబ్బులు లభించినప్పటికీ ఆయన ఇందుకు సంబంధించిన లెక్కలు ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. ఇక మిట్నాలల్లో తిరుపతిరెడ్డి బంగారు తాకట్టు పెట్టి నగదు తెచ్చుకున్నానని రశీదులు చూపించినప్పటికీ ఏమాత్రమూ పట్టించుకోలేదు. చాబోలులో చిన్నబాల ఉస్సేని, చాపిరేవులలో సర్పంచ్ జూపల్లి వాణి ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహించారు. మొత్తం మీద కేవలం ప్రతిపక్ష వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా సాగుతున్న ఈ సోదాలపై ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. ఇటువంటి దాడులతో తమ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేస్తున్నారు. ప్రతిపక్ష నేతలు బసచేసిన లాడ్జీల్లోనే ఇప్పటివరకు మూడుసార్లు సోదాలు నిర్వహించారు. అధికార మంత్రులు, ఎమ్మెల్యేలు ఉంటున్న లాడ్జీలపై కనీసం కన్నెత్తి చూసే సాహసం కూడా చేయడం లేదు. పైగా సీఎం ప్యాంట్రీ వాహనాన్ని తనిఖీ చేయించారని ఫిర్యాదు చేసిన వారిపైనే కేసులు నమోదు చేస్తామని అధికారులు ప్రకటించడాన్ని ఎన్నికల సంఘం కూడా సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది.

సాక్షి
రాష్ట్రీయం

వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం | ఆగస్టు | 20 | 2017
www.sakshi.com



నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం, 2016 నాటికి దేశ వ్యాప్తంగా ఉన్న అనాథ బాలల సంఖ్య **1.1** కోట్లు.

భయపడాల్సిన పనిలేదు: ధర్మాన



సాక్షి, కాకినాడ: నంద్యాల ఉప ఎన్నికల్లో ఎలాగైనా సరే గెలవాలన్న ఆదుర్దాలో అధికారపార్టీ అన్నిరకాల విలువలకు తిలోదకాలిస్తున్నదని వైఎస్సార్సీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామన్న స్పృహ కూడా తెలుగుదేశం వారికి లేకుండా పోయిందని ఆయన ఎద్దేవా చేశారు. అధికార పార్టీ బెదిరింపులకు భయపడాల్సిన పని లేదని ఆయన నంద్యాల ఓటర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలు ఎలా రద్దుచేస్తారో చూస్తామని, ఒక్కరికి పింఛన్ ఆపినా చూస్తూ ఊరుకునేది లేదని ధర్మాన హెచ్చరించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని, వారి తరపున పోరాడుతుందని తెలిపారు. వైఎస్సార్సీపీ అధికారంలోకి రాగానే నంద్యాలను బ్రహ్మాండంగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది అత్యంత విలువైన అస్త్రమని, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం లేకుండా భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుట్రలకు నంద్యాల ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

చెట్లను నరకడం వల్లే దుష్ఫలితాలు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు



అద్దంకి: చెట్లను విచ్చలవిడిగా నరికివేయడం వల్ల దుష్ఫలితాలు తలెత్తుతున్నాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ, గ్రామ భారతి ట్రస్ట్ సంయుక్తంగా శనివారం ప్రకాశం జిల్లా అద్దంకిలో నిర్వహించిన వనం–మనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ... మానవుని మనుగడకు అవసరమైన పంచ భూతాల్లో ఒక్క ఆకాశం మినహా గాలి, నీరు, భూమి, వాయువు కొనుగోలు చేయనిదే దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లను నరకడం వల్లే పర్యావరణంలో సమతుల్యత లోపించి, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. నగరాల్లో సూర్యరశ్మి అందక, మనుషుల్లో విటమిన్–డి లోపం ఏర్పడి, ట్యాబ్లెట్ల రూపంలో కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. యువత పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ముందుగా కళాశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు నర్రా శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ భారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఘంటా రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శంకరరెడ్డి, రోటరీ ఎన్విరాన్‌మెంటల్ చైర్మన్ మన్నం త్రిమూర్తులు, ఏపీ న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చల్లా ధనుంజయ, కార్యదర్శి బాచిన హనుమంతరావు, ఒంగోలు, అద్దంకి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆ ప్రాజెక్టుల పనుల్ని ఏడాదిలోగా పూర్తిచేయాలి

- పీఎంకేఎస్‌వై ప్రాజెక్టులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఆదేశం
- రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష

సాక్షి, అమరావతి: ఆయకట్టుకు నీళ్లందించి రైతులకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) కింద చేపట్టిన ప్రాజెక్టుల పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుంసింగ్ రాష్ట్ర జలవనరులశాఖ అధికారుల్ని ఆదేశించారు. శనివారం విజయవాడలో పీఎంకేఎస్‌వై ప్రాజెక్టులపై రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో గుండ్లకమ్మ, తాడిపూడి, తోటపల్లి, ముసురుమిల్లి, పుష్కర, ఎర్రకాల్వ, తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టులను పీఎంకేఎస్‌వై రెండో దశ కింద కేంద్రం ఎంపిక చేసిందన్నారు. ఈ ప్రాజెక్టుల పనుల్ని పూర్తి చేయడానికి రూ.537.50 కోట్లు అవసరమని, ఇందులో కేంద్ర వాటా రూ.147.83 కోట్లు కాగా.. రాష్ట్ర వాటా రూ.389.67 కోట్లని జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ వివరించారు. పీఎంకేఎస్‌వై ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకున్నామని తెలిపారు. వచ్చే ఖరీఫ్ నాటికి ఆయకట్టుకు నీళ్లందిస్తామని వివరించారు. సమావేశానంతరం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో విశాఖపట్నానికి బయల్దేరి వెళ్లింది. విశాఖపట్నంలో తోటపల్లి ప్రాజెక్టు పనులపై జలవనరులశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ కమిటీ ఆదివారం ఉదయం విశాఖ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్లనుంది.



ఉద్యోగులూ.. మోసపోవద్దు

ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి పిలుపు



సాక్షి, నంద్యాల: ఉద్యోగులు, టీచర్లు, వర్కర్లను 50–55 ఏళ్లకే బలవంతపు పదవీ విరమణ చేయించి ఇంటికి పంపించే కత్తి ఇంకా వేలాడుతూనే ఉందని ఏపీఎన్‌జీవో సంఘం మాజీ అధ్యక్షుడు, జేఏసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ విషయాన్ని ఉద్యోగలోకం దృష్టిలో ఉంచుకొని నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల బలవంతపు పదవీ విరమణకు సంబంధించి ముసాయిదా జీవోను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. నంద్యాల ఎన్నికల నేపథ్యంలో సంబంధిత ఫైల్‌ను ప్రభుత్వం తాత్కాలికంగా పక్కన పెట్టిందన్నారు. ఈ ఉత్తర్వులు రాకుండా ఉండాలంటే నంద్యాల, కాకినాడల్లో జరిగే ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఇంత ఘోరం జరుగుతున్నా ఉద్యోగ సంఘాల నేతలు ఎందుకు నోరు విప్పడంలేదో అర్థం కావడంలేదన్నారు. ఇలాంటి నేతలు ఇంకా ప్రభుత్వ పక్షానే నిలబడాలని చూస్తున్నారని వారికి తగిన బుద్ధి చెప్పాలని ఉద్యోగులను కోరారు.

కర్నూలులో టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

- హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణం
- లైంగిక వేధింపులే కారణమంటున్న విద్యార్థి సంఘాలు



ప్రీతి మృతదేహంతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు.

కర్నూలు సిటీ: కర్నూలు నగర శివారులోని దిన్నెదేవరపాడు వద్దనున్న కట్టమంచి రామలింగారెడ్డి రెసిడెన్షియల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ప్రీతి (15) అనే విద్యార్థిని శనివారం ఆత్మహత్య చేసుకుంది. ఆ విద్యార్థిని చీరతో హస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. విద్యార్థిని ఆత్మహత్యకు పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. కర్నూలులోని లక్ష్మీగార్డెన్‌లో నివాసం ఉంటున్న ఎస్.రాజునాయక్, పార్వతిదేవి దంపతులు కలెక్టరేట్ సమీపంలో జిరాక్స్ సెంటర్ నడుపుతున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్దమ్మాయి ప్రీతి. శనివారం ఉదయం స్కూల్ యాజమాన్యం నుంచి ఫోన్ రావడంతో తల్లిదండ్రులు హుటాహుటిన స్కూల్‌కు వెళ్లారు. కుమార్తె మృతదేహం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. ఇది తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు భారీగా మార్చురీ దగ్గరకు చేరుకున్నారు. మృతదేహంతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కట్టమంచి స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కర్నూలు డీఎస్పీ రమణమూర్తి, ఆర్డీవో హుసేన్ సాహెబ్, డీఈవో తాహెరా సుల్తానా హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. విద్యార్థిని మృతదేహాన్ని మార్చురీకి తీసుకొచ్చిన సమయంలో అక్కడికి వచ్చిన కట్టమంచి స్కూల్‌కు చెందిన ఓ డైరెక్టర్, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల సంఘం నాయకులతో విద్యార్థి నాయకులు వాగ్వాదానికి దిగారు. ఇదే సందర్భంలో అక్కడే ఉన్న స్కూళ్ల యజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిపై విద్యార్థులు దాడి చేయగా ఆయన తలకు గాయమైంది. చికిత్స కోసం శ్రీనివాసరెడ్డిని హాస్పిటల్‌కు తరలించారు. ఆ తరువాత అక్కడే ఉన్న ఓ కారు అద్దాలను సైతం విద్యార్థులు పగులగొట్టారు. విద్యార్థి సంఘాల నాయకులు.. పాఠశాల సిబ్బంది లైంగిక వేధింపులే ఆత్మహత్యకు కారణమని ఆరోపించారు.

నువ్వు రావాలి నాన్నా..
మా కష్టాలు తీరాలి..

- జననేతకు ఓ అవ్వ దీవెన
- ఉపఎన్నిక ప్రచారంలో దూసుకెళుతున్న ప్రతిపక్ష నేత జగన్
- అడుగడుగునా ముంచెత్తుతున్న అభిమానం

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి





'ఇంకెన్నాళ్లు నాన్నా ఈ కష్టమంటూ' భావోద్వేగానికి లోనై రోదిస్తున్న వృద్ధురాలిని ఓదార్చుతున్న వైఎస్ జగన్.. వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న ప్రతిపక్షనేత.. ఓ అవ్వతో సెల్ఫీ

'నువ్వు రావాలి నాన్నా... మా కష్టాలు తీరాలి' అని ఓ పండు ముదుసలి జగన్‌ను మనసారా దీవించింది. నంద్యాలలోని రోజాకుంట ప్రాంతంలో శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా పాదయాత్రగా వెళుతున్నపుడు 90 ఏళ్లున్న ఓ వృద్ధురాలు దగ్గరగా వచ్చే యత్నం చేసింది. జగన్.. గమనించి వెంటనే ఆమె వద్దకు వెళ్లి దగ్గరకు తీసుకున్నారు. 'ఎంతగా కష్ట పడుతున్నావు నాయనా.. నువ్వే రావాలి నాయనా.. అందరి కష్టాలు తీరుతాయి' అని ఆమె దీవించారు. కొద్ది దూరం వెళ్లాక రైతన్న ఒకరు ముందు కొచ్చి 'నీకు నరదిష్టి పోవాలి...' అంటూ గుమ్మడి కాయపై కర్పూరం వెలిగించి దిష్టి తీసి పగులగొట్టారు. రామాలయం 39వ వార్డు నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమైన జగన్ ప్రచారం రాత్రి 8.30 వరకూ సాగింది. మరో రెండు రోజుల్లో ప్రచారానికి గడువు ముగియనుండగా జగన్ తన ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ ముందుకు దూసుకెళుతున్నారు. మధ్యలో కొందరు ఏర్పాటు చేసే ఆత్మీయ సమావేశాలకు కూడా హాజరవుతున్నారు. ఇందులో భాగంగా ఉదయం ఆర్య వైశ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత నూర్ అహ్మద్

టీడీపీకి చెందిన కొందరు నేతలు, కార్యకర్తలు జగన్ తీరు పట్ల ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరారు. జగన్ 40వ వార్డు పెద్ద బండ ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్నప్పుడు టీడీపీ నేత నూర్ అహ్మద్ తన అనుచరులతో కలసి వచ్చారు. తాను వైఎస్సార్‌సీపీలో చేరాలనుకుంటున్నట్లు అభిలషించారు. దాంతో జగన్ వారిని సాదరంగా ఆహ్వానించారు. నూర్ అహ్మద్ జిల్లా టీడీపీ మైనారిటీ విభాగం నేతగా పని చేశారు. టీడీపీ ఊరేగింపుల్లో పాల్గొంటున్న పలువురు కార్యకర్తలు సైతం జగన్ కాన్వాయ్ ఎదురైనపుడు అనుకూలంగా కేరింతలు కొట్టడం విశేషం. చంద్రబాబునాయుడు కూడా నంద్యాలలో పర్యటిస్తున్నందున.. జగన్ రోడ్‌షోలకు వెళ్తున్న జనాన్ని అడ్డుకుని ముఖ్యమంత్రి రోడ్ షోకు తరలించేందుకు ఆ పార్టీ నేతలు పోటీపడ్డారు. అయినా జగన్‌ను చూడటానికి జనం పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి వచ్చారు. దీవెనలు అందజేయడం, సెల్ఫీలు తీసుకునేందుకు దారి పొడవునా వేలాదిగా వెల్లువెత్తారు. అడుగడుగునా అభిమానం ముంచెత్తుతుండటంతో అందరితో ఓపికగా మాట్లాడుతూ జగన్ ముందుకుసాగారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్.. ఫలానా వర్గం అనే తేడా లేకుండా బలహీన వర్గాల మహిళలంతా ఏకమై ఎదురేగి తిలకం దిద్దుతూ స్వాగతం పలికారు. జగన్ కూడా వారిని ఆప్యాయంగా పలుకరించారు. వయసులో పెద్దలు ఎదురైనపుడు ప్రార్థనలు చేయండి అంటూ వినమ్రంగా విజ్ఞప్తి చేశారు.

గర్భవతైన భార్యపై భర్త దాడి

- మాటవినలేదని భార్య పొట్టపై తన్నిన భర్త
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు



కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీత

విజయనగరం ఫోర్ట్: బాధ్యతాయుతమైన పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్ తన భార్యపై అమానుషమైన దాడికి పాల్పడ్డాడు. తన రక్తంపంచుకు పుట్టబోయే బిడ్డకు జన్మనివ్వాల్సిన గర్భిణి అని చూడకుండా ఆమె గర్భంపై తన్నాడు. బాధితురాలు, విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని ఆర్టీసీ కాంప్లెక్సు ప్రాంతానికి చెందిన పాతరపల్లి సునీత (కృష్ణవేణి)కు ఈ ఏడాది ఫిబ్రవరి 2న విజయనగరం పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఇప్పిలి వెంకటేశ్‌తో వివాహమైంది. వెంకటేశ్ గుంటూరు జిల్లా మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. మంగళగిరిలో రెండు నెలల పాటు వీరి కాపురం సజావుగానే సాగింది. ఆ తర్వాత ఆమె గర్భవతి అయిన తర్వాత అబార్షన్ చేయించుకోవాలంటూ వేధింపులు మొదలుపెట్టాడు. అబార్షన్ చేయించుకోకపోతే విడాకులు ఇచ్చేస్తానని బెదిరించేవాడు. రెండు నెలల క్రితం భర్త వేధింపుల విషయం సునీత తన తల్లిదండ్రులకు చెప్పడంతో ఆమెను తల్లిదండ్రులు విశాఖపట్నం తీసుకుని వచ్చేశారు. అప్పటి నుంచి విశాఖలోనే ఉంది. ఈ నేపథ్యంలో పెళ్లి పెద్దలు సమస్యను పరిష్కరించేందుకు శనివారం సునీతను, ఆమె తల్లిదండ్రులను బీసీ కాలనీకి రమ్మనగా.. వారు వెంకటరావు అనే పెళ్లి పెద్ద ఇంటికి వచ్చారు. అక్కడకు వచ్చిన వెంకటేశ్ వచ్చీ రాగానే సునీత గర్భంపై బలంగా తన్నాడు. దీంతో సునీతకు కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు, సోదరుడు స్థానిక జిల్లాకేంద్రాస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది.

సాక్షి

వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం | ఆగస్టు | 20 | 2017

గోపీ పరీక్ష తర్వాతే...

సహజంగానే గోపీచంద్ అకాడమీకి ఇప్పుడు ఉన్న గుర్తింపు, పేరు ప్రఖ్యాతులు అందరినీ ఆకర్షిస్తున్నాయి. దాంతో తమ పిల్లలు అక్కడ చేరితే చాంపియన్లుగా మారతారనే భావన చాలా మంది తల్లిదండ్రుల్లో ఉంది. అందుకే నేరుగా తీసుకొచ్చి అకాడమీలో చేర్పించేందుకు పెద్ద సంఖ్యలో అక్కడికి వస్తున్నారు. అయితే గోపీచంద్ చెప్పిన దాని ప్రకారం... గత మూడేళ్లుగా అకాడమీలో దాదాపుగా అడ్మిషన్లు ఆగిపోయాయి. బేసిక్స్ నేర్చుకునే లెర్నర్స్ విభాగంలోనైతే ఎవరినీ తీసుకోవడం లేదు. కొంత మంది పెద్ద స్థాయి సిఫారసులతో వచ్చినా సరే వారికి కూడా నో ఎంట్రీనే. అయితే ప్రాథమిక స్థాయిలో అప్పటికే చెప్పుకోదగ్గ ప్రదర్శన కనబర్చిన వారిని తీసుకొని మరింతగా సానబెట్టే అవకాశం మాత్రం ఇక్కడ ఉంది. అదీ గోపీచంద్ స్వయంగా తనదైన శైలిలో ఆటలో పరీక్ష నిర్వహించి సంతృప్తి చెందిన తర్వాత మాత్రమే వారికి అవకాశం లభిస్తుంది. అసాధారణ ప్రతిభ ఉందంటూ వచ్చే కొందరికి కూడా ఇదే వర్తిస్తుందని ఆయన అంటున్నారు.



టాప్ స్టార్స్ సింధు, సాయిప్రణీత్, శ్రీకాంత్‌లతో కోచ్ గోపీచంద్

క్రమశిక్షణకు కేరాఫ్...

అగ్రశ్రేణి క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకొని ఉండవచ్చు... అప్పటికే పెద్ద టోర్నీలలో వరుస విజయాలు సాధిస్తూ ఉండవచ్చు... కానీ అకాడమీలో క్రమశిక్షణ విషయానికి వచ్చేసరికి మాత్రం అంతా ఒక్కటే. ఏ ఒక్కరూ తమ పరిధి దాటి ప్రవర్తించేందుకు ఏమాత్రం అవకాశం లేదు. తమకు ఇచ్చిన షెడ్యూల్‌ను కచ్చితంగా, సమర్థంగా పాటించాల్సిందే. ఇన్నేళ్లలో క్రమశిక్షణకు సంబంధించి అకాడమీ నుంచి ఒక్క ఫిర్యాదు కూడా రాకపోవడం విశేషం. తాను కూడా ఈ అంశంలో కఠినంగా వ్యవహరిస్తానని గోపీచంద్ అన్నారు. సాధారణంగా ఇలాంటి వ్యవస్థలో వాతావరణం చెడగొట్టేవారు ఒకరో, ఇద్దరో కచ్చితంగా ఉంటారు. అలాంటి వారిని గుర్తించి పక్కన పెట్టేయడం చాలా అవసరం. ఇక్కడ ట్రైనింగ్ కూడా పూర్తిగా నేను ఇచ్చిన ప్రణాళిక ప్రకారమే సాగాలి. కొంత మంది ఆటగాళ్లు బయట గెలిచి రాగానే ఇలా కాదు అలా ఆడాలి అన్నట్లుగా తమ షెడ్యూల్ తామే మార్చుకునే ప్రయత్నం చేస్తారు. లేదంటే జూనియర్లకు సలహాలిస్తూ మాస్టర్‌లా మారే ప్రయత్నం చేస్తారు. కానీ అలా ప్రవర్తిస్తూ క్రమశిక్షణ ఉల్లంఘించే అవకాశం నేను అసలే ఇవ్వను అని ఆయన చెప్పారు.



షట్లర్ల ఫ్యాక్టరీ...

చాంపియన్లను తయారు చేస్తున్న పుల్లెల గోపీచంద్ అకాడమీ

అన్ని స్థాయిలలో విజేతలుగా నిలుస్తున్న ఆటగాళ్లు
సంవత్సరాల శ్రమకు లభిస్తున్న ఫలితాలు • భవిష్యత్తులో మరింత మంది స్టార్లు

అది హైదరాబాద్ గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీ ప్రాంగణం... సుదీర్ఘంగా సాగిన ప్రాక్టీస్ తర్వాత లభించిన కొద్ది పాటి విరామ సమయం... ఆ కొద్ది సమయంలోనే తమ పరిచయం, తాము వచ్చిన కారణం, తమ ఆలోచనలను గోపీచంద్‌తో పంచుకునేందుకు పలువురు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. అందులో ఎక్కువ మంది ప్రముఖ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు. గోపీచంద్ అనుమతిస్తే అకాడమీతో జత కూడేందుకు... ఏదో రూపంలో స్పాన్సర్‌షిప్ అందజేసేందుకు వచ్చిన వారే. దానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను వారు చర్చిస్తున్నారు. మరికొందరు ఆటగాళ్ల బ్రాండింగ్ గురించి, ఇతర ప్రచార కార్యక్రమాల గురించి మాట్లాడాలని ఆశిస్తున్నారు. గోపీచంద్‌కు ఇటీవల ఇది రొటీన్‌గా మారిపోయింది. రియో ఒలింపిక్స్‌లో సింధు రజతం నెగ్గిన తర్వాత ఇలాంటి వాటి కోసం ఆయన ప్రత్యేకంగా సమయం కేటాయించాల్సి వస్తోంది.

ఒకప్పుడు ఇదే అకాడమీ నిర్మాణం కోసం సహకారం కావాలంటూ ఆయన ఎక్కని, దిగని మెట్టు లేదు. అడగని కార్పొరేట్ సంస్థ లేదు. ఒక రకమైన లెక్కలేనితనంతో చిన్న చూపు చూసినవారు కొందరైతే... అసలు బ్యాడ్మింటన్‌ను ఎవరు పట్టించుకుంటారంటూ మొహం మీదే అనేసిన వారు మరెందరో. అయితే వారి మాటలు గోపీచంద్ లక్ష్యాన్ని మార్చలేదు. చాంపియన్లను తయారు చేయాలన్న తన పట్టుదల ముందు అవన్నీ చిన్న చిన్న విఘ్నాలుగా కనిపించాయే తప్ప... మనకెందుకులే ఇదంతా అంటూ కాడి పడేయాల్సినంతగా భయపెట్టలేదు. కష్టాలు, సమస్యలు ఎన్ని చెప్పకున్నా... చివరకు ఫలితాలతోనే తనను ప్రపంచం అంచనా వేస్తుందని ఆయనకు బాగా తెలుసు. అందుకే వెనకడుగు వేయలేదు. ఒక్కో అడుగు వేసుకుంటూ తన కలను నిజం చేసుకున్నారు. అకాడమీ నుంచి అత్యుత్తమ ఆటగాళ్లను తయారు చేయడంలో విజయవంతమయ్యారు.

సైనా నెహ్వాల్, పీవీ సింధు, పారుపల్లి కశ్యప్, కిడాంబి శ్రీకాంత్, గురుసాయిదత్, సాయిప్రణీత్, సిక్కి రెడ్డి... ఈ జాబితా ఇంతటితో ఆగిపోలేదు. రుత్విక శివాని, మేఘన, రాహుల్ యాదవ్... తదితరులు దీనికి కొనసాగింపు... గాయత్రి, సామియా, విష్ణు...ఇది రాబోయే విజేతల వరుస... ఒకరా, ఇద్దరా బ్యాడ్మింటన్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తున్న వారిలో ఎక్కువ మంది గోపీచంద్ అకాడమీ నుంచి వచ్చినవారే. భారత బ్యాడ్మింటన్‌కు కేంద్రంగా మారిన ఈ అకాడమీపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్....

మొహమ్మద్ అబ్దుల్ హాది

గోపీచంద్ 2004 నవంబర్‌లో ఆటగాడిగా ఆఖరి సారిగా ఒక అంతర్జాతీయ టోర్నమెంట్ బరిలోకి దిగారు. హైదరాబాద్‌లోనే జరిగిన ఆసియా శాటిలైట్ టోర్నీలో విజేతగా నిలిచారు. అప్పటికే వరుస గాయాలకు పదే పదే జరిగిన శస్త్ర చికిత్సల తర్వాత పునరాగమనంలో గెలిచిన టైటిల్ అది. ఈ విజయం తర్వాత ప్రధాన టోర్నీలలో మళ్లీ గెలవడం సాధ్యం కాదని ఆయనకు అర్థమైంది. దాంతో ప్లేయర్‌గా కెరీర్ ముగిసింది.

అదీ ఆరంభం...

2001లో గోపీచంద్ ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌గా నిలిచే సమయానికి భారత్‌లో బ్యాడ్మింటన్‌కు సౌకర్యాల పరంగా అనుకూల వాతావరణం ఏమీ లేదు. తర్వాతి మూడేళ్లలో కూడా పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. హైదరాబాద్‌లో కూడా ఎల్బీ ఇండోర్ స్టేడియం మినహా మరో చెప్పుకోదగ్గ వేదిక లేదు. ఇలాంటి స్థితిలో ఆడిన గోపీచంద్... మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే ఇంకా ఎక్కువ మంది బ్యాడ్మింటన్‌లో వెలుగులోకి రావొచ్చని నమ్మారు. అదే ఆలోచనతో కోచ్‌గా మారి బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

ప్రభుత్వ సహకారంతో...

2004లోనే అప్పటి 'శాప్' మేనేజింగ్ డైరెక్టర్ సుమితా దావ్రా చొరవ చూపించి రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గోపీచంద్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు అనుమతినిచ్చారు. దీని నిర్వహణ కోసం ప్రభుత్వం వైపు నుంచి ఏడాదికి రూ. 10 లక్షల చొప్పున ఇచ్చేందుకు కూడా అంగీకరించారు. ఇందులో పెద్ద మొత్తం ఇండోనేసియా కోచ్‌కే చెల్లించాల్సి వచ్చేది. కొంత మంది వర్ధమాన షట్లర్లు, కొత్తవారితో కలిసి 30 మందితో అకాడమీ ప్రారంభమైంది. సంవత్సరం పాటు ప్రభుత్వ నిధులతో అకాడమీ నడిచింది. కానీ ఆ తర్వాత ఆ మొత్తాన్ని కొనసాగించేందుకు వేర్వేరు కారణాలతో ప్రభుత్వం ఆసక్తి చూపించలేదు. దాంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఈ దశలో గోపీచంద్ సొంత డబ్బులతోనైనా అకాడమీని నడిపించాలని పట్టుదల ప్రదర్శించారు. 2008 వరకు సొంత డబ్బును ఎక్కువ మొత్తంలో ఖర్చు పెట్టాల్సి వచ్చింది.

అత్యుత్తమంగా...

ప్రపంచ స్థాయి కోర్టులు, శిక్షణ, జిమ్, ఫిజియోలు, డైటింగ్... ఇలా ప్రతీ అంశంలో గోపీచంద్ అకాడమీ సౌకర్యాలపరంగా 'ది బెస్ట్'గా నిలుస్తుంది. పదేళ్ల వయసు ఉన్న చిన్నారుల నుంచి రియో ఒలింపిక్స్ రజత పతక విజేత పీవీ సింధు వరకు ప్రస్తుతం అందరికీ ఇక్కడ శిక్షణ కొనసాగుతోంది. 2008లో ఏర్పాటైన అకాడమీకి తోడు అవుటర్ రింగ్‌రోడ్ జంక్షన్ సమీపంలో 2016లో భారత క్రీడా ప్రాధికార సంస్థ సహకారంతో గోపీచంద్ రెండో అకాడమీ కూడా ఏర్పాటైంది. రెండు అకాడమీల్లో కలిపి 150 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ఆటగాళ్లందరినీ మొత్తం 6 గ్రూప్‌లుగా విభజించారు. సింధు, శ్రీకాంత్ తదితర ఆటగాళ్ల కోచింగ్ గోపీ పర్యవేక్షణలోనే జరుగుతుంది. గోపీ కాకుండా మరో 15 మంది కోచ్‌లు పని చేస్తున్నారు. వీరంతా మిగతా గ్రూప్‌లలోని ఆటగాళ్లకు కోచింగ్ ఇస్తారు.

నోయిడాలో కూడా...

హైదరాబాద్‌లో గోపీచంద్ అకాడమీ సూపర్ సక్సెస్ తర్వాత దేశవ్యాప్తంగా కూడా తమ వద్ద అలాంటి అకాడమీలు ఏర్పాటు చేయాలని, ఎంత డబ్బయినా వెచ్చిస్తామని ఆయనకు అనేక ఆఫర్లు వచ్చాయి. అయితే అందులో చాలా వాటిని గోపి తిరస్కరించారు. 'వీళ్లంతా ఇలా పెట్టుబడి పెట్టగానే అలా లాభం మొదలు కావాలని భావించేవాళ్లే. క్రీడల్లో అది సాధ్యం కాదు. దానిని పక్కా వ్యాపార దృష్టితో వారు చూశారు. అందుకే అంగీకరించలేదు' అని గోపీచంద్ చెప్పారు. తన ఆలోచనలకు తగినట్లుగా, కేవలం మంచి ఫలితాలు రావాలనే నమ్మకంతో ముందుకు వచ్చిన వారితో కలిసి న్యూఢిల్లీ సమీపంలోని నోయిడాలో ఆయన అకాడమీని ఏర్పాటు చేశారు. గోపీచంద్ పేరును జోడిస్తూ గ్వాలియర్, వడోదర, తణుకు, సేలంలలో కూడా అకాడమీలు ఉన్నా... వాటిలో ఆయన భాగస్వామ్యం లేదు. అవసరమైనప్పుడు ఆయన తగిన మార్గనిర్దేశనం చేస్తుంటారు.

లండన్ ఒలింపిక్స్ తర్వాతే

2008లో అకాడమీ ప్రారంభమైనా నిర్వహణ కోసం చెప్పుకోదగ్గ మద్దతు లభించలేదు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో సైనా నెహ్వాల్ కాంస్య పతకం సాధించడంతో ఒక్కసారిగా పరిస్థితి మారింది. ఇక్కడ మెరికల్లాంటి షట్లర్లను తయారు చేసే అవకాశం ఉందని అంతా గుర్తించారు. భవిష్యత్తు విజయాల్లో తాము కూడా భాగం కావాలని అనేక కంపెనీలు భావించాయి. ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ కూడా ఆ తర్వాత భాగంగా మారింది. స్వచ్ఛంద సంస్థలు కూడా ఆసక్తి కనబర్చాయి. ఇక స్పోర్ట్స్ అథారిటీ, భారత బ్యాడ్మింటన్ సంఘం రెగ్యులర్‌గా జాతీయ జట్టు శిక్షణ శిబిరాలు ఇక్కడే ఏర్పాటు చేయడంతో అకాడమీకి ఆర్థిక భారం తగ్గింది. ఇక గత ఏడాది 'రియో'లో సింధు పతకం తర్వాతనైతే పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

దీర్ఘకాలిక లక్ష్యాలు...

ఇప్పుడు అకాడమీ నుంచి వరుస విజయాలతో కీర్తి కనకాదులు సొంతం చేసుకుంటున్నవారు ఒక్క రోజులో స్టార్లుగా మారిపోలేదు. ఎన్నో ఏళ్ల శ్రమ, పట్టుదల వాటి వెనక ఉన్నాయి. గోపీచంద్ కూడా అందరికీ ఇదే చెబుతారు. కఠోర ప్రాక్టీస్, సరైన డైట్, రోజువారీ క్రమశిక్షణ... ఈ మూడింటిని ఒక వారమో, నెల రోజులో కాకుండా కనీసం పదేళ్ల పాటు ఒకే తరహాలో కొనసాగించగలవారు మాత్రమే ఆటలోకి అడుగు పెట్టాలి. ఇన్‌స్టంట్‌గా కాకుండా సుదీర్ఘ లక్ష్యాలతో శ్రమిస్తేనే ఫలితాలు ఆశించవచ్చు. అంతే కానీ ఉత్సాహంతో రావడం, కొద్ది రోజులకే ఇంకా చాంపియన్ కావడం లేదని భావిస్తే ఏ అకాడమీ కూడా ఏమీ చేయలేదు అని ఆయన అంటారు.

నిధుల వేటలో...

అకాడమీ నిర్మాణం కోసం అప్పటికే గోపీచంద్‌కు ప్రభుత్వం 5 ఎకరాల స్థలం కేటాయించినా... ఆర్థిక సమస్యలతో అటువైపు దృష్టి పెట్టలేదు. అయితే 2006లో జాతీయ జట్టు చీఫ్ కోచ్‌గా ఎంపికయ్యాక శిక్షణ పరిధి మరింత పెరిగింది. మరోవైపు ప్రభుత్వానికి చెందిన గచ్చిబౌలి అకాడమీలో నిర్వహణ గురించి కొన్ని సమస్యలు తలెత్తాయి. దాంతో అన్ని సౌకర్యాలతో కొత్త అకాడమీని నిర్మించాలని గోపీచంద్ నిర్ణయించుకున్నారు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా అండగా నిలిచేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో అప్పటికి కొద్ది రోజుల క్రితమే కట్టుకున్న ఇల్లును గోపీచంద్ కుదువ పెట్టారు (2012లో ఈ అప్పు తీరింది). అయితే ఆ మొత్తం ఏమాత్రం సరిపోలేదు. చివరకు ప్రముఖ వ్యాపారవేత్త నిమ్మగడ్డ ప్రసాద్ అండగా నిలవడంతో గోపీచంద్ కల సాకారమైంది. ఆయన రూ. 4.5 కోట్లు అకాడమీ కోసం ఇచ్చారు. చివరకు 2008లో నిమ్మగడ్డ ఫౌండేషన్-పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రారంభమైంది. క్రీడా పరికరాల ఉత్పత్తుల్లో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన 'యోనెక్స్' మొదటి నుంచీ అకాడమీకి అండగా నిలుస్తోంది. ఇక్కడి ఆటగాళ్ల శిక్షణ కోసం పెద్ద సంఖ్యలో అవసరమైన షటిల్స్‌ను ఉచితంగా సరఫరా చేయడంతో పాటు గుర్తింపు తెచ్చుకున్న షట్లర్లకు పూర్తి స్థాయిలో కిట్ కూడా అందజేస్తోంది. ఇది తమపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని గోపీచంద్ చెబుతారు. అంతా బాగున్న సమయంలో కొంత మంది తప్పుదోవ పట్టించిన కారణంగా మధ్యలో ఒకసారి భూమి వెనక్కి ఇమ్మంటూ ప్రభుత్వం నుంచి నోటీసు వచ్చింది. దాని కోసం కోర్టులో పోరాడాల్సి వచ్చింది. చివరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి రోజు అధికారికంగా పూర్తి స్థాయిలో అకాడమీ భూమి మా చేతికొచ్చింది. సమస్యలను అధిగమించి దీనిని సమర్థంగా నడిపించడంలో గవర్నర్ నరసింహన్‌తో పాటు ఐఏఎస్ అధికారులు ఎస్పీ సింగ్, ఎల్వీ సుబ్రహ్మణ్యం, కమల్‌వర్ధన్ రావు ఎంతో సహకరించారు అని గోపీచంద్ అన్నారు.



ఒక్క రూపాయి జీతం కూడా తీసుకోలేదు...

'సొంత అకాడమీ ఉంటూ జాతీయ జట్టు చీఫ్ కోచ్‌గా ఎలా పని చేస్తావు' అని చాలా మంది నన్ను ప్రశ్నించారు. నిజానికి అది నాకు ఒక పదవి మాత్రమే. హోదా ఎలా ఉన్నా అత్యుత్తమ ఆటగాళ్లను తయారు చేయడమే నా పని. ఏ అకాడమీ నుంచి ఆటగాళ్లు వచ్చినా చివరకు వారు భారతదేశానికే ప్రాతినిధ్యం వహిస్తారు. దేశం కోసం పతకం గెలుస్తారు. అది ముఖ్యం. అకాడమీ కోచ్, భారత కోచ్ రెండింటినీ నేను సమన్వయపరుస్తూ వెళ్లానే తప్ప ప్రత్యేకంగా సొంత ప్రయోజనాలకు వాడుకోలేదు. అజయ్ జయరామ్ అగ్రశ్రేణి ఆటగాడు. అతను నా అకాడమీలో కాకుండా సొంతంగా ముంబైలో ప్రాక్టీస్ చేసుకుంటాడు. కానీ భారత కోచ్‌గా అతడికి నేను నా వైపు నుంచి పూర్తి స్థాయి సహకారం అందిస్తాను. అంతే గానీ నా అకాడమీ షట్లర్ కాదని నేను భావించను. అన్నింటికి మించి అందరికి తెలియని విషయం ఏంటంటే నేను గత 11 ఏళ్లలో భారత కోచ్ హోదాలో ఒక్క రూపాయి కూడా జీతం తీసుకోలేదు. ఇండియన్ ఆయిల్‌లో ఉద్యోగిగా నాకు వచ్చే జీతం, నా భార్య లక్ష్మి జీతంతో పాటు మా నాన్నగారి ఆదాయాన్ని మేం పూర్తిగా వాడుకున్నాం. సరిగ్గా చెప్పాలంటే ఇప్పుడు గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందుతున్న వారిలో 70 శాతం మంది నుంచి నేను ఎలాంటి ఫీజులు తీసుకోవడం లేదు. కార్పొరేట్లు ఇచ్చే సహకారంతోనే దానిని భర్తీ చేస్తున్నాను. అకాడమీ నిర్వహణ అనేది నాకు ఎప్పుడూ ఆదాయ వనరు కాదు. అలా ఆలోచించి దీనిని మొదలు పెట్టలేదు.

ఆయన పిల్లలు కూడా...

తల్లిదండ్రుల బాటలోనే గోపీచంద్, లక్ష్మిల ఇద్దరు పిల్లలు కూడా బ్యాడ్మింటన్‌పైనే దృష్టి పెట్టారు. ఇతర ట్రైనీలతో పాటు వీరిద్దరు కూడా అకాడమీలోనే శిక్షణ తీసుకుంటున్నారు. నిబంధనల విషయంలో వారికీ ఎలాంటి వెసులుబాటు ఉండదని గోపి చెప్పారు. కూతురు గాయత్రి జాతీయ స్థాయిలో ఇప్పటికే అనేక టైటిల్స్ సాధించి తన ప్రత్యేకత ప్రదర్శించగా... కుమారుడు సాయి విష్ణు కూడా అదే బాటలో ఉన్నాడు.



గాయత్రి



విష్ణు



ప్రపంచంలో నంబర్‌వన్...

గోపీచంద్ అకాడమీ నుంచి పెద్ద ఎత్తున ఆటగాళ్లు వెలుగులోకి వచ్చారు. సైనా నెహ్వాల్, పీవీ సింధులు ఒలింపిక్ పతకాలతో చెలరేగితే... మిగతా వారంతా అనేక పెద్ద స్థాయి అంతర్జాతీయ టోర్నీలలో విజేతలుగా నిలిచి సత్తా చాటారు. ఈ విజయాల వరుసకు బ్రేక్ రాకుండా గోపీచంద్ జాగ్రత్త తీసుకుంటారు. అగ్రశ్రేణి ఆటగాళ్ల శిక్షణపైనే పూర్తిగా దృష్టి పెట్టకుండా తర్వాతి స్థాయి బృందంపై ఆయన ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. ఒక వేళ సీనియర్లు విఫలమైనా ఆ లోటు కనిపించకుండా... తర్వాతి వారు దానిని అందుకునే విధంగా వారికి కోచింగ్ ఇస్తారు. దాని వల్ల మళ్లీ అండర్-13 నుంచి సీనియర్ విభాగం వరకు ఎక్కడా విజయాలకు విరామం లభించదు. చైనాలో 50 అకాడమీలు ఎంతో మంది ఆటగాళ్లను తయారు చేస్తున్నాయి. కానీ ఒకే అకాడమీ నుంచి ఇంత పెద్ద సంఖ్యలో అంతర్జాతీయ షట్లర్లు రావడం ఎక్కడా జరగలేదు. సౌకర్యాలు, ఫలితాలపరంగా ప్రపంచంలోనే మా అకాడమీ నంబర్‌వన్ అని గట్టిగా చెప్పగలను. ఆ విషయంలో నేను గర్వపడుతున్నాను అని గోపీచంద్ చెబుతారు.

తొక్కిస్తున్నారు

చవకగా... తేలికగా ✦ వాహనంతో దాడులకు ఉగ్రసంస్థల మొగ్గు

'సాధ్యమైనంత ఎక్కువగా ప్రాణనష్టం కలిగించడం... అదీ పెద్దగా వ్యూహరచన అవసరం లేకుండా, అత్యంత చవకగా' అనేది ఇప్పుడు ఉగ్ర సంస్థల లక్ష్యంగా మారింది. ఒకప్పుడు ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి, ఎంతోమందిని దాడిలో భాగస్వాములను చేసి... రెక్కీలు నిర్వహించి, పక్కా ప్రణాళికతో దాడులు చేసి విధ్వంసం సృష్టించేవారు. ఎక్కడ, ఏ రోజు, ఏ సమయానికి దాడికి తెగబడాలనే దాన్ని ముందే నిర్ణయించుకునే వారు. భారీ ప్రాణనష్టం కలిగించడం ద్వారా పాశ్చాత్యులను భయభ్రాంతులకు గురిచేసేవారు. కానీ ఇప్పుడు పంథా మారింది. ఓ పికప్ (సరుకు రవాణా) వాహనాన్ని అత్యంత వేగంగా నడుపుతూ జనాన్ని తొక్కించడమే. ఉగ్రవాద సంస్థలు ఈ తరహా దాడులకు మొగ్గడం వెనుక పలు అనుకూలతలు ఉన్నాయి. బార్సిలోనా దాడి నేపథ్యంలో అవేమిటో చూద్దాం...

కనిపెట్టే అవకాశం ఉండదు...

రైళ్లలో, బస్సుల్లో, స్టేడియాల్లో లేదా ఇతర జనసమ్మర్థ ప్రాంతాల్లో బాంబులు పెట్టాలంటే... వాటిని గుట్టుగా రవాణా చేయాలి. విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, సినిమా హాళ్లు, షాపింగ్ మాల్స్ లాంటి చోట్ల మెటల్ డిటెక్టర్లు, సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా ఉంటుంది. కాబట్టి బాంబులను అనుకున్న చోటకు చేర్చడం కష్టం. మానవ బాంబులుగా మారి దాడి చేద్దామన్నా ఇదే పరిస్థితి. పైగా బాంబులను తయారుచేయడం, రవాణా... రిస్క్‌తో కూడుకున్నవి. ఏమాత్రం తేడా వచ్చినా... పేలిపోతారు.

కుట్ర భగ్నం చేయడం కష్టం...

సాధారణంగా నిఘా వ్యవస్థలు ఉగ్ర కదలికలపై గట్టి నిఘా పెడతాయి. ఇంటర్నెట్‌పై, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే సంభాషణలపై కన్నేసి ఉంచుతాయి. ఫోన్ సంభాషణలపైనా నిఘా ఉంటుంది. ఆధునిక భద్రతా వ్యవస్థల కళ్లుగప్పి... ఐసిస్ ఆక్రమిత ప్రాంతం నుంచి యూరోప్ దేశాల్లోని తమ సానుభూతిపరులతో, ఉగ్రవాదులుగా మారిన వారితో సంప్రదింపులు జరపడం అంత తేలిక కాదు. ఇలా ప్రయత్నించే సందర్భాల్లో పలు ఉగ్రకుట్రలు భగ్నమవుతుంటాయి. అదే సానుభూతిపరులను ఒంటరిగా వాహనదాడులకు ప్రేరేపిస్తే... ఎలాంటి అవరోధాలు లేకుండా పని ఇట్టే పూర్తయిపోతుంది. భారీ ప్రాణనష్టం ద్వారా... విపరీతమైన ప్రచారం లభిస్తుంది. ఉగ్ర సంస్థల లక్ష్యం తేలికగా నెరవేరుతుంది. అందుకే ఉగ్ర సంస్థలు తమ మాధ్యమాల ద్వారా ఇలా ఒంటరిగా దాడులు చేసే వారిని అమరయోధులుగా కీర్తిస్తూ ఆకాశానికెత్తుతున్నాయి. తద్వారా మరింత మందిని ఈ దిశగా ప్రేరేపించే ప్రయత్నం చేస్తున్నాయి.

శిక్షణ అక్కర్లేదు...

ఉగ్రసంస్థలు తాము రిక్రూట్ చేసుకునే వారిని... తమ అనుకూల ప్రాంతాలకు రప్పించి శిక్షణ ఇస్తుంటాయి. తుపాకీ కాల్చడం, బాంబుల తయారీ, ఎవరికీ అనుమానం రాకుండా పనిచేసుకుపోవడం, కోడ్ భాష తదితర అంశాల్లో శిక్షణ ఇస్తుంటాయి.

చవక... తేలిక

బాంబుదాడుల్లో ఎన్నో వ్యయప్రయాసలుంటాయి. అదే పికప్‌తో చేసే దాడి చాలా చవక. చేయాల్సిందల్లా ఓ వాహనాన్ని అద్దెకు తీసుకోవడం. జనంతో కిటకిటలాడే ప్రదేశానికి వెళ్లి విచక్షణారహితంగా వాహనాన్ని నడిపి భీభత్సాన్ని సృష్టించడం. ఖర్చు పరంగా ఇది చాలా చవక, అమలుపరంగా అత్యం త తేలిక. ఒకవేళ ముందుజాగ్రత్తగా ఇలాంటి వాహనాలను తనిఖీ చేసినా... నడుపుతున్న వ్యక్తి ఉద్దేశాన్ని పసిగట్టడం అసాధ్యం.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్



ఎలా మొదలైంది...

పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో శత్రు శిబిరంలోకి చొచ్చుకెళ్లి పేల్చివేయడం... చాలా కాలంగా ఉంది. కానీ వాహనంతో గుద్దిచంపడాన్ని 2008లో ఇజ్రాయిలీలపై దాడికి పాలస్తీనియన్లు తొలుత ప్రారంభించారు. తర్వాత అల్‌ఖైదా, ఐసిస్‌లు వ్యతిరేకులపై దాడికి దీన్నో సమర్థ ఆయుధంగా వాడొచ్చని గుర్తించి ప్రచారం ప్రారంభించాయి. 2014లో ఐసిస్ మీడియా గ్రూపు ఎనిమిది నిమిషాల వీడియోను విడుదల చేసింది. పాశ్చాత్యులను, ఇస్లాంను అనుసరించని వారిని భయభ్రాంతులకు గురిచేయండి. ఎప్పుడేం జరుగుతుందోననే భయంతో వారికి నిద్ర కూడా పట్టకూడదు. మనవారి కోసం పోరాడటానికి సిరియా, ఇరాక్‌లకు రానక్కర్లేదు. మీరున్న చోటే... మీ కార్లను ఆయుధాలుగా వాడండి. జనాన్ని కార్లతో తొక్కిచంపండి' అని ఇందులో ఐసిస్ పిలుపిచ్చింది. తర్వాత ఈ తరహా దాడులు పెరిగాయి.



వాహన దాడులు..

డిసెంబర్ 2014: ఫ్రాన్స్‌లోని నాంతెస్‌లో వ్యాన్, డిజాన్‌లో కారుతో ఢీకొట్టిన ఘటనల్లో 20 మంది గాయపడ్డారు.

జూలై 14, 2016: ఫ్రాన్స్‌లోని నైస్‌లో ఉగ్రవాది భారీట్రక్కుతో జనంపైకి దూసుకెళ్లి ఏకంగా 86 మంది చావుకు కారణమయ్యాడు. వందమంది పైచిలుకు క్షతగాత్రులయ్యారు.

డిసెంబర్ 19, 2016: బెర్లిన్‌లోని క్రిస్మస్ మార్కెట్లోకి ట్రాక్టర్ ట్రైలర్‌ను నడిపి అనిస్ అమ్రీ (ట్యునీషియా) 12 మంది అమాయకులను పొట్టనబెట్టుకున్నాడు. ఘటన జరిగిన నాలుగురోజులకు అమ్రీని కాల్చిచంపారు.

మార్చి 22, 2017: లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ బ్రిడ్జిపై నడిచి వెళుతున్న పాదచారులపైకి ఎస్‌యూవీని నడిపి నలుగురిని చంపిన ఖాలిద్ మసూద్... తర్వాత కిందకు దిగి ఓ పోలీసు అధికారిని పొడిచి చంపాడు. చివరకు భద్రతా బలగాలు అతన్ని కాల్చి చంపాయి.

ఏప్రిల్ 7, 2017: స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో ఓ ఫుట్‌పాత్‌పైకి ట్రక్కును నడిపి ఐదుగురిని పొట్టనబెట్టుకున్నాడు ఉజ్బెకిస్థాన్‌కు చెందిన రఖ్‌మత్ అకిలోవ్.

జూన్ 3, 2017: లండన్ బ్రిడ్జిపై పాదచారులపైకి వ్యాన్‌ను నడిపి... తర్వాత దారినే పోయేవారిని కత్తులతో పొడిచారు తీవ్రవాదులు. దాడిలో ఎనిమిది మంది మృతి చెందారు.

జూన్ 19, 2017: లండన్ మసీదులో ప్రార్థనకు వచ్చిన వారిపైకి డారెన్ ఓస్బోర్న్ అనే వ్యక్తి వ్యాన్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, 11 మంది గాయపడ్డారు.

ఆగస్టు 17, 2017: బార్సిలోనాలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో జనంపైకి ఓ వ్యాన్ దూసుకెళ్లింది. 13 మంది మృతి చెందగా, 100 మంది దాకా గాయపడ్డారు.



మళ్లీ జాత్యహంకార ఆగడాలు!

శ్వేతజాతీయవాదుల హింస అమెరికాను మళ్లీ కలవరపెడుతోంది. కిందటి శనివారం వర్జీనియా రాష్ట్రంలోని షార్లట్స్‌విల్ నగరంలో తెల్లజాతి అమెరికన్ల దాడుల్లో ప్రాణనష్టం జరగడంతోపాటు వారి నిరసన ప్రదర్శనలు ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. దీంతో అన్ని రంగుల జాతుల ప్రజలకు 'అవకాశాల స్వర్గధామం'గా పరిగణించే దేశంలో జాతుల సహజీవనం ప్రమాదంలో పడిందనే అభిప్రాయం నెలకొంది. షార్లట్స్‌విల్ హింసలో ముగ్గురు మరణించారు. 34 మంది గాయపడ్డారు. శ్వేతజాత్యహంకారుల దాడులను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించకుండా హింసకు అన్ని వర్గాలదీ బాధ్యత అన్నట్టు మాట్లాడటం కూడా అమెరికా ఉదారవాదాన్ని నమ్మే ప్రజాస్వామ్యవాదులకు మింగుడు పడటంలేదు. 2008 నవంబర్ అధ్యక్ష ఎన్నికల్లో నల్లజాతికి చెందిన బరాక్ ఒబామా విజయంతో దేశంలో జాతివివక్ష అంతమైందనే వాదనను తెల్లజాతి మేధావులు ముందుకు తెచ్చారు. వాస్తవానికి రంగు, జాతి వంటి అంశాలకు అతీతంగా అందరికీ సమాన హక్కులు అందించే ప్రక్రియ ముందుకుసాగడం వారికి ఇష్టంలేదు. అనేక రంగాల్లో శ్వేతజాతేతరులు రాణించడం, పరిమిత సంఖ్యలోనైనా కీలక పదవులు చేపట్టడం, ఆసియా దేశాల నుంచి పెద్ద సంఖ్యలో అమెరికాలోకి వలసలు పెరగడం–వీటన్నిటికి తోడు ఆర్థికసంక్షోభం చుట్టుముట్టడంతో తమ దేశంలో తమకే అన్యాయం జరుగుతోందన్న భావన తెల్లజాతి అమెరికన్లలో బలపడింది.

ఒబామా గెలుపుతో పెరిగిన హింస!

2009 జనవరిలో ఒబామా పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచీ నల్లజాతివారిపై దాడులు పెరిగాయి. అన్నిటికన్నా పెద్ద హత్యాకాండ 2015 జూన్‌లో సౌత్‌కరోలినా రాష్ట్రంలోని చార్లెస్టన్‌లో జరిగింది. ఇక్కడ ఆఫ్రికన్ అమెరికన్లు అధికంగా ఉండే చర్చిపై డిలన్ స్టామ్ రూఫ్ అనే యువకుడు విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో 9 మంది నల్లజాతివారు మరణించారు. ఏడాదిన్నర విచారణ తర్వాత శ్వేతజాత్యహంకార గ్రూపునకు చెందిన తీవ్రవాదిగా భావిస్తున్న రూఫ్‌కు కోర్టు మరణశిక్ష విధించింది. 2044 నాటికి అమెరికాలో తెల్లజాతి అల్పసంఖ్యాకవర్గంగా (జనాభాలో ఇప్పుడున్న 69 శాతం నుంచి 50 శాతం దిగువకు) మారిపోతుందనే అంచనాలతోపాటు, 21వ శతాబ్దంలో పెరిగిన శ్వేతజాతేతర ప్రజల వలసలు తెల్లజాతి అమెరికన్లను 2016 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు మద్దతు పలికేలా చేశాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చినాగాని తెల్లజాతివారంతా కలిసి లేరనే భావనతో వారందరినీ ఏకంచేయాలనే లక్ష్యంతో శ్వేతజాతీయవాదులు షార్లట్స్‌విల్ వేదికగా ఉద్యమాన్ని ప్రారంభించారు. 19వ శతాబ్దంలో జరిగిన అమెరికా అంతర్యుద్ధంలో బానిస వ్యవస్థ రద్దును వ్యతిరేకించిన కాన్ఫెడరేట్ శక్తుల నేతలే... ఇప్పటి క్లూక్లక్స్ క్లాన్, నయా నాజీలు వంటి శ్వేతజాత్యాంహకార గ్రూపులకు ఆరాధ్య దైవాలుగా మరారు. సమానత్వానికి, మానవత్వానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకులైన ఈ కాన్ఫెడరేట్ సేనల నేతల విగ్రహాలు, స్మారకచిహ్నాలు తొలగించడాన్ని ఈ శ్వేతజాత్యహంకారులు పెద్ద పాపంగా పరిగణించి దాన్ని వ్యతిరేకిస్తున్నారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

శ్వేతజాత్యహంకారవాదులు ఎంత మంది?

అమెరికా తెల్లజాతివారిదనే వాదనకు శతాబ్దాల చరిత్ర ఉన్నా ఈ సిద్ధాంతాన్ని బలపరిచే గ్రూపుల సంఖ్యను ఖచ్చితంగా అంచనావేయడం కష్టం. దేశంలో ఇలాంటి అతివాద, జాత్యాహంకార సంస్థలు 1600 వరకు ఉన్నాయని అమెరికా పౌర హక్కుల సంస్థ సదరన్ పోవర్టీ లా సెంటర్ అంచనావేసింది. 1865 అంతర్యుద్ధంలో బానిసత్వం రద్దుకు వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాల కాన్ఫెడరేట్ సైన్యంలో పనిచేసిన శ్వేతజాతి మాజీ సైనికాధికారులు క్లూక్లక్స్‌క్లాన్ (కేకేకే) పేరుతో తొలి రహస్య సంస్థను స్థాపించారు. తర్వాత ఇది దేశవ్యాప్తంగా విస్తరించింది. దీని నుంచే అనేక శ్వేతజాత్యహంకార గ్రూపులు పుట్టుకొచ్చాయి. ఈ గ్రూపుల్లో మొత్తం సభ్యులు ఐదు వేల నుంచి 8 వేల మధ్య ఉంటారని అంచనా. ఆర్థిక జాతీయవాదం, స్థానిక అమెరికన్ల ప్రయోజనాలకు మద్దతుగా మాట్లాడే ట్రంప్ విజయం సాధించాక తమ సంస్థలో సభ్యులుగా చేరేవారి సంఖ్య విపరీతంగా పెరిగిందని కేకేకే 2016లో ప్రకటించింది. షార్లట్స్‌విల్‌లో కాన్ఫెడరేట్ సేనాని రాబర్ట్ లీ విగ్రహం తొలగింపునకు నిరసనగా శ్వేతజాతివారందరినీ ఏకం చేయడానికి ఈ నెల 12న జరిగిన ర్యాలీ, దానికి పోటీగా జరిపిన ప్రదర్శన (విగ్రహం తొలగింపును సమర్థిస్తూ)తో హింస చెలరేగింది. ఇది ఇతర ప్రాంతాలకు విస్తరించటం కలవరపాటుకు గురిచేస్తోంది. తెల్లజాతివారి ఆధిపత్యానికి చిహ్నంగా భావించే కాన్ఫెడరేట్ శక్తులకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తుల, సంస్థల విగ్రహాలు, స్మారకచిహ్నాలు బహిరంగ ప్రదేశాల్లో దేశవ్యాప్తంగా 1500కు పైగా ఉన్నాయి. వీటి తొలగింపునకు లిబరల్స్ పట్టుబడుతుంటే శ్వేతజాతీయవాదులు వారిని ప్రతిఘటిస్తున్నారు.

మాటిచ్చారు.. వదిలేశారు..

హామీలకు విలువెక్కడ?



హోరాహోరీగా జరుగుతున్న నంద్యాల ఉప ఎన్నికపై అందరి దృష్టి కేంద్రీకృతమయ్యింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ మూడేళ్లలోనే నెరవేర్చేశామని, నంద్యాలను కూడా అభివృద్ధి బాట పట్టించామని అధికారపక్షం ఢంకా భజాయించి చెప్పుకుంటోంది. అయితే ఏ ఒక్క హామీనీ నెరవేర్చకపోగా మూడేళ్లలో ఎన్నో అబద్ధాలు, మోసాలతో నారావారి సర్కార్ నెట్టుకొస్తున్నదని ప్రతిపక్షం విమర్శిస్తోంది. అబద్ధాలలో డిగ్రీ ఏదయినా ఉందంటే అది చంద్రబాబుకే ఇవ్వాలని ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎద్దేవా చేస్తున్నారు. 'రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి వంటి ప్రధానమైన హామీలను అటకెక్కించి అందరినీ మోసం చేసిన చంద్రబాబు కేంద్రానికి పాదాక్రాంతమై ప్రత్యేక హోదానూ తుంగలో తొక్కారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 608 హామీలకు, అన్నిజిల్లాలకు అసెంబ్లీ సాక్షిగా చేసిన వాగ్దానాలకు దిక్కులేదు. ఇక జిల్లాలలో పర్యటనల సందర్భంగా ఇచ్చిన హామీలైతే లెక్కేలేదు. ఇలాంటి వ్యక్తిని ఎలా విశ్వసిస్తారని, నమ్మి ఎలా ఓటేస్తారు?' అని ప్రతిపక్షనేత ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఎన్నో హామీలిచ్చారు. రైతులకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని మాట తప్పారు. రైతులనే కాదు, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలను వదిలిపెట్టలేదు. డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని హామీయిచ్చి మోసం చేశారు. జాబు రావాలంటే బాబు రావాలన్నారు. నిరుద్యోగులకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. 36 నెలల్లో ప్రతి ఇంటికి చంద్రబాబు రూ. 72 వేలు బాకీ ఉన్నారు. బెల్టు షాపులు తొలగిస్తానని చెప్పి, ఊరూరా వాటి సంఖ్యను పెంచారు. అందుకే చంద్రబాబు ఇచ్చిన హామీలపై మేధావులు, రాజకీయ విశ్లేషకుల, ప్రజాస్వామికవాదుల మధ్య చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాల పర్యటనలో చంద్రబాబు ఏం హామీలిచ్చారు? వాటి పరిస్థితి ఏమిటనేది ముందుగా పరిశీలిద్దాం...

1 నెల్లూరు జిల్లా



1. పెన్నా బ్యారేజీ నిర్మాణం 2015 కల్లా పూర్తిచేయడం (2015 అక్టోబర్‌లో నెల్లూరు జిల్లా పర్యటన సందర్భంగా) – **పనుల్లో ఎలాంటి పురోగతీ లేదు..**
2. సంగం బ్యారేజీ నిర్మాణం 2016 కల్లా పూర్తి చేయడం (2015 జూన్‌లో జిల్లా పర్యటన సందర్భంగా) – **డిజైన్ల మార్పు, ఇతర గందరగోళాలు.. పనులు పెండింగ్**
3. కావలి సమీపంలోని దగదర్తిలో విమానాశ్రయం (ఎన్నికల మేనిఫెస్టో) – **ఇంకా భూసేకరణ ప్రక్రియ పూర్తికాలేదు..**
4. కోవూరు చక్కెర కర్మాగారం పునఃప్రారంభం – **ఒక్క అడుగు కూడా పడలేదు..**
5. స్మార్ట్ సిటీగా నెల్లూరు నగరం (2015 ఏప్రిల్‌లో విజయవాడలో నిర్వహించిన వివిధ శాఖల సమావేశంలో)– **డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టులు ఈ ఏడాది మొదలుపెట్టారు..**
6. నగదు రహిత లావాదేవీల గ్రామంగా చెన్నూరు – **చర్యలేవీ చేపట్టలేదు..**
7. చెన్నూరు ప్రాంతంలో పరిశ్రమలు – **ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటుచేయలేదు,..**

2 పశ్చిమగోదావరి జిల్లా



1. తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం, ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం, ఎడ్యుకేషన్ హబ్‌గా గూడెం (2015 ఆగస్టు 20, నిట్ శాశ్వత భవన నిర్మాణ శంకుస్థాపన సందర్భంగా) – **అలాంటి చర్యలేవీ లేవు. ఇంత వరకు భూసేకరణ గానీ, ఇతర పనులు గానీ ఏవీ ప్రారంభం కాలేదు.**
2. ఉభయగోదావరి జిల్లాలను కలుపుతూ గోదావరిపై వంతెన నిర్మాణం (2014 మే 2న నరసాపురంలో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో) నితిన్‌గడ్కరీని కూడా ఒప్పించామని చెప్పారు. **కార్యరూపం దాల్చలేదు.**
3. 2018 చివర నాటికి చింతలపూడి ఎత్తిపోతల పథకం (2016 మార్చి 29న పట్టిసీమ ప్రారంభోత్సవం సందర్భంగా) – **ప్రాజెక్టు భూసేకరణే పూర్తికాలేదు. ఏడాదిన్నరగా పనులు నిలిచిపోయాయి.**
4. స్మార్ట్ సిటీగా ఏలూరు నగరం (2015 జనవరి 1న చాటపర్రులో పర్యటన సందర్భంగా) – **నిధులు లేవు.. పనులూ లేవు..**
5. నరసాపురం తీరంలో ఫిషింగ్ హార్బర్ (2014 మే 2న నర్సాపురం స్టీమర్‌రోడ్‌లో జరిగిన బహిరంగ సభలో) – **ఇంతవరకు ఎలాంటి పనులూ లేవు..**
6. వేల్పూరు గ్రామం వద్ద బైపాస్ నిర్మాణం – **ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.**
7. సత్యవాడ – పైడిపర్రు డ్రైనేజీ డ్రెయిన్ ఆధునీకరణ – కార్యరూపం దాల్చలేదు.. **ఎలాంటి ప్రయత్నాలూ లేవు..**

3 తూర్పుగోదావరి



1. పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) ఆధునీకరణ – **ఎలాంటి ప్రనాళిక, కార్యాచరణ లేవు..**
2. పిఠాపురం, ఏలేరు ఆధునీకరణ – **నిధులు విడుదల చేయలేదు. పనులు నామమాత్రం**
3. సుద్ధగడ్డ ముంపు నుంచి గొల్లప్రోలుకు రక్షణ – **ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ లేవు.**
4. రాజోలు నియోజకవర్గంలోని సఖినేటిపల్లి – నరసాపురం బ్రిడ్జి నిర్మాణం – **ఆ ఊసే లేదు. కనీసం సర్వే చేయించి ఎస్టిమేట్లు కూడా వేయించలేదు..**
5. స్మార్ట్ విలేజిగా రాజోలు నియోజకవర్గంలోని మోరి గ్రామం – **పేరుకు ప్రారంభించారు.. అమలు లేదు..**
6. విలీనమండలాలైన నాలుగు మండలాల్లో 57 ఎత్తిపోతల పథకాలకు మరమ్మతుల కోసం రూ.13 వందల కోట్లు. – **ఇప్పటి వరకు ఒక ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించలేదు.**
7. హేవలాక్ బ్రిడ్జి మొట్టమొదటి రైలు వంతెనను పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్నారు. – **ఇప్పటి వరకు చేయలేదు.**

4 విజయనగరం జిల్లా



1. బొబ్బిలి పరిసర ప్రాంతంలో 8 మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ఆధునీకరణకు రూ.30 కోట్లు (తోటపల్లి నీరు విడుదల సందర్భం గా 2015 ఆగస్టు 9న) – **ఆ హామీ గాలిలో కలసిపోయింది.**
2. గజపతినగరం ప్రాంతంలో గోస్తనీ – చంపావతి నదులతో పాటు నాగావళి–వేగవతి నదుల అనుసంధానం (2016 జనవరి 2 బొండపల్లి జన్మభూమి కార్యక్రమం సందర్భంగా) – **కార్యాచరణ ప్రణాళికేదీ లేదు.**
3. 2015లోనే తారకరామ తీర్థసాగర్ పూర్తి (2014 ఫిబ్రవరి ఎన్నికల సభలో) – **అంచనాలు పెరుగుతున్నాయి తప్ప అడుగు పడలేదు.**
4. వెంగళరాయసాగర్, వట్టిగెడ్డ, పెదంకలాం ఆనకట్టల ఆధునీకరణకు రూ.120 కోట్లు. (తోటపల్లి నీరు విడుదల సందర్భంగా 2015 ఆగస్టు 9న)– **పనులూ లేవు. ప్రతిపాదనలూ లేవు**
5. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో తాగునీటి పైలట్ ప్రాజెక్టు (మే 6 2015 సీతానగరం పర్యటన సందర్భంగా) – **అటకెక్కించారు..**
6. గుర్లలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం (2014 అక్టోబర్ 23 హుదూద్ తుఫాను సమయంలో)–**పనులు మొదలు కాలేదు..**
7. నాలుగులేన్లుగా పెందుర్తి – అరకు రోడ్డు (2015 డిసెంబర్ 5 ఎల్‌కోటలోని జనచైతన్య యాత్రలో)– **ఎలాంటి చర్యలూ లేవు**

5 విశాఖపట్నం జిల్లా

1. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు (2014 ఆగస్టు 8న చోడవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో) – **ఎలాంటి చర్యలూ లేవు.**
2. రూ.300 కోట్లతో అంతర్జాతీయ కన్వెన్షన్‌సెంటర్, మూడు జాతీయ క్రీడా ప్రాంగణాలు (2015 మార్చి 13న ఏడుమిషన్లలో ఒకటైన మౌలిక సదుపాయాల మిషన్‌కు విశాఖలో శ్రీకారం చుట్టిన సందర్భంగా) – **కార్యరూపం దాల్చలేదు..**
3. విశాఖలో గిరిజన యూనివర్సిటీ (2014 ఆగస్టు 9న పాడేరులో పర్యటన సందర్భంగా) – **అమలుకు నోచుకోలేదు.**
4. 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో సిగ్నేచర్ టవర్స్ నిర్మాణం (2014 సెప్టెంబర్ 29న మధురవాడ ఐటీ సెజ్‌లో సన్‌రైజ్ స్టార్టప్ విలేజ్ ప్రారంభం సందర్భంగా) – **అడుగు ముందుకు పడలేదు.**
5. ఐటీ టౌన్‌షిప్, మెట్రో రైల్ నిర్మాణం, బర్డ్స్ పార్కు, బొటానికల్ గార్డెన్, ఓషన్ రివర్, బీచ్ రిసార్ట్స్, సైన్స్ సిటీ. (2014 అక్టోబర్‌లో హుద్‌హుద్ తుపాను సమయంలో విశాఖలో) – **ఎలాంటి చర్యలూ లేవు. అన్నీ మాటలకే పరిమితమయ్యాయి...**
6. భీమిలి – కాకినాడ కారిడార్ పొడవునా తీర రహదారి (2017 డిసెంబర్ 17న జాతీయస్థాయి పారిశ్రామిక సంస్థల సీఈఓల సదస్సులో) – **పట్టించుకున్నదే లేదు..**
7. బిట్స్ పిలానీ, సరళ – బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్ – **అలాంటి ప్రయత్నాలే లేవు..**




6 వైఎస్సార్ జిల్లా



1. చెన్నూరు వద్ద హజ్‌హౌస్ – **శంకుస్థాపన చేశారు.. పనులు నత్తనడకన సాగుతున్నాయి.**
2. పెన్నానదిలో లింగంపల్లె వద్ద రూ.75 కోట్లతో చెక్‌డ్యాం నిర్మాణం (2016 నవంబర్‌లో నవనిర్మాణ దీక్ష సందర్భంగా) – **శంకుస్థాపన చేశారు. ఏడాదిన్నర గడుస్తున్నా సర్వేనేపూర్తికాలేదు.**
3. ఉద్యానవన హబ్‌గా కడప (2015 మేలో కడపలో జరిగిన రైతు ఉపశమన సభలో) – **ప్రతిపాదన దశ దాటిందే తప్ప మంజూరు లేదు.**
4. రైల్వే కోడూరులో మూతపడిన పండ్ల రసాల ఫ్యాక్టరీ పునరుద్ధరణ (2015 జనవరిలో జన్మభూమి సభ సందర్భంగా) – **ఎలాంటి చర్యలూ లేవు.**
5. రైల్వే కోడూరు లేదా రాజం పేట ప్రాంతాల్లో ఉద్యాన యూనివర్సిటీ – **ప్రతిపాదన ముందుకు సాగలేదు.**
6. కమలాపురంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ (2015 ఆగస్టులో జరిగిన బహిరంగ సభలో) – **నెరవేరలేదు.**

7 కృష్ణాజిల్లా



1. వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న జగ్గయ్యపేట పట్టణానికి కృష్ణాజలాలు –**అమలుకు నోచుకోలేదు.**
2. నూజివీడులో ట్రిపుల్ ఐటీకి 60 ఎకరాల స్థలం కేటాయింపు (ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం సందర్భంగా 2015 డిసెంబర్)– అమలుకు నోచుకోలేదు.
3. నాగాయలంక మండలంలోని గుల్లల మోదలో మిసైల్ పార్కు (2014 సెప్టెంబర్ 5) – **మాటలకే పరిమితమయ్యింది**
4. ఆగిరిపల్లిలో ఆయుర్వేద యూనివర్సిటీ (2014 సెప్టెంబర్ 5) – ప్రతిపాదన ముందుకు సాగలేదు.
5. రిజర్వాయర్‌గా బ్రహ్మయ్యలింగం చెరువు (2016 మే 6) – పనులు ప్రారంభం కాలేదు. నీరుచెట్టుపేరుతో అధికారపార్టీ నేతలు మట్టి అమ్ముకున్నారు.
6. తిరువూరు నియోజకవర్గం కాకర్ల అటవీ భూములలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు (మేనిఫెస్టో) – నీటిమూటగా మిగిలింది.

8 అనంతపురం జిల్లా



1. మార్కెట్ సదుపాయాలు కల్పించి హార్టికల్చర్ హబ్‌గా జిల్లా – **ఎలాంటి చర్యలూ లేవు**
2. హిందూపురంలో బసవతారకం కేన్సర్ ఆసుపత్రి – **ఇప్పటి వరకు అతీగతీ లేదు**
3. బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ అమలు – **ఇంత వరకు అమలుకు నోచుకోలేదు**
4. సబ్బుల తయారీ కర్మాగారం – **ఎలాంటి పురోగతీ లేదు**
5. హెచ్ఎల్‌సీ ఆధునీకరణ పూర్తి – **తీసుకున్న చర్యలు నామమాత్రం**
6. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఏర్పాటు – **శంకుస్థాపనతో సరి**

9 చిత్తూరు జిల్లా



1. గద్దెనెక్కిన రెండు నెలల్లో చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ తెరిపించి, రూ.40 కోట్ల నిధులు. (2014 ఏప్రిల్ 30న తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో) – **36నెలలుగా అడుగుముందుకు పడలేదు. కార్మికుల జీతాలూ పెండింగ్‌లోనే..**
2. హంద్రీనీవా పూర్తి చేసి 30 లక్షల ఎకరాలకు నీరు. – **ఇప్పటివరకు సప్లయ్ చానల్స్ కూడా తవ్వలేదు**
3. టీటీడీలో ఖాళీగా ఉన్న 2,700 ఉద్యోగాలు స్థానికులకే.. (2014 ఏప్రిల్ 30న తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో) – **ఇంత వరకు కనీసం నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు..**
4. గాలేరు–నగరి త్వరితగతిన పూర్తి.. (మేనిఫెస్టోలో) – **పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే..**
5. మదనపల్లి ప్రాంతంలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్లు – **ఇంత వరకు ఎలాంటి చర్యలూ లేవు.**
6. శాటిలైట్ సిటీగా, సింగపూర్ సిటీగా కుప్పం – **అభివృద్ధికి ఆమడ దూరంలో కుప్పం. రోజూ 10వేల మంది పొట్టచేతపట్టుకుని బెంగళూరుకు వలస..**
7. విద్యాహబ్‌గా చిత్తూరు – **రెండు కేంద్ర సంస్థలు వచ్చాయి. బిల్డింగ్‌లు నిర్మాణదశలో ఉన్నాయి..**

10 కర్నూలు జిల్లా



కర్నూలుకు కొత్త విమానాశ్రయం, స్మార్ట్ సిటీగా కర్నూలు, ఉర్దూ యూనివర్సిటీ, పారిశ్రామిక వాడ, బెంగళూరు పారిశ్రామిక కారిడార్, ఆదోని, ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ క్లస్టర్లు, అపరెల్ పార్కులు, కోవెల కుంట్లలో సిమెంట్ పరిశ్రమల హబ్, ట్రిపుల్ ఐటీ, స్విమ్స్ తరహాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రైల్వే వ్యాగన్ల మరమ్మతుల కర్మాగారం, మైనింగ్ యూనివర్సిటీ వాగ్దానాలు చేసి మూడేళ్లయినా ఒక్కటీ పూర్తి కాలేదు. ఇవికాక..

1. కేసీ కాలువ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరిచ్చేందుకు తుంగభద్రపై గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం (కర్నూలులో డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ పథకం ప్రారంభం సందర్భంగా 15–08–2014) – **మూడేళ్లయినా అతీగతీ లేదు.**
2. కర్నూలులో హజ్ హౌస్ (జన్మభూమి కార్యక్రమంలో భాగంగా 09–11–2015) – **ఇంత వరకు పట్టించుకున్న పాపాన పోలేదు.**
3. కర్నూలు నగరంలో ఇన్నర్‌రింగ్‌రోడ్ కమ్ ఔటర్ రింగ్ రోడ్డు – **ప్రతిపాదనలే సిద్ధం కాలేదు**
4. కర్ణాటక ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో వేదవతీ నదిపై ఎత్తిపోతల పథకం – **నెరవేరలేదు..**
5. ఆత్మకూరు మండలం సిద్దాపురం చెరువుకు వెలుగోడు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా కోసం ఎత్తిపోతల పథకం పూర్తి – పట్టించుకోలేదు
6. అవుకు రిజర్వాయర్‌లో నాలుగు టీఎంసీల నీటి నిల్వ – అమలుకు నోచుకోలేదు.
7. సీడ్ క్యాపిటల్‌గా నంద్యాల (2014 స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా) – ప్రతిపాదనల దశ కూడా చేరుకోలేదు..
8. నంద్యాలలో రికగ్నయిజ్డ్ డీమ్డ్ యూనివర్సిటీ (2014 స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా) – ఇంత వరకు ఎలాంటి ప్రతిపాదనా సిద్ధం కాలేదు
9. అల్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఏర్పాటు చేసి బిందు సేద్యం అభివృద్ధికి రూ.250 కోట్లు (ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా 13–05–2015) – హామీకే పరిమితమయ్యింది.
10. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పూర్తి– పనులు అసంపూర్తిగానే ఉన్నా ముఖ్యమంత్రి ప్రారంభించేశారు.
11. ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్కు, వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (2014 స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా) – ఆచరణకు నోచుకోలేదు
12. కలమందలపాడుకు హంద్రీనీవా కాలువ నుంచి ఎత్తిపోతల పథకం, బనగానపల్లె నియోజకవర్గంలోని జుర్రేరు రిజర్వాయర్‌కు ఎత్తిపోతల పథకం నిర్మాణం.. (జిల్లాలో తాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బనగానపల్లెలో 20–06–2016) – ఇంత వరకు ప్రతిపాదనలు కూడా లేవు..

11 గుంటూరు జిల్లా



1. ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్, పార్కుల ఏర్పాటు (2016 జనవరి 4న తెనాలి పర్యటన సందర్భంగా) – **శంకుస్థాపనకే పరిమితం**
2. తెనాలి పట్టణం మధ్యగా 4 లేన్ల రహదారి నిర్మాణం (2016 జనవరి 4న తెనాలి పర్యటన సందర్భంగా) – **అతీగతీ లేదు..**
3. వరికపూడిశెల, అణుపు – కొప్పునూరు ఎత్తిపోతల పథకాల పూర్తి (2012 జులై 16న మాచర్ల ఉప ఎన్నికల ప్రచారం సందర్భంగా) – **ఎన్నికల హామీగా మిగిలిపోయింది.**
4. దాచేపల్లి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ. 10 కోట్లు (2016 సెప్టెంబర్ 25న వరదప్రాంతాల్లో పర్యటిస్తూ దాచేపల్లి వచ్చిన సందర్భంగా) – **ఏడాది దాటుతున్నా ఒక్క పైసా కూడా మంజూరు కాలేదు..**
5. సింగపూర్ తరహాలో గుంటూరుకు రాజధాని నగరం హంగులు (2015 అక్టోబర్ 2న గుంటూరులో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో) – **అలాంటివేవీ లేవు.. గుంటూరులో నిరుపేదలకు ఒక్క ఇల్లూ నిర్మించలేదు.**
6. నరసరావుపేట మండలం కాకాని గ్రామం వద్ద జేఎన్‌టీయూకు 86 ఎకరాల స్థలం (2015 డిసెంబర్ 11 కోటప్పకొండకు వచ్చిన సందర్భంగా) – **ఇప్పటివరకు ఎకరం కూడా కేటాయించలేదు.**
7. వేమూరు మండల కేంద్రంలో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం కోసం రూ.5.80 కోట్లు మంజూరు.. (2015 డిసెంబర్ 1న వేమూరులో జనచైతన్య యాత్రలను ప్రారంభిస్తూ) – **ఏడాదిన్నర దాటుతున్నా ఇంత వరకు నెరవేర్చలేదు..**

12 ప్రకాశం జిల్లా




1. హైదరాబాద్ తరహాలో ఒంగోలులో శిల్పారామం, వెటర్నరీ యూనివర్సిటీ (7–10–2014న జన్మభూమి కార్యక్రమంలో) – **ఏవీ నెరవేరలేదు..**
2. దర్శిలో అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ (25–4–2016) – **శిలాఫలకం వేశారు.**
3. బల్లికురవలోని భవనాశి రిజర్వాయర్, యర్రం చినపోలిరెడ్డి రిజర్వాయర్ పనులు పూరి – **ప్రతిపాదన ముందుకు సాగలేదు.**
4. దూపాడు ప్రాజెక్టు ద్వారా రూ.285 కోట్లతో పైప్‌లైన్ వేసి నీరు సరఫరా – **నేటికీ సాకారం కాలేదు.**
5. సోమశిల ఉత్తర కాలువ, రామాయపట్నం పోర్టు, రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు (ఎన్నికల మేనిఫెస్టో) – **ఇందులో ఏవీ నెరవేరలేదు.**
6. ఉద్యానయూనివర్సిటీ, సెంట్రల్ స్కూల్ ఏర్పాటు – **ఆ ఊసే లేదు**
7. 2013లో కొట్టుకుపోయిన 13 చెరువులకు మరమ్మతులు– **అంచనాల దశలోనే ఆగిపోయింది.**

13 శ్రీకాకుళం జిల్లా



1. శ్రీకాకుళం నగరంలో రూ.119 కోట్లతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ (14–2–2015 రైతు చైతన్యసదస్సు) – **ఇప్పటి వరకు అతీగతీ లేదు**
2. ఆమదాలవలస షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తాం. సహకార రంగంలోనే పునః ప్రారంభిస్తాం.(2014 ఎన్నికల ప్రచార సభల్లో) – **కానీ చక్కెర కర్మాగారం భూములు ఏపీఐఐసీకి బదలాయించేశారు.**
3. బీల ప్రాంతంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల అనుమతుల జీవో రద్దు (2010 జులై 14 ఆందోళనకారులపై కాల్పులు జరగడంతో పరామర్శకు వచ్చిన సందర్భంగా) – **బహుళ ఉత్పత్తి పరిశ్రమలు నిర్మించడానికి అదే సంస్థకు అనుమతిస్తూ 329 జీవో**
4. టెక్కలి నియోజకవర్గంలో ఆఫ్‌షోర్ నిర్మాణం – **ఇప్పట్లో కొలిక్కి వచ్చే అవకాశం కనిపించడంలేదు**
5. ఉద్దానం కిడ్నీ రోగులను ఆదుకుంటాం. కిడ్నీ రోగులకు రూ.2,500 పింఛన్ (2017 జులై 18 కేబినెట్ సమావేశంలో) – **కానీ ఎన్టీఆర్ వైద్యసేవ కింద డయాలసిస్ చేయించుకున్నవారికే పింఛన్..**
6. నాగావళి, వంశధార నదీ తీరాల్లో వరదగట్ల నిర్మాణం – **ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..**





అసెంబ్లీలో చెప్పిన మాటలు.. మేనిఫెస్టోలో చేసిన బాసలు రేపటి సంచికలో

ఐబీపీఎస్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్).. 'ప్రొబేషనరీ ఆఫీసర్ (పీఓ)/ మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎంటీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ ద్వారా 20 బ్యాంకుల్లో భర్తీ చేయనున్న మొత్తం ఖాళీల సంఖ్య 3,562. ఈసారి నోటిఫికేషన్‌లో ఐబీపీఎస్ పలు కీలక మార్పులు చేసింది. ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో అక్టోబర్/నవంబర్‌లో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఐబీపీఎస్ పీఓ/ఎంటీ పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..



ఎగ్జామ్ టిప్స్

ఐబీపీఎస్ పీఓ..

విజయానికి మార్గాలు

పీఓ ఎంపిక మూడంచెల్లో చేపడతారు. ప్రిలిమినరీ పరీక్ష (100 మార్కులు)లోని విభాగాలు.. ఇంగ్లిష్ (30), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (35), రీజనింగ్ (35). సమయం గంట. నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందినవారిని మెయిన్స్‌కు పిలుస్తారు. మెయిన్స్ ఆబ్జెక్టివ్ విధానంలో 200 మార్కులకు ఉంటుంది. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ (45 ప్రశ్నలు– 60 మార్కులు); జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ (40 ప్రశ్నలు–40 మార్కులు); ఇంగ్లిష్ లాంగ్వేజ్ (35 ప్రశ్నలు–40 మార్కులు); డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ (35 ప్రశ్నలు–60 మార్కులు). ఇదే దశలోని ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్‌లో లెటర్ రైటింగ్, ఎస్సేకు సంబంధించి 2 ప్రశ్నలు ఉంటాయి. 25 మార్కులకు ఉండే ఈ విభాగాన్ని 30 నిమిషాల్లో పూర్తి చేయాలి. మెయిన్ మార్కుల ఆధారంగా ఇంటర్వ్యూకు పిలుస్తారు. మెయిన్ పరీక్ష, ఇంటర్వ్యూ మార్కుల ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. మెయిన్ పరీక్ష, ఇంటర్వ్యూలకు వరుసగా 80:20 నిష్పత్తిలో వెయిటేజీ ఉంటుంది.

- మొత్తంగా.. 100 మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు.

మారిన మెయిన్ పరీక్ష

- మెయిన్‌లో గతంలో అయిదు విభాగాలు ఉండేవి. ఇప్పుడు నాలుగు చేశారు.
- ఈసారి కంప్యూటర్ నాలెడ్జ్ సెక్షన్‌ను రీజనింగ్‌లో కలిపి కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌గా మార్చారు. గతంలో ఈ విభాగంలో 20 ప్రశ్నలుండేవి.
- గత నోటిఫికేషన్‌లో జనరల్ అవేర్‌నెస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్‌గా ఉన్న విభాగాన్ని.. జనరల్, ఎకానమీ, బ్యాంకింగ్ అవేర్‌నెస్‌గా మార్చారు. అప్పుడు 20 నిమిషాల్లో పూర్తి చేయాల్సిన ఈ విభాగానికి ఇప్పుడు 35 నిమిషాల సమయం కేటాయించారు.
- గతంలో ఇంగ్లిష్ విభాగంలో 40 ప్రశ్నలకు 40 మార్కులు ఇచ్చేవారు. అరగంటలో పూర్తిచేయాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రశ్నల సంఖ్యను 35కు తగ్గించి 40 మార్కులు ఇస్తున్నారు. సమయాన్ని 40 నిమిషాలకు పెంచారు.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌గా పేర్కొన్న సెక్షన్‌ను పూర్తిగా డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ (డీఐ) సెక్షన్‌గా మార్చేశారు. 50 ప్రశ్నలతో 50 మార్కులకు ఉండే ఈ విభాగానికి 40 నిమిషాల సమయం కేటాయించేవారు. ఈ సారి డీఐ విభాగంలో 35 ప్రశ్నలే ఉండనున్నాయి. వీటికి 60 మార్కులు, 45 నిమిషాల సమయం ఇచ్చారు.
- రీజనింగ్‌లో కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌ను చేర్చారు. ఈ రెండు విభాగాల నుంచి 45 ప్రశ్నలు వస్తాయి. ఈ ఒక్క సెక్షన్‌కే గంట సమయం కేటాయించారు.

ప్రిపరేషన్ గైడెన్స్..

మెయిన్ పరీక్ష స్వరూపాన్ని చూసి ప్రశ్నల క్లిష్టత ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కాఠిన్యత అధికంగా, ప్రాబ్లమ్ సాల్వింగ్‌కు ఎక్కువ సమయం తీసుకునే విధంగా ప్రశ్నలు ఉంటాయి.

రీజనింగ్ + కంప్యూటర్ ఆప్టిట్యూడ్

రీజనింగ్, కంప్యూటర్ విభాగాల్లోని 45 ప్రశ్నలకే గంట సమయం ఇస్తున్నారు. మార్కులు కూడా 60 కేటాయించారు. రీజనింగ్‌లో భాగంగా హై లెవల్ పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, స్టేట్‌మెంట్స్– ఆర్గ్యుమెంట్స్, స్టేట్‌మెంట్స్–కోర్స్ ఆఫ్ యాక్షన్, సిలాయిజమ్స్, ఇన్‌ఈక్వాలిటీస్ మొదలైన విభాగాల్లో అత్యంత క్లిష్ట ప్రశ్నలు ఎదురవనున్నాయి. కంప్యూటర్ విభాగం నుంచి సాంకేతిక విజ్ఞానాన్ని పరీక్షించే విధంగా డేటాబేసెస్, నెట్‌వర్క్స్, సెక్యూరిటీ, కమ్యూనికేషన్ సిస్టమ్స్ లాంటి వాటిపై లోతుగా పరీక్షించే వీలుంది. ఎంఎస్ ఆఫీస్, ఆపరేటింగ్ సిస్టమ్స్/సాఫ్ట్‌వేర్ బేసిక్స్, ఇంటర్నెట్, వైరస్/మాల్‌వేర్లు తదితర అంశాలకు సంబంధించిన బేసిక్స్‌ను నేర్చుకోవాలి. షార్ట్‌కట్ కమాండ్స్‌ను తెలుసుకోవాలి. ఈ విభాగంలో ఎక్కువ మార్కులు సాధించాలంటే.. హైలెవల్ రీజనింగ్ ప్రాబ్లమ్స్ సాధన చేయాలి. అనలిటికల్, లాజికల్ స్కిల్స్ పెంచుకునేందుకు ప్రయత్నించాలి. మెయిన్ స్థాయిలో కాకున్నా.. ప్రిలిమినరీలోనూ ప్రశ్నల క్లిష్టత అధికంగా ఉండే అవకాశం ఉంది. రీజనింగ్‌కు సంబంధించి అరేంజ్‌మెంట్స్, స్టేట్‌మెంట్–కన్‌క్లూజన్, కాజ్ అండ్ ఎఫెక్ట్, కోడింగ్–డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సిరీస్, ఆల్ఫాబెట్ టెస్ట్ తదితర అంశాలపై అధ్యయనం తప్పనిసరి. మొదట బేసిక్ కాన్సెప్టులపై పట్టుకు కృషి చేయాలి. తర్వాత హైలెవల్ ప్రశ్నలను, గణాంకాలు ఎక్కువగా ఉండే వాటిని ప్రాక్టీస్ చేయాలి.

ఉపయుక్తంగా ఉండే పుస్తకాలు

- A Modern Approach to Verbal and Non Verbal Reasoning (S.Chand) by R.S.Agarwal.
- A new approach to Verbal and Non Verbal Reasoning (Arihant) by BS Sijwali.
- Analytical Reasoning by MK Pandey.
- Arihant computer awareness.
- lucent's computer

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగం నుంచి ప్రిలిమ్స్‌లో 30, మెయిన్‌లో 35 ప్రశ్నలుంటాయి. మెయిన్‌లో 35 ప్రశ్నలకు 40 మార్కులు, 40 నిమిషాల సమయం కేటాయించారు. ఎక్కువ సమయం ఇచ్చారు కాబట్టి ప్రశ్నల క్లిష్టత క్యాట్ స్థాయిలో ఉండే అవకాశం ఉంది. ఈ విభాగంలో రీడింగ్ కాంప్రెహెన్షన్, జంబుల్డ్ సెంటెన్సెస్, ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, క్లోజ్ ప్యాసేజెస్, ఎర్రర్స్ ఇన్ యూసేజ్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ తదితర అంశాలపై పట్టు సాధించాలి. గ్రామర్ కోసం ఇంగ్లిష్ దినపత్రికలు, ప్రామాణిక పుస్తకాలను ఉపయోగించుకోవాలి. ప్యాసేజ్‌లో ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్‌ను గుర్తించగలగాలి. ఈ పరిజ్ఞానాన్ని బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ప్రీవియస్ పేపర్లలోని ప్రశ్నలకు అన్వయిస్తూ సాధన చేయాలి. బేసిక్ గ్రామర్ అంశాలైన పార్ట్స్ ఆఫ్ స్పీచ్, యాక్టివ్–ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్, ఇన్ డైరెక్ట్ స్పీచ్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ తదితర అంశాల సాధన అవసరం. ఇంగ్లిష్ విభాగానికి మెయిన్ పరీక్షలో డిస్క్రిప్టివ్ పేపర్ కూడా ఉంది కాబట్టి రైటింగ్ స్కిల్స్ పెంచుకోవాలి. అంటే.. ఏకకాలంలో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ అప్రోచ్ మెరుగుపరచుకోవాలి. జనరల్ ఇంగ్లిష్‌పై ప్రత్యేక దృష్టి అవసరం. ఇప్పటివరకు ఎస్‌బీఐ మెయిన్స్‌లో అడిగిన ఎస్సే, లెటర్ రైటింగ్ ప్రశ్నలను సేకరించుకుని సాధన చేయాలి.

ఉపయుక్తంగా ఉండే పుస్తకాలు

- Word Power made Easy By Norman lewis.
- Objective General English By R.S. Aggarwal and Vikas Aggarwal.
- Descriptive General English by S.P. Bakshi and Richa Sharma.
- High School English Grammar by Wren & Martin.

డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్

- ఐబీపీఎస్ పరీక్షలో మొదటిసారిగా డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ అని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రిలిమ్స్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, మెయిన్స్‌లో డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్‌గా పేర్కొన్నారు. మెయిన్ పరీక్షలో ప్రాధాన్యత ఉన్న విభాగం కూడా ఇదే. కేవలం 35 ప్రశ్నలకే 60 మార్కులు కేటాయించడంతో ఒక్కో ప్రశ్నకు 1.7 మార్కులు ఇస్తున్నట్లు లెక్క. ఈ సెక్షన్‌కు 45 నిమిషాల సమయం ఉంది కాబట్టి స్కోరింగ్‌కు ఎక్కువ అవకాశం ఉంటుంది. ప్రశ్నల క్లిష్టత మాత్రం క్యాట్ స్థాయిలో ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్‌గ్రాఫ్, బార్‌గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. ఈ విభాగంలో అధిక స్కోరుకు అర్థమెటిక్ ప్రాథమిక అంశాలపై సంపూర్ణ పట్టు ఉండాలి. డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ విభాగంలో అడిగే ప్రశ్నలు అర్థమెటిక్ కాన్సెప్టుల మేళవింపుగా ఉంటాయి. ఇందుకోసం పర్సంటేజెస్, యావరేజెస్, రేషియో చాప్టర్లపై పట్టు సాధించాకే డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజ్, యావరేజెస్, రేషియో– ప్రపోర్షన్, ప్రాఫిట్–లాస్, సింపుల్– కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్ – వర్క్, టైమ్–డిస్టెన్స్, పెర్ముటేషన్స్–కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, పార్టనర్‌షిప్ తదితర విభాగాల నుంచి ప్రశ్నలు తప్పనిసరిగా, లోతుగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. సగం ప్రశ్నలు కచ్చితంగా గుర్తించినా మంచి మార్కులు స్కోర్ చేయొచ్చన్నది వారి అభిప్రాయం. ప్రాథమిక అంశాల కోసం సింప్లిఫికేషన్స్‌కు బోడ్‌మస్ రూల్స్‌కు సంబంధించి ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలను గుర్తుంచుకోవాలి.

ఉపకరించే పుస్తకాలు

- ఆర్‌ఎస్ అగర్వాల్, కిరణ్ ప్రకాశన్, అరిహంత్ పబ్లికేషన్స్ బుక్స్, ఎస్‌బీఐ పీఓ మెయిన్ గత ప్రశ్నపత్రాలు.

జనరల్ అవేర్‌నెస్

జనరల్, ఎకానమీ, బ్యాంకింగ్ అవేర్‌నెస్‌గా ఉండే ఈ సెక్షన్ కేవలం మెయిన్‌లోనే ఉంటుంది. ఈ విభాగంలో మూడు ఉప విభాగాలు, 40 ప్రశ్నలున్నాయి. ఒక్కోదాని నుంచి 15 ప్రశ్నల వరకు వచ్చే అవకాశముంది. ఈసారి ప్రత్యేకంగా ఎకానమీ టాపిక్ చేర్చారు కాబట్టి ఎకనామిక్స్‌కు సంబంధించి బేసిక్స్ టెర్మినాలజీ, వాటి డెఫినేషన్స్ చదవాలి. వీటితోపాటు గత ఆరు నెలల అంతర్జాతీయ, జాతీయ వ్యవహారాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. మరీ ముఖ్యంగా దేశీయంగా చోటుచేసుకున్న ఆర్థిక అంశాలపై దృష్టి పెట్టాలి. ఆర్‌బీఐకి సంబంధించిన అంశాలను కరెంట్ అఫైర్స్ కోణంలో అధ్యయనం చేయాలి. బ్యాంకులకు సంబంధించి ఎప్పటికప్పుడు వస్తున్న పథకాలు, ఆధునిక సాంకేతికత ద్వారా అందుతున్న బ్యాంకింగ్ సేవలు తదితరాలపై అవగాహన అవసరం.

ఉపకరించే పుస్తకాలు

- బ్యాంకింగ్ అండ్ ఎకనామిక్స్ అవేర్‌నెస్ బై రాకేశ్ కుమార్.
- అరిహంత్ బ్యాంకింగ్ అవేర్‌నెస్
- మనోహర్ పాండే – జనరల్ నాలెడ్జ్
- ప్రీవియస్ పేపర్లు.

కేరీర్ స్కోప్

- పీఓగా ఎంపికైనవారికి రెండేళ్ల శిక్షణ తర్వాత కన్‌ఫర్మ్ అవుతుంది. ఆ తర్వాత అదే స్కేల్‌లో కన్‌ఫర్మ్‌డ్ అసిస్టెంట్ మేనేజర్ హోదా లభిస్తుంది.
- ఆ తర్వాత బ్రాంచ్ మేనేజర్, చీఫ్ మేనేజర్, ఏజీఎం (అసిస్టెంట్ జనరల్ మేనేజర్), డీజీఎం (డిప్యూటీ జనరల్ మేనేజర్), జీఎం (జనరల్ మేనేజర్) హోదాలు సొంతం చేసుకోవచ్చు. ఇంటర్నల్ పరీక్షల ద్వారా పదోన్నతులు లభిస్తాయి. ప్రతిభకు తగ్గ పదోన్నతులను పొందొచ్చు.

టిప్స్

- అభ్యర్థులు ప్రిలిమ్స్, మెయిన్‌కు వేర్వేరుగా కాకుండా.. ఏకకాలంలో సన్నద్ధమవ్వాలి. అక్టోబర్ మొదటి రెండు వారాల్లో ప్రిలిమినరీ పరీక్షలు ఉంటాయి. అంటే.. 50 రోజులకు పైగా సమయం ఉంది. కాబట్టి అభ్యర్థులు ఇప్పటినుంచి ప్రిపరేషన్ ప్రారంభించినా ఉద్యోగం సాధించవచ్చు.
- మెయిన్‌లో సెక్షన్ వైజ్ టైమ్ ఉంటుంది. ప్రశ్నలు ఎక్కువ అటెంప్ట్ చేయకున్నా ఆత్మవిశ్వాసం కోల్పోకూడదు. సాధ్యమైనన్ని ప్రశ్నలు కచ్చితంగా అటెంప్ట్ చేసినా చాలు.
- డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ విభాగంలో డేటాపై ప్రశ్నలు ఇచ్చినప్పుడు ఒక్కో టేబుల్/ చార్ట్‌లో ప్రతి అయిదు ప్రశ్నల్లో 2 ప్రశ్నలు కఠినంగా ఉంటాయి. వాటిని గుర్తించి వదిలేయాలి. లేకపోతే సమయం వృథాకు అవకాశం ఉంటుంది. తర్వాత సమయం ఉంటే చివర్లో ప్రయత్నించాలి.
- రీజనింగ్‌లో హై లెవల్ ప్రశ్నలే 90 శాతం ఉంటాయనేది నిపుణుల అభిప్రాయం. ఒక్కోసారి లాజిక్ తట్టకపోవచ్చు. అలాంటప్పుడు వాటిని వదిలేసి తర్వాత ప్రయత్నించాలి. రీజనింగ్ సెక్షన్‌లో మొదట అన్ని ప్రశ్నలు ఒకసారి చూసిన తర్వాత తెలిసినవాటితో పరీక్ష రాయడం ప్రారంభించాలి.
- మెయిన్‌లో ఇంగ్లిష్ ఎస్సే, లెటర్ రైటింగ్‌లు కంప్యూటర్‌లో టైప్ చేయాల్సి ఉంటుంది కాబట్టి అభ్యర్థులు టైపింగ్ ప్రాక్టీస్ చేయాల్సిన అవసరం ఉంది.

ఎస్‌బీఐ పీఓ తరహాలో..

ఈ సారి ఐబీపీఎస్ మెయిన్స్‌లో ఎస్‌బీఐ పీఓ స్థాయిలో క్లిష్టంగా, ఎక్కువ సమయం తీసుకునే ప్రశ్నలుంటాయి. అభ్యర్థులు ప్రిలిమ్స్, మెయిన్స్‌లోని మూడు విభాగాలు.. ఇంగ్లిష్, క్వాంట్, రీజనింగ్ సెక్షన్లకు ఒకేసారి ప్రిపరేషన్ ప్రారంభించాలి. ప్రిలిమ్స్ ఫలితాలకు, మెయిన్ పరీక్షకు మధ్య గరిష్టంగా నెల సమయం మాత్రమే ఉండే అవకాశముంది. అప్పుడు కంప్యూటర్, జనరల్ అవేర్‌నెస్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి. ముఖ్యంగా ప్రిలిమ్స్‌ను నిర్లక్ష్యం చేయొద్దు. బేసిక్ కాన్సెప్టులపై పట్టు వచ్చాక మాక్ టెస్టులు రాసి ఫలితాలను సమీక్షించుకుంటూ ముందుకు సాగాలి. విభాగాలవారీగా కూడా టెస్టులు రాయడం తప్పనిసరి. మెయిన్ పరీక్షలో డేటా ఇంటర్‌ప్రిటేషన్ విభాగంలో అత్యంత క్లిష్టమైన, ఎక్కువ సమయం తీసుకునే ప్రశ్నలు వస్తాయి. కాబట్టి హైలెవల్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.

– రవి గార్లపాటి, డైరెక్టర్, ఐరైజ్ అకాడమీ, హైదరాబాద్.

బులెటిన్ బోర్డ్

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్‌లో 36 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

- **పోస్టుల పేరు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ.
- **విభాగాల వారీ ఖాళీలు:** హెచ్‌ఆర్ (హ్యూమన్ రీసోర్సెస్)–12; మార్కెటింగ్ (ఎంకేటీజీ)–24.
- **వేతనం:** రూ.16,400–రూ.40,500.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి 60 శాతం మార్కులతో ఎంబీఏ/పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా/బీఎస్సీ+ఎంఎస్సీ/బీఎస్సీ+పీజీడీబీఎం.
- **వయోపరిమితి:** 2017, ఆగస్టు 31 నాటికి 29 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.735(రూ.700 అప్లికేషన్ ఫీజు+రూ.35 బ్యాంకు చార్జీలు); ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/ఎక్స్–సర్వీస్‌మెన్/డిపార్ట్‌మెంటల్ కేటగిరీల అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 6, 2017.
- **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

ఓఎన్‌జీసీలో 27 ఖాళీలు

- **పోస్టుల పేరు–ఖాళీలు:** హ్యూమన్ రీసోర్స్ ఎగ్జిక్యూటివ్–20; ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్–5; అఫిషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్–2.
- **వేతనం:** రూ.24,900–రూ.50,500.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి 60 శాతం మార్కులతో ఎంబీఏ/పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా/పీజీ. దీంతో పాటు యూజీసీ నెట్ (నవంబర్ 2017) ఉత్తీర్ణత.
- **వయోపరిమితి:** 2017, జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలు, యూజీసీ నెట్ మార్కులు, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్టు 21, 2017.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 19, 2017.
- **వెబ్‌సైట్:** www.ongcindia.com

> చదువనివాడజ్ఞుండగు
> చదివిన సదసద్వివేక చతురత కలుగున్
> చదువగ వలయును జనులకు
>
> – బమ్మెర పోతన

పుస్తక పఠనం.. ప్రగతి సోపానం

సాఫ్ట్ స్కిల్స్

వందల ఏళ్ల కిందటే మహాకవి బమ్మెర పోతన చదువు అవసరం.. అనివార్యత.. ప్రాధాన్యం గురించి సరళంగా.. స్పష్టంగా చెప్పారు. 'పుస్తకం హస్త భూషణం' అని కూడా అన్నారు పెద్దలు. ఒకనాటి యువత చేతిలో సాహిత్య, సామాజిక రంగాలకు సంబంధించిన పుస్తకాలు కనిపించేవి. వారు చదివిన పుస్తకాలపై చర్చించుకునేవారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ హస్త భూషణమైపోయింది. ఇష్టంగా గ్రంథాలయాలకు వెళ్లి.. సైలెన్స్ ప్లీజ్ బోర్డుల కింద కూర్చుని చదువుకునేంత తీరిక ఎవరికీ ఉండటం లేదు. వేలి కొనలతో బ్రౌజ్ చేసి.. కావల్సినవాటిని క్షణాల్లో డౌన్‌లోడ్ చేసిపెట్టే స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్ల కాలం ఇది. ఈ రోజుల్లోనూ ప్రపంచ వీక్షణకు పుస్తక పఠనం తొలిమెట్టు అని నమ్ముతున్న పలువురు ప్రముఖ మేధావుల గురించి తెలుసుకుందాం..

1. మార్క్ జుకర్‌బర్గ్



ప్రఖ్యాత సోషల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం ఫేస్‌బుక్ సీఈవో. ఈయన స్థాపించిన సంస్థ పేరులోనే బుక్ ఉంది. అందుకు తగ్గట్లే పుస్తక పఠనం జుకర్‌బర్గ్ అభిరుచి. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా.. కనీసం వారానికొక పుస్తకమైనా చదవాల్సిందే అంటారీయన. 'ఒక్క పుస్తకం ఉంటే చాలు అసమాన జ్ఞానం.. మనసుకి ఉత్సాహం.. మెదడుకి ఉత్తేజం' అని నమ్మే వ్యక్తి. చదవడం, చదివిన దాన్ని అర్థం చేసుకోవడం పద్ధతి ప్రకారం జరగాలన్నది జుకర్‌బర్గ్ భావన. అంశాన్ని పూర్తిగా చదవడం, ముఖ్యమైన విషయాలు.. వాటికి సంబంధించిన విశ్లేషణ, విషయం ఎక్కడి నుంచి మొదలై ఎలా ముగుస్తుందనే రూపాన్ని గమనించడం కీలకమంటారు. టీవీల్లో, సామాజిక మాధ్యమాల్లో వచ్చే పసలేని కార్యక్రమాలకు సమయాన్ని వృథా చేయకుండా ఏదో ఒక పుస్తకం చదడం మేలని సూచిస్తుంటారు.

2. ఫిల్ నైట్




ప్రముఖ దుస్తులు, పాదరక్షల తయారీ సంస్థ 'నైకీ' వ్యవస్థాపకులు. ఈయన కూడా నిత్య విద్యార్థి. ఆఫీసులో కంటే కూడా రోజులో అత్యధిక సమయం సొంత లైబ్రరీలోనే గడుపుతుంటారు. రచయిత రాసిన క్రమంలోనే పుస్తకాన్ని చదవాల్సిన అవసరం లేదన్నది ఫిల్ భావన. పుస్తకంలోని ప్రతి విషయాన్ని సొంత దృక్పథంతో చదవడం ఈయన అలవాటు. అంశంపై అవగాహన పెంచుకోవడం, అవసరమైనవి నోట్స్ రాసుకోవడం చేస్తుంటారు. విషయ సూచికలు, బొమ్మలు, హెడ్డింగ్స్, సబ్– హెడ్డింగ్స్ వంటి అంశాల్లో మరింత సమాచారం ఉంటుందని చెబుతుంటారు.


3. బిల్ గేట్స్



నేటి సాంకేతిక రంగాన్ని శాసిస్తున్న మైక్రోసాఫ్ట్ సామ్రాజ్యానికి రారాజు. ఈ క్రమంలో గేట్స్ పేరు తెలియనివారుండరంటే అతిశయోక్తి కాదు. ఈయన కూడా పుస్తకాల పురుగు. ఏడాదిలో కనీసం 50 పుస్తకాలైనా చదువుతారట. అంటే సుమారు వారానికి ఒకటన్న మాట. పబ్లిక్ హెల్త్, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యాపారానికి సంబంధించిన పుస్తకాలు ఈయన చదివే వాటిలో ఎక్కువగా ఉంటాయి. 'పుస్తకాలు ప్రతిభా పాఠవాలు నేర్పించే గురువులు. తెలియని విషయాలను విశదీకరించే మిత్రులు. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానంతో పాటు భాషా పరిజ్ఞానం కూడా పెరుగుతుందన్నది' గేట్స్ సలహా.



4. వారెన్ బఫెట్



వ్యాపార ప్రపంచానికి పరిచయం అక్కర్లేని పేరు. విజయవంతమైన వ్యాపారవేత్త మాత్రమే కాదు.. దాతృత్వంలోనూ దిట్ట. ప్రపంచ కుబేరుల జాబితాలో మొదటి వరుసలో ఉండే వ్యక్తి. ఈయన రోజులో అధిక సమయాన్ని పుస్తక పఠనానికే కేటాయిస్తారట. ఉదయం లేవగానే వార్తా పత్రికలు చదవడంతో మొదలయ్యే బఫెట్ దినచర్య.. రోజులో కనీసం 500 పేజీలైనా చదివేదాక సాగుతుంది. తన ఆశయాలు, లక్ష్యాల సాధనలో పుస్తకాలు కీలక పాత్ర పోషించాయని గర్వంగా చెబుతుంటారు.

5. లారీ ఎలిసన్



ఈయన సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజ్ ఒరాకిల్ వ్యవస్థాపకుడిగా సాంకేతిక ప్రపంచానికి పరిచయం. ఈ ఏడాది జనవరి నాటికి లారీ సంపద విలువ 51.9 బిలియన్ డాలర్లు. అంత ధనవంతుడైనా పుస్తక ప్రియుడు. విజ్ఞాన పిపాసి. ఈయన ఎక్కువగా సాంకేతిక, వైజ్ఞానిక విషయాల గురించి చదువుతుంటారు. మేధస్సును పెంపొందించుకునేందుకు, వెనుకబాటుతనం పారదోలేందుకు పుస్తక పఠనం ఎంతో దోహదపడుతుందని బలంగా నమ్మే వ్యక్తి. నవతరం కూడా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచిస్తుంటారు.

పుస్తక పఠనంతో ప్రయోజనాలు

- లక్ష్యాన్ని నిర్దేశించుకునే స్పృహ పెరుగుతుంది.
- కొత్త విషయాలను తెలుసుకోవాలన్న ఆసక్తి కలుగుతుంది.
- ఊహాశక్తిని పెంచుతుంది.
- గమ్యాన్ని చేరుకోవాలనే పట్టుదల అలవడుతుంది.
- సామాజిక సమస్యలపై అవగాహన ఏర్పడుతుంది.
- భిన్నంగా ఆలోచించే శక్తినిస్తుంది.
- క్లిష్టమైన సమస్యలకు సులువైన పరిష్కారం కనుక్కోగలరు.
- ఆకర్షణీయంగా మాట్లాడే నైపుణ్యం సొంతమవుతుంది.
- స్వీయ విశ్లేషణ సామర్థ్యం మెరుగవుతుంది.

విద్యుదాఘాతానికి మూడు ఏనుగులు మృతి

కేకే.నగర్ (చెన్నై)/వేలూరు (తమిళనాడు): తమిళనాడులో విద్యుదాఘాతానికి గురు, శుక్రవారాల్లో మూడు ఏనుగులు మృతి చెందాయి. నీలగిరి జిల్లా కూడలూరు సమీపంలోని దేవర్‌సోలై కొత్తాడి ప్రాంతానికి చెందిన దురై అనే వ్యక్తికి తోట ఉంది. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఈ తోటలోకి గురువారం రాత్రి రెండు ఏనుగులు, ఓ గున్న ఏనుగు చొరబడ్డాయి. అక్కడున్న చెట్టును లాగిన సమయంలో చెట్టు కూలి కరెంటు స్తంభంపై పడింది. ఈ ఘటనలో కరెంటు తీగలు ఏనుగుల మీద పడటంతో రెండు ఏనుగులు మృతి చెందాయి. వేలూరు జిల్లా పేర్నంబట్టు తాలుకా ఎరుక్కంబట్టులో జరిగిన ఘటనలో ఓ మగ ఏనుగు పిల్ల (5) ఈ కంచెను తాకి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది.

- ప్రేమకు నిరాకరించిందని నిప్పంటించిన యువకుడు
- యువతి సజీవ దహనం.. రక్షించబోయిన తమ్ముడూ ఆస్పత్రిలో మృతి
- ఆ తర్వాత రైలుకింద పడి నిందితుడి ఆత్మహత్య
- విశాఖ జిల్లాలో దుర్ఘటన

ప్రేమోన్మాది ఘాతుకం



రూప (ఫైల్)



ఆత్మహత్యకు పాల్పడిన హరి సంతోశ్

మధురవాడ/భీమునిపట్నం: ఓ ప్రేమోన్మాది ఘాతుకం యువతి నూరేళ్ల జీవితాన్ని బుగ్గిపాలు చేసింది. ప్రేమకు నిరాకరించిందని పెట్రోలు పోసి తగులబెట్టిన యువకుడు ఆ తర్వాత రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కను రక్షించబోయిన మృతురాలి తమ్ముడు సైతం 80 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మరణించాడు. ఈ దుర్ఘటన విశాఖపట్నం జిల్లా భీమిలి రూరల్ మండలం టి.నగరప్పాలెంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, భీమిలి పోలీసులు తెలిపిన వివరాలు.. పొట్నూరు రూప (17) తగరపువలసలోని బాసర కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన పతివాడ హరిసంతోష్ ఆరు నెలలుగా ఆమె వెంటపడి ప్రేమించమని వేధిస్తున్నాడు. వేధింపులు మరీ ఎక్కువ కావడంతో రూప పెద్దలకు చెప్పింది. వారు వచ్చి సంతోష్‌ని హెచ్చరించి లెటర్ కూడా రాయించుకున్నారు. అయినా, మళ్లీ వెంట పడుతుండడంతో మూడు నెలల నుంచి కళాశాలకు వెళ్లడం మానేసింది. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి దగ్గరకు వచ్చి ప్రేమించాలని వాదనకు దిగాడు. రూప నిరాకరించడంతో పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. రూప అక్కడికక్కడే కాలి బూడిద కాగా.. రక్షించబోయిన రూప సోదరుడు ఉపేంద్ర (14) సైతం తీవ్రంగా గాయపడడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. 80 శాతం గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి తొమ్మిదిన్నర గంటలకు మరణించాడు. మృతురాలి తండ్రి పొట్నూరు సూరిబాబు మొదటి భార్య చనిపోవడంతో రెండో వివాహం చేసుకున్నాడు. రూప, ఉపేంద్ర మొదటి భార్య పిల్లలు. వీరిద్దరూ నాన్నమ్మ అప్పచ్చమ్మ, తాత ఎల్లయ్య, చిన్నాన్నల దగ్గర ఉంటున్నారు. తండ్రి ట్రాన్స్‌పోర్టు లేబర్‌గా పనిచేస్తున్నాడు.

రైలుకింద పడి ప్రేమోన్మాది ఆత్మహత్య

ప్రేమించలేదని రూపపై పెట్రోల్ పోసి నిప్పంటించిన హరిసంతోష్ (19) అనంతరం భయాందోళనతో విజయనగరంలో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను విజయనగరం కోర్టు సమీపంలో ఉండేవాడు. బతుకుతెరువు కోసం అతని కుటుంబం ఏడాది క్రితం తగరపువలస వచ్చింది. తండ్రి రమణ పరుపులు కుట్టే షాపులో పనిచేస్తున్నాడు.

అయ్యా.. నన్ను కాపాడండి!

- కొడుకు పట్టించుకోలేదని న్యాయమూర్తిని ఆశ్రయించిన వృద్ధుడు
- అనారోగ్యంతో బాధపడుతున్నానని కన్నీటిపర్యంతం.. ఆసుపత్రికి తరలింపు
- చికిత్స అందిస్తున్న వైద్యులు



ఏరియా ఆస్పత్రిలో వీరయ్యకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చిన్నపిల్లల్లా చూసుకోవాల్సిన వారి పిల్లలు కొందరు అది తమ బాధ్యత కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రుల కష్టసుఖాలను చూడడం భారంగా భావిస్తూ తప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలం వల్లరగుడబ గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు గుంట వీరయ్య తీవ్ర చలిజ్వరం, విరేచనాలతో బాధపడుతున్నాడు. ఇంటివద్ద కుమారుడు పట్టించుకోకపోవడంతో అతి కష్టంగా శనివారం పార్వతీపురం వచ్చాడు. స్థానిక న్యాయమూర్తి జి.గంగరాజును కలసి తన గోడు చెప్పుకున్నాడు. వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన కుమారుడు తనను పట్టించుకోవడం లేదని రోదించాడు. అనారోగ్యంతో ఉన్న తనను కాపాడాలని కోరాడు. వెంటనే స్పందించిన న్యాయమూర్తి.. వీరయ్యకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని ఆదేశిస్తూ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. అనంతరం వీరయ్య కుమారుడు పోలయ్యను పిలిపించి అప్పగించాలని ఔట్‌పోస్టు పోలీసులకు సూచించారు. దీంతో ప్రస్తుతం వీరయ్యకు ఏరియా ఆస్పత్రి వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు.

మొక్కలతోనే పర్యావరణ సమతుల్యత

జాతీయ సదస్సులో శాసనసభ స్పీకర్ కోడెల



సాక్షి, అమరావతి: మొక్కలను నాటి పరిరక్షించుకోవడం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు చెప్పారు. జీవరాశుల మనుగడ కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. శనివారం విజయవాడలోని ఒక హోటల్‌లో ఏపీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో 33 శాతం అటవీ ప్రాంతం ఉండాల్సివుండగా 23 శాతానికి పడిపోయిందని, రాష్ట్రంలో అటవీ ప్రాంతం అంతకంటే తక్కువగా 20 శాతానికి పరిమితమైందన్నారు. మొక్కలను తొలగించాల్సివస్తే ట్రీ ప్లాంటేషన్ ద్వారా వేరే చోట నాటాలన్నారు. మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన పెరగాలన్నారు. సదస్సులో విజయవాడ మేయర్, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ మల్లికార్జునరావు, అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మురుగన్ దీక్ష



వేలూరు (తమిళనాడు): రాజీవ్ హత్యకేసులో శిక్ష అనుభవిస్తున్న మురుగన్ ఆహారం తీసుకోకుండా జైలు గదిలోనే ధ్యానం చేస్తున్నాడని అతని తరపు న్యాయవాది పుహలేంది శనివారం మీడియాకు వెల్లడించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్య కేసులో మురుగన్, పేరరివాలన్, శాంతన్ వేలూరు సెంట్రల్ జైలులో, మురుగన్ భార్య నళిని వేలూరు మహిళా జైలులో జీవిత శిక్ష అనుభవిస్తున్న విషయం విదితమే. 26 ఏళ్లుగా తాను జైలు జీవితం అనుభవిస్తున్నానని, జైలులోనే జీవ సమాధిగా అయ్యేందుకు అనుమతివ్వాలని మురుగన్ ఇటీవల జైలు అధికారులకు లేఖ ద్వారా కోరాడు. జైలు అధికారులు అనుమతించక పోవడంతో ముఖ్యమంత్రికి మురుగన్ లేఖ రాసి జైలు అధికారుల వద్ద ఇచ్చాడు. ఈ క్రమంలో 18వ తేదీన మురుగన్ ఏమాత్రం ఆహారం తీసుకోలేదు. శనివారం ఉదయం మురుగన్, నళినిల న్యాయవాది పుహలేంది జైలులోని వారిరువురినీ కలసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మురుగన్ జీవితంపై విరక్తితో జీవ సమాధి అయ్యేందుకు నిర్ణయించుకున్నాడన్నారు.

రోబోటిక్‌తో క్లిష్ట ఆపరేషన్లు సులువుగా చేయొచ్చు

ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాక్టర్ పళనివేలు



డాక్టర్ పళనివేలును సన్మానిస్తున్న సర్జన్ల సంఘం నేతలు

గుంటూరు మెడికల్: కష్టమైన ఆపరేషన్లు సైతం రోబోటిక్స్‌తో సులువుగా చేయొచ్చని కోయంబత్తూరుకు చెందిన జెమ్స్ హాస్పిటల్ రీసెర్చి సెంటర్ అధినేత డాక్టర్ సి.పళనివేలు అన్నారు. గుంటూరు వైద్య కళాశాలలో శుక్రవారం నుంచి జరుగుతున్న సర్జరీ వైద్యనిపుణుల సంఘం రాష్ట్ర సదస్సులో శనివారం 'రోబోటిక్ ఇన్ మినిమల్లీ ఇన్వ్యాసివ్ సర్జరీ' అంశంపై ఆయన మాట్లాడారు. శస్త్ర చికిత్సల్లో నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు వచ్చాయని, వాటి వల్ల రోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ముఖ్యంగా కడుపులో ఉండే అతి సూక్ష్మ క్యాన్సర్ కారకాలను సైతం రోబోటిక్స్ విధానంలో త్రీడీ ఇమేజ్ ఉండటం వల్ల చాలా స్పష్టంగా చూసి, తొలగించి క్యాన్సర్ రాకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. రోబోటిక్ సర్జరీలతో రోగికి నొప్పి ఉండదని, గాయం కూడా చాలా చిన్నగా ఉంటుందని వివరించారు. క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నూటికి నూరుశాతం నయం చేయవచ్చని, స్క్రీనింగ్ చాలా ముఖ్యమని డాక్టర్ సి.పళనివేలు పేర్కొన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, సర్జన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.భాస్కరరావు ఇతర సంఘ సభ్యులు డాక్టర్ పళనివేలును ఘనంగా సత్కరించారు.

'పోలవరం' గడువులోగా పూర్తి చేయాలి

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి కృష్ణాడెల్టా పరిరక్షణ సమితి వినతి

సాక్షి, అమరావతి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత వ్యవధిలో పూర్తి చేసేలా కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి సభ్యులు శనివారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుంసింగ్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సమితి సభ్యులు మల్లాది విష్ణు, కొలనుకొండ శివాజీ, నరసింహారావు తదితరులు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు.

విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టును కేంద్రమే పూర్తి ఖర్చులతో చేపట్టాల్సి ఉన్నా, త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వానికే నిర్మాణ బాధ్యతను అప్పగించినట్లు కేంద్రం చెబుతోందన్నారు. అయితే పెరిగిన అంచనాల ప్రకారం ప్రాజెక్టుకయ్యే పూర్తి వ్యయం భరించలేమని, కేవలం 2010–11 అంచనాల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.16 వేల కోట్లు మాత్రమే వంద శాతం భరిస్తామని, ఐదేళ్ల కాలవ్యవధిలో ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయలేని పక్షంలో ఈ మొత్తాన్ని ఆర్థిక సాయం అప్పుగా పరిగణిస్తామని షరతులు విధించడాన్ని కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి వ్యతిరేకిస్తోందని వినతిపత్రంలో వారు పేర్కొన్నారు.

ఆర్థో సర్జన్‌పై హత్యా యత్నం కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం: హెచ్‌ఐవీ సిరంజితో మెడికల్ సూపరింటెండెంట్‌పై దాడికి పాల్పడ్డ ఘటనలో ఆర్థో సర్జన్ డేవిడ్‌రాజ్‌పై ప్రొద్దుటూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మీప్రసాద్‌పై ఆర్థో సర్జన్ డేవిడ్‌రాజ్ హెచ్‌ఐవీ రక్తమున్న సిరంజితో దాడిచేసిన విషయం తెలిసిందే. ఘటనకు సంబంధించి ఆస్పత్రి ఔట్‌పోస్టు ఇన్‌చార్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం సుమోటోగా కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సదాశివయ్య తెలిపారు.

జయ స్మారక మందిరం పనులు ప్రారంభం

సాక్షి ప్రతినిధి, చెన్నై: చెన్నై పోయెస్ గార్డెన్‌లోని దివంగత ముఖ్యమంత్రి జయలలిత నివాసం వేద నిలయంను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, స్మారక మందిరంగా మార్చే పనులు శనివారం ప్రారంభమయ్యాయి. దీన్ని జయలలిత అన్న జయకుమార్ సంతానమైన దీప, దీపక్‌లు చట్టపరంగా ఎదుర్కొంటామని ప్రకటించిన తరుణంలో స్మారక మందిరం పనులను ప్రభుత్వం ప్రారంభించడం గమనార్హం. మైలాపూరు తహశీల్దారు శైలేందర్ నేతృత్వంలో ప్రజాపనుల శాఖ, రెవెన్యూ, చెన్నై కార్పొరేషన్‌కు చెందిన మొత్తం ఎనిమిది మంది అధికారులు శనివారం వేద నిలయానికి వెళ్లి కొలతలు తీసుకున్నారు.

పునరావాసం కల్పించే వరకూ 'పోలవరం' ఆపాల్సిందే

- పట్టిసీమలోలాగే ఎకరాకు రూ.50 లక్షలివ్వాలి
- ప్రాజెక్టు నిర్వాసితుల డిమాండ్
- విలీన మండలాల్లో బంద్ విజయవంతం



ర్యాలీలో పాల్గొన్న మిడియం బాబూరావు, ఎమ్మెల్యేలు సున్నం రాజయ్య, మడకం మనీష్

చింతూరు (రంపచోడవరం): పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించేంత వరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాల్సిందేనని నిర్వాసితులు డిమాండ్ చేశారు. విభజన సమయంలో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో విలీనమైన నాలుగు మండలాల్లోని నిర్వాసితులకు మెరుగైన పూర్తి పునరావాసం కల్పించాలనే డిమాండ్‌తో అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్ విజయ వంతమైంది. బంద్‌లో పాల్గొన్న పోలవరం నిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య మాట్లాడుతూ, పట్టిసీమ భూముల తరహాలో.. పోలవరం నిర్వాసితులకు కూడా ఎకరానికి రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో రూ.లక్షా 15వేలు పరిహారంగా చెల్లించిన రైతులకు కూడా 2013 భూసేకరణ చట్టం ప్రకారం మిగతా పరిహారాన్ని చెల్లించాలని కోరారు. నిర్వాసిత కుటుంబాలకు ఇంటికొక ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, ముంపు గ్రామాల విషయంలో సమగ్రంగా సర్వే జరపాలని డిమాండ్ చేశారు. బంద్‌కు ఒడిశా రాష్ట్రం మల్కనగిరి ఎమ్మెల్యే మడకం మనీష్ మద్దతు తెలిపారు.

'సినర్జీస్' విలీనానికి ఆమోదం

అగనంపూడి (గాజువాక): సినర్జీస్ డ్యూరే ఆటోమోటివ్ లిమిటెడ్ సంస్థ ఇకపై సినర్జీస్‌లో భాగం కానుంది. విశాఖలోని దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలో ఉన్న సినర్జీస్ క్యాస్టింగ్స్ సినర్జీస్ డ్యూరే ఆటోమోటివ్ లిమిటెడ్, లిమిటెడ్ సంస్థలు అలాయీస్ వీల్స్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో మరింత నాణ్యమైన ఉత్పత్తులు అందించే లక్ష్యంతో రెండు కంపెనీలను విలీనం చేసేందుకు అనుమతివ్వాలని జాతీయ కంపెనీ లా బోర్డును సంస్థ యాజమాన్యాలు కోరాయి. అందుకు అనుమతి మంజూరు చేస్తూ లా బోర్డు ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. విలీన ప్రక్రియను చట్టబద్ధంగా పూర్తి చేస్తామని, 1500 మంది కార్మికుల ప్రయోజనాలకు పూర్తి భద్రత కల్పిస్తామని సంస్థ సీనియర్ మేనేజర్ చంచల్ గుప్తా శనివారం తెలిపారు. జనరల్ మోటార్స్, ఫోర్డ్ యూఎస్ఏ, చిస్లర్ యూఎస్ఏ, జనరల్ మోటార్స్ ఇండియా, ఫోర్డ్ ఇండియా, టాటా మోటార్స్, టయోటా, హుండాయ్, ఫియట్, నిస్సాన్, వోక్స్‌వ్యాగన్, హోండా, మహేంద్రా అండ్ మహేంద్రా సంస్థలు తయారు చేసే కార్లకు సినర్జీస్ అలాయీ వీల్స్‌ను వినియోగిస్తున్నాయి.

సెప్టెంబర్ 12న ఎన్ఎంయూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ నేతలు చల్లా చంద్రయ్య, రమణారెడ్డిలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 12న విజయవాడలోని పీఎన్‌బీఎస్ బస్టాండ్ ఎదురుగా ఉన్న పద్మావతి ఘాట్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పోలీస్ కస్టడీకి సర్వే ఇన్‌స్పెక్టర్ గణేష్

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో భూ రికార్డుల ట్యాంపరింగ్‌కు పాల్పడ్డ సర్వే విభాగం ఇన్‌స్పెక్టర్ గణేశ్వరరావును ప్రత్యేక దర్యాప్తు బృందం శనివారం కస్టడీలోకి తీసుకుంది. ఈ వ్యవహారంలో కీలక నిందితుడిగా ఉన్న ఆయనను ఇటీవల అరెస్టు చేయడంతో ప్రస్తుతం విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో గణేష్‌ను విచారించడానికి కస్టడీకి ఇవ్వాలని సిట్ కోర్టును అభ్యర్థించింది. ఇందుకు కోర్టు అనుమతించడంతో శనివారం ఆయనను సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. గణేష్‌ను ఆరు రోజులపాటు విచారించే అవకాశం ఉంది.





1. రైలు పట్టాలు తప్పడంతో పక్కనున్న ఇంట్లోకి దూసుకెళ్లిన బోగీ. 2. బోగీలో చిక్కుకున్న ప్రయాణికుడికి నీళ్లు అందిస్తున్న దృశ్యం. 3. గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న సహాయక సిబ్బంది



భారత్‌లో రష్యా రాయబారిగా నికోలై కుదాషెవ్‌ను నియమించినట్లు ఢిల్లీలోని ఆ దేశ దౌత్యకార్యాలయం వెల్లడించింది. ఈయన రష్యా విదేశాంగ శాఖలో డిప్యూటీ డైరక్టర్ జనరల్ సెక్రటేరియేటర్‌గా పనిచేస్తున్నారు.


పట్టాలు తప్పిన ఉత్కళ్

యూపీలో ఘోర రైలు ప్రమాదం ● 23 మంది మృతి.. 60 మందికి పైగా గాయాలు

ముజఫర్‌నగర్: ఉత్తరప్రదేశ్‌లో శనివారం ఘోర రైలు ప్రమాదం జరిగింది. ముజఫర్‌నగర్ జిల్లా ఖతౌలి వద్ద పూరీ–హరిద్వార్ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 23 మంది మృతిచెందగా.. 60 మందికి పైగా గాయపడ్డారు. రైల్లోని 14 బోగీలు పట్టాలు తప్పడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంది. ఉత్తరప్రదేశ్ పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్, ఏటీఎస్ బలగాలు, వైద్య బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భారీ క్రేన్లు, గ్యాస్ కట్టర్లతో బోగీల్లో చిక్కుకుపోయిన ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. ప్రమాదతీవ్రతతో ఒక బోగీ ట్రాక్ పక్కనున్న ఇంట్లోకి దూసుకుపోగా.. రెండు బోగీలు ఒకదానిపైకి మరకొటి ఎక్కాయి. సహాయక చర్యల్లో స్థానికులు కూడా బలగాలకు సాయం చేస్తున్నారు. ఘటనాస్థలంలో పరిస్థితి భీతావహంగా మారింది. అంబులెన్సుల ద్వారా బాధితులను సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. శనివారం సాయంత్రం 5.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు మీరట్ జోన్ రైల్వే మెడికల్ అధికారి పీఎస్ మిశ్రా స్పష్టం చేశారు. ఎస్1 నుంచి ఎస్ 10 వరకు స్లీపర్ కోచ్‌లు, థర్డ్ ఏసీ బీ1, సెకండ్ ఏసీ ఏ1, ప్యాంట్రీ బోగీలు పట్టాలు తప్పాయన్నారు.

ప్రమాదానికి కారణమేంటి?

దుర్ఘటన విషయం తెలియగానే మొదట దీన్ని ఉగ్రవాద ఘటనగానే రైల్వే శాఖ, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం భావించాయి. దీంతో ఎన్డీఆర్‌ఎఫ్, పోలీసులు, వైద్య బృందాలతోపాటుగా ఉగ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్)ను కూడా యూపీ సర్కారు రంగంలోకి దించింది. అయితే.. దుర్ఘటన జరిగిన ప్రాంతం నుంచి సేకరించిన ఆధారాలతో.. మానవ తప్పిదమే ఈ ఘటనకు కారణమని యూపీ సర్కారు స్పష్టం చేసింది. ఏటీఎస్ కూడా దీన్ని ధ్రువీకరించింది. మీరట్–సహరాన్‌పూర్ డివిజన్‌లో పలుచోట్ల రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ విషయంపై ఆ మార్గంలో ప్రయాణించే రైలు డ్రైవర్‌కు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి అనుగుణంగా రైలు వేగాన్ని డ్రైవర్ నియంత్రణలో ఉంచుకుంటారు. అయితే రిపేర్లు జరుగుతున్న విషయాన్ని డ్రైవర్‌కు సూచించకపోవటం వల్లే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నార్తర్న్ రైల్వేలో చాలా రద్దీగా ఉండే ఈ లైన్ ద్వారా వెళ్లే రైళ్లను దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు ముజఫర్‌నగర్ అధికారులు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశారు. 0131–2436918, 0131–2436103, 0131–2436564 నంబర్ల ద్వారా వివరాలు అందజేస్తున్నట్లు తెలిపారు.



ప్రధాని, యూపీ సీఎం దిగ్భ్రాంతి

ఈ ఘటనపై ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన బాధాకరమన్న మోదీ.. బాధితులను ఆదుకునేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ, యూపీ ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. 'ముజఫర్‌నగర్ వద్ద రైలు పట్టాలు తప్పిన దుర్ఘటన బాధాకరం. బాధితుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని మోదీ ట్వీటర్ ద్వారా విచారం వ్యక్తం చేశారు. రైలు ప్రమాద ఘటన తమను కలచివేసిందని కాంగ్రెస్ అధినేత్రి సోనియా, రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటనపై రైల్వే మంత్రి సురేశ్ ప్రభు విచారణకు ఆదేశించారు. తనే స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ దుర్ఘటన కారకులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సహాయకచర్యలను వేగవంతం చేసేందుకు యూపీ సర్కారుతో కలిసి పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.3.5లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50వేలు, స్వల్ప గాయాలైన వారికి రూ.25వేల పరిహారం ఇవ్వనున్నట్లు సురేశ్ ప్రభు వెల్లడించారు. యూపీ సీఎం యోగి కూడా మృతుల కుటుంబాలకు రూ. 2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. రైల్వే శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా, ఇద్దరు యూపీ మంత్రులు ఘటనాస్థలంలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రైల్వే బోర్డు చైర్మన్, ట్రాఫిక్ బోర్డు సభ్యులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. చీకటి కారణంగా సహాయకచర్యలకు ఆటంకం కలగకుండా.. విద్యుత్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

ఒడిశా బాధితులకు రూ.5లక్షలు

ప్రమాద ఘటనపై ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఒడిశా ప్రయాణికుల కుటుంబాలకు రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 50వేలు పరిహారంగా ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. సహాయక చర్యలను పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని పట్నాయక్ ఆదేశించారు. కాగా, ప్రమాదానికి గురైన 14 బోగీల్లో కలిపి 80 మంది స్లీపర్ క్లాసులో, ఆరుగురు ఏసీ కోచ్‌లో పూరీలో ఎక్కినట్లు అధికారులు తెలిపారు. బాధితుల వివరాల కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే 1072 టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రారంభించింది.

పట్టాలెక్కని కకోద్కర్ కమిటీ సిఫార్సులు

ముజఫర్‌నగర్ దుర్ఘటన భారత రైల్వే భద్రతలోని డొల్లతనాన్ని మరోసారి స్పష్టం చేసింది. రైల్వే భద్రతా అంశాలను అధ్యయనం చేసి తగిన సిఫార్సులు చేయాలని కోరుతూ 2012లో అప్పటి యూపీఏ ప్రభుత్వం అనిల్ కకోద్కర్ అధ్యక్షతన ఓ కమిటీని నియమించింది. ఐదేళ్లు గడిచినా కమిటీ చేసిన సూచనల్లో చాలా మటుకు ఇంకా అమలుకు నోచుకోలేదు. అందులో... ఐదేళ్ల కాలానికి ప్రయాణికుల భద్రత కోసం లక్ష కోట్లు వెచ్చించడంతో పాటు, రైల్వే భద్రతా ప్రాధికార సంస్థ ఏర్పాటు లాంటివి ఉన్నాయి. రైల్వే బోర్డుపై పని ఒత్తిడి పెరిగినా, భద్రతా ప్రాధికార సంస్థపై ఎలాంటి పురోగతి జరగలేదు.

కమిటీ చేసిన మరికొన్ని సిఫార్సులు

- రైల్వే కార్యకలాపాల పర్యవేక్షణకు శక్తిమంత సంస్థ ఏర్పాటు
- ఐదేళ్లలో అన్ని లెవల్ క్రాసింగ్‌ల ఎత్తివేత
- లెవల్ క్రాసింగ్‌లను తొలగించడానికి అయ్యే ఖర్చు రూ.50 వేల కోట్లు. నిర్వహణ ఖర్చు తగ్గించుకోవడం ద్వారా ఈ మొత్తాన్ని 8 ఏళ్లలో తిరిగి రాబట్టుకోవచ్చు.
- అన్ని బ్రిడ్జిల వద్ద నీటి మట్టాలు, నీటి ప్రవాహ వేగాలను తరచూ పర్యవేక్షించాలి.
- రైలు లోకోపైలట్‌కు సూచించేలా ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జిల వద్ద నీటి మట్టాలను కొలిచే పరికరాలు, టర్బైన్ ఫ్లో మీటర్లను బిగించాలి.
- రూ. 20 వేల కోట్ల వ్యయంతో యూరప్ దేశాల మాదిరిగా అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టాలి.

భారీ రైలు ప్రమాదాలు

- **న్యూఢిల్లీ: డిసెంబర్ 28, 2016:** యూపీలోని కాన్పూర్ దేహత్ జిల్లాలో షెల్దా–అజ్మీర్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 62 మంది ప్రయాణికులు గాయపడ్డారు.
- **నవంబర్ 20, 2016:** యూపీలోని ఫతేపూర్ సమీపంలో కల్కా మెయిల్‌కు చెందిన 15 బోగీలు పట్టాలు తప్పడంతో దాదాపు 70 మంది మరణించగా.. వందల మంది గాయపడ్డారు.
- **మే 28, 2010:** పశ్చిమబెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలో మావోయిస్టులు పట్టాలు తొలగించడంతో జ్ఞానేశ్వర్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి 148 మంది మృతిచెందారు.
- **సెప్టెంబర్ 9, 2002:** హౌరా–ఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ బిహార్ రాష్ట్రం ఔరంగాబాద్ జిల్లాలోని దవే నదిలో పడడంతో 100 మంది మరణించగా.. 150 మంది గాయపడ్డారు.
- **ఆగస్టు 2, 1999:** 2,500 మందితో వెళ్తున్న రెండు రైళ్లు అస్సాంలోని గైసల్ సమీపంలో ఢీకొనడంతో 290 మంది మరణించారు.
- **నవంబర్ 26, 1998:** పంజాబ్‌లోని ఖాన్నా సమీపంలో పట్టాలు తప్పిన ఫ్రాంటియర్ మెయిల్‌ను జమ్ముతావి–షెల్దా ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో 212 మంది ప్రాణాలు కోల్పోయారు.
- **సెప్టెంబర్ 14, 1997:** అహ్మదాబాద్–హౌరా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 5 బోగీలు మధ్యప్రదేశ్ రాష్ట్రం బిలాస్‌పూర్ జిల్లాలోని నదిలో పడడంతో 81 మంది దుర్మరణం చెందారు.
- **ఆగస్టు 20, 1995:** యూపీలోని ఫిరోజాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆగిఉన్న కలింది ఎక్స్‌ప్రెస్‌ను పురుషోత్తమ్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో 400 మంది మరణించారు.
- **ఏప్రిల్ 18, 1988:** యూపీలోని లలిత్‌పూర్ సమీపంలో కర్ణాటక ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 75 మంది ప్రాణాలు కోల్పోయారు.
- **జూలై 8, 1988:** కేరళలోని అష్టముది సరస్సులో ఐలాండ్ ఎక్స్‌ప్రెస్ పడడంతో 107 మంది మరణించారు.



అస్సాంలో భారీ వరదలకు కజిరంగా జాతీయ పార్కులో మృతి చెందిన పులి కళేబరం ప్రవాహానికి కొట్టుకొచ్చిన దృశ్యం. జాతీయపార్కులో దాదాపు 80 శాతం భూభాగం నీటమునగడంతో 178 జింకలు, 15 ఖడ్గ మృగాలు, నాలుగు ఏనుగులు, ఓ పులి మృతిచెందాయి.

ఎన్డీయేలో జేడీయూ చేరిక

- జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీర్మానం
- పార్టీ మొదట్నుంచీ నేనున్నా.. నన్నే తరిమేస్తారా?: శరద్ యాదవ్

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) నాలుగేళ్ల తర్వాత మళ్లీ ఎన్డీయే గూటికి చేరింది. బీజేపీ కూటమితో ఉన్న పాత బంధాన్ని మళ్లీ చిగురింపజేసింది. పట్నాలో శనివారం జరిగిన జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఎన్డీయేలో చేరటంపై తీర్మానం చేశారు. కాంగ్రెస్, ఆర్జేడీలతో కూడిన మహాకూటమికి జేడీయూ గుడ్ బై చెప్పింది. జాతీయకార్యవర్గ సమావేశంలో నితీశ్ మాట్లాడుతూ.. తమ వర్గంపై విమర్శలు చేస్తున్నవారు దమ్ముంటే పార్టీని చీల్చి చూపించాలని పరోక్షంగా శరద్ యాదవ్‌కు సవాల్ విసిరారు. పార్టీ జాతీయ కార్యవర్గానికి గైర్హాజరైన శరద్ యాదవ్.. పార్టీ ఎంపీ అలీ అన్వర్‌తో కలిసి 'జన్ అదాలత్' నిర్వహించారు. ప్రజలు 2015లో ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా నితీశ్ బీజేపీతో జట్టుకట్టాడని ఆయన విమర్శించారు. కాగా, ఎన్డీయేలో చేరుతూ జేడీయూ జాతీయ కార్యవర్గం తీర్మానం చేయటాన్ని బీజేపీ చీఫ్ అమిత్ షా స్వాగతించారు.

అంతా మావైపే: కేసీ త్యాగి

'పార్టీ చీఫ్, సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలో సమావేశమైన జేడీయూ జాతీయ కార్యవర్గం.. ఎన్డీయేలో చేరాలని తీర్మానించింది. దీంతో మేం ఎన్డీయేలో భాగస్వాములమయ్యాం' అని పార్టీ సీనియర్ నేత త్యాగి స్పష్టం చేశారు. '71 మంది పార్టీ ఎమ్మెల్యేలు, 30 మంది ఎమ్మెల్సీలు, పార్టీ పదాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అలాంటప్పుడు పార్టీలో చీలిక ఉందని ఎలా అంటారు?' అని త్యాగి ప్రశ్నించారు. శరద్ యాదవ్‌పై ప్రస్తుతానికి విప్ జారీ చేయబోవటంలేదని ఆయన తెలిపారు. అయితే పట్నాలో ఆగస్టు 27న ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో జరగనున్న విపక్షాల ర్యాలీకి శరద్ యాదవ్ హాజరైతే.. చర్యలు తప్పవన్నారు. బిహార్ సీఎం అధికారిక నివాసం ముందు నితీశ్, యాదవ్ వర్గాల కార్యకర్తలు ఘర్షణకు దిగారు.



అప్పుడెందుకు మాట్లాడలేదు!

తమదే అసలైన పార్టీ అని చెబుతున్న యాదవ్ వర్గం నేతలు.. దమ్ముంటే పార్టీని చీల్చాలని సవాల్ విసిరారు. 'వారికి సత్తా ఉంటే జేడీయూ శాసనసభాపక్షాన్ని చీల్చి చూపించాలి. అనవసరంగా పసలేని విమర్శలు చేయటం మానుకోండి. 2013లో ఎన్డీయే నుంచి జేడీయూ విడిపోవాలనుకున్నప్పుడు శరద్ యాదవ్ ఎందుకు మాట్లడలేదు? అప్పుడు మీరే పార్టీ అధ్యక్షులుగా ఉన్నారు కదా?' అని నితీశ్ ప్రశ్నించారు. '2004 లోక్‌సభ ఎన్నికల్లో మధేపుర నుంచి శరద్ యాదవ్ ఓడిపోతే.. అప్పటి పార్టీ చీఫ్ జార్జి ఫెర్నాండేజ్‌తో రెండుగంటలపాటు మాట్లాడి రాజ్యసభకు శరద్ యాదవ్‌ను పంపేలా ఒప్పించాను' అని నితీశ్ పేర్కొన్నారు. 'చౌదరీ దేవీలాల్‌తో కలిసి పార్టీ నిర్మాణంలో పనిచేశాను. నన్నే తరిమేయాలనుకుంటున్నారు. నేను ఎవరికీ భయపడను' అని శరద్ యాదవ్ అన్నారు.

50 ఏళ్లు పాలిస్తాం!

మధ్యప్రదేశ్ పర్యటనలో బీజేపీ చీఫ్ అమిత్ షా వెల్లడి



భోపాల్: కనీసం 50 ఏళ్లపాటు దేశాన్ని పాలించటమే తమ ఆలోచన అని బీజేపీ చీఫ్ అమిత్ షా స్పష్టం చేశారు. ఈ దిశగా పార్టీని బలోపేతం చేసేందుకు, దేశం నలుమూలలకూ పార్టీని విస్తరించేందుకు కార్యకర్తలు కృషిచేయాలని ఆయన కోరారు. భోపాల్‌లో రాష్ట్ర పార్టీ పదాధికారులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. దేశంలో బీజేపీ జెండా ఎగరని ప్రాంతం ఉండకూడదని.. ఈ దిశగా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. 'వ్యక్తిత్వమే మన పార్టీకి పునాది' అని షా తెలిపారు. అయితే 75 ఏళ్లు దాటిన వారు ఎన్నికల్లో పోటీ చేయకూడదనే నిబంధనేమీ పార్టీలో లేదని అమిత్ షా స్పష్టం చేశారు. రామ మందిర నిర్మాణం తమ మేనిఫెస్టోలో ఉందని షా తెలిపారు.

జీఎస్టీ రిటర్న్స్ దాఖలు గడువు పెంపు

న్యూఢిల్లీ: జీఎస్టీ రిటర్న్స్ దాఖలు, చెల్లింపుల గడువును ఆగస్టు 25 వరకూ పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అధిక రద్దీ కారణంగా జీఎస్టీఎన్ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జూలై నెలకు సంబంధించి జీఎస్టీ పన్ను రిటర్న్స్ దాఖలు గడువు ఆదివారంతో ముగియనుండగా మరో 5 రోజులు పెంచారు. వెబ్‌సైట్‌ను పునరుద్ధరించి పన్ను దాఖలు ప్రక్రియను ప్రారంభించామని జీఎస్టీఎన్ చైర్మన్ నవీన్ కుమార్ చెప్పారు.

పీహెచ్‌డీ విద్యార్థులకు 70 వేల ఫెలోషిప్

కోల్‌కతా: ఐఐటీ, ఐఐఎస్సీలో పీహెచ్‌డీలు చేసే పరిశోధకులకు నెలకు రూ. 70వేలు ఫెలోషిప్‌లు ఇవ్వనున్నట్లు కేంద్ర ఉన్నత విద్య సెక్రటరీ కేవల్ కుమార్ శర్మ వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పూర్‌లో జరిగిన 67వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఫెలోషిప్ స్కీమ్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఆర్థిక పరమైన కారణాల వల్లే చాలా మంది విద్యార్థులు విదేశాలకు వెళ్తున్నారని అటువంటి వారు స్వదేశంలోనే ఉండేందుకు ఈ నిర్ణయం దోహదపడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశోధకులకు ఐదేళ్ల పాటు ప్రతి నెలా రూ.70 వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ త్వరలోనే ఆమోదం తెలపనుందని, వచ్చే ఏడాది నుంచి విద్యార్థులకు ఫెలోషిప్‌లు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు.

కోర్టులవి ద్వంద్వ ప్రమాణాలు: జైట్లీ

ముంబై: పార్లమెంట్ చట్టరూపంలో రూపొందించిన టైమ్‌లైన్స్‌ని పాటించడం కార్యనిర్వాహక వ్యవస్థకు తప్పనిసరి కాగా, న్యాయ వ్యవస్థకు అలా లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించారు. భారత కోర్టులు ద్వంద్వ ప్రమాణాలను అవలంబిస్తున్నాయని పేర్కొన్నారు. కార్పొరేట్ వ్యవహారాల శాఖ శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ' సంప్రదాయంగానే మన కోర్టులవి ద్వంద్వ ప్రమాణాలు. టైమ్‌లైన్స్‌కు కార్యనిర్వాహక శాఖ కట్టుబడి ఉంటుంటే, కోర్టులు మాత్రం అవి తమకు మార్గదర్శకాలు మాత్రమే అని పేర్కొంటున్నాయి' అని జైట్లీ తెలిపారు. న్యాయశాఖ మంత్రిగా తనకు ఎదురైన అనుభవాల్ని వివరిస్తూ... సివిల్ ప్రొసీజర్ కోడ్‌ను సవరించినా ఎలాంటి మార్పు రాలేదన్నారు.

రష్యాలో కత్తితో వీరంగం

ఏడుగురికి గాయాలు

మాస్కో: రష్యాలో ఓ వ్యక్తి కత్తితో వీరంగం సృష్టించాడు. దారిన పోతున్న వారిపై విచక్షణారహితంగా దాడి చేసి ఏడుగురిని గాయపరిచాడు. వేగంగా స్పందించిన పోలీసులు దుండగుడిని కాల్చి చంపారు. శనివారం సర్గత్ పట్టణంలో చోటుచేసుకున్న ఈ ఘటనను ఉగ్రదాడిగా పరిగణించడంలేదని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ' ఉదయం దారిన వెళ్తున్న వారిపై ఆగంతకుడు దాడికి పాల్పడంతో ఏడుగురు కత్తిపోట్లకు గురయ్యారు' అని పేర్కొన్నారు. ఆసుపత్రికి తరలించిన వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా, ఐదుగురి ఆరోగ్యం స్థిరంగా ఉందని అధికారులు పేర్కొన్నారు.

నేడో రేపో విలీనం!

పళని, పన్నీర్ శిబిరాల్లో ఎడతెగని చర్చలు

సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడు సీఎం పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్‌సెల్వం వర్గాలు నేడో రేపో ఏకమవడం ఖాయమైంది. అన్నాడీఎంకే విలీన చర్చలు శనివారం తుదిఅంకానికి చేరాయి. ఒకటి రెండు రోజుల్లో శుభవార్త వింటారని పన్నీర్‌సెల్వం, పళని వర్గ అధికార ప్రతినిధి ధీరన్ స్పష్టం చేయడంతో.. ఈనెల 21న విలీనంపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని భావిస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి విలీనం ఖాయమని భారీ ప్రచారం సాగింది. అయితే పన్నీర్ శిబిరమే విలీనానికి బ్రేక్ వేసింది. అన్నాడీఎంకే విలీనానికి ఆది నుంచి పన్నీర్‌సెల్వం వర్గం వెనకడుగువేస్తోంది. పళని వర్గంతో కలిస్తే పార్టీ, ప్రభుత్వాల్లో ఏఏ పదవులు కోరాలన్న అంశంపైనే పన్నీర్ శిబిరం శుక్రవారం రాత్రంతా చర్చించారు. పార్టీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్, ప్రజాపనులు లేదా హోంశాఖతో పాటు పన్నీర్‌సెల్వంకు డిప్యూటీ సీఎం పదవి, చెమ్మలై, పాండియరాజన్‌లకు మంత్రి పదవులు ఇస్తామని పళని వర్గం ముందుగానే హామీనిచ్చింది. అయితే ఆర్థిక శాఖ ఇచ్చేందుకు నిరాకరించింది. మొదటి నుంచి శశికళను వ్యతిరేకిస్తున్న వారికి పార్టీ, ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం కల్పించాలని పన్నీర్ వర్గం డిమాండ్ చేసింది. ఏ పదవులు ఇస్తారో లిఖితపూర్వకంగా స్పష్టం చేయాలని పన్నీర్ వర్గ నేతలు పట్టుబట్టారు. అందువల్లే శుక్రవారం జరగాల్సిన విలీన ప్రక్రియ నిలిచిపోయింది. విలీనం వల్ల అన్ని విధాలా మనకు న్యాయం జరుగుతుందని, అందుకు హామీ ఇస్తానని తన వర్గ నేతలకు పన్నీర్‌సెల్వం నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా లేని మాజీ మంత్రులు నత్తం విశ్వనాథన్, కేపీ మునుస్వామిలు మంత్రి పదవులు డిమాండ్ చేస్తున్నారు. తమ కోసం రాజీనామా చేసేందుకు కొందరు ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని వారు పన్నీర్‌పై ఒత్తిడి తెచ్చారు. సీనియర్ నేతలు పాండియరాజన్, కేపీ మునుస్వామి, నత్తం విశ్వనాథన్, ఎంపీ మైత్రేయన్, ముగ్గురు ఎమ్మెల్యేలు పన్నీర్ ముందు పలు డిమాండ్లు పెట్టారు. పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారికి ఆయన నచ్చచెప్పలేకపోవడంతో చర్చలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. శనివారం తెల్లవారుజాము వరకూ నేతలతో పన్నీర్ సెల్వం చర్చలు జరిపారు. శనివారం సైతం పళనీ, పన్నీర్ వర్గాలు చర్చలు జరిపాయి.

ఆ మరణాలు.. ప్రభుత్వ హత్యలే!

గోరఖ్‌పూర్ మరణాలపై కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ విమర్శ

గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగినవి ప్రభుత్వ హత్యలేనని, 71 మందికి పైగా చిన్నారులు మృతి చెందడానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. యూపీ సీఎం ఆదిత్యనాథ్ దీన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. మృతి చెందిన చిన్నారుల తల్లిదండ్రులను పరామర్శించిన అనంతరం రాహుల్ మాట్లాడుతూ, 'ఆక్సిజన్ అందకపోవడం వల్లే తమ పిల్లలు చనిపోయారంటూ బాధిత తల్లిదండ్రులంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో చాలా మంది తల్లిదండ్రులకు ఏఎంబీయూ (ఆర్టిఫీషియల్ మాన్యువల్ బ్రీతింగ్ యూనిట్)లు ఇచ్చి.. పంప్ చేయమన్నారు. దీంతో వారు గంటలపాటు పంప్ చేస్తూనే ఉండిపోయారు' అని పేర్కొన్నారు. ఆక్సిజన్ కొరత, నిర్లక్ష్యం కారణంగానే చిన్నారులు చనిపోయారని స్పష్టంగా తెలుస్తోందని వ్యాఖ్యానించారు. 'నవ భారతదేశం గురించి మోదీ మాట్లాడతారు. ఆయన కలగంటున్న ఇండియా మాకు వద్దు. పేదలు తమ పిల్లలను చికిత్స కోసం తీసుకెళ్లేందుకు, చికిత్స అనంతరం సంతోషంగా ఇంటికి తీసుకెళ్లేందుకు అనువైన ఆస్పత్రులు కావాలి' అని కోరారు.



బాధితులను పరామర్శిస్తున్న రాహుల్

గోరఖ్‌పూర్ పిక్నిక్ స్పాట్ కాదు: రాహుల్ గోరఖ్‌పూర్ పర్యటనపై యూపీ సీఎం ఆదిత్యనాథ్ మండిపడ్డారు. గోరఖ్‌పూర్ పిక్నిక్ స్పాట్ కాదని ఎద్దేవా చేశారు. శనివారం గోరఖ్‌పూర్‌లో ఓ కార్యక్రమాన్ని యోగి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, 'షెహ్‌జాదా (రాజు) లక్నోలో, యువరాజు ఢిల్లీలో కూర్చొని ఉంటే పరిశుభ్రత ప్రాముఖ్యం తెలుసుకోలేరని నా అభిప్రాయం. వాళ్లు గోరఖ్‌పూర్‌ను పిక్నిక్ స్పాట్‌గా మార్చేందుకే వస్తారు. అయితే అందుకు మేం అనుమతివ్వం' అని అఖిలేశ్, రాహుల్‌లను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు.

బిజినెస్

ఇన్ఫోసిస్ బైబ్యాక్ ఆఫర్ @ రూ.1,150


11.3 కోట్ల షేర్ల కొనుగోలు ప్రతిపాదన

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ బోర్డు రూ. 13,000 కోట్ల విలువైన షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. షేరుకి రూ. 1,150 చొప్పున ధర నిర్ణయించింది. శుక్రవారం షేరు ముగింపు ధర రూ. 923.10తో పోలిస్తే ఇది సుమారు 25 శాతం అధికం. ప్రతిపాదన ప్రకారం 11.3 కోట్ల షేర్లను ఇన్ఫోసిస్ తిరిగి కొనుగోలు చేయనుంది. ఇన్ఫీ బైబ్యాక్ ప్రకటించడం ఇదే ప్రథమం. పోటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఏప్రిల్‌లో రూ. 16,000 కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఇన్ఫోసిస్ షేర్ బైబ్యాక్ రెండోది కానుంది. మొత్తం పెయిడప్ ఈక్విటీ క్యాపిటల్‌లో దీని పరిమాణం 4.9 శాతం మేర ఉంటుంది. బైబ్యాక్ ఆఫర్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఇన్ఫోసిస్ 7 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఇందులో కో–చైర్మన్ వెంకటేశన్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సిక్కా, తాత్కాలిక సీఈవో యూబీ ప్రవీణ్ తదితరులు ఉన్నారు. సీఈవోగా విశాల్ సిక్కా రాజీనామా తదితర పరిణామాల నేపథ్యంలో ఇన్ఫోసిస్‌పై అమెరికాలోని న్యాయవాద సంస్థలు దృష్టి సారించాయి. కంపెనీ డైరెక్టర్లు, అధికారులు.. అమెరికా చట్టాలను ఉల్లంఘించడం వల్ల స్థానిక ఇన్వెస్టర్లకు నష్టం జరిగిందా అన్న కోణంలో విచారణ ప్రారంభించాయి. ఇన్వెస్టర్లకు నష్టం జరిగి ఉంటే వారి తరఫున కంపెనీపై దావా వేసేందుకు సిద్ధమవుతున్నాయి. బ్రోన్ స్టెయిన్, గెవిట్జ్ అండ్ గ్రాస్‌మాన్, రోజెన్ లా ఫర్మ్, పామెరాంట్జ్ లా ఫర్మ్, గోల్డ్‌బర్గ్ లా పీసీ సంస్థలు ఇందులో ఉన్నాయి.

సాక్షి రౌండప్

వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । ఆగస్టు । 20 । 2017
www.sakshi.com

తాజాగా విడుదలైన గణాంకాల ప్రకారం, దేశంలో ఏనుగుల సంఖ్య 3,399 తగ్గింది. 2012లో 30,711 ఉండగా, ప్రస్తుతం 27,312కు పడిపోయాయి. అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మాత్రం 1199 పెరుగుదల నమోదైంది.



గత జన్మలో వాడే నన్ను చంపాడు..



ఆడుతూ..పాడుతూ.. చలాకీగా తిరిగే మన హీరోని విలన్ అన్యాయంగా చంపేస్తాడు. దీంతో అతనిపై పగబట్టిన మన హీరో పునర్జన్మ ఎత్తి విలన్‌ని చంపేస్తాడు. ఇలా గత జన్మలను ఆధారంగా చేసుకుని వచ్చిన మగధీర, ఈగ లాంటి తెలుగు చిత్రాలతో పాటు ఇతర భాషల్లో అనేక చిత్రాలు మనం చూసే ఉంటాం. గత జన్మలో జరిగిన సంఘటనలు పునర్జన్మలో గుర్తుకు రావడం నిజంగా ఉన్నాయంటారా..? అయితే పక్కనున్న చిత్రంలోని మూడేళ్ల బాలుడికే గత జన్మ గుర్తుకువచ్చింది.. ఇతడే మన హీరో. ఈ జన్మలో సిరియా, ఇజ్రాయెల్ సరిహద్దులోని గోలన్ హైట్స్ అనే ప్రాంతంలో పుట్టాడు. ఈ బాలుడికి మాటలు రాగానే తన కుటుంబసభ్యులకు తన గత జన్మ గురించి చెప్పాడు. గత జన్మలో తనను ఓ వ్యక్తి గొడ్డలితో తలపై నరికి చంపేశాడని చెప్పడమే కాదు.. అప్పుడు గొడ్డలితో నరికిన చోట ఉన్న ఎర్రటి గుర్తులను కూడా వారికి చూపించాడు. అలాగే తాను గత జన్మలో నివసించిన గ్రామం, తన పేరు అన్ని విషయాలు వారికి తెలిపాడు. ఇక్కడే అసలు సమయం రానే వచ్చింది. అచ్చం సినిమాల్లో జరిగిన విధంగానే మన హీరోకి తనను నరికి చంపిన విలన్ ఎదురుపడ్డాడు. ఇంకేముంది వెంటనే వాడిని గుర్తుపట్టేశాడు మన హీరో. అలాగే వాడి పూర్తి పేరు చెప్పి.. ఇతడే తనను గత జన్మలో చంపేశాడని.. తన శరీరాన్ని చంపిన ప్రదేశాన్ని కూడా చూపించాడు. బాలుడు చెప్పిన ప్రదేశంలో తవ్వి చూడగా.. అక్కడ బాలుడి అస్థి పంజరంతోపాటు చంపేందుకు ఉపయోగించిన గొడ్డలి లభించాయి. ఇంకేముంది విలన్ తానే బాలుడిని గత జన్మలో చంపేశానని ఒప్పుకున్నాడు. ఇదంతా జర్మన్ థెరపిస్ట్ ట్రూట్జ్ హార్డో 'చిల్డ్రన్ హూ హావ్ లివడ్ బిఫోర్: రీఇంకర్‌నేషన్ టుడే' అనే పుస్తకంలో రాశాడు. ఇతను ప్రస్తుత జన్మలో గత జన్మలు గుర్తుకు వచ్చిన అనేకమందిపై ఈ పుస్తకంలో రాయగా.. అందులో ఒకటే ఈ బాలుడికి సంబంధించిన కథ.

ప్రధాన పంటల ఉత్పత్తి

మొత్తం ఆహార పంటలు	
2015-16	251.57
2016-17	275.68

2016-17లో ప్రధాన పంటలు

పంట	ఉత్పత్తి
వరి	110.15
గోధుమ	98.38
ముతక ధాన్యం	44.19
మొక్కజొన్న	26.26
పప్పు ధాన్యాలు	22.95
శెనగలు	9.33
కందిపప్పు	4.78
మినప	2.80
నూనె గింజలు (మొత్తం)	32.10
సోయాబీన్	13.79
ఆవ	7.98
వేరుశెనగ	7.56
ఆముదం	1.42
పత్తి	33.09
చెరుకు	306.72

ఆధారం: కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ

ఏపీలో ఒంటరిగా బలోపేతమయ్యేందుకు కృషి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు
- పొత్తులపై ఎన్నికల సమయంలోనే నిర్ణయం
- వచ్చే ఎన్నికల్లో మాకు దక్షిణాది కీలకం



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో బీజేపీ ఒంటరిగా బలోపేతమయ్యేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు తెలిపారు. అందులో భాగంగానే పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఏపీలో త్వరలో పర్యటిస్తారని వివరించారు. ఆయన శనివారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఏపీలో ఒంటరిగా పోటీ చేయడమా లేక పొత్తులు పెట్టుకోవడమా.. లేదంటే ఎన్నికల తర్వాత పొత్తుపెట్టుకోవడమా అనేది పార్టీ నిర్ణయిస్తుందని చెప్పారు. ఏపీ, తెలంగాణలో ఒంటరిగా బలపడేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 350 పార్లమెంటు స్థానాల్లో విజయమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి దక్షిణాది కీలకం కానుందని, అన్ని దక్షిణ రాష్ట్రాల్లో పూర్తి స్థాయిలో బలపడేందుకు క్షేత్రస్థాయి నుంచి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ సంస్థాగత బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇప్పటివరకూ బీజేపీ గెలవని 150 స్థానాలపై ప్రత్యేక దృష్టిసారించినట్టు వివరించారు.

సత్యసాయి సేవలు వెలకట్టలేనివి

ఏపీ, కర్ణాటక వైద్య శాఖ మంత్రులు



త్రైమాసిక పత్రికను విడుదల చేస్తున్న మంత్రులు, ట్రస్ట్ సభ్యులు

పుట్టపర్తి అర్బన్: సత్యసాయి సేవలు వెలకట్టలేనివని ఏపీ, కర్ణాటక రాష్ట్రాల వైద్య ఆరోగ్య శాఖ మంత్రులు కామినేని శ్రీనివాస్, రమేష్‌కుమార్ అన్నారు. శనివారం అనంతపురం జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో సత్యసాయి జాతీయ వైద్య సమ్మేళనం నిర్వహించారు. విశిష్ట అతిథిగా హాజరైన కేర్ ఆసుపత్రి వైద్యులు సోమరాజు, ట్రస్ట్ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పుట్టపర్తి, బెంగళూరులోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు అత్యంత ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా, ప్రేమ పూర్వకంగా అందిస్తున్నాయన్నారు. ప్రతి నీటి చుక్క ఎలా సముద్రాన్ని చేరుతుందో.. మానవ సేవతోనే ప్రతి ఒక్కరూ భగవంతున్ని చేరవచ్చన్నారు. సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే సమ్మేళనం ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ 120 దేశాల్లో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా ఏటా 20 లక్షల మంది ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారన్నారు. అనంతరం సత్యసాయి ఆరోగ్య ప్రణాంజలి త్రైమాసిక పత్రికను విడుదల చేశారు. ఉత్తమ సేవకులను సత్యసాయి ధన్వంతరి సేవా అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ప్రసాదరావు, ఆర్‌జే రత్నాకర్, డాక్టర్లు మోహన్, సుందరేష్, నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ వైద్యసేవలు ప్రైవేటుకు

- పీపీపీ విధానంలో సీటీ స్కానర్ ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానం
- కాంట్రాక్టరు పదేళ్లు వసూలు చేసుకునేందుకు అనుమతులు
- ఏడాదికి రూ.30 కోట్లకు పైబడి వసూళ్లకు అవకాశం
- టీటీడీకి నిధుల కొరత లేకపోయినా ప్రైవేటుకు మొగ్గు



సాక్షి, అమరావతి: ప్రభుత్వం దగ్గర నిధులు లేవంటూ పీపీపీ పద్ధతిలో రోడ్లను ప్రైవేటు కాంట్రాక్టర్లుకు అప్పగించి, కొత్త రోడ్లు వేసేందుకు ఖర్చు చేసిన డబ్బులను టోల్‌గేట్లు పెట్టుకొని వసూలు చేసుకోవడానికి అనుమతి ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అదే పద్ధతిని వైద్యరంగంలోనూ ప్రవేశపెడుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులతో పేద ప్రజలకు సేవ చేసేందుకు తిరుపతిలో ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (స్విమ్స్) సేవలను కూడా పీపీపీ పద్ధతిన ప్రైవేట్ కాంట్రాక్టర్లుకు అప్పగించాలని చంద్రబాబు సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగా మొదట సీటీ స్కానర్ ఏర్పాటు ప్రక్రియను పీపీపీ పద్ధతిన ఏర్పాటు చేసేందుకు ఈ– టెండర్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. రోజుకు దాదాపు 900 మంది రోగులకు తల, గుండె, ఇతర రకాల సీటీ స్కాన్ పరీక్షలు నిర్వహించే బాధ్యతలను కాంట్రాక్టరుకు అప్పగిస్తామని నమ్మశక్యం కాని విధంగా టెండర్లలో పేర్కొన్నారు. ఒక్కొక్క పరీక్షకు ఎంత మొత్తాన్ని రోగుల నుంచి వసూలు చేసుకునే దానిపై టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టరు సెప్టెంబరు 5వ తేదీ లోగా బిడ్ దాఖలు చేయాల్సి ఉంది. టెండరు దక్కించుకునే కాంట్రాక్టరు ఆస్పత్రిలో సీటీ స్కానర్‌ను ఏర్పాటు చేసి పదేళ్ల పాటు రోగుల నుంచి డబ్బులు వసూలు చేసుకోవడానికి అనుమతి తెలిపారు. టీటీడీలో నిధుల కొరత లేకపోయినా స్విమ్స్‌లో ప్రైవేటు కాంట్రాక్టర్లకు ప్రవేశం కల్పించడంపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి.

కాంట్రాక్టరుకు ఏటా రూ. 30 కోట్లు

ప్రభుత్వం సూచించిన సీటీ స్కానర్ ఏర్పాటుకు రూ. 10 కోట్లు వరకు ఖర్చు అవుతుందని వైద్య రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఒక్కొక్క సీటీ స్కాన్ పరీక్షకు బహిరంగ మార్కెట్ పరీక్షను బట్టి రూ. 600 నుంచి రూ. 2 వేల వరకు ల్యాబ్ యజమానులు వసూలు చేస్తున్నారు. స్విమ్స్‌లో సీటీ స్కానర్ ఏర్పాటు టెండర్లు దక్కించుకునే కాంట్రాక్టరుకు ఏడాదికి పరీక్షల పేరుతో దాదాపు రూ. 30 కోట్లకు పైబడి రోగుల నుంచి వసూలు చేసుకునే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. టీటీడీ నిధులతో చేపట్టాల్సిన సేవలను పూర్తి స్థాయిలో పీపీపీ పద్ధతిన ఒక ప్రైవేట్ కాంట్రాక్టరుకు అప్పగించడం ఇదే తొలిసారని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టాల్సిన తిరుపతి– రేణిగుంట ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం, అలంకరణ పనులకు టీటీడీ నుంచి రూ.పది కోట్లు విడుదలకు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. అయితే ఈ నిర్ణయాన్ని నాలుగు రోజుల కిందటే రాష్ట్ర హైకోర్టు తప్పుపట్టిన విషయం తెలిసిందే.

పాలకమండలిని కూడా నియమించకుండా..

ఏటా రూ. 2800 కోట్ల వరకు ఆదాయం ఉన్న టీటీడీ నిధులపై పూర్తి స్థాయి పెత్తనం చెలాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఐదు నెలలుగా టీటీడీకి పాలక మండలిని కూడా నియమించకుండా కాలయాపన చేస్తోందన్న విమర్శలున్నాయి. చదలవాడ కృష్ణమూర్తి చైర్మన్‌గా కొనసాగిన పాలక మండలి పదవీ కాలం ఏప్రిల్ 26వ తేదీతోనే ముగిసింది. అప్పటినుంచి కొత్త కమిటీని నియమించలేదు. టీటీడీ పాలక మండలి నియమాకంలో ఆలస్యం అయినప్పుడు గతంలో ప్రభుత్వం కనీసం అధికారులతో స్పెసిఫైడ్ అథారిటీ కమిటీ నియమించే అనవాయితీ ఉంది. దానిని కూడా చంద్రబాబు సర్కారు పక్కన పెట్టి ఈ ఐదు నెలల కాలంలో అధికారుల కమిటీని కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో టీటీడీ నిధుల నుంచి రూపాయి సైతం ఖర్చు పెట్టాలన్నా నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే అనుమతి తెలిపాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాదాపు రూ.వంద కోట్ల టీటీడీ నిధులతో చేపట్టాల్సిన పనులకు అనుమతి తెలపాల్సిన ఫైళ్లు ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

వర్ధమాన సినీ హీరో, దర్శకుడికి రిమాండ్

విజయవాడ లీగల్: వర్ధమాన సినీ హీరోయిన్‌తో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితులైన హీరో స్టీఫెన్, దర్శకుడు చలపతికి సెప్టెంబర్ 1వ తేదీ వరకు రిమాండ్ విధించారు. విజయవాడలోని నాల్గవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఇందిరాప్రియదర్శిని ఈ మేరకు శనివారం ఉత్తర్వులిచ్చారు. వివరాల్లోకి వెళితే.. వర్ధమాన హీరో కొండూరు స్టీఫెన్ ఆలియాస్ సృజన్, దర్శకుడు పువ్వాల చలపతి ఓ సినిమా షూటింగ్ కోసం హీరోయిన్‌తో కలసి హైదరాబాద్ నుంచి విజయవాడకు వస్తున్నారు. ఈ క్రమంలో పడమట దగ్గరకు వచ్చేసరికి తనతో స్టీఫెన్, చలపతి అసభ్యంగా ప్రవర్తించారని, తన కారును నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి గురిచేశారని హీరోయిన్ పటమట పీఎస్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

'ఎమ్మార్ వ్యాక్సిన్ సురక్షితమే'

తాడేపల్లిలో బాలిక మృతి చెందింది ఆ వ్యాక్సిన్ వల్ల కాదు

గుంటూరు(తాడేపల్లి రూరల్): ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని గుంటూరు ప్రభుత్వ వైద్యులు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో ఎమ్మార్ వ్యాక్సిన్ వల్ల శుక్రవారం ఓ బాలిక మృతి చెందిందంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో జిల్లా ఆరోగ్య శాఖ విచారణ చేపట్టింది. నిపుణుల కమిటీ సభ్యులు తాడేపల్లిలో బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరుకు తరలించారు. పరీక్షల తర్వాత ఆమె ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల మృతి చెందలేదని నిర్ధారించినట్లు నిపుల కమిటీ సభ్యులు తెలిపారు.

నంద్యాల, కాకినాడల్లో గెలుపు మనదే

- వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి
- కష్టపడి పనిచేస్తే టీడీపీకి షాకిచ్చే ఫలితాలు
- బీజేపీతో పొత్తు విషయంలో చంద్రబాబు ద్వంద్వ నీతి
- 22 తరువాత కాకినాడకు జగన్ రాక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి. చిత్రంలో పార్టీ నేతలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, కన్నబాబు, చెవిరెడ్డి, ధర్మాన, విశ్వరూప్, దాడిశెట్టి రాజా, కోన రఘుపతి, చలమలశెట్టి, వంతల రాజేశ్వరి

కాకినాడ: క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న ఆదరణ, సర్వే నివేదికలు పరిశీలిస్తే రానున్న నంద్యాల, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపీ వి.విజయసాయి రెడ్డి స్పష్టంచేశారు. పార్టీ శ్రేణులు మరింత కష్టపడి పనిచేస్తే టీడీపీకి కనువిప్పు కలిగేలా ఫలితాలుంటాయని చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని ఎస్వీఎన్ ఫంక్షన్ హాలులో శనివారం సాయంత్రం ఉభయ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల పార్టీ కోఆర్డినేటర్లు, ముఖ్య నేతలతో కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సరైన ప్రణాళిక, వ్యూహంతో ముందుకు వెళ్తే వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదన్నారు. బీజేపీతో పొత్తు విషయంలో చంద్రబాబు ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నారని మండిపడ్డారు. నంద్యాలలో ముస్లిం ఓట్ల ప్రభావం అధికంగా ఉండడంతో మిత్రపక్షంగా ఉన్న బీజేపీని అక్కడ ప్రచారం చేయనీయడంలేదని, అదే కాకినాడలో 48 డివిజన్లకుగాను బీజేపీకి తొమ్మిది డివిజన్లు కేటాయించడాన్ని చూస్తే చంద్రబాబు ద్వంద్వ వైఖరి అర్థమవుతోందని విమర్శించారు. నంద్యాలలో పార్టీ విజయం కోసం అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో శ్రమిస్తూ ప్రచారం సాగిస్తున్నారని, ఇక్కడ కూడా పార్టీ నేతలు అదే విధంగా పాటుపడాలని సూచించారు. వైఎస్ జగన్ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం కోసం ఈ నెల 22వ తేదీ తరువాత రానున్నారని తెలిపారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం: ధర్మాన

మూడున్నరేళ్లలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని మాజీ మంత్రి, సీనియర్‌నేత ధర్మాన ప్రసాదరావు చెప్పారు. నంద్యాల ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు టీడీపీ రూ.100 కోట్లకు పైగా వెచ్చిస్తోందని ఆరోపించారు. కమీషన్ల కోసమే పురుషోత్తపట్నం, పట్టిసీమ ఎత్తిపోతల పథకాలను ప్రతిపాదించారంటూ మండిపడ్డారు. మూడున్నరేళ్లలో సాధించిన విజయాలు చెప్పుకోలేక జగన్‌పై నిందలు వేస్తూ కాకినాడ ఎన్నికల కోసం కరపత్రాలు రూపొందిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబు సొంత ప్రాంతమైన చంద్రగిరి ప్రజలే ఆయనను నమ్మరని, అందుకు తనను గెలిపించడమే ఓ నిదర్శనమని చంద్రగిరి ఎమ్మెల్యే, కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి చెప్పారు. చంద్రబాబు సర్కార్ అవినీతి పాలన అంతానికి నంద్యాల, కాకినాడ ఎన్నికలు నాంది కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ తూర్పు, విశాఖ జిల్లాల అధ్యక్షుడు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్, పీఏసీ సభ్యుడు పినిపే విశ్వరూప్, మాజీ మంత్రులు ఎం.పార్థసారథి, కొప్పన మోహనరావు, పి.బాలరాజు, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, దాడిశెట్టి రాజా, వంతల రాజేశ్వరి, గిడ్డి ఈశ్వరి, కళావతి, బూడి ముత్యాల నాయుడు, కోన రఘుపతి, కంబం జోగులు, పి.రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యేలు కారుమూరి నాగేశ్వరరావు, గొల్ల బాబూరావు, తానేటి వనిత, రౌతు సూర్యప్రకాశరావు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, పెండం దొరబాబు, పాముల రాజేశ్వరిదేవి, అల్లూరు కృష్ణంరాజు, కాకినాడ పార్లమెంట్ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, కాకినాడ సిటీ కో ఆర్డినేటర్ ముత్తా శశిధర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నవరత్నాల సభల షెడ్యూల్‌లో మార్పు

సాక్షి, అమరావతి: నంద్యాల ఉప ఎన్నిక, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రచార బాధ్యతలు నిర్వహిస్తున్న పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తల నియోజకవర్గాల్లో నవరత్నాల సభల నిర్వహణ, పోలింగ్ బూత్ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమాల షెడ్యూల్‌లో మార్పులు చేస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వి.విజయసాయిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ మార్పు చేసినట్లు ఆయన తెలిపారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచార బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల నియోజకవర్గాల్లో ఆగస్టు 24 నుంచి ఆగస్టు 31వరకు నవరత్నాల సభలు, సెప్టెంబరు 3 నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు పోలింగ్ బూత్ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి తప్పనిసరిగా తేదీలను ఖరారు చేసుకుని సమాచారమివ్వాలని సూచించారు. అలాగే, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన శాసనసభ్యులు, సమన్వయకర్తలు తమ నియోజకవర్గాల్లో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 5వ తేదీలోపు నవరత్నాల సభలు, సెప్టెంబర్ 6 నుంచి సెప్టెంబర్ 9వ తేదీలోగా పోలింగ్ బూత్ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి తేదీలను ఖరారు చేసుకుని సమాచారవ్వాలని ఎంపీ విజయసాయిరెడ్డి కోరారు.

ఎన్ని ఇబ్బందులు పెట్టినా మడమతిప్పం

- కాపు ఉద్యమనేత ముద్రగడ
- తుదిపోరులో పాలు పంచుకోవాలని కాపులకు పిలుపు
- నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని సీఎంపై ధ్వజం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటి గేటు వద్దే నిరసన




నిరసన దీక్షా శిబిరంలో ముద్రగడ, కాపు జేఏసీ నేతలు

కిర్లంపూడి (జగ్గంపేట): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిరకాలుగా ఇబ్బంది పెట్టినా, అణచివేతకు గురిచేసినా ఉద్యమం నుంచి మడమ తిప్పబోమని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం స్పష్టం చేశారు. ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి ఉధృతం చేయాలని కాపు జాతికి ఆయన పిలుపునిచ్చారు. ఉద్యమం ఆఖరిదశలో ఉన్నందున యావత్తు కాపుజాతి ఉద్యమంలో పాలుపంచుకోవాలన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని స్వగ్రామం కిర్లంపూడి నుంచి అమరావతికి ముద్రగడ తలపెట్టిన పాదయాత్రను గత 25 రోజులుగా పోలీసులు నిత్యం ఇంటిగేటు వద్దే అడ్డుకుంటున్న సంగతి తెలిసిందే. శనివారం ముద్రగడ, కాపునేతలు యథావిధిగా గేటు వద్ద కుర్చీలపై బైఠాయించి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం, తూర్పు గోదావరి జిల్లా కాట్రావులపల్లి, ఏలేశ్వరం, కూర్మాపురం, ముక్కొల్లు, పిఠాపురం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన కాపులు నిరసన శిబిరంలో బైఠాయించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు కాపులకిచ్చిన హామీల అమలులో నిమ్మకు నీరెత్తినట్లు, చెవిటివారి ముందు శంఖం ఊదినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తనను గృహనిర్బంధం చేయడమే గాక పోలీసులను అడ్డుపెట్టి పాదయాత్రను అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా పాదయాత్ర జరిగి తీరుతుందన్నారు. భావితరాలు బాగుండాలంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోజూ నిరసనలు తెలియజేయడమే కాక ప్రతిఒక్కరూ కిర్లంపూడికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాశ్, జీవీ రమణ, గౌతు స్వామి, గోపు అచ్యుత రామయ్య, తుమ్మలపల్లి రమేష్, గొల్లపల్లి కాశీ, సంగిశెట్టి వెంకటేశ్వరరావు, జి.సురేంద్రకుమార్, బండి పట్టాభిరామయ్య, ఏడుకొండలు, పార్థసారథి, ప.గోదావరి జిల్లా గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తానేటి వనిత, మాజీ ఎమ్మెల్సీ కోడూరు శివరామకృష్ణ, అధిక సంఖ్యలో కాపు నాయకులు పాల్గొన్నారు.

పనులు చేయకున్నా పైసలిచ్చేశారు!

పులిచింతల కాంట్రాక్టర్‌కు రూ.14 కోట్లు వెనక్కి ఇచ్చేసిన ప్రభుత్వం

- జలవనరులు, ఆర్థిక శాఖ అభ్యంతరాలు బేఖాతరు
- 2.30 లక్షల చదరపు మీటర్లలో గ్రౌటింగ్ పనులు చేయని కాంట్రాక్టర్
- పనుల విలువ రూ.15 కోట్లు... ఆ భారమంతా సర్కార్‌పైనే




సాక్షి, అమరావతి: పులిచింతల ప్రాజెక్టు కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తోంది. నిపుణుల కమిటీ సూచనల మేరకు 'గ్రౌటింగ్' పనులు చేసేది లేదంటూ పేచీకి దిగిన కాంట్రాక్టర్‌కు ధరావత్తు సొమ్ము (ఈఎండీ)లో రూ.14 కోట్లను ప్రభుత్వం వెనక్కి ఇచ్చేసింది. జలవనరుల, ఆర్థిక శాఖల అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చుతూ ఈఎండీని వెనక్కి ఇవ్వడంలో ఆంతర్యమేమిటన్నది బహిరంగ రహస్యమే. పులిచింతల ప్రాజెక్టు పనులను అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావుకు చెందిన శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ సంస్థ రూ.268.87 కోట్లకు దక్కించుకుంది. నిబంధనల ప్రకారం ఇందులో 10 శాతం సొమ్ము అంటే రూ.26.88 కోట్లను ఈఎండీ రూపంలో ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేసింది. టెండర్ ఒప్పందం ప్రకారం పనులు పూర్తి చేసి.. రెండేళ్లపాటు ప్రాజెక్టును నిర్వహించిన తర్వాతే కాంట్రాక్టర్‌కు ఈఎండీని వెనక్కి ఇవ్వాలి. ప్రాజెక్టు పనులను 2015లో పరిశీలించిన నిపుణుల కమిటీ స్పిల్‌వే అడుగు భాగంలో లీకేజీలను అరికట్టేందుకు కనీసం మూడు లక్షల చదరపు మీటర్ల పరిధిలో గ్రౌటింగ్ (బోరు వేసి కాంక్రీట్‌తో చీలికలను నింపడం) చేయాలని సూచిస్తూ సర్కార్‌కు నివేదిక ఇచ్చింది. ఆ మేరకు పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించింది. కేవలం 70 వేల చదరపు మీటర్లలో గ్రౌటింగ్ పనులు చేసిన కాంట్రాక్టర్ మిగతా పనులు చేసేదీ లేదంటూ పేచీకి దిగారు. కాంట్రాక్టర్ టీడీపీ ఎమ్మెల్యే కావడం, 'ముఖ్య'నేత అండదండలు ఉండటంతో అధికారులు చేతులెత్తేశారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేశానని, తాను చెల్లించిన ఈఎండీని వెనక్కి ఇవ్వాలని కాంట్రాక్టర్ పట్టు బట్టడం మరొక ఎత్తు. కాంట్రాక్టర్ వాదనతో ఏకీభవించిన కీలక మంత్రి.. ఈఎండీని వెనక్కి ఇచ్చేయాలంటూ జలవనరుల శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఈఎండీని వెనక్కి ఇచ్చేందుకు అనుమతివ్వాలని ఆర్థిక శాఖకు జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు.

కాంట్రాక్టర్‌కు 'ముఖ్య'నేత ఆశీస్సులు

టెండర్ ఒప్పందంలోని నిబంధనలను గుర్తు చేస్తూ.. ఈఎండీని వెనక్కి ఇవ్వలేమని ఆర్థిక శాఖ తేల్చిచెప్పింది. ఇంతలోనే కాంట్రాక్టర్ 'ముఖ్య'నేతను ఆశ్రయించారు. ఈఎండీలో రూ.14 కోట్లను ఇటీవల అధికారులు వెనక్కి ఇచ్చేశారు. ఈఎండీని వెనక్కి ఇచ్చేయడమంటే ప్రాజెక్టు పనులను కాంట్రాక్టర్ పూర్తి చేసినట్లు అంగీకరించడమేనని.. మిగిలిన 2.30 లక్షల చదరపు మీటర్లలో గ్రౌటింగ్ పనులు ఎవరు చేస్తారని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు కనీసం రూ.15 కోట్లు అవసరం. అంటే ఈ భారం ప్రభుత్వ ఖజానాపైనే పడుతుందన్న మాట.!

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం, 20-8-2017



తనకేమీ తెలియదని తెలుసుకున్నవాడు జ్ఞాని

అహంకారంతో భ్రష్టత్వం



పక్క పేజీలో

చిరంజీవి కోడలు సౌభాగ్యవతి.
ఉపాసనకు అన్ని భాగ్యాలూ ఉన్నాయి.
గొప్ప తాతయ్యలు...
మంచి తల్లిదండ్రులు...
బంగారంలాంటి భర్త... అత్తమామలు.
'ఈ బర్త్‌డేకి చిరంజీవికి కోడలిగా...
మీరేమిస్తున్నారు' అని అడిగితే...
చిరంజీవి-చరణ్‌ల అనుబంధాన్ని
గుర్తుచేసుకుంటూ...
'కుటుంబాన్ని సంతోషంగా...
ఉంచుతానని మామయ్యకు ప్రామిస్ చేస్తాను'
అని ఉపాసన అన్నారు.

మామయ్యకు ప్రామిస్





● అత్తమామలు, భర్తతో ఉపాసన

● ఇప్పటివరకూ చిరంజీవిగారు అందుకున్న 'బెస్ట్ గిఫ్ట్స్'లో 'ఉపాసన' అనే బహుమతికి ప్రముఖ స్థానమే ఉంటుంది. మరి.. ఆయన బర్త్‌డేకి మీరు ఇవ్వబోతున్న గిఫ్ట్?

ఉపాసన: మామయ్య నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ ఆయన కొడుకు రామ్‌చరణ్. తండ్రి అంటే తనకి చాలా గౌరవం, ప్రేమ. ప్రతి తండ్రీ ఏ కొడుకు నుంచైనా అలాంటి ప్రేమ, గౌరవాన్ని ఆశిస్తాడు. రామ్‌చరణ్ ప్రేమ అతని గుండె లోతుల్లోంచి వస్తుంది. మామయ్య బర్త్‌డే సందర్భంగా తన కొడుకుని, ఫ్యామిలీని ఎప్పుడూ సంతోషంగా ఉంచడానికి ప్రయత్నిస్తానని నేను ఆయనకు ప్రామిస్ చేస్తున్నాను. ఫ్యామిలీని హ్యాపీగా ఉంచడమనేది అందమైన బాధ్యతలా భావిస్తున్నా.

● చాలా గ్యాప్ తర్వాత చిరంజీవిగారు 150వ సినిమా చేశారు... ఆయన గత సినిమాల స్థాయిలో ఈ సినిమా ఉంటుందా? అంతే కష్టపడి చేయగలుగుతారా? అసలెందుకు చేయాలి వంటి ఫీలింగ్స్ ఏమైనా?

ఎంతో గ్యాప్ తర్వాత ఆయన్ని స్క్రీన్ మీద చూసినప్పుడు మొత్తం ఫ్యామిలీ అంతా ఎమోషన్ అయ్యారు. వాళ్ల ఆనందం, ఉద్వేగం చూసి, నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. మామయ్య గురించి నేనేం వర్రీ కాలేదు. కానీ, నా భర్త చిన్న వయసులో అంత పెద్ద ప్రాజెక్ట్‌ను హ్యాండిల్ చేయడం చాలా రిస్క్, టఫ్ అనిపించింది. పైగా, తను హీరోగా ఒక సినిమా చేస్తూ, తండ్రి 150వ సినిమాను నిర్మించడం అనేది ఒత్తిడికి గురి చేసే విషయం. అందుకే 'ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ రామ్‌చరణ్'. మామయ్య సూపర్‌స్టార్. ఆయన కోసం సిల్వర్ స్క్రీన్ ఆరాటంగా ఎదురు చూసింది. ఏం చేసినా అందులో ఆయన మాస్టర్. ఇవాళ ఆడియన్స్ పల్స్ ఎలా ఉందో ఆయనకు తెలుసు. ఎంత పల్స్ తెలిసినా, ఎంత సూపర్ స్టార్ అయినా.. చాలా కష్టపడాలని అర్థమైంది. మామయ్య హార్డ్‌వర్క్ చేస్తారు. 'డబుల్ ఎఫర్ట్' పెడతారు. 'ఖైదీ నంబర్ 150' మా అందరికి ప్రత్యేకమైన సినిమా. ఆనందానికి గురి చేసిన సినిమా. అదే విధంగా ఎమోషనల్‌గా కనెక్ట్ చేసిన మూవీ.

● రామ్‌చరణ్‌గారు మీకు 'ప్రపోజ్' చేసినప్పుడు 'మీ నాన్నగారు ఒప్పుకుంటారా?' అని అడిగారా? రెండు కుటుంబాలూ ఎలా రియాక్ట్ అవుతాయో అనే ఒత్తిడి ఏదైనా ఉండేదా?

ఇలాంటి విషయాల్లో ఏ అమ్మాయి అయినా 'నెర్వస్' అవుతుంది. నేనూ అలానే అయ్యాను. మామయ్య నన్ను కోడలిగా కాదు.. కూతురిలా అంగీకరించారు. అత్తమ్మ, మామయ్య నన్ను చాలా సపోర్ట్ చేశారు. నన్ను ఇంట్లోకి ఆప్యాయంగా ఆహ్వానించారు. నేను ఆప్యాయంగా పెంచుకుంటున్న నా మూగజీవాలను కూడా ఇంట్లోకి అనుమతించారు (నవ్వుతూ).

● నిజం చెప్పండి.. మీ మామయ్య మంచి యాక్టరా? మీ భర్త రామ్‌చరణా?

మా మామయ్య మాస్టర్. నా భర్త తన మాస్టర్ దగ్గర మెళకువలు నేర్చుకున్న 'స్టార్ స్టూడెంట్'.

● 'హెల్త్ కేర్' చూస్తున్న లెజెండ్ ప్రతాప్. సి. రెడ్డిగారి మనవరాలు మీరు. 'హ్యాపీ కేర్' (ఎంటర్‌టైన్‌మెంట్) చూస్తున్న లెజెండ్‌కి కోడలు. ఇద్దరు లెజెండ్స్ మధ్య ఉండటం ఎలా అనిపిస్తోంది?

ఇది నిజంగా గొప్ప విషయం. రామ్ (రామ్‌చరణ్)కు, నాకు బంధం ఏర్పడానికి ఓ కారణం ఉండి ఉంటుందని నమ్ముతున్నాను. ఇద్దరు లెజెండ్‌ల కల, ఆకాంక్షకు తగ్గట్టుగా మేమిద్దరం మా జీవితాన్ని కొనసాగించాలి. వారసత్వం గురించి పట్టించుకోకుండా మేం జస్ట్ అలా జీవితం గడిపేస్తే ఇద్దరికీ గిల్టీగా ఉంటుంది. వారసత్వం తాలూకు బాధ్యతలను మేం నిర్వర్తించాలి. ఆ అధికారాలను తీసుకోవాలి. అదే విధంగా ఆ ఇద్దరినీ ప్రేరణగా తీసుకోవాలి. ఇద్దరు లెజెండ్స్ వారసులుగా మేం వినయంగా కూడా ఉండాలి. మేం ఇద్దరం అలానే ఉంటాం.

● మీరు మంచి బిజినెస్ ఉమన్‌గా దూసుకెళుతున్నారు. ఒకవైపు హెల్త్ మ్యాగజైన్, మరోవైపు అపోలో లైఫ్ అండ్ అపోలో ఫౌండేషన్ బాధ్యతలు చూసుకుంటున్నారు. మీ కెరీర్ విషయంలో మీ మామయ్యగారి ఎంకరేజ్‌మెంట్ ఎలా ఉంటుంది?

మా మామయ్యకు నా మీద అపారమైన నమ్మకం. నేనే పని చేసినా బాగా చేస్తానని నమ్ముతారు. అయినప్పటికీ ఇంకా బెటర్‌గా చేయమని ఎంకరేజ్ చేస్తారు. ఉద్యోగం చేసే ఆడవాళ్లంటే మామయ్యకు గౌరవం, నమ్మకం.

● మీ మావయ్య యాక్ట్ చేసినవాటిలో మీకు బాగా నచ్చిన సినిమాలు?

ఫస్ట్ 'జగదేకవీరుడు అతిలోక సుందరి'. ఆ తర్వాత 'ఇంద్ర', 'ఠాగూర్' సినిమాలు చాలా ఇష్టం.

● వేరు వేరు ప్రపంచాలకు చెందిన మీ తల్లిదండ్రులు, చరణ్‌గారి తల్లిదండ్రులు కలిసినప్పుడు ఎలా ఉంటుంది? ఏదైనా సరదా సంఘటనలు ఉంటే షేర్ చేసుకుంటారా?

నిజమే.. రెండు కుటుంబాల వాళ్లం వేరు వేరు ప్రపంచానికి చెందినవాళ్లం. కానీ, మా ఇద్దరి తల్లిదండ్రులు బాగా కలిసిపోతారు. ఫన్నీ మూమెంట్స్ చాలా ఉన్నాయి. అయితే అవన్నీ పర్సనల్. రెండు కుటుంబాలూ కలిసినప్పుడు టేస్టీ ఫుడ్‌ని ఎంజాయ్ చేస్తాం. ఒకరి కంపెనీ మరొకరికి నచ్చుతుంది.

● మీ మామయ్యగారి, చరణ్‌గారి అనుబంధం ఎలా ఉంటుంది?

అద్భుతంగా ఉంటుంది. ఇద్దరి మగవాళ్ల మధ్య ఉన్న ఆ అనుబంధాన్ని ఓ తల్లి, భార్య, సోదరి చెప్పలేరు. మాటల్లో చెప్పలేని అనుబంధం వాళ్లది. ఇద్దరికీ ఒకరకంటే మరొకరికి ప్రేమ, గౌరవం. ఆ ప్రేమ, గౌరవాన్ని ఎలా చూపించుకోవాలో ఇద్దరికీ బాగా తెలుసు.

- డి.జి. భవాని

ఆగస్టు 22 చిరంజీవి బర్త్‌డే స్పెషల్ ఇంటర్వ్యూ కోడలు ఉపాసనతో..

'మిస్టర్ సి' అలాంటి వ్యక్తే!



● రామ్‌చరణ్, ఉపాసన పెళ్లి ఫొటో

● మీ అమ్మగారు శోభన కామినేని 'పంక్టీలియస్'. జాతీయ స్థాయి స్క్వాష్ ప్లేయర్ కూడా. మరి.. తనకు అల్లుడిగా స్పోర్ట్స్‌మేన్ రావాలని ఆమె, జమీందారి కుటుంబం నుంచి వచ్చిన మీ నాన్నగారు అనిల్‌కి అలాంటి కుటుంబానికి చెందిన అబ్బాయి అల్లుడవ్వాలని ఉండేదా? చరణ్‌గారి గురించి చెప్పినప్పుడు ఆమె ఎలా రియాక్ట్ అయ్యారు?

పెళ్లి విషయంలో నా పేరెంట్స్‌కి అలాంటి పట్టింపులు లేవు. నేను బాగా ఇష్టపడి, గౌరవించే వ్యక్తితో పెళ్లి చేయాలనుకున్నారు. ఆ వ్యక్తితో నా జీవితం బాగుండాలనుకున్నారు. 'మిస్టర్ సి' (రామ్‌చరణ్) అలాంటి వ్యక్తే.

సెట్‌లోకి సూర్యుడొచ్చాడు!




● అల్లు అర్జున్

ఎక్కడొచ్చాడు? అసలు ఆకాశమంతా మేఘాలు, చిన్ని చిన్ని చినుకులు, వర్షాలు... వీటి మధ్యలో సూర్యుడికి చోటేది? ఆయన ఇంట్లోకి, సెట్‌లోకి వచ్చే దారేది? అనేగా మీ డౌటు! ఇక్కడ చెబుతున్నది ఆకాశంలో సూర్యుడి గురించి కాదు, వక్కంతం వంశీ సెట్‌లో సూర్య గురించి. అల్లు అర్జున్ హీరోగా లగడపాటి శిరీషా శ్రీధర్ నిర్మిస్తున్న సినిమా 'నా పేరు సూర్య-నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అల్లు అర్జున్ సూర్య పాత్రలో నటిస్తున్నారు. శుక్రవారం అల్లు అర్జున్ ఈ సెట్‌లోకి ఎంటరయ్యారు. ఇప్పుడు జరుగుతున్నది సెకండ్ షెడ్యూల్. హీరో లేకుండానే ఫస్ట్ షెడ్యూల్ పూర్తి చేశారు. త్వరలో హీరోయిన్ అనూ ఇమ్మాన్యుయేల్ కూడా షూటింగ్‌లో పాల్గొంటారట. హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుంటే... వీకెండ్స్‌లో ముంబైలో మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. విశాల్-శేఖర్ సంగీతమందిస్తున్న ఈ సినిమాలో పాటలు రాయడానికి రామజోగయ్య శాస్త్రి, ఆయనతో దర్శకుడు శనివారం ఉదయం ముంబై వెళ్లారు.

థ్రిల్.. నవ్వుల్

అల్లరి నరేశ్, నిఖిల విమల్ జంటగా జి. ప్రజిత్ దర్శకత్వంలో బొప్పన చంద్రశేఖర్ నిర్మించిన చిత్రం 'మేడమీద అబ్బాయి'. నీలిమ సమర్పకురాలు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుదిదశకు చేరుకున్న సందర్భంగా బొప్పన చంద్రశేఖర్ మాట్లాడుతూ– ''కొత్త కథతో రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సిన్మాలో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ఉంటుంది. థ్రిల్లింగ్‌గా ఉంటూనే నరేశ్ శైలి వినోదం పంచుతుంది. 'గమ్యం, శంభో శివ శంభో' తర్వాత ఆ తరహా సున్నితమైన కథతో నరేశ్ చేస్తున్న చిత్రమిది. తన కెరీర్‌లో మరో మైలురాయిలా నిలుస్తుందనే నమ్మకం ఉంది. సెప్టెంబరు 8న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకరావడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. అవసరాల శ్రీనివాస్, జయప్రకాశ్, తులసి, సుధ, 'సత్యం' రాజేష్, నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఉన్ని ఎస్ కుమార్, సంగీతం: షాన్ రెహమాన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఎం.ఎస్.కుమార్.



● 'అల్లరి' నరేశ్

హింస.. అహింస ఒకేసారి ఎదురైతే..?

మంచు మనోజ్ హీరోగా అజయ్ ఆండ్రూస్ నూతక్కి దర్శకత్వంలో ఎస్.ఎన్. రెడ్డి, లక్ష్మీకాంత్ నిర్మించిన చిత్రం 'ఒక్కడు మిగిలాడు'. అనీషా అంబ్రోస్ హీరోయిన్. సెప్టెంబర్ 8న విడుదల కానున్న ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను శనివారం మంచు లక్ష్మి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ''నా తమ్ముడు మనోజ్ నటుడిగా నాకెంతో ఇన్‌స్పిరేషన్ ఇస్తుంటాడు. కొత్త రకం సినిమాలు, పాత్రలు చేయాలనుకుంటాడు. 'మనోజ్ ఇండస్ట్రీకి ఒక వరం' అని నేను భావిస్తున్నాను. దర్శకుడు అజయ్ మంచి హార్డ్‌వర్కర్. నిర్మాతలకు సినిమాల పట్ల మంచి ప్యాషన్ ఉంది'' అన్నారు. ''నేను రెండు పాత్రలు చేయగలనని నమ్మి నాతో సినిమా చేసిన దర్శకుడు అజయ్, నిర్మాతలకు నా కృతజ్ఞతలు. సినిమా అద్భుతంగా వచ్చింది'' అన్నారు మనోజ్. ''హింస, అహింస అనే రెండు అనుభవాలు ఎదురైతే ఆ పరిస్థితులకు తగ్గట్లు ఎలా ప్రవర్తిస్తారో అలా ఉంటుంది మనోజ్‌గారి క్యారెక్టరైజేషన్. ఒక దేశం, రాష్ట్రం, కుటంబంలో పెద్ద ఫెయిల్ అయితే ఆ ప్రభావం ఆ సమాజం లేదా ఆ కుటుంబంపై ఎలా ఉంటుందనేదే చిత్రకథ. సినిమా కోసం మనోజ్ ఒక దశలో 20 కేజీల బరువు పెరిగారు. ఆ తర్వాత పది కేజీలు తగ్గారు'' అన్నారు అజయ్.



● అజయ్ ఆండ్రూస్, మంచు మనోజ్, మంచు లక్ష్మి, ఎస్.ఎన్. రెడ్డి, లక్ష్మీకాంత్, శివ నందిగం



ఆచార్య దేవోభవ

తనకేమీ తెలియదని తెలుసుకున్నవాడు జ్ఞాని



అధ్యాపకుడు అంటే ఏది చదవాలో అది చదివిస్తాడు. ఏ చదువయినా ఈశ్వరుడి దగ్గరకు చేరుకునేటట్లు చేస్తాడు. గురువు వినీతుడు. శిష్యుడు వినేయుడు. గురువుచేసే మొదటి పని వినయాన్ని నేర్పడం. అసలు విద్య అన్న మాటకు ఒక అర్థం–విత్ అంటే తెలుసుకొనుట. రెండవ అర్థం–నాకేమీ తెలియదని తెలుసుకొనుట. కానీ మానవ నైజం ఏమిటంటే– సరస్వతీ కటాక్షం లేదంటే (నీ కేమీ తెలియదంటే) ఎవ్వడూ ఒప్పుకోడు. లక్ష్మీకటాక్షం (పుష్కలంగా సంపద/డబ్బు) ఉందంటే ఒప్పుకోడు. 'నాకేం తెలుసండీ' అనగలగాలంటే చాలా తెలిసి ఉండాలి. కొన్ని తెలుసుకున్న తరువాత... 'ఎన్ని గ్రంథాలున్నాయి, ఎంతమంది రుషులున్నారు, ఎన్నిదర్శనాలు, ఎంతమంది మహానుభావులు. అవన్నీ చదవడానికి నా జీవితం ఏం సరిపోతుంది. దీనికే సరిపోకపోతే ఇక వాటిని ఎప్పుడు అనుభవంలోకి తెచ్చుకోవాలి... అయ్యబాబోయ్, నాకేం తెలియదండీ' అంటాడు. బాగా తెలిసున్న వాడి లక్షణం నాకేమీ తెలియదని వినయంతో ఉండడం.

సుందరకాండలో సీతమ్మ హనుమని పిలిచి– 'అంతమంది వానరులొచ్చి అటుపక్కన సముద్రపు ఒడ్డున ఉండిపోయారు కదా, నువ్వొకడివే కదా ఇక్కడికి వచ్చావు, రేపు రామ– రావణ యుద్ధం జరిగితే ఎంతమంది వానరులు వస్తారు' అని సందేహం వ్యక్తం చేస్తే హనుమ అంటాడు ''అమ్మా! నీకు తెలుసుకదా, రాణివాసంలోని మహారాణి దగ్గరకు ఎవర్నయినా పంపాల్సి వచ్చినప్పుడు ప్రభువులు తమ దగ్గరున్న సేవకుల్లో అందరికన్నా పనికి మాలిన వాడెవడో వాడిని పంపిస్తారు. అమ్మా, సుగ్రీవుడు నన్ను పంపించాడంటే–నాతో సమానులు, నాకన్నా అధికులున్నారు కానీ, నాకన్నా తక్కువ వాళ్ళు అక్కడ లేరమ్మా'' అన్నాడు. అదీ వినయం. అందుకే హనుమ పాదాలు పట్టుకుంటే బుద్ధి, వినయం లభిస్తాయంటారు.

కంచి కామకోటి పీఠాధిపతి శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారిని శిష్యులొకసారి 'మిమ్మల్ని జగద్గురువని సంబోధించాలని ఉంది... అలా పిలవొచ్చా– అని అడిగారు. దానికాయన ''జగద్గురువంటే ఒక సమాసం ప్రకారం 'జగత్తునంతా గురువుగా కలిగినవాడు' అనే అర్థంలో నేను జగద్గురువునే. ఎందుకంటే ఇంతమంది నేను ప్రతిరోజూ నేర్చుకుంటున్నాను క

అన్నారు. అదీ ఆయన వినయం.

శిష్యుడు అంటే శిక్షింపబడేవాడు.

ఉండి ఇంద్రియములు శిక్షింపబడిన వా

గురువుగారి పేరు వినబడినా, ఆయన

ఇంద్రియాలు అదుపులోకి రావాలి. చూ

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

జెన్‌పథం

లోటుపాట్లు అనేవే లోపం!!

ఆయన ఓ గురువు. చిత్రకారుడు కూడా. ఆయన ఓ బొమ్మ గీస్తున్నారు. దగ్గరలోనే ఓ శిష్యుడు నిల్చుని చూస్తున్నాడు. అంతేకాదు, మధ్యమధ్యలో అతను విమర్శిస్తున్నాడు కూడా.

గురువుగారు ఎలాగైతేనేం బొమ్మ గీశారు. అదేమంత గొప్పగాలేదు. ఇద్దరిలోను దిగులు.

దేనినైనా చక్కగా చేసే తన గురువు ఈరోజు ఎందుకు సరిగ్గా గీయలేదు? ఆయనకు ఏమైంది? అని ఆలోచించాడు శిష్యుడు.

గురువు కూడా రకరకాలుగా ఆలోచించి గీసినా అదేమంత చక్కగా అమరలేదు. ఆయన దిద్దేకొద్దీ అది మరింత పిచ్చిగా తయారవుతోంది.

శిష్యుడు బొమ్మ బాగులేదని చెప్తూ వచ్చాడు.

చివరికి వర్ణాలన్నీ అయిపోయాయి. ''వెళ్లి కాస్త వర్ణాలు తీసుకురా....''అని చెప్పారు గురువు శిష్యుడితో.

శిష్యుడు లేచి వెళ్ళాడు.

గురువు తనదగ్గరున్న కుంచెలను మారుస్తున్నారు.

కాసేపటికి శిష్యుడు వచ్చాడు. శిష్యుడికి ఆశ్చర్యం వేసింది. బొమ్మ పూర్తి అయిపోయింది. అద్భుతంగా ఉంది.

''గురువుగారూ! బొమ్మ చాలా గొప్పగా ఉంది...'' అన్నాడు ఆనందంతో.

గురువు నవ్వుతూ ''నువ్వు ఇక్కడే ఉండటంతో ఆ సమస్య తలెత్తింది. నువ్వు చూస్తున్నావు అనే విషయం నన్ను ఏదో చేసింది. ఆ భావంతోనే బొమ్మ సరిగ్గా రాలేదు. పక్కన విమర్శించే ఓ మనిషి ఉంటే ఏ సృష్టీ సరిగ్గా రాదు. మనసులో ప్రశాంతత ఉండదు. ఆత్మ ప్రశాంతంగా లేకుంటే సృష్టిలో క్రమం తప్పుతుంది. పూర్ణత్వం రాదు... నువ్వు వెళ్ళిపోయావు. నాలో నాపై ఉన్న నిషేధం, ఒత్తిడి పోయాయి. ఆ స్థితిలో చిత్రం చక్కగా రూపుదిద్దుకుంది. పూర్ణత్వం ఏర్పడాలనే తలపే అపూర్వాన్ని పుట్టిస్తుంది. మనస్సుని నిండుగా అర్పించినప్పుడు లోటుపాట్లు పటాపంచలవుతాయి. అందుకే అంటున్నా, లోటు అనేదే ఓ లోపం. అది ఉన్నంతవరకూ ఏదీ పూర్ణం కాదు. అర్ధమనస్సుతో ఏదీ చేయకూడదు. సహజత్వం అనేదే పూర్ణత్వం. సహజంగా చేసేదేదైనా పరిపూర్ణమే'' అన్నారు.

- యామిజాల జగదీశ్



వరా

ఆగస్ట్ 24, గురువార

హిరణ్యాక్షుడనే రాక్షసుని

వతారం దాల్చిన రోజుకే వ

దినాన శ్రీమహావిష్ణువును వ

పురాణం లేదా విష్ణు సహస్రనా

పంచలై, అనేకమైన శుభఫలితాల

మైన వరాహస్వామి ఆలయంలో

తాయి. తిరుమలలో కొలువై ఉన్న

స్వామివారి

గుతా

ప



సాక్షి ఫ్యామిలీ
సన్నిధి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం
20-8-2017



ఎప్పుడూ
ని చూసి
నుక'

వినయం
డు శిష్యుడు.
కనబడినా
డకూడనిది



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కన్ను చూడదు, స్మరించకూడనివి మనసు స్మరించదు, వినకూడనివి చెవులు వినవు. అలా ఇంద్రియాలను శిక్షించుకుని, నిగ్రహించుకుని, శమదమాదులు నేర్చుకుని గురువు ముందు కూర్చున్నవాడు శిష్యుడు.

అందుకే శంకరాచార్యులవారు షట్పదీ స్తోత్రం చేస్తూ 'నా అవినయాన్ని తీసేసి వినయాన్ని కటాక్షించు' అన్నారు. మొదట వినయం నేర్పినవాడు గురువు, ఆయన అధ్యాపకుడు. చదువు నేర్పుతాడు.

ఉపాధ్యాయుడు అని మరో పేరు. అనేకమైన క్రియాకలాపాల వల్ల గురువు ఇన్ని పేర్లతో పిలవబడతాడు. లౌకికంగా అర్థం చెప్పాలంటే – కొంత ద్రవ్యాన్ని జీతంగా తీసుకుని పాఠం చెప్పేవాడు ఉపాధ్యాయుడు అని. మరొక అర్థంలో – కుమారుడికి ఉపనయనంచేసే తండ్రి చెపుతున్నట్లుగా ''ఉపేధ్య–తస్మాత్ అధీయతా'' ఉపేధ్య అంటే వెళ్ళు. ఆయన దగ్గరకు వెళ్ళు, తస్మాత్ అధీయతా.. ఇప్పుడు ఆ మహానుభావుడి దగ్గరకువెళ్ళి నేర్చుకో అని తండ్రి ఎవరివంక చేయి చూపించి పంపుతాడో, ఎవరు వేదం నేర్పుతారో ఆయన ఉపాధ్యాయుడు.

ఉపశమనం

రుణబాధలు పీడిస్తున్నాయా?

నిత్యం కొందరికి ఆదాయానికీ వ్యయానికీ పొంతన ఉండదు. ఏదో ఒక ఇబ్బంది ముంచుకొస్తూ అప్పుల ఊబిలోకి నెట్టేసే పరిస్థితులు ఎదువుతూ ఉంటాయి. ఇలాంటి సమస్యను అధిగమించాలంటే...
● ప్రతిరోజూ అంగారక స్తోత్రాన్ని పఠించాలి. మంగళవారం రోజున పురోహితులకు ఏడు కిలోల కందులు, ఒకటిన్నర కిలోల బెల్లం, ఎర్రని వస్త్రాలు తగిన దక్షిణతో కలిపి దానంగా ఇవ్వాలి ● సోమవారం ప్రదోష సమయంలో శివాలయానికి వెళ్లి, శివలింగానికి వరిపిండితో అభిషేకం చేయించాలి. లేదా ఇంట్లోనే పూజామందిరంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి వరిపిండితో అభిషేకం చేసుకోవచ్చు. ఈ పరిహారాన్ని కనీసం పదకొండు వారాలు పాటించాల్సి ఉంటుంది ● శ్రీ లక్ష్మీనృసింహ రుణ విమోచన స్తోత్రాన్ని అనుదినం పఠించాలి. వీలుంటే నారసింహ క్షేత్రాన్ని దర్శించుకుని, స్వామివారికి చందనం. పూలు, పాలు, తేనె, పానకం సమర్పించాలి ● శుక్రవారం రోజున ఆకలితో ఉన్నవారు తారసపడితే వారికి తృప్తిగా భోజనం పెట్టండి. కనీసం ఐదు ఆదివారాలు ఆవుకు బెల్లం కలిపి చేసిన రొట్టెలు స్వయంగా తినిపించండి ● ఇంట్లో నగదు, విలువైన వస్తువులను భద్రపరచే బీరువా, క్యాష్‌బాక్స్ వంటి వాటిలో చిన్న సైజులో ఉండే చింతచెట్టు కొమ్మను కూడా ఉంచండి. బీరువా, క్యాష్‌బాక్స్‌లలో ఏడు దేగ ఈకలను ఉంచినా ఫలితం ఉంటుంది.

- పన్యాల జగన్నాథ దాసు

సువార్త

అహంకారంతో భ్రష్టత్వం



పరుగెత్తడం గొప్ప విషయమే, కాని పరుగెత్తుతూ పడిపోకుండా చూసుకోవడమూ ముఖ్యమే. పరుగు పందెంలో పాల్గొనేవారికి కోచింగ్ ఇచ్చే నిపుణులు కాలు మడతపడి పోకుండా ఎలా పరుగెత్తాలో మెలకువలు చెబుతారు. అపొస్తలుడైన పౌలు కూడా 'తాను నిలుచున్నానని తలంచేవాడు పడిపోకుండా జాగ్రత్తపడాలి' అంటాడు (1కొరింథీ 10:12). హిమాలయ శిఖరాన్ని కూడా పడేయగల శక్తి అహంకారానిది. విశ్వాసుల ఆత్మీయ పురోభివృద్ధికి అడ్డుపడే ప్రధాన శత్రువు అహంకారం. విశ్వాసులుగా, సేవకులుగా దేవుని రాజ్య నిర్మాణంలో భాగంగా మనం చేసేదంతా దేవుడిచ్చే శక్తితోనే సాధ్యమవుతోందని మర్చిపోయి, 'ఇదంతా నా ప్రతిభే!' అని భావించిన మరుక్షణం నుండి పతనం ఆరంభమవుతుంది. ఈ స్వాతిశయమే భ్రష్టత్వంలో పడవేస్తుంది. లోకంలో ఎదుర్కొనే ప్రతిరోదననూ జయించే ఆత్మీయశక్తిని దేవుడు విశ్వాసిలో, సేవకుల్లో నిక్షిప్తం చేశాడు. అయితే 'అహంకారం' ఆ శక్తిని దొంగిలించి లేదా నిర్వీర్యపర్చి మనల్ని ఆత్మీయంగా బలహీనుల్ని చేస్తుంది. చూస్తూండగానే పతనం అంచులకు లాక్కుపోతుంది.

మన చిన్న చిన్న విజయాలు, ఆర్జించిన జ్ఞానం, అనుకోకుండా కలిసొచ్చిన సిరి, అహం విజృంభించబడడానికి చాలాసార్లు దోహదం చేస్తుంది. ఆదిమకాలంలో ప్రపంచంలోనే అత్యంత గొప్ప మేధావిగా పేరుగాంచిన గమలీయేలు పాదాల వద్ద జ్ఞానాభ్యాసం చేసిన పౌలు, ఎన్నడూ అతిశయించలేదు. దేవుడిచ్చిన పరలోక భాగ్యం, పరలోక జ్ఞానం ముందు తన ఈ లోకజ్ఞానం 'వ్యర్థ పదార్థమే'నని ఆయన ప్రకటించాడు. అపరిచితులున్న కొత్త కొత్త ప్రాంతాలకు కూడా వెళ్ళి అక్కడ పరిచర్య చేసి కొత్తవిశ్వాసులతో చర్చిలు స్థాపించిన ఘనవిజయాలు పరిచర్యలో చవిచూసినా, నరకానికి పాత్రుడనైన తనను పరలోక పౌరుడిగా మార్చిన యేసుక్రీస్తు ప్రేమకు తాను రుణం తీర్చుకొంటున్నానన్నాడే తప్ప అదంతా తన ప్రతిభ అని ఎన్నడూ పొంగిపోలేదు.

బైబిలులోని కొత్త నిబంధన పుస్తకాల్లో సగం పౌలు రాసినవే! ఈనాడు క్రైస్తవంగా లోకం అర్థం చేసుకొంటున్న ఆత్మీయ సంగతులన్నీ ఆయన ఆవిష్కరించినవే! అంతటి మేధావి అయినా పౌలు, యేసుక్రీస్తు ప్రేమను అందరికీ పంచేందుకు తనను తాను మనుషులందరికీ దాసునిగా మారానని రాసుకున్నాడు (1 కొరింథీ 9:22). ఈ రెండువేల ఏళ్ళ క్రైస్తవ చరిత్రలో అపొస్తలుడైన పౌలు చేసినంత పరిచర్య ఎవరూ చేయలేదు, ఆయనలాగా శ్రమించినవారూ లేరు. అంతటివాడే తాను బానిసనని చెప్పుకుంటే, కొద్దిపాటి పరిచర్యకే కాలరెగరవేసే వారినేమనాలి? వినయం, సాత్వికత్వం, ప్రేమ, మృదుభాష్యమే విశ్వాసి లక్షణాలు.

- రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

సందర్భం

...హ జయంతి

...ం: భూమిని చాప చుట్టలా చుట్టిన
సంహరించడానికి విష్ణుమూర్తి వరాహా
...రాహ జయంతి అని పేరు. ఈ పర్వ
...రాహావతారంలో పూజించడం, వరాహ
...మ పారాయణ చేయడం వల్ల పాపాలు పటా
...లనిస్తుంది. ఈవేళ మధురలోని అతి ప్రాచీన
విశేషమైన పూజలు, ఉత్సవాలు జరుగు
...భూ వరాహస్వామి ఆలయంలో కూడా
...కి విశేషపూజలు, పంచామృతాభిషేకాలు జరు
...యి. వరాహ జయంతిని జరుపుకునేవారు
...గలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం వేళ
కలశంలో వరాహస్వామిని ఉంచి, పండి
తులకు దానం ఇచ్చి, వారి ఆశీస్సులం
దుకోవాలి. వరాహస్వామి ప్రతిమ
లభించనివారు వస్త్ర, వస్తు
దానాలు కూడా చేయ
వచ్చు.



రాఫెల్ నాదల్‌కు మళ్లీ షాక్

సోమవారం మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్న స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్‌కు సిన్సినాటి మాస్టర్స్ టోర్నమెంట్‌లో చుక్కెదురైంది. ఆస్ట్రేలియాకు చెందిన నిక్ కిరియోస్‌తో శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో నాదల్ 2–6, 5–7తో ఓడిపోయాడు. రెండు వారాల వ్యవధిలో రెండు మాస్టర్స్ టోర్నీల్లో పాల్గొన్న నాదల్ క్వార్టర్ ఫైనల్‌ను దాటలేకపోయాడు. గతవారం రోజర్స్ కప్‌లో నాదల్ కెనడాకు చెందిన 143వ ర్యాంకర్ షపోవలోవ్ చేతిలో ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఓడిపోయాడు.

ప్రపంచకప్ సైన్యం కోసం!

శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌ను సునాయాసంగా 3–0తో క్లీన్ స్వీప్ చేసిన భారత జట్టు ఇప్పుడు వన్డే సిరీస్‌పై దృష్టి పెట్టింది. అయితే భారత్ మాత్రం దీన్ని కేవలం ద్వైపాక్షిక సిరీస్‌గా మాత్రమే చూడటం లేదు. ఎందుకంటే ఇప్పటికే చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ తమ ప్రపంచకప్ సన్నాహకాలు ప్రారంభమైనట్టే అని ప్రకటించారు. ఓ ఏడాదిపాటు రొటేషన్ ప్రకారం తమ యువ ఆటగాళ్ల ప్రదర్శనను అంచనా వేయాలని భావిస్తోంది. ఇప్పటి నుంచే తమ వనరులను సరిచూసుకునేందుకు ఇది ఓ అవకాశంగా తీసుకోనుంది. ఇక సీనియర్ బ్యాట్స్‌మన్ ఎంఎస్ ధోనిపై అందరి దృష్టి నెలకొనడంతో పరిమిత ఓవర్ల మ్యాచ్‌లో తన సత్తా ఏమిటో నిరూపించుకోవాల్సి ఉంది. మరోవైపు ప్రపంచకప్‌కు నేరుగా బెర్త్ దక్కించుకోవాలంటే శ్రీలంక మరో రెండు విజయాలు సాధించాల్సి ఉంది. అసలే ఆత్మవిశ్వాసం అడుగంటిన వేళ ఈ వన్డే సిరీస్‌లో ఆతిథ్య జట్టు ఏమేరకు రాణించగలదో వేచిచూడాలి.

ప్రయోగాల బాటలో భారత్ ◆ ధోనిపైనే అందరి దృష్టి
శ్రీలంకతో నేటి నుంచి ఐదు వన్డేల సిరీస్
మధ్యాహ్నం గం. 2.30 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



దంబుల్లా: టెస్టు సిరీస్‌లో దుమ్మురేపిన టీమిండియా వన్డేల్లోనూ మెరుపులు మెరిపించేందుకు ఆతృతగా ఎదురుచూస్తోంది. శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు స్థానిక రణగిరి దంబుల్లా అంతర్జాతీయ మైదానంలో తొలి మ్యాచ్ జరగనుంది. మూడు టెస్టుల సిరీస్‌లో శ్రీలంకను చితక్కొట్టిన కోహ్లి బృందం ఎనలేని ఆత్మవిశ్వాసంతో ఉంది. అలాగే 2019 వన్డే ప్రపంచకప్ కోసం జట్టును ఇప్పటి నుంచే తయారు చేయాలనే ఆలోచనతో ఉన్న టీమ్ మేనేజిమెంట్ ఆ దిశగా ఈ సిరీస్‌ను ఉపయోగించుకోవాలనుకుంటోంది. బలహీనంగా కనిపిస్తున్న లంకపై యువ ఆటగాళ్లను పరీక్షించనుంది. ఇప్పటికే యువరాజ్ సింగ్‌పై వేటు వేయగా... మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనిపై తాను ప్రపంచ కప్ జట్టులో ఉండాల్సిన ఆటగాడినే అని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఉంది. ఇక ఈ సిరీస్‌కు ముందు జింబాబ్వేపై అవమానకర రీతిలో 2–3 తేడాతో ఓడిన లంక పటిష్ట భారత్‌ను నిలువరించి పోయిన పరువును దక్కించుకోవాలని చూస్తోంది. ప్రస్తుతం వన్డే ర్యాంకింగ్స్‌లో ఎనిమిదో స్థానం (88 పాయింట్లు)లో ఉన్న లంక సెప్టెంబర్ 30 కటాఫ్ తేదీలోపు నేరుగా ప్రపంచకప్ బెర్త్ దక్కించుకోవాలంటే ఈ సిరీస్‌లో కనీసం రెండు మ్యాచ్‌లు గెలవాలి.

నాలుగో స్థానంలో రాహుల్...

వన్డేల కోసం భారత జట్టు మారినా ఫామ్‌కు మాత్రం ఢోకా లేదు. అన్ని విభాగాల్లో జట్టు పటిష్టంగానే కనిపిస్తోంది. గాయం నుంచి కోలుకున్న అనంతరం టెస్టు సిరీస్‌లో బరిలోకి దిగిన ఓపెనర్ లోకేశ్ రాహుల్ భీకర ఫామ్‌ను చాటుకున్నాడు. అయితే వన్డేల్లో అతడిని నాలుగో స్థానంలో బరిలోకి దించనున్నారు. గతేడాది అరంగేట్రంలోనే శతకం బాదిన అతను గాయాల కారణంగా కేవలం ఆరు వన్డేలు మాత్రమే ఆడగలిగాడు. అన్నింట్లోనూ ఓపెనర్‌గానే బరిలోకి దిగాడు. అయితే ఈసారి ఓపెనింగ్ స్లాట్ రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లతో భర్తీ చేస్తారు. ప్రపంచకప్ అంచనాల్లో రాహుల్ కచ్చితంగా ఉంటాడు కాబట్టి అతడిని బెంచ్‌కే పరిమితం చేయలేరు. అందుకే అతడి స్థానాన్ని మిడిలార్డర్‌కు మార్చనున్నారు. అయితే 2015 వరల్డ్ కప్ నుంచి ఇదే స్థానంలో అజింక్య రహానే మెరుగ్గానే ఆడుతున్నాడు. కానీ రహానే ఇప్పుడు మూడో ఓపెనర్‌గానే ఉండే అవకాశం ఉంది. ఐదో స్థానంలో ధోని రావడం ఖాయమే. ఇక మనీష్ పాండే, హార్దిక్ పాండ్యా ఆ తర్వాత స్థానాల్లో దిగనున్నారు. బుమ్రా, భువనేశ్వర్ పేస్ బౌలింగ్ విభాగంలో కీలకం కానున్నారు. స్పిన్‌లో కుల్దీప్‌తో పాటు అక్షర్ పటేల్, యజువేంద్ర చహల్‌లలో ఒకరికి చాన్స్ దక్కవచ్చు.

4 శ్రీలంకతో ఈ మైదానంలో ఆడిన 11 వన్డేల్లో భారత్ నాలుగు మాత్రమే గెలిచింది.

2 ప్రపంచకప్‌లో నేరుగా అర్హత దక్కించుకునేందుకు శ్రీలంక గెలవాల్సిన మ్యాచ్‌లు.

ఒత్తిడిలో శ్రీలంక...

టెస్టుల్లో వైట్‌వాష్ అనంతరం వన్డే సిరీస్ ఆడబోతున్న లంక తీవ్ర ఒత్తిడిలో ఉంది. తమ అభిమానులను తిరిగి ఆకట్టుకోవాలంటే ఈ జట్టు తమ స్థాయికి మించి ప్రదర్శన చేయాల్సిందే. కొత్త కెప్టెన్ ఉపుల్ తరంగ నేతృత్వంలో నూతనోత్తేజంతో బరిలోకి దిగాలని భావిస్తోంది. ఇరు జట్ల మధ్య జరిగిన చివరి వన్డే (చాంపియన్స్ ట్రోఫీ)లో తామే గెలవడం లంకేయులకు కొద్దిగా ఊరటనిచ్చే విషయం. తరంగ, మాథ్యూస్, చండిమాల్ బ్యాటింగ్ ఆర్డర్‌కు వెన్నెముకలా నిలవనున్నారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ పుష్పకుమార అరంగేట్రం ఖాయమే. బౌలింగ్‌లో సీనియర్ పేసర్ లసిత్ మలింగ, ఫెర్నాండోలపై ఎక్కువగా ఆధార పడనుంది.

జట్లు: (అంచనా)

భారత్: కోహ్లి (కెప్టెన్), ధావన్, రోహిత్, రాహుల్, ధోని, పాండే/జాదవ్, పాండ్యా, కుల్దీప్, భువనేశ్వర్, చహల్, బుమ్రా.

శ్రీలంక: తరంగ (కెప్టెన్), గుణతిలక, మెండిస్, డిక్‌వెలా, మాథ్యూస్, కపుగెదెర, హసరంగా, పెరీరా, ఫెర్నాండో, మలింగ, సందకన్.

పిచ్, వాతావరణం

ఈ ఏడాది జరిగిన రెండు మ్యాచ్‌ల్లో ఇక్కడ 300కు పైగా పరుగులు నమోదయ్యాయి. ఈ మ్యాచ్‌లోనూ అలాంటి పరిస్థితే ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మధ్యాహ్నం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.



సెమీస్‌లో సానియా జంటకు నిరాశ

ఒహాయో: సిన్సినాటి ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మహిళల డబుల్స్‌లో సానియా మీర్జా–షుయె పెంగ్ (చైనా) జంట సెమీఫైనల్లో నిష్క్రమించగా... పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న–ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జోడీ క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌ల్లో సానియా–షుయె పెంగ్ జంట 4–6, 6–7 (4/7)తో సు వీ సెయి (చైనీస్ తైపీ)–మోనికా నికెలెస్కూ (రొమేనియా) ద్వయం చేతిలో ఓడిపోయింది. గంటా 33 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా–షుయె పెంగ్‌లకు తమ ప్రత్యర్థి సర్వీస్‌ను 6 సార్లు బ్రేక్ చేసే అవకాశం లభించినా ఒక్కసారి మాత్రమే సఫలమయ్యారు. సానియా జంటకు 37, 278 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 23 లక్షల 91 వేలు)తోపాటు 350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. బోపన్న–డోడిగ్ జోడీ 1–6, 7–6 (7/5), 7–10తో లుకాజ్ కుబోట్ (పోలాండ్)–మార్సెలో మెలో (బ్రెజిల్) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. బోపన్న జంటకు 37, 250 డాలర్ల (రూ. 23 లక్షల 90 వేలు) ప్రైజ్‌మనీ తోపాటు 180 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి.

దక్షిణాఫ్రికా 'ఎ' 258/5

పోట్చెఫ్‌స్ట్రూమ్: భారత్ 'ఎ' జట్టుతో శనివారం మొదలైన రెండో అనధికార టెస్టు మ్యాచ్‌లో తొలిరోజు దక్షిణాఫ్రికా 'ఎ' జట్టు రాణించింది. స్టీఫెన్ కుక్ (205 బంతుల్లో 98; 9 ఫోర్లు, 1 సిక్స్), ఎయిడెన్ మార్క్రమ్ (145 బంతుల్లో 74; 6 ఫోర్లు, 1 సిక్స్) కుదురుగా ఆడటంతో ఆట ముగిసే సమయానికి 91 ఓవర్లలో 5 వికెట్లకు 258 పరుగులు చేసింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ప్రస్తుతం క్రీజులో రమేలా (39 బ్యాటింగ్), ఫెలుక్‌వాయో (15 బ్యాటింగ్) ఉన్నారు. భారత స్పిన్నర్లు షాబాజ్ నదీమ్, కృష్ణప్ప గౌతమ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

విండీస్ ఫాలోఆన్

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో విండీస్ క్రికెట్ జట్టు కష్టాల్లో పడింది. ఓవర్‌నైట్ స్కోరు 44/1తో మూడో రోజు శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్ జట్టు 47 ఓవర్లలో 168 పరుగులకే కుప్పకూలింది. బ్లాక్‌వుడ్ (76 బంతుల్లో 79 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీ సాధించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో అండర్సన్ మూడు వికెట్లు పడగొట్టగా... స్టువర్ట్ బ్రాడ్, రొలాండ్ జోన్స్ రెండేసి వికెట్లు తీసుకున్నారు. 346 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన ఇంగ్లండ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించకుండా... విండీస్ జట్టును ఫాలోఆన్ ఇన్నింగ్స్ ఆడాలని కోరింది. ఫాలోఆన్ ఇన్నింగ్స్ మొదలుపెట్టిన విండీస్ కడపటి వార్తలు అందే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 15 ఓవర్లలో 2 వికెట్లకు 49 పరుగులు చేసింది.


ముంబా రైడర్ అనూప్‌ను పట్టేసిన టైటాన్స్ ఆటగాళ్లు

టైటాన్స్ గెలిచిందోచ్

లక్నో: ప్రొ కబడ్డీ లీగ్‌లో 8 మ్యాచ్‌ల తర్వాత తెలుగు టైటాన్స్ జట్టు ఖాతాలో మరో విజయం చేరింది. ఈ లీగ్‌లోని తొలి మ్యాచ్‌లో నెగ్గిన టైటాన్స్... ఆ తర్వాత ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. ఇందులో ఏడింట ఓడిపోగా, ఒక మ్యాచ్ టైగా ముగిసింది. తాజాగా శనివారం జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ 37–32 స్కోరుతో యు ముంబాపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టైటాన్స్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. డిఫెండర్ సోంబిర్ ప్రత్యర్థి రైడర్లను వణికించాడు. 8 టాకిల్ పాయింట్లు సాధించాడు. రైడింగ్‌లో రాహుల్ చౌదరి అదరగొట్టాడు. 20 సార్లు రైడింగ్‌కు వెళ్లిన అతను 13 పాయింట్లు చేశాడు. వీరిద్దరి ప్రతిభతో టైటాన్స్ జట్టు యు ముంబాను రెండు సార్లు ఆలౌట్ చేసింది. మిగతా వారిలో నీలేశ్ సాలుంకే, విశాల్ భరద్వాజ్ చెరో 3 పాయింట్లు సాధించారు. యు ముంబా జట్టులో రైడర్ అనూప్ కుమార్ (9) రాణించాడు. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ 36–29తో యూపీ యోధ జట్టుపై విజయం సాధించింది. **నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో పుణేరి పల్టన్, యూపీ యోధతో జైపూర్ పింక్ పాంథర్స్ తలపడతాయి. 'స్టార్ స్పోర్ట్స్–2' చానల్ ఈ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.**

హోరాహోరీ పోరు జరగాలని...

సునీల్ గావస్కర్

టెస్టు మ్యాచ్‌ల్లో అలవోకగా ఓడిన శ్రీలంక జట్టు నుంచి వన్డేల్లో మాత్రం గట్టి పోటీ లభిస్తుందని భారత జట్టు భావిస్తోంది. తెల్ల బంతులతో బౌలర్లకు మ్యాచ్ ఆరంభంలో మినహా మిగతా ఓవర్లలో అంత మద్దతు ఉండే అవకాశాలు లేవు. ఫలితంగా బౌలర్లు వికెట్లు తీయడంకంటే పరుగులను నియంత్రించడంపైనే దృష్టి సారిస్తారు. కెప్టెన్లు కూడా బౌలర్ల సూచనలకు అనుగుణంగా ఫీల్డింగ్‌ను పెడతారు. కఠిన నిబంధనల కారణంగా బౌలర్లు ఎక్కువ బౌన్సర్లు వేయడానికి కూడా వెనుకాడతారు. ఈ అంశాలన్నీ టెస్టు మ్యాచ్‌లతో పోలిస్తే విభిన్న వ్యూహాలతో వన్డేల్లో ఆడాల్సి ఉంటుందని సూచిస్తాయి. బౌండరీలు కూడా దగ్గరగా ఉండటంతో గురి తప్పిన షాట్‌లు కూడా సిక్సర్లుగా వెళతాయి. వన్డేల్లో బ్యాట్స్‌మన్ వికెట్లకు దూరంగా జరిగి పేస్ బౌలింగ్‌లో షాట్‌లు ఆడినా ఎవరూ ఏమీ అనరు. అదే టెస్టుల్లో ఇలా చేస్తే మాత్రం పేస్ బౌలింగ్‌ను ఎదుర్కోలేకే ఆ బ్యాట్స్‌మన్ పక్కకు జరిగి ఆడాడని విమర్శలు చేస్తారు.

భారత్‌తో చివరిసారి చాంపియన్స్ ట్రోఫీలో వన్డే ఆడినపుడు శ్రీలంక 320 పరుగులకంటే ఎక్కువ లక్ష్యాన్ని కేవలం మూడు వికెట్లు కోల్పోయి అధిగమించి అద్భుత విజయం సాధించింది. ఆ మ్యాచ్ స్ఫూర్తితో వన్డే సిరీస్‌లో శుభారంభం చేయాలని లంక జట్టు భావిస్తోంది. టెస్టు సిరీస్‌తో పోలిస్తే వన్డే సిరీస్‌లో టీమిండియా పలు బౌలింగ్ మార్పులతో బరిలోకి దిగనుంది. అనుభవజ్ఞుడైన జస్‌ప్రీత్ బుమ్రాతోపాటు ఇతర బౌలర్లపై భారత్ ఆధారపడాల్సి ఉంటుంది. మళ్లీ భారత బ్యాట్స్‌మెన్ నుంచి భారీగా పరుగులు రావాల్సిన అవసరం ఉంది. టెస్టుల్లో ఓపెనర్‌గా వచ్చిన లోకేశ్ రాహుల్ వన్డేల్లో నాలుగో నంబర్ స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడని సెలక్టర్లు తెలిపారు. దీంతో బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు ఏమైనా చేయాలంటే కెప్టెన్ కోహ్లి ఆలోచించాలి. ఉదాహరణకు టాప్–3 బ్యాట్స్‌మెన్ అద్భుతంగా ఆడాక చివరి ఆరు ఓవర్లు మిగిలినపుడు అవుటైతే రాహుల్‌ను పంపించాలా? ధోనిని పంపించాలా? అనే విషయం కోహ్లి తేల్చుకోవాలి. రెండో వికెట్ పడ్డాక ఎవరు రావాలనే విషయంపై కోహ్లి నిర్ణయం తీసుకుంటాడా లేక చీఫ్ సెలక్టర్ ఆదేశాలను పాటిస్తాడా వేచి చూడాలి. మొత్తానికి టెస్టు సిరీస్ మాదిరిగా ఏకపక్షం కాకుండా వన్డే సిరీస్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాలని కోరుకుంటున్నాను. టెస్టు సిరీస్‌లోనైతే లంక అన్ని విభాగాల్లో తేలిపోయింది. వన్డే సిరీస్‌లో ఎలా ఆడతారో చూడాలిక!

ఆనంద్‌కు ఎనిమిదో స్థానం

న్యూఢిల్లీ: సెయింట్ లూసియా ఓపెన్ బ్లిట్జ్‌చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ఎనిమిదో స్థానంలో నిలిచాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య 18 రౌండ్‌ల పాటు అమెరికాలో జరిగిన ఈ టోర్నీలో ఆనంద్ ఒక గేమ్‌లో గెలిచి, 12 గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మిగతా ఐదు గేముల్లో ఓడిపోయాడు. రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ తొమ్మిది పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచాడు. 13.5 పాయింట్లతో సెర్గీ కర్జాకిన్ (రష్యా) టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

హారిక ఖాతాలో మూడో 'డ్రా'

న్యూఢిల్లీ: అబుదాబి అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మూడో 'డ్రా' నమోదు చేసింది. శుక్రవారం విశ్రాంతి దినం తర్వాత శనివారం ఒకే రోజు ఐదు, ఆరో రౌండ్ గేమ్‌లు జరిగాయి. ఇషా కరవాడే (భారత్)తో జరిగిన ఐదో గేమ్‌ను హారిక 16 ఎత్తుల్లో... ఆంటోనియో పజోస్ (స్పెయిన్)తో జరిగిన ఆరో గేమ్‌ను 20 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది.

ఒక్క 'ద్రోణుడు' తగ్గాడు!

- మిగతా అందరికీ కేంద్ర క్రీడా శాఖ అమోదం
- చివర్లో వచ్చిన బోపన్న, సంజితలకు నో చాన్స్
- ఈనెల 29న జాతీయ క్రీడా పురస్కారాల అందజేత


సాకేత్ మైనేని


జ్యోతి సురేఖ

న్యూఢిల్లీ: క్రీడా పురస్కారాల కమిటీ ప్రతిపాదనలకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. అయితే ఈ జాబితా నుంచి క్రిమినల్ కేసు ఎదుర్కొంటున్న పారా స్పోర్ట్స్ కోచ్ సత్యనారాయణను ద్రోణాచార్య నామినీ నుంచి తప్పించింది. రియో పారాలింపిక్స్ చాంపియన్, హైజంపర్ మరియప్పన్ తంగవేలు కోచ్ అయిన సత్యనారాయణ (కర్ణాటక) క్రిమినల్ పరువు నష్టం కేసు విచారణను ఎదుర్కొంటున్నారు. ఇదొక్కటి మినహా సీకే ఠక్కర్ నేతృత్వంలోని కమిటీ సిఫారసులన్నింటికీ కేంద్రం ఆమోదముద్ర వేసింది. దీంతో 'అర్జున' అవార్డు కోసం టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న మరో ఏడాది నిరీక్షించక తప్పదు. అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) నుంచి ఆలస్యంగా వచ్చిన అతని దరఖాస్తును, వెయిట్‌లిఫ్టర్ సంజిత చాను సిఫారసును క్రీడా శాఖ పక్కన బెట్టింది. నిజానికి నిర్ణీత గడువులోగా తమ పరిశీలనకే రాని వీరిద్దరిని అవార్డుల కమిటీ కూడా నామినేట్ చేయలేదు. అయితే బోపన్న కంటే జూనియర్ అయిన హైదరాబాదీ స్టార్ సాకేత్ మైనేని 'అర్జున'కు ఎంపికవడంపై స్వల్ప వివాదం రేగినా... క్రీడా శాఖ భారత్ తరఫున 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో స్వర్ణం, రజతం నెగ్గిన సాకేత్ ఎంపికనే సమర్థించింది. ఆ మెగా ఈవెంట్ సమయంలో బోపన్న దేశానికి కాకుండా ఏటీపీ టూర్లకే ప్రాధాన్యమివ్వడంతో మూల్యం చెల్లించుకున్నాడు. కేంద్ర క్రీడాశాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ దీనిపై వివరణ ఇస్తూ 'సాకేత్ దేశం గర్వించే విజయాలు సాధించాడు. బోపన్న కంటే తక్కువేమీ కాదు' అని స్పష్టం చేశారు. ఈనెల 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం రోజు ఈ అవార్డులను అందజేస్తారు.

రాజీవ్ ఖేల్‌రత్న: దేవేంద్ర జజారియా, సర్దార్ సింగ్.

అర్జున అవార్డీలు: జ్యోతి సురేఖ (ఆర్చరీ), సాకేత్ మైనేని (టెన్నిస్), ఖుష్బిర్ కౌర్, రాజీవ్ (అథ్లెటిక్స్), ప్రశాంతి (బాస్కెట్‌బాల్), దేవేంద్రో సింగ్ (బాక్సింగ్), పుజారా, హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్), ఓయినమ్ బెంబెం దేవి (ఫుట్‌బాల్), చౌరాసియా (గోల్ఫ్), సునీల్ (హాకీ), జస్వీర్ సింగ్ (కబడ్డీ), ప్రకాశ్ నంజప్ప (షూటింగ్), ఆంథోనీ అమల్ రాజ్ (టేబుల్ టెన్నిస్), మరియప్పన్ తంగవేలు, వరుణ్ భటి (పారా అథ్లెటిక్స్), సత్యవర్త్ కడియన్ (రెజ్లింగ్).



లోధా సిఫారసులు అమలు చేయరా?

హెచ్‌సీఏ తీరుపై అజహరుద్దీన్ విమర్శలు

సాక్షి, హైదరాబాద్: లోధా కమిటీ సిఫారసులను హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అమలు చేయడం లేదని భారత మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ మండిపడ్డారు. హెచ్‌సీఏలో నిత్యకృత్యమైన ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై ఆయన విమర్శలు గుప్పించారు. మొయినుద్దౌలా గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నీ కోసం ఎంపిక చేసిన హైదరాబాద్ జట్లలో ప్రతిభ గల కుర్రాళ్లను పక్కన బెట్టడం దారుణమన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అజహరుద్దీన్ మాట్లాడుతూ 'ఇది చాలా విచారకరం. హెచ్‌సీఏ 'ఎ' డివిజన్ రెండు రోజుల లీగ్‌లలో మూడేసి సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్‌ను, ఐదేసి వికెట్లు తీసిన బౌలర్లను హైదరాబాద్ ఇరు జట్లకు ఎంపిక చేయలేదు. లోధా ప్యానెల్ సిఫారసుల ప్రకారం సెలక్టర్లుగా నియామకమైనవారికి కనీసం 25 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉండాలి. కానీ దీన్ని హెచ్‌సీఏ పాటించట్లేదు. పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన హెచ్‌సీఏను ప్రక్షాళన చేయాల్సిందే. సర్వోన్నత న్యాయస్థానం నియమించిన 'లోధా' సిఫారసులను అమలు చేయాలి' అని అజహరుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ జనవరిలో జరిగిన హెచ్‌సీఏ ఎన్నికల బరిలోకి దిగేందుకు ఆయన విఫలయత్నం చేశారు. అయితే ఈ భారత మాజీ కెప్టెన్ వేసిన నామినేషన్‌ను రిటర్నింగ్ ఆఫీసర్ తిరస్కరించిన సంగతి తెలిసిందే. మరోవైపు అజహర్ విమర్శలపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జి.వివేకానంద్‌ను సంప్రదించగా... 'లోధా సిఫారసుల అమలు విషయాన్ని బోర్డు పరిపాలక కమిటీ (సీఓఏ) చూసుకుంటుంది. ఇది ఇప్పుడు కోర్టు పరిధిలోని అంశం. దీనిపై ఇంకా ఎక్కువ ఏమీ మాట్లాడలేను. ఆయన (అజహర్)కు ఏమైనా అభ్యంతరాలుంటే సుప్రీం కోర్టుకు వెళ్లవచ్చు' అని అన్నారు.

సాక్షి ఫ్యామిలీ
సన్నిధి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం
20-8-2017

ఆచార్య దేవోభవ

తనకేమీ తెలియదని తెలుసుకున్నవాడు జ్ఞాని


అధ్యాపకుడు అంటే ఏది చదవాలో అది చదివిస్తాడు. ఏ చదువయినా ఈశ్వరుడి దగ్గరకు చేరుకునేటట్లు చేస్తాడు. గురువు వినీతుడు. శిష్యుడు వినేయుడు. గురువుచేసే మొదటి పని వినయాన్ని నేర్పడం. అసలు విద్య అన్న మాటకు ఒక అర్థం–విత్ అంటే తెలుసుకొనుట. రెండవ అర్థం–నాకేమీ తెలియదని తెలుసుకొనుట. కానీ మానవ నైజం ఏమిటంటే– సరస్వతీ కటాక్షం లేదంటే (నీ కేమీ తెలియదంటే) ఎవ్వడూ ఒప్పుకోడు. లక్ష్మీకటాక్షం (పుష్కలంగా సంపద/డబ్బు) ఉందంటే ఒప్పుకోడు. 'నాకేం తెలుసండీ' అనగలగాలంటే చాలా తెలిసి ఉండాలి. కొన్ని తెలుసుకున్న తరువాత... 'ఎన్ని గ్రంథాలున్నాయి, ఎంతమంది రుషులున్నారు, ఎన్నిదర్శనాలు, ఎంతమంది మహానుభావులు. అవన్నీ చదవడానికి నా జీవితం ఏం సరిపోతుంది. దీనికే సరిపోకపోతే ఇక వాటిని ఎప్పుడు అనుభవంలోకి తెచ్చుకోవాలి... అయ్యబాబోయ్, నాకేం తెలియదండీ' అంటాడు. బాగా తెలిసున్న వాడి లక్షణం నాకేమీ తెలియదని వినయంతో ఉండడం.

సుందరకాండలో సీతమ్మ హనుమని పిలిచి– 'అంతమంది వానరులొచ్చి అటుపక్కన సముద్రపు ఒడ్డున ఉండిపోయారు కదా, నువ్వొకడివే కదా ఇక్కడికి వచ్చావు, రేపు రామ– రావణ యుద్ధం జరిగితే ఎంతమంది వానరులు వస్తారు' అని సందేహం వ్యక్తం చేస్తే హనుమ అంటాడు ''అమ్మా! నీకు తెలుసుకదా, రాణివాసంలోని మహారాణి దగ్గరకు ఎవర్నయినా పంపాల్సి వచ్చినప్పుడు ప్రభువులు తమ దగ్గరున్న సేవకుల్లో అందరికన్నా పనికి మాలిన వాడెవడో వాడిని పంపిస్తారు. అమ్మా, సుగ్రీవుడు నన్ను పంపించాడంటే–నాతో సమానులు, నాకన్నా అధికులున్నారు కానీ, నాకన్నా తక్కువ వాళ్ళు అక్కడ లేరమ్మా'' అన్నాడు. అదీ వినయం. అందుకే హనుమ పాదాలు పట్టుకుంటే బుద్ధి, వినయం లభిస్తాయంటారు.

కంచి కామకోటి పీఠాధిపతి శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారిని శిష్యులొకసారి 'మిమ్మల్ని జగద్గురువని సంబోధించాలని ఉంది... అలా పిలవొచ్చా– అని అడిగారు. దానికాయన ''జగద్గురువంటే ఒక సమాసం ప్రకారం 'జగత్తునంతా గురువుగా కలిగినవాడు' అనే అర్థంలో నేను ఎప్పుడూ జగద్గురువునే. ఎందుకంటే ఇంతమందిని చూసి నేను ప్రతిరోజూ నేర్చుకుంటున్నాను కనుక' అన్నారు. అదీ ఆయన వినయం.



శిష్యుడు అంటే శిక్షింపబడేవాడు. వినయం ఉండి ఇంద్రియములు శిక్షింపబడిన వాడు శిష్యుడు. గురువుగారి పేరు వినబడినా, ఆయన కనబడినా ఇంద్రియాలు అదుపులోకి రావాలి. చూడకూడనిది కన్ను చూడదు, స్మరించకూడనివి మనసు స్మరించదు, వినకూడనివి చెవులు వినవు. అలా ఇంద్రియాలను శిక్షించుకుని, నిగ్రహించుకుని, శమదమాదులు నేర్చుకుని గురువు ముందు కూర్చున్నవాడు శిష్యుడు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అందుకే శంకరాచార్యులవారు షట్పదీ స్తోత్రం చేస్తూ 'నా అవినయాన్ని తీసేసి వినయాన్ని కటాక్షించు' అన్నారు. మొదట వినయం నేర్పినవాడు గురువు, ఆయన అధ్యాపకుడు. చదువు నేర్పుతాడు.

ఉపాధ్యాయుడు అని మరో పేరు. అనేకమైన క్రియాకలాపాల వల్ల గురువు ఇన్ని పేర్లతో పిలవబడతాడు. లౌకికంగా అర్థం చెప్పాలంటే – కొంత ద్రవ్యాన్ని జీతంగా తీసుకుని పాఠం చెప్పేవాడు ఉపాధ్యాయుడు అని. మరొక అర్థంలో – కుమారుడికి ఉపనయనంచేసే తండ్రి చెపుతున్నట్లుగా ''ఉపేధ్య–తస్మాత్ అధీయతా'' ఉపేధ్య అంటే వెళ్ళు. ఆయన దగ్గరకు వెళ్ళు, తస్మాత్ అధీయతా.. ఇప్పుడు ఆ మహానుభావుడి దగ్గరకువెళ్ళి నేర్చుకో అని తండ్రి ఎవరివంక చేయి చూపించి పంపుతాడో, ఎవరు వేదం నేర్పుతారో ఆయన ఉపాధ్యాయుడు.

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

ఉపశమనం

రుణబాధలు పీడిస్తున్నాయా?

నిత్యం కొందరికి ఆదాయానికీ వ్యయానికీ పొంతన ఉండదు. ఏదో ఒక ఇబ్బంది ముంచుకొస్తూ అప్పుల ఊబిలోకి నెట్టేసే పరిస్థితులు ఎదువుతూ ఉంటాయి. ఇలాంటి సమస్యను అధిగమించాలంటే...
- ప్రతిరోజూ అంగారక స్తోత్రాన్ని పఠించాలి. మంగళవారం రోజున పురోహితులకు ఏడు కిలోల కందులు, ఒకటిన్నర కిలోల బెల్లం, ఎర్రని వస్త్రాలు తగిన దక్షిణతో కలిపి దానంగా ఇవ్వాలి
- సోమవారం ప్రదోష సమయంలో శివాలయానికి వెళ్లి, శివలింగానికి వరిపిండితో అభిషేకం చేయించాలి. లేదా ఇంట్లోనే పూజామందిరంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి వరిపిండితో అభిషేకం చేసుకోవచ్చు. ఈ పరిహారాన్ని కనీసం పదకొండు వారాలు పాటించాల్సి ఉంటుంది
- శ్రీ లక్ష్మీనృసింహ రుణ విమోచన స్తోత్రాన్ని అనుదినం పఠించాలి. వీలుంటే నారసింహ క్షేత్రాన్ని దర్శించుకుని, స్వామివారికి చందనం. పూలు, పాలు, తేనె, పానకం సమర్పించాలి
- శుక్రవారం రోజున ఆకలితో ఉన్నవారు తారసపడితే వారికి తృప్తిగా భోజనం పెట్టండి. కనీసం ఐదు ఆదివారాలు ఆవుకు బెల్లం కలిపి చేసిన రొట్టెలు స్వయంగా తినిపించండి
- ఇంట్లో నగదు, విలువైన వస్తువులను భద్రపరచే బీరువా, క్యాష్‌బాక్స్ వంటి వాటిలో చిన్న సైజులో ఉండే చింతచెట్టు కొమ్మను కూడా ఉంచండి. బీరువా, క్యాష్‌బాక్స్‌లలో ఏడు డేగ ఈకలను ఉంచినా ఫలితం ఉంటుంది.

- పన్యాల జగన్నాథ దాసు

జెన్‌పథం

లోటుపాట్లు అనేవే లోపం!!

ఆయన ఓ గురువు. చిత్రకారుడు కూడా. ఆయన ఓ బొమ్మ గీస్తున్నారు. దగ్గరలోనే ఓ శిష్యుడు నిల్చుని చూస్తున్నాడు. అంతేకాదు, మధ్యమధ్యలో అతను విమర్శిస్తున్నాడు కూడా.

గురువుగారు ఎలాగైతేనేం బొమ్మ గీశారు. అదేమంత గొప్పగాలేదు. ఇద్దరిలోను దిగులు.

దేనినైనా చక్కగా చేసే తన గురువు ఈరోజు ఎందుకు సరిగ్గా గీయలేదు? ఆయనకు ఏమైంది? అని ఆలోచించాడు శిష్యుడు.

గురువు కూడా రకరకాలుగా ఆలోచించి గీసినా అదేమంత చక్కగా అమరలేదు. ఆయన దిద్దేకొద్దీ అది మరింత పిచ్చిగా తయారవుతోంది.

శిష్యుడు బొమ్మ బాగులేదని చెప్తూ వచ్చాడు.

చివరికి వర్ణాలన్నీ అయిపోయాయి. ''వెళ్లి కాస్త వర్ణాలు తీసుకురా....''అని చెప్పారు గురువు శిష్యుడితో.

శిష్యుడు లేచి వెళ్ళాడు.

గురువు తనదగ్గరున్న కుంచెలను మారుస్తున్నారు.

కాసేపటికి శిష్యుడు వచ్చాడు. శిష్యుడికి ఆశ్చర్యం వేసింది. బొమ్మ పూర్తి అయిపోయింది. అద్భుతంగా ఉంది.

''గురువుగారూ! బొమ్మ చాలా గొప్పగా ఉంది...'' అన్నాడు ఆనందంతో.

గురువు నవ్వుతూ ''నువ్వు ఇక్కడే ఉండటంతో ఆ సమస్య తలెత్తింది. నువ్వు చూస్తున్నావు అనే విషయం నన్ను ఏదో చేసింది. ఆ భావంతోనే బొమ్మ సరిగ్గా రాలేదు. పక్కన విమర్శించే ఓ మనిషి ఉంటే ఏ సృష్టీ సరిగ్గా రాదు. మనసులో ప్రశాంతత ఉండదు. ఆత్మ ప్రశాంతంగా లేకుంటే సృష్టిలో క్రమం తప్పుతుంది. పూర్ణత్వం రాదు... నువ్వు వెళ్ళిపోయావు. నాలో నాపై ఉన్న నిషేధం, ఒత్తిడి పోయాయి. ఆ స్థితిలో చిత్రం చక్కగా రూపుదిద్దుకుంది. పూర్ణత్వం ఏర్పడాలనే తలపే అపూర్వాన్ని పుట్టిస్తుంది. మనస్సుని నిండుగా అర్పించినప్పుడు లోటుపాట్లు పటాపంచలవుతాయి. అందుకే అంటున్నా, లోటు అనేదే ఓ లోపం. అది ఉన్నంతవరకూ ఏదీ పూర్ణం కాదు. అర్ధమనస్సుతో ఏదీ చేయకూడదు. సహజత్వం అనేదే పూర్ణత్వం. సహజంగా చేసేదేదైనా పరిపూర్ణమే'' అన్నారు.

- యామిజాల జగదీశ్



సందర్భం

వరాహ జయంతి

ఆగస్ట్ 24, గురువారం: భూమిని చాప చుట్టలా చుట్టిన హిరణ్యాక్షుడనే రాక్షసుని సంహరించడానికి విష్ణుమూర్తి వరాహావతారం దాల్చిన రోజుకే వరాహ జయంతి అని పేరు. ఈ పర్వదినాన శ్రీమహావిష్ణువును వరాహావతారంలో పూజించడం, వరాహ పురాణం లేదా విష్ణు సహస్రనామ పారాయణ చేయడం వల్ల పాపాలు పటాపంచలై, అనేకమైన శుభఫలితాలనిస్తుంది. ఈవేళ మధురలోని అతి ప్రాచీనమైన వరాహస్వామి ఆలయంలో విశేషమైన పూజలు, ఉత్సవాలు జరుగుతాయి. తిరుమలలో కొలువై ఉన్న భూ వరాహస్వామి ఆలయంలో కూడా స్వామివారికి విశేషపూజలు, పంచామృతాభిషేకాలు జరుగుతాయి. వరాహ జయంతిని జరుపుకునేవారు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం వేళ కలశంలో వరాహస్వామిని ఉంచి, పండితులకు దానం ఇచ్చి, వారి ఆశీస్సులందుకోవాలి. వరాహస్వామి ప్రతిమ లభించనివారు వస్త్ర, వస్తు దానాలు కూడా చేయవచ్చు.



సువార్త

అహంకారంతో భ్రష్టత్వం

పరుగెత్తడం గొప్ప విషయమే, కాని పరుగెత్తుతూ పడిపోకుండా చూసుకోవడమూ ముఖ్యమే. పరుగు పందెంలో పాల్గొనేవారికి కోచింగ్ ఇచ్చే నిపుణులు కాలు మడతపడి పోకుండా ఎలా పరుగెత్తాలో మెలకువలు చెబుతారు. అపొస్తలుడైన పౌలు కూడా 'తాను నిలుచున్నానని తలంచేవాడు పడిపోకుండా జాగ్రత్తపడాలి' అంటాడు (1కొరింథీ 10:12). హిమాలయ శిఖరాన్ని కూడా పడేయగల శక్తి అహంకారానిది. విశ్వాసుల ఆత్మీయ పురోభివృద్ధికి అడ్డుపడే ప్రధాన శత్రువు అహంకారం. విశ్వాసులుగా, సేవకులుగా దేవుని రాజ్య నిర్మాణంలో భాగంగా మనం చేసేదంతా దేవుడిచ్చే శక్తితోనే సాధ్యమవుతోందని మర్చిపోయి, 'ఇదంతా నా ప్రతిభే!' అని భావించిన మరుక్షణం నుండి పతనం ఆరంభమవుతుంది. ఈ స్వాతిశయమే భ్రష్టత్వంలో పడవేస్తుంది. లోకంలో ఎదుర్కొనే ప్రతిరోధననూ జయించే ఆత్మీయశక్తిని దేవుడు విశ్వాసిలో, సేవకుల్లో నిక్షిప్తం చేశాడు. అయితే 'అహంకారం' ఆ శక్తిని దొంగిలించి లేదా నిర్వీర్యపర్చి మనల్ని ఆత్మీయంగా బలహీనుల్ని చేస్తుంది. చూస్తూండగానే పతనం అంచులకు లాక్కుపోతుంది. మన చిన్న చిన్న విజయాలు, ఆర్జించిన జ్ఞానం, అనుకోకుండా కలిసొచ్చిన సిరి, అహం విజృంభించబడడానికి చాలాసార్లు దోహదం చేస్తుంది. ఆదిమకాలంలో ప్రపంచంలోనే అత్యంత గొప్ప మేధావిగా పేరుగాంచిన గమలీయేలు పాదాల వద్ద జ్ఞానాభ్యాసం చేసిన పౌలు, ఎన్నడూ అతిశయించలేదు. దేవుడిచ్చిన పరలోక భాగ్యం, పరలోక జ్ఞానం ముందు తన ఈ లోకజ్ఞానం 'వ్యర్థ పదార్థమే'నని ఆయన ప్రకటించాడు. అపరిచితులున్న కొత్త కొత్త ప్రాంతాలకు కూడా వెళ్ళి అక్కడ పరిచర్య చేసి కొత్తవిశ్వాసులతో చర్చిలు స్థాపించిన ఘనవిజయాలు పరిచర్యలో చవిచూసినా, నరకానికి పాత్రుడనైన తనను పరలోక పౌరుడిగా మార్చిన యేసుక్రీస్తు ప్రేమకు తాను రుణం తీర్చుకొంటున్నానన్నాడే తప్ప అదంతా తన ప్రతిభ అని ఎన్నడూ పొంగిపోలేదు.



బైబిలులోని కొత్త నిబంధన పుస్తకాల్లో సగం పౌలు రాసినవే! ఈనాడు క్రైస్తవంగా లోకం అర్థం చేసుకొంటున్న ఆత్మీయ సంగతులన్నీ ఆయన ఆవిష్కరించినవే! అంతటి మేధావి అయినా పౌలు, యేసుక్రీస్తు ప్రేమను అందరికీ పంచేందుకు తనను తాను మనుషులందరికీ దాసునిగా మారానని రాసుకున్నాడు (1 కొరింథీ 9:22). ఈ రెండువేల ఏళ్ళ క్రైస్తవ చరిత్రలో అపొస్తలుడైన పౌలు చేసినంత పరిచర్య ఎవరూ చేయలేదు, ఆయనలాగా శ్రమించినవారూ లేరు. అంతటివాడే తాను బానిసనని చెప్పుకుంటే, కొద్దిపాటి పరిచర్యకే కాలరెగరవేసే వారినేమనాలి? వినయం, సాత్వికత్వం, ప్రేమ, మృదుభాష్యమే విశ్వాసి లక్షణాలు.

- రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్